

'ప్రజల జీవన ప్రమాణాలు ఇంకా మెరుగు పడాలి.
అందుకు అధికారులు నిబద్ధత, పారదర్శకత,
కార్యదీక్షతో పనిచేయాలి.'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 20 వెల: ₹ 5.50

సంపుటి: 18
సంచిక: 104

శనివారం 5-7-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



స్మిత

● పారాచూట్ ఉమన్ ఆఫ్ ఇండియా

ఆమె విజయం ఆకాశమంత!

ముంబైలోని 'ఓరియెంటల్ వీవింగ్ అండ్ ప్రాసెసింగ్ మిల్స్'ను స్మిత తండ్రి విష్ణునాథ్ చాల్కె స్థాపించారు. కంపెనీలోకి స్మిత అడుగుపెట్టిన తరువాత పారాచూట్‌ల తయారీ మొదలైంది.

నీటికింద ఉపయోగించే పారాచూట్, డిఫెన్స్ టార్గెట్ పారాచూట్, స్పేస్ రికవరీ పారాచూట్, కార్గో పారాచూట్, పర్సనల్ పారాచూట్, కాంబాట్ పారాచూట్, ట్యాంకులను విమానాల నుండి డ్రాప్ చేసే పారాచూట్... ఇలా ఎన్నో రకాల పారాచూట్‌లను ఓరియెంటల్ కంపెనీ తయారు చేస్తోంది.

భద్రతా దళాలకు కూడా పారాచూట్‌లను సరఫరా చేస్తుంది. పారాచూట్‌లను అంతర్జాతీయంగా ఎగుమతి చేసిన తొలి ప్రైవేట్ ఇండియన్ కంపెనీగా 'ఓరియెంటల్' కంపెనీ గుర్తింపు తెచ్చుకుంది.

తండ్రి వ్యాపారంలోకి అడుగు పెట్టడానికి ముందు కొన్ని కంపెనీలలో పనిచేసింది స్మిత.

> **గర్వించిన సందర్భం**
> వ్యాపారరంగంలో నాకు స్ఫూర్తి మా నాన్న. అన్ని రకాలుగా నన్ను ప్రోత్సహించే వారు. సాధారణ అవసరాల నుంచి యుద్ధంలో ఉపయోగపడే పారాచూట్‌ల వరకు ఎన్నో రకాల పారాచూట్‌లను మేము తయారు చేశాం. ఎయిర్ క్రాఫ్ట్‌తో డ్రాప్ చేసే 16 టన్నుల ట్యాంకును ఎత్తే సామర్థ్యం ఉన్న పారాచూట్‌లను తయారు చేయడం మేము గర్వించిన సందర్భం.
> – స్మిత


మొదట్లో పని తెలిసిన టైలర్‌లను వెదుక్కోవడం కష్టంగా ఉండేది. పారాచూట్ టెక్నాలజీలో పట్టు సాధించి, మౌలిక సవాళ్లను అధిగమించి ముందుకు వెళ్లింది స్మిత. విదేశాల్లో జరిగే ఎగ్జిబిషన్‌లకు క్రమం తప్పకుండా హాజరవుతుంటుంది. సాంకేతిక నిపుణులతో మాట్లాతుంది. కొత్త సాంకేతికతను ఎప్పటికప్పుడు కంపెనీలోకి తీసుకువస్తుంటుంది.

'ఒకప్పుడు పారాచూట్ ఫ్యాబ్రిక్ సాధారణ మగ్గాలపై తయారయ్యేది. ఇప్పుడు వాటర్ జెట్ లూమ్‌లపై తయారవుతోంది. అందుకే నాణ్యత మరింత పెరిగింది' అంటున్న స్మిత ప్రతిష్ఠాత్మకమైన 'ది సింథటిక్ అండ్ ఆర్ట్ సిల్క్ మిల్స్ రిసెర్చ్ అసోసియేషన్'కు ఉపాధ్యక్షురాలిగా ఉంది.

తీరికలేనంత పనుల్లో ఉన్నప్పటికీ వంట చేయడం, తోటపనులు అంటే స్మితకు ఇష్టం.

ఇష్టమైన పనులు చేస్తున్నప్పుడు ఆమెకు కొత్త కొత్త ఆలోచనలు వస్తుంటాయి. ఆ ఆలోచనలు ఊరకే పోవు. కంపెనీ బలోపేతానికి ఏదో రకంగా ఉపయోగపడుతూనే ఉంటాయి.

ఆ స్ఫూర్తిని అందిపుచ్చుకోవాలి



ఇస్లామీయ క్యాలండర్ ప్రకారం సంవత్సరంలోని మొదటి నెల 'ముహర్రం'. ప్రతి సంవత్సరం ఈ నెల వస్తూనే ముహమ్మద్ ప్రవక్త(స) వారి జీవితంలోని ఓ ముఖ్యమైన ఘట్టం మనసులో మెదులుతుంది. అదే 'హిజ్రత్'. (మక్కా నుండి మదీనాకు వలస). హిజ్రత్ తరువాతనే ధర్మానికి జవసత్వాలు చేకూరాయి, ధర్మం ఎల్లెడలా విస్తరించింది. ధర్మ పరిరక్షణ, మానవ సేవ, మానవులకు సత్య సందేశాన్ని అందించడం లాంటి మహత్తర ఆశయం కోసం కష్ట నష్టాలను సహించాల్సి వచ్చినా, చివరికి స్వదేశాన్ని విడిచి వలస వెళ్ళవలసి వచ్చినా వెనకాడకూడదనే విషయాన్ని ముహర్రం ప్రతి సంవత్సరం విశ్వాసులకు గుర్తు చేస్తూ ఉంటుంది.

ముహర్రం ఘనతకు సంబంధించి ముహమ్మద్ ప్రవక్త(స) ఇలా అన్నారు. 'ముహర్రం అల్లాహ్ నెల. రమజాన్ ఉపవాసాల తరువాత శ్రేష్ఠమైన ఉపవాసాలు ముహర్రం ఉపవాసాలే'. (సహీహ్ ముస్లిం: 2755) ప్రవక్త మహనీయులు మదీనాకు వలస వెళ్ళిన తరువాత, అక్కడి యూదులు రోజా (ఉపవాసం) పాటించడం గమనించారు. అది ముహర్రం పదవ తేదీ. (యౌమె ఆషూరా) అప్పుడు ప్రవక్త వారు, 'ఏమిటి ఈరోజు విశేషం?' అని వారిని అడిగారు. దానికి వారు,' ఇది చాలా గొప్పరోజు. ఈ రోజే దైవం మూసా ప్రవక్త(అ) ను, ఆయన జాతిని ఫిరౌన్ బారినుండి రక్షించాడు. ఫిరౌన్‌ను, అతడి సైన్యాన్ని సముద్రంలో ముంచేశాడు. అప్పుడు మూసా ప్రవక్త, దైవానికి కృతజ్ఞతగా రోజా పాటించారు. కనుక మేము కూడా ఆయన అనుసరణలో ఈ రోజు ఉపవాసం పాటిస్తాము'. అని చెప్పారు. అప్పుడు ప్రవక్త మహనీయులు, 'మూసా ప్రవక్త అనుసరణలో రోజా పాటించడానికి మీకంటే మేమే ఎక్కువ హక్కుదారులం' అని చెప్పి, మీరు రెండు రోజులు రోజా పాటించమని తన సహచరులకు బోధించారు. అంటే ముహర్రం మాసం 9,10 కాని, లేక 10,11 కాని రెండురోజులు రోజా పాటించాలి.

కాకతాళీయంగా 'కర్బలా' సంఘటన కూడా ఇదే రోజున జరగడం వల్ల దీని ప్రాముఖ్యత మరింతగా పెరిగిపోయింది. అంతమాత్రాన ముహర్రం నెలంతా విషాద దినాలుగా పరిగణించడం సరికాదు. ఎందుకంటే అమరత్వం అనేది మానవ సహజ భావోద్రేకాల పరంగా బాధాకరం కావచ్చునేమో గాని, విషాదం ఎంతమాత్రం కాదు. 'కర్బలా' సాక్షిగా ఒక విశ్వాసి పోషించవలసిన పాత్రను హజ్రత్ ఇమామె హుసైన్ ఆచరణాత్మకంగా నిరూపించారు. అందుకే ఆ మహనీయుడు అమరుడై దాదాపు వేయిన్నర సంవత్సరాలు కావస్తున్నా, నేటికీ కోట్లాదిమంది ప్రజలకు, ప్రజాస్వామ్య ప్రియులకు ఆదర్శంగా, స్ఫూర్తిగా నిలిచారు. అందుకే ప్రతియేటా 'ముహర్రం 'నెలలో ఆయన త్యాగాన్ని ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది ప్రజలు స్మరించుకుంటారు. కనుక మొహర్రం నెల ప్రాముఖ్యం, హజ్రత్ ఇమామె హుసైన్ (ర) అమరత్వం మామూలు విషయం కాదు. అందుకని ఆయన ఏ లక్ష్యం కోసం ప్రాణాలను సైతం లెక్క చేయకుండా పోరాడి అమరుడయ్యారో మనం దాన్నుండి ప్రేరణ పొందాలి. ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడినప్పుడు దాన్ని కాపాడుకోడానికి నడుం బిగించాలి. ఇదే ఇమామె హుసైన్ అమరత్వం మనకిస్తున్న సందేశం.

– ముహమ్మద్ ఉస్మాన్ ఖాన్

● ఐకానిక్

ఉప్పొంగిన ఉద్యమ కెరటం



ఎమ్మా వాట్సాన్

నటి, ఉద్యమకారిణి, మానవతావాది... ఎమ్మా వాట్సాన్. ఒక్క ముక్కలో చెప్పాలంటే... పవర్‌ఫుల్ ఉమన్. 'లింగ సమానత్వం' కోసం 'హర్ ఫర్ షీ' క్యాంపెయిన్ నిర్వహించింది. 'మా ఉద్యమంలో మహిళలు మాత్రమే కాదు పురుషులు కూడా భాగం కావాలి' అని 'హర్ ఫర్ షీ' ఉద్యమం పిలుపు ఇచ్చింది.

స్త్రీ స్వేచ్ఛాస్వాతంత్ర్యాల కోసం, జెండర్ స్టీరియో టైప్స్‌ను బ్రేక్ చేయడం... మొదలైన లక్ష్యాలతో 'హర్ షీ మూమెంట్' పనిచేసింది.

'నేను స్త్రీవాదిని' అని గర్వంగా చెప్పుకునే ఎమ్మా స్త్రీవాదాన్ని పునర్నిర్వచించాలని చెబుతుంది. పురుషులను ద్వేషించడమే లక్ష్యంగా కాకుండా వివాదరహితంగా స్త్రీవాద ఉద్యమం ఉండాలని కోరుకుంటుంది.

తన ఉద్యమ కార్యాచరణ ద్వారా ఎంతోమంది పురుషులను ప్రభావితం చేసింది ఎమ్మా.

యూఎన్ గుడ్‌విల్ అంబాసిడర్‌గా ఆమె చేసిన ఉపన్యాసం వైరల్ అయింది.

యూఎన్ అంబాసిడర్‌గా బంగ్లాదేశ్, జాంబియాలలో ఆడపిల్లల చదువుకు సంబంధించి ప్రోత్సాహక కార్యక్రమాలు చేపట్టింది.

మహిళల హక్కుల కోసం, స్త్రీలపై హింసకు వ్యతిరేకంగా ప్రపంచవ్యాప్తంగా 30 సంస్థలతో కలిసి పని చేసింది.

ప్యారిస్‌లో జన్మించిన ఎమ్మా వాట్సన్ ఇంగ్లాండ్‌లోని 'ది యూనివర్శిటీ ఆఫ్ ఆక్స్‌ఫర్డ్'లో చదువుకుంది.

టైమ్ మ్యాగజైన్ '100 మోస్ట్ ఇన్‌ఫ్లూయెన్షియల్ పీపుల్ ఇన్ ది వరల్డ్' జాబితాలో చోటు సాధించింది.

గుడ్డు అనగానే ఆవిరిపై ఉడికించుకోవడం దగ్గర నుంచి ఆమ్లెట్- బ్రెడ్ ఆమ్లెట్ వేసుకోవడం వరకే మనకు తెలిసిన రుచులు! మరి ఎప్పుడైనా కొత్తగా సరికొత్తగా ప్రయత్నించి చూశారా? ఇంకెందుకు ఆలస్యం? ఇలా ట్రై చేయండి.

ఎగ్‌స్ట్రా వెరైటీస్

వంటిల్లు

ఎగ్ మోమోస్



కావలసినవి: మైదాపిండి – 2 కప్పులు; గుడ్లు – 5; ఉల్లిపాయ ముక్కలు – ఒక టేబుల్ స్పూన్; పచ్చిమిర్చి – 3 (సన్నగా తరిగినవి); అల్లం–వెల్లుల్లి పేస్ట్ – ఒక టీ స్పూన్; కొత్తిమీర తరుగు– 2 టేబుల్ స్పూన్లు; క్యాప్సికమ్ ముక్కలు, క్యారెట్ తురుము – పావు కప్పు చొప్పున; సోయా సాస్ – ఒక టీ స్పూన్; మిరియాల పొడి – అర టీ స్పూన్; నూనె, నీళ్ల, ఉప్పు – సరిపడా

తయారీ: ముందుగా ఒక పెద్ద గిన్నెలో మైదాపిండి, ఉప్పు వేసుకుని, కొద్దికొద్దిగా నీళ్లు కలుపుకుంటూ చపాతీపిండిలా కలుపుకోవాలి. చివరగా ఒక టీస్పూన్ నూనె వేసి పిండిని మరోసారి బాగా కలిపి, తడి వస్త్రంతో కప్పి 30 నిమిషాలు పక్కన పెట్టుకోవాలి. ఒక పాన్‌లో 2 టేబుల్ స్పూన్ల నూనె వేసి వేడి చేసుకుని, నూనె వేడయ్యాక, ఉల్లిపాయ ముక్కలు వేసి దోరగా వేయించుకోవాలి. ఇప్పుడు అల్లం–వెల్లుల్లి పేస్ట్ వేసి పచ్చివాసన పోయేవరకు గరిటెతో తిప్పాలి. పచ్చిమిర్చి ముక్కలు, క్యాప్సికమ్ ముక్కలు, క్యారెట్ తురుము వేసి 2–3 నిమిషాలు వేసి వేయించుకోవాలి. ఇప్పుడు గుడ్లు వేసుకుని బాగా కలిపి, రెండు నిమిషాల తర్వాత స్టవ్ ఆఫ్ చేసుకోవాలి. ఈ మిశ్రమంలో సోయా సాస్, మిరియాల పొడి, తగినంత ఉప్పు, కొత్తిమీర తరుగు వేసి బాగా కలిపి, చల్లారనివ్వాలి. ఈలోపు మైదా మిశ్రమాన్ని చిన్న చిన్న ఉండలుగా చేసుకుని పూరీల్లా ఒత్తుకుని.. ఒక్కో గరిటె ఎగ్ మిశ్రమాన్ని వేసుకుని, మోమోస్‌లా చుట్టుకోవాలి. ఇప్పుడు వాటిని ఆవిరిలో ఉడికించుకుంటే సరిపోతుంది.

ఎగ్ చాట్



కావలసినవి: గుడ్లు – 2 (ఉడికించినవి); ఉల్లిపాయ ముక్కలు, టమాటో ముక్కలు – అర కప్పు చొప్పున; జీలకర్ర పొడి, గరం మసాలా, పసుపు – పావు టీస్పూన్ చొప్పున; కారం, చాట్ మసాలా – అర టీస్పూన్ చొప్పున; కొత్తిమీర తరుగు, నిమ్మరసం – ఒక టేబుల్ స్పూన్ చొప్పున; ఉప్పు, నూనె – సరిపడా; కొత్తిమీర -పచ్చిమిర్చిలతో చేసిన కారం పచ్చడి లేదా సాస్ – 2 టేబుల్ స్పూన్లు; కారప్పూస – 2 టేబుల్ స్పూన్లపైనే.

తయారీ: ముందుగా గుడ్లను ఉడికించి, పైపెంకు తీసి, నిలువుగా కట్ చేసుకోవాలి. గుడ్డు పసుపు సొనను తీసి ఒక బౌల్‌లో వేసుకోవాలి. ఇప్పుడు పాన్ మీద కొద్దిగా నూనె వేసుకుని, వేడి కాగానే జీలకర్ర పొడి, గరం మసాలా, పసుపు, కారం, చాట్ మసాలా, కొద్దిగా ఉప్పు వేసుకుని గుడ్డు ముక్కలను ఇరువైపులా దోరగా వేయించుకోవాలి. ఇప్పుడు పసుపు సొనను అదే నూనెలోవేసి పొడిపొడిగా చేసుకుని పెట్టుకోవాలి. అనంతరం ఆ గుడ్డు ముక్కల్లో కొత్తిమీర– పచ్చిమిర్చి పచ్చడి లేదా సాస్ కొద్దికొద్దిగా వేసుకుని, పైన, కొద్దికొద్దిగా పసుపు సొన మిశ్రమం, ఉల్లిపాయ ముక్కలు, టమోటో ముక్కలు, కొత్తిమీర తురుగు, కారప్పూస ఒకదాని తర్వాత ఒకటి నచ్చిన విధంగా గార్నిష్ చేసుకుని సర్వ్ చేసుకోవచ్చు.

ఎగ్ బన్స్



కావలసినవి: గుండ్రటి టమాటో ముక్కలు, గుండ్రటి బన్నులు, గుడ్లు – 6 చొప్పున; ఉల్లిపాయ ముక్కలు, పచ్చిమిర్చి ముక్కలు – కొద్దికొద్దిగా; క్యారెట్ తురుము – పావు కప్పు; మిరియాల పొడి, ఎండు మిర్చి కచ్చాబిచ్చా మిశ్రమం – కొద్దికొద్దిగా; చీజ్ తురుము, బటర్ – సరిపడా

తయారీ: ముందుగా బన్నులను పైన గుండ్రంగా చిన్న భాగం కట్ చేసుకుని, లోపలున్న బ్రెడ్‌ను తొలిచి, కప్పు మాదిరి మార్చుకోవాలి. ఇప్పుడు ప్రతి బన్‌లో ఒక్కో టమోటో ముక్క వేసుకుని, మిరియాల పొడి జల్లుకుని, కొద్దికొద్దిగా క్యారెట్ తురుమును అందులో పరచుకోవాలి. ఇప్పుడు ప్రతి బన్‌లో ఒక్కో గుడ్డు కొట్టుకుని వేసుకోవాలి. తెల్లసొన లోపలికి ఇంకిపోయి, పసుపు సొన పైకి కనిపిస్తూ ఉంటుంది. ఇక దాని చుట్టూ చీజ్ తురుము పరుచుకుని, పైన కచ్చాబిచ్చా చేసిన ఎండుమిర్చి పొడర్‌ను వేసుకోవాలి. ఇప్పుడు పాన్‌లో సరిపడా బటర్ కరిగించి, స్టవ్ చిన్న మంట మీద పెట్టుకుని, పాన్‌లో బన్నులను వరసగా పెట్టుకుని మూత పెట్టి ఉడికించుకోవాలి. బన్స్‌లో గుడ్డు ఉడికి, చీజ్ కరిగి గట్టిగా మారిన తర్వాత సర్వ్

కూరలమ్మలు



ఎంత కష్టపడ్డా సాగులో లాభాలను పండించలేమని తెలిసినా వ్యవసాయాన్ని మానరు.. సాగు చేయడాన్ని మరువరు మన రైతులు. అలా అన్నపూర్ణను తలపించే నలభైమంది మహిళా రైతులు మహారాష్ట్ర, జల్‌గావ్‌లో కనిపిస్తారు. వీళ్లు రోజూ సూర్యోదయానికి కంటే ముందే జల్‌గావ్‌లోని కూరగాయల్ మార్కెట్‌కి చేరుకుని తాము పండించి తెచ్చిన కూరగాయలను విక్రయిస్తారు. ఎండనక, వాననక ఉదయం నుంచి సాయంత్రం వరకు కష్టపడ్డా చేతి నిండా డబ్బుల్ని చూడరు. అయినా సరే.. తాము తెచ్చిన తాజా కూరగాయల్లోంచి కొన్నిటిని తీసి పక్కన పెడ్తారు ఆ మార్కెట్‌కి దగ్గర్లోనే ఉన్న వెనుకబడిన పిల్లలు చదివే హాస్టల్ కోసం. అందులో దాదాపు 125 మంది స్టూడెంట్స్ ఉన్నారు. వాళ్లందరూ చక్కగా తాజా కూరగాయలతో వండిన భోజనాన్ని తినాలని ఆ మహిళా రైతుల తాపత్రయం. అందుకే రోజూ తాము మార్కెట్‌కి తెచ్చే తమ కూరగాయల పంటలోంచి కొంత పక్కన పెడ్తారు. ఆ హాస్టల్ సిబ్బంది వచ్చి వాటిని తీసుకెళ్తారు. 2000 సంవత్సరం నుంచి ఈ రైతులు ఇలా ఆ హాస్టల్‌కి కూరగాయలను డొనేట్ చేస్తున్నారు. 'కేవలం అయిదుమంది పిల్లలతో మొదలైన ఈ హాస్టల్ ఇప్పుడు 125 మందికి చేరుకుంది. అరకొరగా అందే విరాళాలతోనే నడుస్తున్న ఈ హాస్టల్‌లో పిల్లల సంఖ్య పెరుగుతున్నకొద్దీ కూరగాయలు కొనడం హాస్టల్ సిబ్బందికి కష్టమవుతుందని తెలిసి.. మేము మార్కెట్‌కి తెచ్చిన కూరగాయల పంటలోంచి కొంత ఆ హాస్టల్‌కి ఇవ్వాలని నిర్ణయించుకున్నాం. అప్పటినుంచి ఇది కొనసాగుతూనే ఉంది. ఆ పిల్లలూ మా పిల్లల్లాంటి వాళ్లే! మంచి తిండి ఉంటే ఆరోగ్యం బాగుంటుంది. ఆరోగ్యం బాగుంటేనే కదా.. చదువు మైండ్‌కి ఎక్కేది! మేం చేస్తున్నది సాయంగా కూడా భావించం. ఎందుకంటే ఆ పిల్లలు రేపు పెరిగి పెద్దవాళ్లై మన దేశ ప్రగతికే కదా పాటుపడేది! అందుకే మేం చేసేదాన్ని సాయంగా భావించట్లేదు.. పిల్లల ఆరోగ్యాన్ని కనిపెట్టుకునే తల్లుల బాధ్యతగా భావిస్తున్నాం' అంటారు ఆ మహిళా రైతులు.

● పర్యావరణ హిత

స్క్రాప్ టు స్ట్రక్చర్


ఇషిత బన్సాల్

'స్క్రాప్ టు స్ట్రక్చర్' నినాదంతో వేస్ట్ మేనేజ్‌మెంట్ సెక్టార్‌లోకి అడుగుపెట్టిన 'ప్లానెక్స్ రీసైకిలింగ్' కంపెనీ వినూత్న ఆవిష్కరణలకు పెద్ద పీట వేసింది.

'వెదికితేనే కదా... దారి తెలిసేది' అంటున్న 'ప్లానెక్స్' కో–ఫౌండర్ ఇషిత బన్సాల్ ఎప్పటికప్పుడు సరికొత్త లక్ష్యాలతో ముందుకు వెళుతోంది.

వ్యాపార కుటుంబంలో పుట్టిన ఇషితకు వాణిజ్య విషయాలు కొట్టిన పిండి. పాఠశాల విద్య పూర్తయిన తరువాత దుబాయ్‌లోని 'అమెరికన్ యూనివర్శిటీ ఆఫ్ దుబాయ్'లో చేరి ఇంటర్నేషనల్ బిజినెస్‌లో డిగ్రీ చేసింది. ఇండియాకు తిరిగి వచ్చిన తరువాత తమ కుటుంబ ఆధ్వర్యంలోని 'ఇన్‌టెక్స్ టెక్నాలజీస్'లో చేరింది. ఇక్కడ పనిచేస్తున్న కాలంలోనే ఇ–వేస్ట్ గురించి ఆలోచించింది. ఈ సమస్య గురించి లోతుగా అధ్యయనం చేసింది.

ఆ తరువాత యశ్‌రాజ్ భరద్వాజ్, యువరాజ్, హర్షి గిలర్‌లతో కలిసి దిల్లీ కేంద్రంగా 'ప్లానెక్స్ రీసైకిలింగ్' మొదలుపెట్టింది. మైక్రో–రీసైకిలింగ్ యూనిట్‌లను వికేంద్రీకరించడం ద్వారా కంపెనీ కొత్త అడుగు వేసింది.

చెత్త సేకరించే కార్మికులకు గౌరవప్రదమైన ఉపాధిని అందించడంతో పాటు వారి ఆరోగ్య విషయాలపై దృష్టి పెట్టింది. వారి కోసం నైపుణ్య అభివృద్ధి వర్క్‌షాప్‌లు నిర్వహిస్తోంది ప్లానెక్స్.

ఈ సంవత్సరం 4.5 లక్షల మెట్రిక్ టన్నుల ప్లాస్టిక్‌ను రీసైకిల్ చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది.

బులియన్ జూలై 4న ముగింపు (బంగారం 10 గ్రా.: వెండి కిలో) రూ.లలో

హైదరాబాద్	
బంగారం (24 క్యారెట్లు)	97,810
బంగారం (22 క్యారెట్లు)	90,290
వెండి	1,09,200
విజయవాడ	
బంగారం (24 క్యారెట్లు)	1,00,060
బంగారం (22 క్యారెట్లు)	90,500
వెండి	1,10,700
విశాఖపట్నం	
బంగారం (24 క్యారెట్లు)	98,730
బంగారం (22 క్యారెట్లు)	90,500
వెండి	1,20,000
రాజమండ్రి	
బంగారం (24 క్యారెట్లు)	98,730
బంగారం (22 క్యారెట్లు)	90,500
వెండి	1,10,000
ప్రొద్దుటూరు	
బంగారం (24 క్యారెట్లు)	97,740
బంగారం (22 క్యారెట్లు)	89,610
వెండి	1,08,300
చెన్నై	
బంగారం (24 క్యారెట్లు)	98,730
బంగారం (22 క్యారెట్లు)	90,500
వెండి	1,20,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

● డాక్యుమెంటరీ

చూపు లేకపోయినా.... ప్రపంచమంతా చూస్తోంది!



ఇంటర్నేషనల్ బ్లైండ్ స్పోర్ట్స్ ఫెడరేషన్(ఐబీఎస్ఎఫ్) వరల్డ్ గేమ్స్‌లో టీ 20 క్రికెట్ భాగం అయిన తరవాత కొత్తగా ఏర్పాటైన భారత మహిళా క్రికెట్ జట్టు తమ అద్భుత ప్రతిభతో క్రీడాలోకాన్ని ఆకట్టుకుంది. లీగ్ దశలో ప్రతి మ్యాచ్ గెలిచింది. ఆస్ట్రేలియా జట్టుపై విజయం సాధించడాన్ని దృష్టిలో పెట్టుకొని...

'మా విజయానికి నాకు మాటలు రావడం లేదు. క్రికెట్‌లో నేను మన దేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్నందుకు గర్వంగా ఉంది. చిన్నప్పుడు ఎంతోమంది క్రికెటర్‌ల గురించి మాట్లాడుకునేవాళ్లం. ఇప్పుడు మా గురించి మాట్లాడుకుంటుంటే ఆశ్చర్యంగా, ఆనందంగా ఉంది' అంటుంది కర్నాటకకు చెందిన దీపిక టీసి.

ఆటలో అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తున్న బ్లైండ్ ఇండియన్ ఉమెన్ టీమ్‌పై 'దేఖ్‌లే ఇండియా' పేరుతో శాంతి మోహన్, ముకుంద మూర్తి డాక్యుమెంటరీ నిర్మించారు.

'భిన్నమైన సాంస్కృతిక నేపథ్యాల నుంచి రావడం వల్ల తొలిరోజుల్లో ఒకరినొకరు అర్థం చేసుకోవడం కష్టంగా ఉండేది. మొదట నేపాల్‌తో జరిగిన మ్యాచ్‌లో సమన్వయం చేయడం కష్టమైంది. దీంతో ఓడిపోయాం. క్రమక్రమంగా ఒకరినొకరు అర్థం చేసుకోవడం మొదలైంది. సమన్వయం చేసుకోవడంతో సులభం అయింది' అంటుంది కర్నాటక ప్లేయర్, టీమ్ కెప్టెన్ వర్ష. 'మాకు కావాల్సింది మీ సానుభూతి కాదు. మద్దతు' అంటున్నారు టీమ్ సభ్యులు.

'మన దేశంలో క్రికెట్ అనేది చాలా పాపులర్ అయినప్పటికీ చాలామందికి బ్లైండ్ క్రికెట్ ఉమెన్ టీమ్ ఉంది అనే విషయం తెలియదు. దీన్ని దృష్టిలో పెట్టుకొని డాక్యుమెంటరీ తీయాలనుకున్నాం. ఈ జట్టులో ఉన్న అమ్మాయిలు అంధులు మాత్రమే కాదు కఠినమైన సామాజిక, ఆర్థిక నేపథ్యం నుంచి వచ్చినవారు. ఎన్నో సవాళ్లను ఎదుర్కొని ఈ స్థాయికి రావడం అనేది సాధారణ విషయం కాదు' అంటున్నాడు 'దేఖ్‌లే ఇండియా' డాక్యుమెంటరీ నిర్మించిన వారిలో ఒకరైన శాంతి మోహన్.

సత్యమేవ జయతే
సాక్షి
'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండుగ రోజు'
WWW.SAKSHI.COM
పేజీలు: 20 వెల: ₹ 5.50
సంపుటి: 18
సంచిక: 104
శనివారం 5-7-2025
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

లైఫ్@360

● బ్యూటీ



అందం సహజంగానే...

ఎప్పటికీ యవ్వనంగా కనిపించాలంటే ఔషధాలు, లేపనాలు వాడాలా? కాస్మొటిక్ సర్జరీలు చేయించుకోవాలా? అనే ఆలోచన చాలా మంది చేస్తుంటారు. అందుకే చాలా వరకు యాంటీ ఏజింగ్ ప్రయత్నాలూ చేస్తుంటారు. అయితే, వీటిలో ఏది నిజంగా పనిచేస్తుంది? ఏది సురక్షితం? ఏది సరైనది కాదు.. ఎలా తెలియాలి.. అనే సందేహాలు కూడా ఎన్నో పుట్టుకు వస్తుంటాయి. వాటికి సమాధానమే ఈ వ్యాసం.

శరీరంలోని జీవక్రియల స్థాయిలో వృద్ధాప్యాన్ని ఆలస్యం చేయాలని తీసుకునే మందులు ఉంటాయి. ఉదాహరణకు డయాబెటిస్ మందులైన మెట్‌ఫార్మిన్, మెటబాలిజంను ప్రభావితం చేసే రపామైసిన్ వంటి ఔషధాలు వృద్ధాప్యాన్ని నెమ్మదిగా చేయగలవా.. అనే పరిశోధనలు జరుగుతున్నాయి. ఇవి బాడీలోని సెల్స్ లెవల్‌లో మార్పులు తేవాలని ప్రయత్నిస్తాయి. కానీ... ఇవి ఇంకా పరిశోధన దశలో ఉన్నాయి. చాలావరకు ఇవి మన శరీరానికి తగినట్టు పనిచేస్తాయో లేదో స్పష్టత లేదు. కాస్త పొరపాటైతే జీర్ణ సమస్యలు, హార్మోన్ అసమతుల్యత, లివర్ డ్యామేజ్, గుండె సంబంధిత సమస్యలు, ఇన్‌ఫెక్షన్లు వంటి తీవ్రమైన దుష్ప్రభావాలు వస్తాయన్నదే నిజం. అంతేకాదు, స్కిన్ లైటెనింగ్, మెట్‌బాలిజం మార్చే ఐవీ థెరపీ వంటి చికిత్సలు కూడా – పర్యవేక్షణ లేకుండా చేయడం చాలా ప్రమాదకరం.



– డా.స్వప్నప్రియ, డెర్మటాలజిస్ట్

కాస్మెటిక్ ప్రొసీజర్స్...

ముడతలు, డార్క్ స్పాట్స్, సాగిన చర్మం.. మొదలైనవాటిని మెరుగుపరచడం కోసం ఈ చికిత్సలు తీసుకుంటారు. వీటిలో నాన్–సర్జికల్ అయిన బోటాక్స్, ఫిల్లర్లు, లేజర్ ట్రీట్మెంట్స్ ఉంటాయి. సర్జికల్‌గా ఫేస్‌లిఫ్ట్, ఐ లిడ్ సర్జరీ, లైపోసక్షన్ వంటివి ఉన్నాయి. ఈ ప్రొసీజర్లు నిపుణులైన వైద్యులు చేతుల మీదుగానే జరుగుతాయి. అయినా ఇవి యవ్వనాన్ని శాశ్వతంగా నిలబెట్టవు. కానీ చూడటానికి యంగ్‌గా కనిపించేలా చేస్తాయి.

మాటల మాయలో పడిపోకండి..

'నేచురల్ అంటే సేఫ్' అని చాలా మంది అనుకుంటారు. కానీ, హెర్బల్ పేరుతో ఉన్న కొన్ని పదార్థాలు కూడా హార్మోన్ లెవల్స్‌ను దెబ్బతీయవచ్చు. 'అన్ని యవ్వన చికిత్సలు ఒకే విధంగా పనిచేస్తాయి' అనుకోవద్దు. మందులు లోపలికి తీసుకుంటే సెల్ లెవెల్‌లో పనిచేస్తాయి. ప్రొసీజర్లు చర్మం మీద పని చేస్తాయి. 'యాంటీ ఏజింగ్'కి మార్కెట్లో ఉన్న అనేక క్రీములు, టాబ్లెట్లు ... పరిశోధనలు లేకుండానే వచ్చి చేరుతున్నాయి. అందుకని వాటి మాయలో పడి ఆరోగ్యాన్ని దెబ్బతీసుకోవద్దు.

లుక్ పరంగా తగ్గించవచ్చు...

ట్రీట్‌మెంట్లతో యవ్వనాన్ని అలాగే ఉంచాలనుకోవడం ఆరోగ్యరీత్యా సరికాదు. తగినంత సూర్యరశ్మి మేనికి తగలాలి. ఆహారపదార్థాలలో చక్కెర పదార్థాలను తగ్గించాలి. మన జీవనశైలి సరిగా లేకపోతే ఇన్సులిన్ సామర్థ్యం తగ్గుతుంది. ఈ రోజుల్లో చాలా వరకు మెదడుకు పని పెడుతున్నారే తప్ప, శరీరానికి తగినంత వ్యాయామం ఇవ్వటం లేదు. మెనోపాజ్ దశలో హార్మోన్లలో సమతుల్యత ఉండదు. మనం చేయగలిగేది చర్మ సరంక్షణ విషయంలో మాయిశ్చరైజర్, సన్‌ప్రొటెక్షన్‌ను ఉపయోగించడం. వయసుతో పాటు చర్మం సాగినట్టు కనిపించడం సహజం. దీనికి ఫిల్లర్స్, స్కిన్ బూస్టర్స్ ఉపయోగించవచ్చు. ఏ యాంటీ ఏజింగ్ చికిత్స అయినా నిపుణుల సలహా అవసరం. ఏవీ పర్మినెంట్ చికిత్సలు కావు. అన్నిరకాల ఆహారం తీసుకోవాలి. అంటే, ఆ ఆహారంలో కూరగాయలు, పండ్లు ఉండాలి. నీళ్లు సరిపడినన్ని తాగాలి. జీవనశైలి బాగుంటే వయసు పెరిగినా యవ్వనంగా కనిపిస్తారు.



– నిర్మలా రెడ్డి

● ఎవరైనా 'మిరాకిల్ క్యూర్' అంటే వారి మాటలు నమ్మవద్దు. వాస్తవాలను చెక్ చేయాలి.
● ఇన్‌ఫ్లూయెన్సర్ల మాటల్ని అస్సలు నమ్మవద్దు. సోషల్ మీడియాలో చెప్పే ఔషధాలు/క్రీములు చాలావరకు నిర్ధారణ కానివే.

మనం ఏం చేయాలంటే...

● వేళకు పోషకాహారం తినడం, నిద్ర, వ్యాయామం.. ఇవే నిజమైన యవ్వన రహస్యాలు. వయస్సు పెరిగినా యవ్వనాన్ని అవగాహనతో అందంగా, ఆరోగ్యంగా నిలుపుకోవచ్చు. ఔషధాలా, చికిత్సలా అనే విషయంలో నిర్ణయం తీసుకోవడానికి ముందు, పూర్తి అవగాహనకు నిపుణుల సలహా తీసుకోవడం మంచిది.



ఆషాఢమట... గోరింట ఎందుకట?

ఆషాఢమాసం వచ్చిందనగానే ఆడపడచులందరూ చేతికి గోరింటాకు పెట్టుకుని కనిపిస్తారు. ఒకవేళ వాళ్లు పెట్టుకోకపోతే ఆ చేతులకు కాస్తంత గోరింటాకు పెట్టుకోండమ్మా... ఆషాఢ మాసం వచ్చింది కూడానూ అని బామ్మలు, అమ్మమ్మలు పోరుతుంటారు. ఇంతకీ ఆషాఢమాసానికీ, అర చేతులకు గోరింటాకు పెట్టుకోవడానికీ సంబంధం ఏమిటో చూద్దాం...



జ్యేష్ఠ మాసంలో కురవడం మొదలైన వర్షాలు ఆషాఢం నాటికి ఊపందుకుంటాయి. అలా తరచూ వర్షపు నీటిలో నానక తప్పదు. ఇక పొలం పనులు చేసుకునేవారు, ఏరు దాటాల్సి వచ్చేవారు... ఈ కాలంలో కాళ్లూ, చేతులను తడపకుండా రోజుని దాటలేరు. అలాంటి సమయంలో చర్మవ్యాధులు రావడం, గోళ్లు దెబ్బతినడం సహజం. ఈ ఉపద్రవాన్ని గోరింటాకు కొన్ని రోజుల పాటు ఆపుతుంది. ఆషాఢం నాటికి వాతావరణం ఒక్కసారిగా చల్లబడిపోతుంది. వాతావరణంలో అకస్మాత్తుగా వచ్చే ఈ మార్పు వల్ల శరీరంలో కఫ సంబంధమైన దోషాలు ఏర్పడతాయి. గోరింటాకుకి ఒంట్లోని వేడిని తగ్గించే గుణం ఉంది. అలా బయట వాతావరణానికి అనుగుణంగా మన శరీరాన్ని కూడా చల్లబరిచి దోషాలబారిన పడకుండా చేస్తుంది గోరింట.

ఆషాఢంలో కొత్త పెళ్లి కూతుళ్లు తమ పుట్టింటికి చేరుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఆ సమయంలో తమ చేతులకు పండించుకునే గోరింట, వారికి తమ సౌభాగ్యాన్ని గుర్తుచేస్తుంది. పుట్టింట ఉన్న మనసు, మెట్టినింట ఉన్న భర్త ఆరోగ్యాన్ని కాంక్షిస్తుంది. వేళ్లకి గోరింట పెట్టుకోవడం వల్ల కంటికి నదరుగానే కాకుండా గోళ్లు పెళుసు బారిపోకుండా, గోరుచుట్టు వంటి వ్యాధులు రాకుండా ఉంటాయి.

ఆయుర్వేదం ప్రకారం గోరింటి ఆకులే కాదు... పూలు, వేళ్లు, బెరడు, విత్తనాలు... అన్నీ ఔషధయుక్తాలే! గోరింట పొడిని మందుగా తీసుకోవడం, గోరింటతో కాచిన నూనెని వాడటం మన పెద్దల చిట్కావైద్యంలో ఉన్నదే!

కేవలం ఆషాఢంలోనే కాదు... అట్లతద్దినాడూ, శుభకార్యాల సందర్భంలోనూ గోరింటాకు పెట్టుకోవాలని పెద్దలు సూచిస్తూ ఉంటారు. అలా ఏడాదికి కొన్నిసార్లైనా గోరింట అందించే ఆరోగ్యాన్ని అందుకోవాలన్నది పెద్దల ఉద్దేశం కావచ్చు. అందులోనూ ఆషాఢంలో అయితే గోరింట లేత ఆకులతోచక్కగా చిగుళ్లు వేసి ఉంటుంది. ఆ ఆకు కోయడం కూడా ఒంటికి మంచిదే!

● మీకు తెలుసా?



పాలకూర, బచ్చలికూర లాంటి ఆకు కూరలు మీ కంటి చూపును మెరుగుపరుస్తాయి. పాలకూరలో విటమిన్లు, మినరల్స్ పుష్కలంగా ఉంటాయి. ఇందులోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు, యాంటీ ఆక్సిడెంట్లు కంటి సమస్యలపై పోరాడటంతో ప్రముఖ పాత్ర పోషిస్తాయి. ఆకుకూరలు.. మాక్యులర్ డీజెనరేషన్, కంటిశుక్లం లాంటి సమస్యల నుంచి రక్షించి కార్నియాను ఆరోగ్యంగా ఉంచుతాయి.

దానిమ్మ



దానిమ్మ తినడం వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. రక్తహీనతతో బాధపడేవారిని దానిమ్మ తినమని సలహా ఇస్తారు. ఇందులోని యాంటీ ఆక్సిడెంట్స్ రోగ నిరోధక శక్తికి పెంచుతాయి. అంతేనా దానిమ్మని రెగ్యులర్‌గా తింటే ప్లేట్‌లెట్స్ కౌంట్ పెరుగుతుందని ఓ పరిశోధనలో తేలింది. కాబట్టి ప్లేట్‌లెట్స్‌ని పెంచుకునేందుకు దానిమ్మ బాగా ఉపయోగపడుతుంది.

డ్రై ఫ్రూట్స్



డ్రై ఫ్రూట్స్... శరీరంలోని రోగనిరోధక వ్యవస్థను బలంగా మారుస్తాయి. దీంతో పాటు కంటిచూపును మెరుగుపర్చి నేత్ర సంబంధ సమస్యలను దూరం చేస్తాయి. వీటిలో విటమిన్ ఇ, ఆరోగ్యకరమైన కొవ్వులు పుష్కలంగా ఉంటాయి.

ఊరికే అలసిపోతున్నారా?

పొటాషియం అవసరం కావచ్చు!



మన శరీరానికి అవసరం అయ్యే అనేక పోషకాల్లో పొటాషియం ఒకటి. పొటాషియం మన శరీరంలో బీపీని నియంత్రిస్తుంది. స్ట్రోక్స్ రాకుండా చూస్తుంది. కండరాల నొప్పులు, కండరాలు పట్టుకుపోయినట్లు అనిపించడం వంటి సమస్యలను పొటాషియం తగ్గిస్తుంది. అలాగే గుండె జబ్బులు రాకుండా చూస్తుంది. అందువల్ల పొటాషియం ఉండే ఆహారాలను తీసుకోవాలి. పొటాషియం లోపిస్తే కండరాలు బలహీనంగా మారుతాయి. కండరాలు పట్టుకుపోయినట్లు అనిపిస్తుంది. అలసట, గుండె వేగంగా కొట్టుకోవడం, ఆకలి లేకపోవడం, మానసిక కుంగుబాటు, తరచు వాంతులు, విరేచనాలు అవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. కొందరికి మలంలో రక్తం కూడా వస్తుంది. అందువల్ల పొటాషియం లోపించకుండా చూసుకోవాలి.

సాధారణంగా మనకు రోజుకు 2.5 నుంచి 3.5 గ్రాముల వరకు పొటాషియం అవసరం అవుతుంది. మనం తినే ఆహారాల నుంచే మనకు పొటాషియం లభిస్తుంది. సప్లిమెంట్లను వాడాల్సిన పనిలేదు. ఈ క్రమంలోనే పలు ఆహారాలను తీసుకోవడం వల్ల పొటాషియం లోపం రాకుండా చూసుకోవచ్చు.

ఎందులో లభిస్తుందంటే.. కోడిగుడ్లు, టమాటాలు, చిలగడ దుంపలు, విత్తనాలు, నట్స్, అరటి పండ్లు, యాప్రికాట్స్, చేపలు, తృణ ధాన్యాలు, పెరుగు, పాలు, మాంసం, తర్బూజా, క్యారెట్, నారింజ, కివీ, కొబ్బరినీళ్లు, బీట్‌రూట్ వంటి ఆహారాల్లో పొటాషియం విరివిగా లభిస్తుంది కాబట్టి వీటిని తరచూ తీసుకుంటే పొటాషియం లోపం రాకుండా ఉంటుంది.

సాక్షి సినిమా



● సల్మాన్ ఖాన్

బ్యాటిల్ ఆఫ్ గాల్వాన్

బాలీవుడ్ కండలవీరుడు సల్మాన్ ఖాన్ హీరోగా కొత్త సినిమా ప్రకటన వచ్చింది. అపూర్వ లఖియా దర్శకత్వం వహించనున్న ఈ సినిమాకి 'బ్యాటిల్ ఆఫ్ గాల్వాన్' అనే టైటిల్‌ని ప్రకటించారు. అలాగే సల్మాన్ ఖాన్ ఫస్ట్ లుక్‌ని శుక్రవారం విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో క్లీన్ షేవ్‌లో ముఖంపై రక్తపు మరకలతో భయంకరంగా కనిపించారు సల్మాన్. 2020లో గాల్వాన్ లోయలో జరిగిన యుద్ధం నేపథ్యంలో 'బ్యాటిల్ ఆఫ్ గాల్వాన్' చిత్రం ఉంటుంది. ఈ చిత్రంలో సల్మాన్ ఖాన్ ఆర్మీ ఆఫీసర్‌గా కనిపించనున్నారు. ఈ పాత్ర కోసం ఆయన ప్రత్యేకమైన వర్కవుట్లు చేసి, బరువు తగ్గారు. ఈ సినిమా షూటింగ్ ఈ నెలలో లడఖ్‌లో ప్రారంభం కానుంది. ఈ షెడ్యూల్ సుమారు 25 రోజుల పాటు జరగనుందట. కీలకమైన యాక్షన్ సన్నివేశాలను తెరకెక్కించనున్నారు. లడఖ్‌లోని రియల్ లొకేషన్స్‌లో ఈ పోరాట సన్నివేశాల చిత్రీకరణకు సన్నాహాలు చేస్తున్నారట అపూర్వ లఖియా. ఈ ఏడాది ఆఖరులోపు ఈ సినిమా చిత్రీకరణ పూర్తి చేయాలన్నది యూనిట్ ఆలోచన. వాస్తవ ఘటనల నేపథ్యంలో ఈ చిత్రం రూపొందనుంది.



● నాగచైతన్య

ముప్పై రోజులు... మూడు ప్రదేశాలు

'తండేల్' వంటి బ్లాక్‌బస్టర్ సినిమా తర్వాత నాగచైతన్య హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'ఎన్‌సీ 24' (వర్కింగ్ టైటిల్). 'విరూపాక్ష' చిత్రంతో సూపర్ హిట్ అందుకున్న కార్తీక్ దండు దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో మీనాక్షీ చౌదరి హీరోయిన్‌గా నటిస్తున్నారు. బాపినీడు సమర్పణలో శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర, సుకుమార్ రైటింగ్స్‌పై బీవీఎస్ఎన్ ప్రసాద్, సుకుమార్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా రెండో షెడ్యూల్ హైదరాబాద్‌లో ఆరంభమైనట్లు చిత్రయూనిట్ తెలిపింది. ''మిస్టిక్ థ్రిల్లర్‌గా రూపొందుతోన్న చిత్రం 'ఎన్‌సీ 24'. అన్నపూర్ణ స్టూడియోలో వేసిన ప్రత్యేకమైన గుహ సెట్‌లో ఈ సినిమా తొలి షెడ్యూల్ చిత్రీకరణ పూర్తి చేశాం. రషెస్ చాలా బాగా వచ్చాయి. ఇప్పుడు మరింత ఉత్సాహంతో హైదరాబాద్‌లో రెండవ షెడ్యూల్‌ను ప్రారంభించాం. ముప్పై రోజుల పాటు హైదరాబాద్‌లోని మూడు ప్రధాన ప్రదేశాల్లో షూటింగ్ ప్లాన్ చేశాం. ఈ షెడ్యూల్‌లో నాగచైతన్యతో పాటు ఇతర నటీనటులపై కీలక సన్నివేశాలు చిత్రీకరించనున్నాం. చైతన్య కెరీర్‌లో అత్యధిక బడ్జెట్‌తో నిర్మిస్తున్న చిత్రం ఇది'' అని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: అజనీష్ బి. లోక్‌నాథ్, కెమెరా: రాగుల్ ధరుమన్.



● కాజోల్, పృథ్వీరాజ్, ఇబ్రహీం

దేశభక్తి నేపథ్యంలో...

మలయాళ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ హీరోగా నటించిన బాలీవుడ్ చిత్రం 'సర్‌జమీన్'. ఈ సినిమాతో కాయోజ్ ఇరానీ డైరెక్టర్‌గా పరిచయమవుతున్నారు. కాజోల్ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రంలో నటుడు సైఫ్ అలీఖాన్ తనయుడు ఇబ్రహీం అలీఖాన్ కీలక పాత్రలో నటించారు. కరణ్ జోహార్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 25న జియో హాట్‌స్టార్ ఓటీటీలో నేరుగా విడుదల కానుంది. శుక్రవారం 'సర్‌జమీన్' మూవీ ట్రైలర్‌ను విడుదల చేశారు. దేశభక్తి, కశ్మీర్ నేపథ్యంలో రూపొందిన ఈ సినిమాలో పృథ్వీరాజ్ సుకుమారన్ ఆర్మీ ఆఫీసర్‌గా, ఆయన భార్య మీరా పాత్రలో కాజోల్, ఇబ్రహీం అలీఖాన్ ఉగ్రవాదిగా కనిపించనున్నారు.




● ప్రియాంకా చోప్రా

ఇండియన్ సినిమా చేయడం హ్యాపీ

● మహేశ్‌బాబుతో సినిమా గురించి ప్రియాంకా చోప్రా

''ఇండియాని చాలా మిస్ అయిపోతున్నాను. హిందీ సినిమాలను కూడా మిస్సవుతున్నాను. ఇప్పుడు ఓ ఇండియన్ ప్రాజెక్ట్ చేస్తున్నాను. ఆ సినిమా కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నాను'' అంటూ ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రియాంకా చోప్రా చెప్పిన విషయాలు వైరల్‌గా మారాయి. ఈ బ్యూటీ నటించిన హాలీవుడ్ చిత్రం 'హెడ్స్ ఆఫ్ స్టేట్' ఇటీవల విడుదలైంది. ఈ చిత్రం ప్రమోషన్‌లో భాగంగా ఆమె ఇండియన్ సినిమాల గురించి కూడా మాట్లాడారు. ''ఇండియాలో 2002లో నా తొలి సినిమా (తమిళ చిత్రం 'తమిళన్')తో కెరీర్ మొదలుపెట్టి, ఎన్నో రకాల సినిమాలు చేశాను. ఎందరో ప్రతిభావంతులతో సినిమాలు చేశాను. అందుకే ఈ సంవత్సరం ఇండియన్ సినిమా (మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో రూపొందుతున్న సినిమాని ఉద్దేశించి) చేయడం చాలా ఆసక్తిగా ఉంది. భారతీయ ప్రేక్షకులు నా పై చూపించే ప్రేమ నాకెంతో విలువైనది. నాపై వారి ప్రేమ ఎప్పటికీ అలానే ఉండాలని కోరుకుంటున్నా'' అని ప్రియాంకా చోప్రా పేర్కొన్నారు. హాలీవుడ్ సింగర్–యాక్టర్–మ్యూజిక్ డైరెక్టర్ నిక్ జోనస్‌ని 2018లో పెళ్లి చేసుకున్న ప్రియాంక ఆ తర్వాత భారతీయ చిత్రాలు ఎక్కువ చేయడంలేదు. ఈ నేపథ్యంలో ఇప్పుడు పూర్తి స్థాయిలో మహేశ్‌బాబు–రాజమౌళి కాంబినేషన్‌లోని సినిమాలో నటించడం పట్ల ఆమె చాలా ఆనందంగా ఉన్నారు. ఈ చిత్రం 2027 వేసవిలో విడుదలయ్యే అవకాశం ఉంది.

వైరల్ వయ్యారి!



● కిరీటి రెడ్డి, శ్రీలీల

ప్రముఖ పారిశ్రామికవేత్త, కర్ణాటక మాజీ మంత్రి గాలి జనార్దన్ రెడ్డి తనయుడు కిరీటి రెడ్డి హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'జూనియర్'. రాధాకృష్ణ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో శ్రీలీల కథానాయికగా నటించారు. జెనీలియా కీలక పాత్రలో నటించగా, కన్నడ నటుడు డా. రవిచంద్రన్ ప్రధాన పాత్ర పోషించారు. వారాహి చలన చిత్రం పతాకంపై రజనీ కొర్రపాటి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 18న విడుదల కానుంది. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందించిన 'జూనియర్' నుంచి 'వైరల్ వయ్యారి...' అంటూ సాగే రెండో పాటని రిలీజ్ చేశారు మేకర్స్. 'ఇన్‌స్టాగ్రామ్‌లో నా ఫాలోయింగ్ చూశావంటే మైండ్ బ్లోయింగ్.. ఫాలోవర్స్ అందరికీ నేనే డార్లింగు... నేనేమి చేసినా ఫుల్ ట్రెండింగు...' అంటూ ఈ పాట సాగుతుంది. కల్యాణ్ చక్రవర్తి సాహిత్యం అందించిన ఈ పాటని దేవిశ్రీ ప్రసాద్, హరిప్రియ పాడగా, రేవంత్ గొల్లమండల నృత్యరీతులు సమకూర్చారు. ఈ చిత్రానికి కెమెరా: కేకే సెంథిల్ కుమార్.



● నిమిషా సజయన్, అథర్వ

పిల్లలు మాయం... మై బేబి

అథర్వ మురళి, నిమిషా సజయన్ లీడ్ రోల్స్‌లో నెల్సన్ వెంకటేశన్ దర్శకత్వం వహించిన తమిళ చిత్రం 'డీఎన్ఏ'. తమిళంలో ఘనవిజయం సాధించడంతో పాటు విమర్శకుల ప్రశంసలు కూడా పొందిన ఈ చిత్రాన్ని తెలుగులో 'మై బేబి' పేరుతో ఎస్.కె. పిక్చర్స్ ద్వారా ఈ నెల 11న సురేష్ కొండేటి విడుదల చేయనున్నారు. ఈ చిత్రం గురించి సురేష్ కొండేటి మాట్లాడుతూ – ''2014లో ఒక సాఫ్ట్‌వేర్ ఆర్కిటెక్ట్ జీవితంలో జరిగిన దుర్ఘటన నేపథ్యంలో ఈ కథ సాగుతుంది. హాస్పిటల్స్‌లో పిల్లల్ని మాయం చేసి, అమ్మడం న్యూస్‌లో వింటున్నాం... చూస్తున్నాం. ఆ నేపథ్యంలో రూపొందిన ఈ సినిమా మనం సొసైటీలో ఎంత జాగ్రత్తగా ఉండాలో మరోసారి తెలియజేస్తుంది. గతంలో 'ప్రేమిస్తే, జర్నీ, షాపింగ్ మాల్, పిజ్జా' వంటి 15 విజయవంతమైన చిత్రాలను విడుదల చేశాను. ఇప్పుడు 16వ చిత్రంగా 'మై బేబి'ని తీసుకువస్తున్నాను. ఈ సినిమా కూడా సూపర్ హిట్ అవుతుందనే నమ్మకం ఉంది'' అన్నారు.


సస్పెన్స్... థ్రిల్



● అబిద్ భూషణ్, మేఘా రాజ్‌పుత్, రియా కపూర్, రోహిత్

'రక్త కన్నీరు' సినిమా ఫేమ్, దివంగత నటుడు నాగభూషణం మనవడు అబిద్ భూషణ్ హీరోగా, 'బిగ్ బాస్' ఫేమ్ రోహిత్ సహాని హీరోయిన్‌గా నటించిన చిత్రం 'మిస్టీరియస్'. మహి కోమటిరెడ్డి దర్శకత్వం వహించిన ఈ సినిమాలో రియా కపూర్, మేఘనా రాజ్‌పుత్ ప్రధాన పాత్రల్లో నటించారు. ఆష్లీ క్రియేషన్స్ పై జయ్ వల్లందాస్ నిర్మించిన ఈ చిత్రం త్వరలో విడుదల కానుంది. హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ సినిమా టీజర్ లాంచ్ ఈవెంట్‌లో మహి కోమటిరెడ్డి మాట్లాడుతూ–''సస్పెన్స్, థ్రిల్లర్, మిస్టరీతో వస్తున్న మా సినిమా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుంది. టీజర్‌కి వచ్చిన స్పందనతో మా చిత్రం విజయంపై మరింత నమ్మకం పెరిగింది'' అని చెప్పారు. ''ఎక్కడా రాజీపడకుండా 'మిస్టీరియస్' నిర్మించాం. భవిష్యత్‌లో మరిన్ని మంచి సినిమాలతో ప్రేక్షకులను అలరిస్తాం'' అన్నారు నిర్మాతలు ఉషా, శివాని. ''మాకు ఇంతమంచి అవకాశాన్ని ఇచ్చిన దర్శక–నిర్మాతలకు థ్యాంక్స్. ఇప్పటికే రిలీజ్ అయిన రెండు పాటలతో పాటు టీజర్‌కి కూడా మంచి స్పందన రావడం ఆనందంగా ఉంది'' అని అబిద్ భూషణ్, రోహిత్ సహాని తెలిపారు.

పల్లెటూరి నేపథ్యంలో...



● మనోజ్ చంద్ర


మనోజ్ చంద్ర, మోనిక .టి, ఉషా బోనెల, రవీంద్ర విజయ్, బెనర్జీ, బొంగు సత్తి, ఫణి, ప్రేమ్ సాగర్ ముఖ్య తారలుగా నటించిన చిత్రం 'కొత్తపల్లిలో ఒకప్పుడు'. 'కేరాఫ్ కంచరపాలెం' వంటి చిత్రంతో నిర్మాతగా మంచి గుర్తింపు తెచ్చుకున్న ప్రవీణ పరుచూరి దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందింది. రానా దగ్గుబాటి సమర్పణలో గోపాలకృష్ణ పరుచూరి–ప్రవీణ పరుచూరి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 18న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా టీజర్‌ని విడుదల చేశారు. ''పల్లెటూరి నేపథ్యంలో వినోదాత్మకంగా రూపొందిన చిత్రం ఇది. నటి, నిర్మాత ప్రవీణ పరుచూరి ఈ సినిమాతో డైరెక్టర్‌గా పరిచయమవుతున్నారు. ఈ చిత్రం పల్లెటూరి జీవితాన్ని, సరదాలని అద్భుతంగా చూపిస్తుంది. గురు కిరణ్ బత్తుల చక్కని కథ, సంభాషణలను అందించగా, ప్రవీణ పరుచూరి చక్కగా తెరకెక్కించారు'' అని చిత్ర యూనిట్ తెలిపింది. ఈ చిత్రానికి నేపథ్య సంగీతం: వరుణ్ ఉన్ని, కెమెరా: పెట్రోస్ ఆంటోనియాడిస్.

థియేటర్లో సస్పెన్స్



● ధనుంజయ

కన్నడ స్టార్ శివ రాజ్‌కుమార్, 'పుష్ప'లో చేసిన జాలి రెడ్డి పాత్రతో తెలుగులో మంచి గుర్తింపు తెచ్చుకున్న డాలీ ధనుంజయ లీడ్ రోల్స్‌లో నటిస్తున్న చిత్రం '666 ఆపరేషన్ డ్రీమ్ థియేటర్'. 'సప్త సాగరాలు' సినిమా ఫేమ్ హేమంత్ రావు దర్శకత్వంలో వైశాఖ్ జె. గౌడ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ చిత్రం నుంచి డాలీ ధనుంజయ న్యూ లుక్‌ను శుక్రవారం రిలీజ్ చేశారు. 1970ల నేపథ్యంలో ఈ చిత్రం ఉంటుందని సమాచారం. ''ఈ సస్పెన్స్ యాక్షన్ థ్రిల్లర్ మూవీని ఒకేసారి కన్నడంతో పాటు తెలుగులోనూ రిలీజ్ చేస్తాం. ఎమోషన్స్‌కి కూడా ప్రాధాన్యం ఉంది'' అని యూనిట్ పేర్కొంది.


'సంపద అట్టడుగు వర్గాలకు చేరితే వారి కొనుగోలు శక్తి పెరుగుతుంది'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 20 వెల: ₹ 5.50

సంపుటి: 18 సంచిక: 104

శనివారం 5-7-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



పైచేయి మనదే


సిరాజ్‌కు 6 వికెట్లు. ఇంగ్లండ్ 407

ఆలౌట్. స్మిత్, బ్రూక్ సెంచరీలు -15లో



యూపీఎస్‌కూ పన్ను లబ్ధి


ఎన్‌పీఎస్ మాదిరే కల్పించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం -15లో



ఆకాశమూ హద్దు కాదు

అవకాశాల గనిగా మారిన భారత్‌కు ఆకాశం సైతం హద్దు కాదని ట్రినిడాడ్ అండ్ టొబాగోలో ప్రధాని మోదీ పేర్కొన్నారు.

- వివరాలు 6లో▶



550 డ్రోన్లు, 11 మిస్సైళ్లు

ఉక్రెయిన్ రాజధాని కీవ్ లక్ష్యంగా రష్యా శుక్రవారం రాత్రి అతిపెద్ద దాడికి పాల్పడింది. బాంబు పేలుళ్లతో కీవ్ దద్దరిల్లింది.

- వివరాలు 6లో▶



పాక్‌కు చైనా, తుర్కియే సాయం

ఆపరేషన్ సిందూర్ వేళ పాక్‌కు చైనా, తుర్కియే సహకరించాయని ఆర్మీ డిప్యూటీ చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ రాహుల్ సింగ్ చెప్పారు.

- వివరాలు 6లో▶



వర్షాలతో తీవ్ర నష్టం

రెండు వారాలుగా ఏకధాటిగా కురుస్తున్న వర్షాలతో హిమాచల్ ప్రదేశ్‌లో 43 మంది మృతిచెందగా 37 మంది గల్లంతయ్యారు.

- వివరాలు 6లో▶

యుద్ధాన్ని ఆపేశారేం?

ఆపిందెవరో మోదీ ప్రభుత్వం చెప్పాలి

పాక్ పీచమణిచే అవకాశాన్ని చేజేతులా కోల్పోయారు

ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ధ్వజం

- పహల్గాం ఘటనపై కేంద్రానికి దేశం యావత్తు అండగా నిలిచింది
- రాజకీయ పార్టీలు కూడా మోదీకి మద్దతుగా గొంతు కలిపాయి
- కీలక సమయంలో చేతులు ఎత్తేయడమే మోదీకి చేతనవుతుంది
- మోదీ మాదిరి అప్పట్లో ఇందిరా గాంధీ భయపడలేదు
- కాంగ్రెస్ గ్రామాధ్యక్షులు, కార్యకర్తల సమ్మేళనంలో ప్రసంగం
- ప్రజా ప్రభుత్వం పథకాలు దేశానికే రోల్‌మోడల్: సీఎం రేవంత్
- వచ్చే ఎన్నికల్లో 100 ఎమ్మెల్యే, 15 ఎంపీ సీట్లు గెలిచి అధిష్టానానికి బహుమతిగా ఇచ్చేందుకు కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారని వ్యాఖ్య

సాక్షి, హైదరాబాద్: పాకిస్తాన్‌పై యుద్ధాన్ని ఆకస్మికంగా ఎందుకు ఆపేశారో, అసలు ఆపిందెవరో దేశ ప్రజలకు మోదీ ప్రభుత్వం చెప్పాలని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే డిమాండ్ చేశారు. పహల్గాం ఘటనపై దేశం యావత్తు కేంద్ర ప్రభుత్వానికి అండగా నిలిచిందని చెప్పారు. దేశంలోని అన్ని రాజకీయపార్టీలు మోదీకి మద్దతు ఇస్తూ యుద్ధం చేయాలంటూ గొంతు కలిపాయని గుర్తుచేశారు. అయినా యుద్ధం కొనసాగించకుండా అర్ధాంతరంగా నిలిపివేయడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. దేశానికున్న బలగంతో వీరోచితంగా పోరాడి పాక్ పీచమణిచి పీఓకేను స్వాధీనం చేసుకునే అవకాశాన్ని చేజేతులా కోల్పోవడం అత్యంత దురదృష్టకరమంటూ ఖర్గే ధ్వజమెత్తారు. జబ్బలు చరుచుకునే మోదీకి కీలక సమయంలో చేతులు ఎత్తేయడమే చేతనవుతుందని విమర్శించారు. దేశరక్షణ, సైనికులపై ఏర్పాటు చేసిన అఖిలపక్ష సమావేశానికి గైర్హాజరు కావడం ఆయన దేశభక్తికి నిదర్శనమని ఎద్దేవా చేశారు. శుక్రవారం ఎల్బీ స్టేడియంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు, కార్యకర్తల సమ్మేళనానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు.

మోదీ మణిపూర్ ఎందుకు వెళ్లలేదు?

'గంభీరంగా కనిపిస్తున్నట్లు నటించే మోదీ నిజానికి అత్యంత భయస్తుడు. ప్రధాని మోదీ ఇప్పటివరకు 42 దేశాల్లో పర్యటించారు. కానీ స్వదేశంలో

మిగతా 12వ పేజీలో ▶



శుక్రవారం ఎల్బీ స్టేడియంలో జరిగిన కాంగ్రెస్ సమ్మేళనంలో కార్యకర్తలకు అభివాదం చేస్తున్న ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సీఎం రేవంత్‌రెడ్డి

గ్రూపులు కడతామంటే కుదరదు

- నలుగురం కలిసి ఏదో కిందా మీదా చేద్దామనుకుంటే నేను, రాహుల్ భయపడం
- పార్టీ నేతలకు ఖర్గే సీరియస్ వార్నింగ్!

12లో

మోదీని ఇంట్లో కూర్చోబెట్టాలి

- అప్పుడే దేశంలో రాజ్యాంగ హక్కులకు రక్షణ ఉంటుంది
- టీపీసీసీ విస్తృత స్థాయి సమావేశంలో మల్లికార్జున ఖర్గే
- బీజేపీతో యుద్ధానికి సిద్ధం కావాలని పిలుపు

12లో

న్యూస్‌రీల్

20 మంది విద్యార్థులుంటే కొత్తగా పాఠశాల



ప్రజలకు విద్యను మరింత చేరువ చేసే దిశగా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గ్రామాలు, పట్టణ శివారుల్లో 20 మంది విద్యార్థులున్నచోట పాఠశాల లేకుంటే వెంటనే ప్రారంభించాలని నిర్ణయించింది.

- వివరాలు 2లో▶

ఖాళీ గనులను మూసేస్తాం



ఖనిజాల వెలికితీత పూర్తయిన గనులను శాస్త్రీయ పద్ధతుల్లో మూసివేస్తామని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రకటించారు. తద్వారా ప్రమాదాలను నివారించడంతోపాటు పర్యావరణ పరిరక్షణ, స్థానికులకు ఉపాధి లక్ష్యంగా కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు.

- వివరాలు 13లో▶

నిబద్ధతకు నిలువెత్తు సంతకం రోశయ్య



కాంగ్రెస్ పార్టీలో నిబద్ధతకు మాజీ సీఎం రోశయ్య నిలువెత్తు సంతకమని ఏఐసీసీ చీఫ్ ఖర్గే అన్నారు. రోశయ్య జయంతి సందర్భంగా లక్డీకాపూల్‌లో ఆయన కాంస్య విగ్రహాన్ని సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి ఆవిష్కరించారు.

- వివరాలు 5లో▶

ఈడీ విచారణకు అల్లు అరవింద్



రామకృష్ణ ఎలక్ట్రానిక్ బ్యాంక్ స్కామ్ కేసులో సినీనిర్మాత అల్లు అరవింద్‌ను ఈడీ అధికారులు విచారించారు. ఈ నెల 2న ఆయన విచారణకు హాజరుకాగా ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

- వివరాలు 5లో▶





నిర్మలా సీతారామన్ | పురందేశ్వరి | వనతి శ్రీనివాసన్

దక్షిణాది మహిళకే బీజేపీ పగ్గాలు?

జాతీయ అధ్యక్ష పదవి రేసులో నిర్మలా సీతారామన్, పురందేశ్వరి, వనతి శ్రీనివాసన్

- పార్టీ చరిత్రలో తొలిసారి మహిళా నేతకు అవకాశం
- మహిళకు బాధ్యతలు కట్టబెట్టేందుకు ఆర్‌ఎస్‌ఎస్ గ్రీన్‌సిగ్నల్

సాక్షి, న్యూఢిల్లీ: చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్ కల్పించాలనే సంకల్పానికి నిదర్శనంగా బీజేపీ చారిత్రక నిర్ణయం తీసుకోబోతున్నట్లు తెలుస్తోంది. పార్టీ చరిత్రలో తొలిసారి అధ్యక్ష బాధ్యతలు ఒక మహిళకు అప్పగించాలని భావిస్తున్నట్లు సమాచారం. బీజేపీ జాతీయ అధ్యక్ష పగ్గాలు ఈసారి దక్షిణాదికి చెందిన మహిళా నేతకే దక్కుతాయని ఢిల్లీలో ఊహాగానాలు ఊపందుకున్నాయి. ఈ రేసులో తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ముగ్గురు ప్రముఖ మహిళా నేతలు ఉన్నారనే చర్చ జరుగుతోంది. వారిలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్, ఏపీ బీజేపీ ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, బీజేపీ మహిళా మోర్చా జాతీయ అధ్యక్షురాలు వనతి శ్రీనివాసన్ పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. మరోవైపు.. మహిళకు పార్టీ పగ్గాలు కట్టబెట్టేందుకు రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్(ఆర్‌ఎస్‌ఎస్) కూడా ఆమోద ముద్ర వేసినట్లు సమాచారం. ఏడాదిన్నర కాలంగా జాతీయ అధ్యక్షుడి ఎంపికపై కొనసాగుతున్న ఉత్కంఠకు కొద్దిరోజుల్లో తెరదించేలా బీజేపీ అధిష్టానం కసరత్తు చేస్తోంది.

ముందంజలో నిర్మలా సీతారామన్

కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ఇటీవల పార్టీ ప్రధాన కార్యాలయంలో బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా, ప్రధాన కార్యదర్శి(సంస్థాగత) బీఎల్ సంతోష్‌లను కలిశారు. కమలం పార్టీ అధ్యక్ష పీఠం కోసం మిగతా 13వ పేజీలో ▶

ధైర్యం, ధర్మం, కర్మ

ఆపరేషన్ సిందూర్ ద్వారా ప్రపంచానికి పరిచయం చేశాం: రాజ్‌నాథ్ సింగ్

- మన ప్రజలను చంపినవాళ్లను మాత్రమే మనం చంపాం
- దేశ స్వాభిమాన చిహ్నం అల్లూరి సీతారామరాజు
- అల్లూరి 128వ జయంతి ఉత్సవాల్లో రక్షణ మంత్రి
- అమరులందరినీ గుర్తుచేసుకోవాలి: కేంద్ర మంత్రి షెకావత్
- అల్లూరి వారసులను ఆదుకున్నాం: కిషన్‌రెడ్డి



వేదికపై విల్లు ఎక్కు పెడుతున్న రాజ్‌నాథ్‌సింగ్

సాక్షి, హైదరాబాద్: ఆపరేషన్ సిందూర్ ద్వారా ధైర్యం, ధర్మం, కర్మను ప్రపంచానికి పరిచయం చేశామని రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ తెలిపారు. పహల్గాంలో భారతీయులను చంపినవారినే ఆపరేషన్ సిందూర్ ద్వారా మనం చంపేశామని చెప్పారు. పహల్గాంలాంటి ఘటనలు మరోసారి జరిగితే సకాలంలో సరైన సమాధానం చెబుతామని హెచ్చరించారు. శుక్రవారం శిల్పకళావేదికలో స్వాతంత్ర్య పోరాటయోధుడు అల్లూరి సీతారామరాజు 128వ జయంతి ఉత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అల్లూరి సీతారామరాజు తెలుగు ప్రజలతోపాటు మొత్తం భారతదేశ స్వాభిమానానికి చిహ్నంగా చరిత్రలో నిలిచిపోయారని అన్నారు. అల్లూరి పోరాట యోధుడే కాదని, ప్రజల కోసం అన్నీ కోల్పోయిన గొప్ప నాయకుడన్నారు. దశాబ్దాలపాటు సాగిన పోరాటాలకు సీతారామరాజు బాటలు వేశారని అన్నారు.

వేగంగా గిరిజనుల అభివృద్ధి

ఆదివాసీలను సాధారణ జనజీవనంలోకి తీసుకురావాల్సిన మిగతా 13వ పేజీలో ▶

'జేన్ స్ట్రీట్' స్కామ్!

రూ. వేల కోట్ల అక్రమార్జనపై సెబీ ఉక్కుపాదం


- మార్కెట్ లావాదేవీలు నిర్వహించకుండా జేన్ స్ట్రీట్ గ్రూప్‌పై నిషేధం... రూ. 4,843 కోట్ల అక్రమ లాభాలను చెల్లించాలంటూ మధ్యంతర ఆదేశాలు
- స్టాక్ మార్కెట్లో అవకతవకలకు పాల్పడటమే కారణం

- వివరాలు 15లో



ఇది ఇల్లీగల్!

అక్రమ నిర్మాణం ముందు ఇలా హోర్డింగు ఏర్పాటుకు ఆదేశాలిస్తాం



- అప్పుడు ఎవరూ కొనరు.. నిర్మాణం నిలిపివేస్తారు
- లేకుంటే అనధికారిక నిర్మాణాల ప్రహసనం కొనసాగుతూనే ఉంటుంది
- హైకోర్టు తీవ్ర వ్యాఖ్యలు.. అక్రమ నిర్మాణం కూల్చివేయకపోవడంపై సీరియస్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని అనధికారిక భవనాలకు 'ఇది అనుమతి లేని నిర్మాణం' అంటూ స్పీకింగ్ ఆర్డర్స్ ఇవ్వడంతో పాటు భవనం ముందు బోర్డులు, హోర్డింగులు ఏర్పాటు చేసేలా ఆదేశాలిస్తామని హైకోర్టు తెలిపింది. దీంతో రెండు ప్రయోజనాలుంటాయని..అది ఒకవేళ బహుళ అంతస్తుల నిర్మాణం, అపార్ట్‌మెంట్ అయితే ప్రజలు ఎవరూ కొనుగోలు చేయరని, వ్యక్తిగత ఇల్లు అయితే పరువు కోసమన్నా అక్రమ నిర్మాణాన్ని నిలిపివేస్తారని స్పష్టం చేసింది. లేకుంటే అనధికారిక నిర్మాణాల ప్రహసనం ఇలానే కొనసాగుతూ ఉంటుందని ఆందోళన వ్యక్తం చేసింది. జీహెచ్ఎంసీ అధికారుల తీరుపై తీవ్ర వ్యాఖ్యలు చేసింది. తాజా కేసులో వివరాలు తెలుసుకుని చెప్పేందుకు సమయం కావాలని కోరడంతో తదుపరి విచారణ మిగతా 2వ పేజీలో ▶

ఎఫ్‌టీఎల్ నిర్ధారించకుండా కూల్చివేతలా? 2లో



కేసీఆర్‌తో సమావేశమైన కేటీఆర్, హరీశ్‌రావు, లింగయ్య ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్, జగదీశ్‌రెడ్డి

తెలంగాణ తెచ్చుకుంది కడుక్కు తాగేందుకు కాదు

ఆస్పత్రిలో పార్టీ నేతలతో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్

- నాసిరకం పాలనతో రాష్ట్రానికి తీరని అన్యాయం
- సాగునీటి రంగంపై పాలకులకు తోక తెలియదు... మూతి తెలియదు
- నేనే ప్రెస్‌మీట్ పెట్టి బనకచర్ల సహా అన్ని విషయాలు వివరిస్తా

సాక్షి, హైదరాబాద్: 'సుదీర్ఘ కాలం కొట్లాడి తెలంగాణ రాష్ట్రం తెచ్చుకున్నది కడుక్కుని తాగేందుకు, కరిగించుకుని తినేందుకు కాదు. రాష్ట్ర ఏర్పాటు ఉద్యమం వెనుక ఉన్న గాఢతను అర్థం చేసుకునే తెలివితేటలు ప్రస్తుత పాలకులకు లేవు. రొడ్డకొట్టుడు ఉపన్యాసాలతో, నాసిరకం పాలనతో రాష్ట్రానికి తీరని నష్టం చేస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సాగునీటి రంగంలో తెలంగాణకు జరిగిన అన్యాయం గురించి ఎంత చెప్పినా తక్కువే. నీళ్ల కోసమే తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం పుట్టిందనే విషయం అందరికీ తెలుసు. కానీ ప్రస్తుత పాలకులకు సాగునీటి రంగంపై అవగాహన లేకపోవడంతో జరుగుతున్న నష్టంపై ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉంది. ఒకటి రెండు రోజుల్లో నేను స్వయంగా ప్రెస్‌మీట్ పెట్టి అన్ని విషయాలు మిగతా 13వ పేజీలో ▶

ఇదండీ సంగతి




అదేదో ట్రంప్‌కు చెపితే బెటరనుకుంటా కామ్రేడ్!

'మనసున్న మనిషికి సుఖము లేదంతే..' అన్నారు ఆచార్య ఆత్రేయ. సుఖం ఉండకపోగా, డిప్రెషన్‌లోకి వెళ్లిపోయే ప్రమాదమూ ఉండొచ్చు. 'యాంటీడిప్రెసెంట్స్'లు వాడి ఆ డిప్రెషన్ నుంచి బయట పడొచ్చనుకోండి.. అయితే వాటిని వాడితే మెదడుపై దీర్ఘకాల దుష్ప్రభావాలు ఉంటాయని శాస్త్ర పరిశోధకులు కనిపెట్టారు. 'ఇందులో కొత్తేముందీ!' అంటారా? ఉంది. యాంటీడిప్రెసెంట్‌లు వాడితే మెదడుపై పడే దుష్ప్రభావాలు మగవాళ్లలోనే కానీ, ఆడవాళ్లలో కాదట!

\- సాక్షి, స్పెషల్ డెస్క్

- ఒత్తిడి తగ్గించే ఔషధాల దుష్ప్రభావం స్త్రీలపై తక్కువే
- దీర్ఘకాలంలో పురుషుల్లోనే కొన్ని ప్రతికూల మార్పులు
- విటమిన్ బీ3 వాడకంతో తగ్గుతున్న దుష్ప్రభావాలు
- గర్భిణులకు, పుట్టబోయే పిల్లలకు గొప్ప శుభవార్తే

మహిళల మెదడు సేఫ్!



మానసిక రుగ్మతలకు వైద్యులు సిఫారసు చేసే 'యాంటీడిప్రెసెంట్' ఔషధాలు దీర్ఘకాలంలో పురుషుల మెదడుపై దుష్ప్రభావాలు చూపే అవకాశాలు ఉండగా, మహిళల్లో అలాంటి ప్రభావం దాదాపు లేదని టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ (టి.ఐ.ఎఫ్.ఆర్.) శాస్త్రవేత్తలు ఎలుకలపై జరిపిన తాజా పరిశోధనలో వెల్లడైంది. అయితే యాంటీడిప్రెసెంట్లు పురుషుల మెదడుపై ఈ విధంగా ప్రభావాన్ని చూపటం అన్నది వారి వయసుపై కూడా ఆధారపడి ఉండొచ్చని వారు భావిస్తున్నారు.

యాంటీ డిప్రెసెంట్‌లు ఏం చేస్తాయి?

సెరటోనిన్ అనే న్యూరోహార్మోన్ మెదడులోని భావోద్వేగాల రూపకల్పనలో కీలక పాత్ర పోషిస్తుంది. ఆ హార్మోన్‌ను నియంత్రించటమే యాంటీడిప్రెసెంట్ల పని. నిరాశ, నిస్పృహ, ఆందోళన తదితర న్యూరోసైకియాట్రిక్ వ్యాకులతలకు వైద్యులు ప్రధానంగా 'సెలెక్టివ్ సెరటోనిన్ రీఅప్టేక్ ఇన్హిబిటర్లు' (ఎస్.ఎస్.ఆర్.ఐ.లు) సిఫారసు చేస్తారు. ఈ మందులు మెదడులోని సెరటోనిన్ అధికం చేసి మానసిక ఉపశమనానికి తోడ్పడతాయి.

మగ ఎలుకల్లోనే మార్పులు


ఎస్.ఎస్.ఆర్.ఐ.లలో విస్తృతంగా వాడుకలో ఉన్న ఔషధం 'ఫ్లూఆక్సిటీన్'. గర్భిణులు, బాలింతలు, పిల్లలు, కౌమార దశలో ఉన్నవారు సహా అన్ని వయసుల వారికి వైద్యులు సిఫారసు చేసే ఈ ఫ్లూఆక్సిటీన్ దీర్ఘకాలిక ప్రభావాలు ఎలా ఉంటాయన్న విషయమై ఎలుకల మెదడుపై జరిపిన ఈ అధ్యయనంలో అనేక ఆసక్తికరమైన సంగతులు వెల్లడయ్యాయి. ఫ్లూఆక్సిటీన్‌ను ఇవ్వడం వల్ల మగ ఎలుకల మెదడులో విస్తృతమైన వ్యతిరేక మార్పులు కనిపించాయి. పుట్టిన కొద్ది రోజుల వయసున్న ఎలుకలకు యాంటీడిప్రెసెంట్‌లను ఇచ్చినప్పుడు క్రమేణా ఆందోళన స్థాయిలు పెరిగాయి. లైంగిక పరిపక్వతకు చేరుకున్న దశలో ఉన్న ఎలుకలకు ఇచ్చినప్పుడు అవి తక్కువ ఆందోళనను కనబరిచాయి. ఈ మందు ఇచ్చిన ఆడ ఎలుకల ప్రవర్తన, మెదడు నిర్మాణం, మైటోకాండ్రియా లేదా జన్యు వ్యక్తీకరణలలో మార్పులేమీ కనిపించలేదు. బహుశా ఇందుకు ఈస్ట్రోజెన్, ఇతర స్త్రీ హార్మోనుంచి రక్షణ లభిస్తుండవచ్చునని తెలిపారు. జెండర్ క్రోమోజోమ్‌లు, జన్యుపరమైన వ్యత్యాసాలపై మరింత అధ్యయనం జరిపితే దీనిపై నిర్ధారణకు అవకాశం ఉంటుందని పరిశోధకులు భావిస్తున్నారు.

అత్యంత సాధారణ ఔషధం

'ఫ్లూఆక్సిటిన్' అనేది 18 సంవత్సరాల కంటే తక్కువ వయసున్న వారికి, గర్భిణులకు చికిత్సపరంగా మంచి ఫలితాల కోసం ఇచ్చే అత్యంత సాధారణ ఔషధం. ప్రొజాక్, ఫ్లూడాక్ వంటి బ్రాండ్‌పేర్లతో ఇది లభిస్తోంది. అయితే దాని దీర్ఘకాలిక ప్రభావాన్ని అంచనా వేయడానికి మరిన్ని పరిశోధనలు జరగాల్సి ఉంది' అని తాజా పరిశోధనా పత్రాన్ని సమర్పించిన ముఖ్య అధ్యయనకర్త ఉత్కర్షా ఘాయ్ అంటున్నారు. ఘాయ్ ముంబైలోని టి.ఐ.ఎఫ్.ఆర్. (టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రిసెర్చ్) లో పీహెచ్‌డి, బెంగళూరులోని నిమ్‌హాన్స్‌లో పోస్ట్‌డాక్టరల్ రీసెర్చ్ చేశారు.

అధ్యయనం జరిగిన విధానం

ఫ్లూఆక్సిటిన్ తీసుకున్న తర్వాత.. సెక్సువల్ హార్మోన్లు క్రియాశీలకం కావడానికి ముందు, తర్వాత మెదడుపై ప్రభావాలను అధ్యయనం చేసేందుకు టి.ఐ.ఎఫ్.ఆర్. శాస్త్రవేత్తల బృందం ఎలుకల్ని రెండు జట్లుగా విభజించింది. ఒక జట్టు : ఎలుకలు 2 నుండి 21 రోజుల వయసున్నవి. ఇంకో జట్టు : 28–48 రోజుల వయసున్నవి. అప్పుడే పుట్టిన ఎలుకల్లో ఈ మందు వాడకంతో ఆందోళన క్రమంగా పెరిగింది. అదే రెండో జట్టు ఎలుకల్లో ఒత్తిడి, ఆందోళన స్వల్పంగా తగ్గాయి. ఈ అధ్యయన ఫలితాలను మానవుల్లోనూ అవే రెండు దశలుగా శైశవ దశ నుంచి శరీరంలో సెక్సువల్ హార్మోన్లు కనిపించే వయసు వరకు; టీనేజీ నుంచి 25 ఏళ్ల వరకు ఈ బృందం అన్వయించింది.



సహాయకారిగా విటమిన్ బి3

యాంటీడిప్రెసెంట్‌ల వాడటం వల్ల కొందరి మెదడుపై కనిపించే దుష్ప్రభావాలను తగ్గించేందుకు చేసిన అధ్యయనంలో భాగంగా ఈ బృందం విటమిన్ బి3 (నికోటినమైడ్)ని ఎలుకలకు ఇచ్చింది. ఆశ్చర్యకరంగా, పుట్టి కొద్ది రోజులే అయిన ఎలుకలలో గమనించిన అనేక ప్రతికూల ప్రభావాలు బి3 ప్రభావంతో ఉపశమించాయి. వాటి జీవక్రియ పునరుద్ధరణ జరిగింది. వాటి నిరాశ, నిస్పృహల ప్రవర్తనలలో గణనీయమైన తగ్గుదల కనిపించింది. దీంతో వైద్యులకు ఒక ఆశారేఖ దొరికినట్టయింది. తీవ్రమైన ఆందోళన, ఒత్తిడి ఉండి.. ఆత్మహత్య చేసుకోవాలనుకునే మానసిక స్థితి ఉన్న గర్భిణులకు ఎస్ఎస్ఆర్ఐలు తప్పనిసరిగా ఇవ్వాల్సి వస్తుంది. అలా ఇస్తే వాటి ప్రభావం పుట్టే పిల్లలపై పడుతుంది. కానీ, విటమిన్ బీ3 వాడితే... ఆ ప్రభావం తగ్గుతుందని ప్రస్తుత పరిశోధనల్లో కొంత వరకు తేలింది. ఇది గర్భిణులందరికీ గొప్ప శుభవార్తే. కాకపోతే పూర్తిస్థాయిలో పరిశోధనలు జరగాల్సి ఉంది.

క్లుప్తంగా...

20 మంది విద్యార్థులుంటే కొత్తగా పాఠశాల

గ్రామాలు, పట్టణ కాలనీల్లో ఏర్పాటుకు ప్రభుత్వం ఆదేశం

సాక్షి, హైదరాబాద్: ప్రజలకు విద్యను మరింత చేరువ చేసే దిశగా ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీచేసింది. గ్రామాలు, పట్టణాల్లోని శివారు కాలనీల్లో 20 మంది విద్యార్థులున్నచోట ప్రభుత్వ పాఠశాల లేకుంటే వెంటనే ప్రారంభించాలని నిర్ణయించింది. ఇటీవల డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల సంస్థలో జరిగిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకోగా, తాజాగా పాఠశాల విద్య డైరెక్టర్ అన్ని జిల్లాల డీఈవోలు, మండల విద్యాశాఖ అధికారులకు పాఠశాలల ఏర్పాటుపై ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థులుండి పాఠశాలు లేనిచోట వెంటనే ప్రాథమిక పాఠశాలలను ప్రారంభించాలని సూచించారు. పట్టణ ప్రాంతాల్లో 359, గ్రామీణ ప్రాంతాల్లో 212 పాఠశాలలు అవసరమని అధికారులు నివేదిక రూపొందించారు. కొన్ని పాఠశాలల్లో ఎక్కువగా ఉన్న ఉపాధ్యాయులను కొత్తగా ఏర్పాటు చేసే పాఠశాలలకు పంపాలని సూచించారు.

ఆర్జీయూకేటీ ప్రవేశాల జాబితా విడుదల



జాబితాను విడుదల చేస్తున్న ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్

భైంసా: నిర్మల్ జిల్లా బాసర ట్రిపుల్‌ఐటీలో ప్రవేశాల జాబితాను ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ శుక్రవారం యూనివర్సిటీ క్యాంపస్‌లో విడుదల చేశారు. ఈ విద్యాసంవత్సరానికి కేటాయించిన సీట్ల మెరిట్ జాబితా విడుదలైంది. బాసర, మహబూబ్‌నగర్ కేంద్రాలకు కలిపి 1,690 సీట్లకు విద్యార్థులను ఎంపిక చేశారు. 20,258 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఎంపికైన విద్యార్థులకు మూడు విడతల్లో కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. నిజామాబాద్ జిల్లా నుంచి అత్యధికంగా 297 మంది విద్యార్థులు ఎంపికవగా.. భూపాలపల్లి జిల్లా నుంచి ఒకే విద్యార్థి ఎంపికయ్యాడు. ఇక క్రమసంఖ్య 1 నుంచి 564 వరకు ఈనెల 7న, 565 నుంచి 1128 వరకు ఈనెల 8న, 1129 నుంచి 1690 వరకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. పూర్తి వివరాలకు www.rgukt.ac.in వెబ్‌సైట్ చూడొచ్చు.

ఎంపిక జాబితా, కటాఫ్ మార్కుల వివరాలు.. సాక్షి ప్లస్ ఈ-పేపర్‌లో..

రేపటి నుంచి వెబ్ ఆప్షన్లు

కీలక దశకు ఇంజనీరింగ్ కౌన్సెలింగ్

- ఇప్పటికీ పూర్తికాని కాలేజీల అఫిలియేషన్లు
- జేఎన్టీయూహెచ్‌లో కొన్ని కాలేజీలపై సందేహాలు
- కొత్త సీట్లు ఈ ఏడాది లేనట్టే



సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్ కౌన్సెలింగ్ వెబ్ ఆప్షన్ల ప్రక్రియ ఆదివారం నుంచి మొదలవుతుంది. విద్యార్థులకు ఇదే కీలకం. ఆప్షన్ల కోసం లక్షల మంది విద్యార్థులు ఎదురు చూస్తున్నారు. బ్రాంచీ, కాలేజీని ఎంపిక చేసుకునేది ఇప్పుడే. కౌన్సెలింగ్ ప్రక్రియ గత నెల 28 నుంచి మొదలైంది. తొలి దశ కౌన్సెలింగ్ కోసం 7వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ చేసుకునే వెసులుబాటు ఉంది. రిజిస్ట్రేషన్ చేసుకుని, ధ్రువపత్రాల పరిశీలన పూర్తయిన విద్యార్థులు వెబ్ ఆప్షన్లు ఇవ్వాలి. దీనికి 10వ తేదీ వరకు గడువు ఉంటుంది. శుక్రవారం సాయంత్రం వరకు 92,013 మంది ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. వీరిలో 55,120 మందికి సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తయింది. వెబ్ ఆప్షన్లు ఇచ్చే నాటికి దాదాపు 2 లక్షలకుపైగా రిజిస్ట్రేషన్లు జరిగే అవకాశం ఉంది.

ఇంకా తేలని కాలేజీలు, సీట్ల లెక్క

వెబ్ ఆప్షన్ల సమయంలో కౌన్సెలింగ్‌లో పాల్గొనే అన్ని కాలేజీలు, వాటిల్లో బ్రాంచీలు, సీట్ల వివరాలు ఆన్‌లైన్‌లో ఉంచాలి. కానీ, ఇప్పటివరకు జవహర్‌లాల్ సాంకేతిక విశ్వవిద్యాలయం (జేఎన్టీయూహెచ్) నుంచి సాంకేతిక విద్య విభాగానికి అఫిలియేషన్ వివరాలు అందలేదు. దీంతో సీట్ల సంఖ్యపై స్పష్టత కొరవడింది. జేఎన్టీయూహెచ్ పరిధిలో 139 అనుబంధ గుర్తింపు కాలేజీలున్నాయి. ఈ ఏడాది ఒక ప్రైవేటు ఇంజనీరింగ్ సంస్థ డీమ్డ్ హోదా పొందింది. దీని పరిధిలోని కాలేజీలు కౌన్సెలింగ్‌లో ఉండే అవకాశం లేదు. మరో రెండు కాలేజీలు మూసివేతకు దరఖాస్తు చేశాయి. రాష్ట్రవ్యాప్తంగా 156 ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలున్నాయి. ప్రభుత్వ వర్సిటీలకు చెందిన కాలేజీలు 19 ఉన్నాయి. మొత్తం 175 కాలేజీలు గత ఏడాది కౌన్సెలింగ్‌లో పాల్గొన్నాయి. ఈ సంవత్సరం కొత్తగా పాలమూరు, శాతవాహన, కొత్తగూడెం హెల్త్ సైన్సెస్ యూనివర్సిటీ కాలేజీలు కౌన్సెలింగ్‌లో పాల్గొంటాయి. దీంతో 176 ఇంజనీరింగ్ కాలేజీలు కౌన్సెలింగ్ జాబితాలో ఉంటాయి. వీటి పరిధిలో 89,970 సీట్లు అందుబాటులో ఉండే వీలుంది. శనివారం సాయంత్రానికి గుర్తింపు పొందిన కాలేజీలు, సీట్ల వివరాలు సాంకేతిక విద్య విభాగానికి పంపుతామని జేఎన్టీయూహెచ్ అధికారులు తెలిపారు.

విద్యార్థుల అవగాహనకు మాక్ కౌన్సెలింగ్

వెబ్ ఆప్షన్లు ఇచ్చిన విద్యార్థులకు ఈసారి కొత్తగా మాక్ కౌన్సెలింగ్ చేపడుతున్నారు. ఈ నెల 13వ తేదీన విద్యార్థులకు సీటు, బ్రాంచీ వివరాలతో మెసేజ్ వస్తుంది. దీన్నిబట్టి కాలేజీలు, బ్రాంచీలను ఈ నెల 15వ తేదీ వరకు మార్చుకునే వీలుంది. 15న సీట్ల కేటాయిస్తారు.

కొత్త సీట్లు లేనట్టే

డిమాండ్ లేని బ్రాంచీల్లో సీట్లు తగ్గింపు.. కంప్యూటర్స్, ఎమర్జింగ్ కోర్సుల్లో సీట్లు పెంపు కోసం దాదాపు 100 కాలేజీలు దరఖాస్తు చేయగా ప్రభుత్వం తిరస్కరించింది. సర్కారు ఓకే చెప్పి ఉంటే దాదాపు 20 వేల సీట్లు కంప్యూటర్ కోర్సుల్లో పెరిగేవి. ప్రభుత్వం ఒప్పుకోకపోవటంతో ఈసారి సీట్లు పెరిగే వీలు లేదు. మరోవైపు పాత ఫీజులనే వసూలు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. దీనిపైనా స్పష్టత ఇవ్వాలని విద్యార్థులు కోరుతున్నారు. ఇంజనీరింగ్ అయిపోయే వరకు ఇదే ఫీజు ఉంటుందా? ఒక వేళ ఫీజు పెంచితే కొత్త ఫీజు మధ్యలో వసూలు చేస్తారా? అనే స్పష్టత కోరుతున్నారు.

అంతా సిద్ధం చేశాం



వెబ్ ఆప్షన్లకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశాం. సాంకేతిక సమస్యలొచ్చినా యంత్రాంగం తక్షణమే స్పందిస్తుంది. వెబ్ ఆప్షన్లు ఇచ్చే నాటికి అఫిలియేషన్ కాలేజీలు, సీట్ల వివరాలు అందుబాటులోకి వస్తాయి.

\- శ్రీనివాస్, ఎప్‌సెట్ క్యాంప్ ఆఫీసర్

జాబితా రెడీ చేశాం



అనుబంధ గుర్తింపు ప్రక్రియను పూర్తి చేశాం. కాలేజీల్లో మౌలిక వసతులు, ఫ్యాకల్టీ అన్నీ పరిశీలించి గుర్తింపు ఇచ్చాం. తుది జాబితాను సాంకేతిక విద్యకు పంపే ఏర్పాట్లు చేస్తున్నాం. సీట్ల పెంపు ప్రతిపాదనేమీ లేదు.

\- డాక్టర్ కె విజయకుమార్ రెడ్డి, జేఎన్టీయూహెచ్ రెక్టార్

ఇది ఇల్లీగల్!

▶ మొదటి పేజీ తరువాయి

ఈ నెల 11కు వాయిదా వేసింది. హైదరాబాద్ మహారాజ్‌గంజ్ తోటగూడలోని అనధికారిక భవనానికి స్పీకింగ్ ఆదేశాలు (నోటీసులు) జారీ చేసిన జీహెచ్‌ఎంసీ అధికారులు.. ఆ తర్వాత ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని వ్యాపారవేత్త జి.శ్రీనివాస్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. వెంటనే కూల్చివేతకు ఆదేశాలివ్వాలని కోరారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి శుక్రవారం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి పలు కీలక వ్యాఖ్యలు చేశారు.

ఉత్తర్వులకన్నా బోర్డుల ఏర్పాటే ఉత్తమం

'అక్రమ నిర్మాణాల ముందు స్పీకింగ్ ఉత్తర్వులతో హోర్డింగులు, బోర్డులు ఏర్పాటు చేయాలి. అప్పుడే అనధికారికంగా నిర్మాణాలు చేపట్టే వారికి తెలిసొస్తుంది. చుట్టుపక్కల వారు అడుగుతారనే భయంతో నిర్మాణాలు నిలిపివేస్తారు. భవనం ముందు బోర్డు ఉంటుంది కనుక మాకు తెలియకుండా అపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్ కొనుగోలు చేశామని ఎవరూ చెప్పరు. న్యాయస్థానాలు ఇచ్చే ఉత్తర్వుల కంటే ఇది సత్ఫలితాలిస్తుంది. ఆ మేరకు మున్సిపల్ అధికారులకు ఆదేశాలు జారీ చేస్తాం.అసమర్థులైన ప్రభుత్వ అధికారులపై ఆధారపడటం కంటే ప్రజలు తమ పనులు తామే చేసుకునేలా అలవాటు చేసుకోవడం మంచిది. ఎవరికి వారు చట్టప్రకారం రక్షణ చర్యలు ఎలా తీసుకోవచ్చో నేర్చుకోండి..'అని న్యాయమూర్తి సూచించారు.

అక్రమార్కుల్లో భయం పోతోంది..

'స్పీకింగ్ ఆర్డర్ ఇచ్చిన తర్వాత చర్యలు ఎందుకు చేపట్టడం లేదు? ప్రజలంతా కోర్టుకు వచ్చేవరకు ఎందుకు ఆగుతున్నారు? కోర్టు ఆదేశాలిచ్చినా వాటి అమలుకు తాత్సారం చేస్తున్నారు. కూల్చివేత, సీజ్ లాంటి చర్యలు వెంటనే ఎందుకు తీసుకోవడం లేదు?.. రానురాను పోలీసు, కోర్టు, అధికారులంటే అక్రమాలు చేసిన వారిలో భయం పోతోంది. సోషల్ మీడియా అంటే మాత్రం బెదిరిపోతున్నారు.

అధికారుల మైండ్‌సెట్ మారడం లేదు..

జీహెచ్‌ఎంసీ అధికారులు మారుతున్నారు తప్ప వారి మైండ్‌సెట్ మారడం లేదు. మున్సిపల్ అధికారులే కాదు.. వారిని వెనకేసుకొచ్చే స్టాండింగ్ కౌన్సిళ్లు కూడా అలానే ఉన్నాయి. కోర్టులు వందల కొద్దీ ఆదేశాలు జారీ చేస్తున్నా.. ఏదో ఒక కారణం చెబుతూ కాలయాపన చేస్తుంటారు. అక్రమ నిర్మాణాలకు పాల్పడినా.. వారి పరువు పోవద్దని ఆలోచిస్తున్నాం. కానీ ఇదే పరిస్థితి కొనసాగితే బోర్డు ఏర్పాటుకు ఆదేశాలివ్వాల్సి వస్తుంది..'అని న్యాయమూర్తి హెచ్చరించారు.

'సీలింగ్' చట్టంపై వివరాలివ్వండి


రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

సాక్షి, హైదరాబాద్: 'తెలంగాణ భూ సంస్కరణల చట్టం-1973'అమలు తీరుపై పూర్తి వివరాలను అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణలోగా కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ.. పలువురు అధికారులకు నోటీసులు జారీ చేసింది. సీలింగ్ చట్టాన్ని పకడ్బందీ అమలు చేసేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ హైకోర్టు ప్రధాన కార్యదర్శికి మెదక్ జిల్లాకు చెందిన సింగూరు జలసాధన కమిటీ అధ్యక్షుడు కంచరి బ్రహ్మం లేఖ రాశారు. ఈ చట్టాన్ని ఉల్లంఘించిన అధికారులందరిపై కఠిన చర్యలు తీసుకోవాలని, వ్యవసాయ భూమిని పునరుద్ధరించేలా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరారు. కార్పొరేట్ కంపెనీలతో సహా అనేక మంది నిర్దేశించిన పరిమితికి మించి వ్యవసాయ భూములను కలిగి ఉన్నారని తెలిపారు. ఫిబ్రవరిలో రాసిన ఈ లేఖపై విచారణ చేపట్టేందుకు నంబర్ కేటాయించాలని తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి సుజోయ్‌పాల్ హైకోర్టు రిజిస్ట్రీని ఆదేశించారు. దీనిపై జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ రేణుక యారా ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రెవెన్యూ ముఖ్య కార్యదర్శి, భూ పరిపాలన ప్రధాన కమిషనర్, న్యాయ శాఖ కార్యదర్శికి నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది.

ఎఫ్‌టీఎల్ నిర్ధారించకుండా కూల్చివేతలా?

నిర్మాణదారులకు నోటీసులైనా జారీ చేయరా?

- హైడ్రా తీరుపై మరోసారి హైకోర్టు ఆగ్రహం
- అనధికారిక నిర్మాణాల కూల్చివేతను కోర్టు తప్పుబట్టదు
- అయితే..ఎఫ్‌టీఎల్ పరిధిలో చట్ట ప్రకారం చర్యలు చేపట్టాలి
- సున్నం చెరువు బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్‌ను నిర్ధారించండి
- అప్పటివరకు కూల్చివేతలొద్దంటూ జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి ఆదేశం



సాక్షి, హైదరాబాద్: చెరువుల ఎఫ్‌టీఎల్ తేల్చకుండా, నోటీసులు జారీ చేయకుండా అక్రమ నిర్మాణాలంటూ కూల్చివేతలు చేపట్టడం చట్టవిరుద్ధమని హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. తొలుత ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌ను నిర్ధారించాలని.. ఆ తర్వాత చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని హైడ్రాను ఆదేశించింది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం గుట్టల బేగంపేటలోని సున్నం చెరువు వద్ద కూల్చివేతలను నిలిపివేయాలంటూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. అక్రమంగా నిర్మించిన భవనాల కూల్చివేతను తప్పుబట్టమని..అయితే ఎఫ్‌టీఎల్ పరిధిలోని నిర్మాణాల కూల్చివేయడానికి ఓ విధానం ఉందని తెలుసుకోవాలంది. వర్షాకాలం వస్తుందని ఇష్టారాజ్యంగా కూల్చివేతలు చేపట్టడానికి వీలు లేదని స్పష్టం చేసింది. తమకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా, ఎఫ్‌టీఎల్‌ను నిర్ధారించకుండా అక్రమ నిర్మాణాల పేరుతో హైడ్రా కూల్చివేతలకు పాల్పడుతోందంటూ ఎస్ఐఈటీ మారుతి హిల్స్‌కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సహా ఏడుగురు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి విచారణ చేపట్టారు.

చట్టవిరుద్ధంగా కూల్చేస్తే సగం హైదరాబాద్ నేలమట్టం

పిటిషనర్ తరఫున న్యాయవాది ఎంవీ దుర్గాప్రసాద్ వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్లకు కనీసం నోటీసులైనా ఇవ్వకుండా హైడ్రా జోక్యం చేసుకుంటోందని.. కూల్చివేతలకు పాల్పడటాన్ని ఆపాలని కోరారు. హైడ్రా తరఫు న్యాయవాది కొటూరి పవన్‌కుమార్ వాదనలు వినిపిస్తూ.. శేరిలింగంపల్లి మండలం గుట్టలబేగంపేట సర్వే నంబర్లు 12, 13, అల్లాపూర్ సర్వేనంబరు 31లో పిటిషనర్లతోపాటు మరికొందరికి నోటీసులిచ్చి సర్వే చేయాలని గతంలో హైకోర్టు ఆదేశించిందన్నారు. స్టేటస్‌కో ఆదేశాలు కూడా ఉన్నాయని, ఈ ఉత్తర్వులను అడ్డుపెట్టుకొని పిటిషనర్లు బోర్ల నుంచి కలుషిత నీటిని ట్యాంకర్ల ద్వారా ప్రజలకు సరఫరా చేస్తున్నారని చెప్పారు. వర్షాకాలం వస్తున్నందున చెరువులను పునరుద్ధరించాలని, లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురికాకుండా చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. 'ఎఫ్‌టీఎల్‌లో అక్రమ నిర్మాణాలనూ కూల్చివేయడానికి విధానం ఉంది. ముందుగా విలేజ్ మ్యాప్ ఆధారంగా చెరువు హద్దులు, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లను నిర్ధారించాలి. ఆ తర్వాత చర్యలు చేపట్టే ముందు దాని ప్రభావంతమయ్యే వారికి నోటీసులివ్వాలి. వాళ్ల దగ్గరున్న రశీదులు, డాక్యుమెంట్లు పరిశీలించాలి. ఇవేవి చేయకుండా ఏకపక్షంగా హైడ్రా కూల్చివేతలు చేపడతామంటే సమర్థించం. వర్షాకాలం, వరద అంటూ చట్టవిరుద్ధంగా కూల్చివేతలు చేపడితే సగం హైదరాబాద్ నేలమట్టం అవుతుంది. అక్రమమా.. సక్రమమా.. అనేది హైడ్రా నిర్ణయించేందుకు వీల్లేదు. స్టేటస్‌కో ఉత్తర్వులను పొడిగిస్తున్నాం. బోర్ల నుంచి నీటిని తరలిస్తుంటే ఆ వాహనాలను సీజ్ చేయండి'అని ఆదేశించింది. పిటిషనర్లు సమర్పించిన పత్రాలను పరిశీలించాలని ఆదేశిస్తూ తదుపరి విచారణ ఈ నెల 17కు వాయిదా వేసింది.

యాచకురాలి బిడ్డను బడిలో చేర్పించిన ఉపాధ్యాయుడు



చిన్నారిని బడికి పంపించాలని చెబుతున్న ఉపాధ్యాయుడు భద్రు

మణుగూరు టౌన్: ఓ యాచకుడు అడుక్కుంటూ వచ్చే ఆదాయంతోనే భార్యాబిడ్డను పోషించేవాడు.. ఆయన మృతితో భార్య కుటుంబ పెద్దగా యాచననే ఎంచుకుంది. ఈక్రమంలోనే బిడ్డను కూడా వెంట తీసుకెళ్తుండటం గమనించిన ఒక ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఆమెకు నచ్చజెప్పారు. ఆ బిడ్డను బడిలో చేర్పించి స్థానికుల మన్ననలు అందుకున్నారు. మణుగూరు మున్సిపాలిటీ కార్యాలయానికి సమీపాన రహదారి వెంట ఉంటున్న ధన.. తన బిడ్డ యేసుమణిని సైతం యాచనకు తీసుకెళ్తోంది. గతనెలలో నిర్వహించిన బడిబాటలో మండలంలోని శివలింగాపురం పాఠశాల ఉపాధ్యాయుడు మాలోతు భద్రు తదితరులు ధనకు అవగాహన కల్పించగా పాఠశాలలో చేర్పించింది. ఒకటి, రెండు రోజులు యేసుమణి పాఠశాలకు వచ్చినా.. ఆ తర్వాత నుంచి రావడం లేదు. ఈ నేపథ్యంలో, శుక్రవారం భద్రు తల్లిబిడ్డను రోడ్డు పక్కన గుర్తించాడు. దీంతో యేసుమణిని పాఠశాలకు పంపించాలని కోరారు. పుస్తకాలు, పెన్నులు కొనడం తనవల్ల కాదని ధన బదులిచ్చింది. ఈమేరకు పాఠశాల నుంచి యూనిఫాం తెప్పించిన ఉపాధ్యాయుడు యేసుమణికి వేయించి.. షాప్‌కు తీసుకెళ్లి బ్యాగ్, ఇతర సామగ్రి కొనిచ్చారు. అనంతరం తన బైక్‌పైనే పాఠశాలకు తీసుకెళ్లారు. రోజూ విద్యార్థిని పాఠశాలకు పంపించేలా పర్యవేక్షిస్తానని కూడా స్పష్టం చేసిన ఉపాధ్యాయుడు భద్రును స్థానికులు అభినందించారు.

వారం పాటు 64 మంది హౌస్ సర్జన్ల సస్పెన్షన్

స్టైపెండ్ కోసం ధర్నా చేసినందుకు చల్మెడ మెడికల్ కళాశాల యాజమాన్యం చర్యలు



చల్మెడ కళాశాల ఎదుట ధర్నా చేస్తున్న హౌస్‌సర్జన్లు (ఫైల్)

కరీంనగర్ రూరల్: కరీంనగర్ శివారు బొమ్మకల్‌లోని చల్మెడ ఆనందరావు మెడికల్ కళాశాలలో 64 మంది ఎంబీబీఎస్ హౌస్‌సర్జన్లను సస్పెండ్ చేయడం చర్చనీయాంశంగా మారింది. శుక్రవారం నుంచి వారం రోజుల పాటు విధుల నుంచి తొలగించడం కలకలం సృష్టిస్తోంది. ఈనెల 1న డాక్టర్స్ డే రోజున స్టైపెండ్ చెల్లించాలని డిమాండ్ చేస్తూ కళాశాల ఎదుట హౌస్‌సర్జన్లు ధర్నా నిర్వహించారు. ఈ అంశాన్ని యాజమాన్యం సీరియస్‌గా తీసుకుంది. ఆందోళనలో పాల్గొన్న 64 మంది హౌస్‌సర్జన్లను క్రమశిక్షణ చర్యల కింద వారం రోజుల పాటు విధుల నుంచి తొలగిస్తూ ప్రిన్సిపాల్ డాక్టర్ అసీం అలీ ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం నుంచి ఈనెల 10 వరకు విధులకు హాజరు కావొద్దని, 11న తిరిగి యథావిధిగా హాజరు కావాలని పేర్కొన్నారు. హౌస్‌సర్జన్ల సమస్య పరిష్కారమైందని ప్రిన్సిపాల్ తెలిపారు.

ఆ పిటిషన్లు విచారణార్హం కాదు.. కొట్టివేయండి

- గ్రూప్–1 కేసులో ఎంపికైన అభ్యర్థుల వాదనలు
- తదుపరి విచారణ 7కు వాయిదా వేసిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: గ్రూప్–1 మెయిన్స్‌లో అవకతవకలు జరిగాయని, మళ్లీ పరీక్షలు జరపాలని కోరడం సరికాదని, ఈ మేరకు దాఖలైన పిటిషన్లు విచారణార్హం కాదని, వాటిని కొట్టివేయాలని గ్రూప్–1కు ఎంపికైన అభ్యర్థులు హైకోర్టులో వాదనలు వినిపించారు. 14 ఏళ్లుగా నియామకాల కోసం ఎదురు చూస్తున్నామని, తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) పారదర్శకంగా పరీక్షలు నిర్వహించిందని చెప్పారు. అనంతరం తదుపరి విచారణ ఈ నెల 7కు వాయిదా పడింది. 2024, అక్టోబర్ 21 నుంచి 27 వరకు నిర్వహించిన గ్రూప్–1 మెయిన్స్ పరీక్ష పత్రాల మూల్యాంకనంలో అవకతవకలు, అసమానతలు చోటుచేసుకున్నాయని, దీనిపై న్యాయ విచారణ జరిపించాలని కోరుతూ సిద్దిపేట కు చెందిన కె.పర్శరాములుతో పాటు మరికొందరు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు శుక్రవారం విచారణ కొనసాగించారు. ఎంపికైన అభ్యర్థుల తరఫున న్యాయవాది లక్ష్మీనరసింహ వాదనలు వినిపించారు. 'గ్రూప్–1 పరీక్షలపై దాఖలైన పిటిషన్లు ప్రజాప్రయోజనాలకు విరుద్ధం. రాష్ట్ర పాలనలో కీలకమైన అధికారుల నియామకం కోసం 563 పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చారు. వీరి పోస్టింగ్‌లు ఆగిపోవడంతో పాలన కుంటుపడుతోంది. దివ్యాంగులు ఎలాంటి పిటిషన్లు వేయకున్నా.. వారి తరఫున అంటూ పిటిషనర్లు వాదనలు వినిపిస్తున్నారు. పూజితారెడ్డి అనే అభ్యర్థి సోషల్ మీడియాలో పెట్టిన పోస్టుతో వివాదం ప్రారంభమైంది. నియామక ప్రక్రియ తుది దశలో ఉండగా రద్దు చేస్తే ఎంపికైన అభ్యర్థుల హక్కులకు భంగం వాటిల్లుతుంది'అని వాదించారు.


Reliance
Growth is Life
Jio Mart
రెండిటినీ పొదుపు చేస్తుంది
సమయం మరియు డబ్బు
Quick ఫ్రీ
హోమ్ డెలివరీ
లో ప్రైస్
గ్యారంటీ
0
జీరో ఎక్స్ట్రా
ఛార్జెస్
JioMart
Quick
Scheduled
Biscuits, Drink & Packaged Foods
ఫ్లాట్ ₹ 100 తగ్గింపు*
JioMart లో మీ మొదటి చెల్లింపుపై
*₹399 కనీస షాపింగ్ పై.
కూపన్ కోడ్ వాడండి
JMNEW100
ఫ్లాట్ ₹ 150 తగ్గింపు*
JioMart లో మీ క్విక్ గ్రోసరీస్ ఆర్డర్ పై
*₹1499 కనీస షాపింగ్ పై.
కూపన్ కోడ్ వాడండి
FLAT150
ఉల్లిపాయలు 1 kg
₹5
ఆర్డర్ పై 1 kg కు ఆఫర్ చెల్లుతుంది. స్టాక్ ఉన్నంత వరకు
బంగాళదుంపలు 1 kg
మార్కెట్ ధర ₹ 40
జియోమార్ట్ ధర ₹29
బనానా కర్పూరవల్లి 1 kg
మార్కెట్ ధర ₹ 89
జియోమార్ట్ ధర ₹59
అమూల్ A+ / బ్రిటానియా / డి'లెక్టా / గో చీజ్ / హెరిటేజ్ / మిల్కీమిస్ట్ / మూవింగ్ చీజ్ స్లైస్ 400 g మొదలుకుని (సెలెక్ట్ వేరియంట్స్)
ఎమ్ఆర్‌పి ₹ 280 మొదలుకుని
జియోమార్ట్ ధర ₹199
ఆదా చేసుకోండి ₹ 81 మొదలుకుని
ఎఫ్రీడి ప్రీమియం మిల్క్ బ్రెడ్ 400 g
ఎమ్ఆర్‌పి ₹ 60
జియోమార్ట్ ధర ₹29
ఆదా చేసుకోండి ₹ 31
బిస్కెట్స్ 69 g మొదలుకుని / పార్లె ఇలాయిచి రస్క్ 291.2 g (సెలెక్ట్ వేరియంట్స్)
ఎమ్ఆర్‌పి ₹ 30 మొదలుకుని
ఫ్లాట్ 33% తగ్గింపు
జియోమార్ట్ ధర ₹ 20 మొదలుకుని
తాజ్‌మహల్ లీఫ్ టీ 500 g
ఎమ్ఆర్‌పి ₹ 380 మొదలుకుని
ఆదా చేసుకోండి ₹65
జియోమార్ట్ ధర ₹ 315 మొదలుకుని
హార్లిక్స్ క్లాసికల్ మాల్ట్ / బూస్ట్ 750 g
ఎమ్ఆర్‌పి ₹ 459 మొదలుకుని
ఆదా చేసుకోండి ₹160
జియోమార్ట్ ధర ₹ 299 మొదలుకుని
సూపర్ సర్వోత్తమ్ రైస్ బ్రాన్ ఆయిల్ 815 g / ఫార్చ్యూన్ రిఫైన్డ్ ఫ్లవర్ ఆయిల్ 870 g
ఎమ్ఆర్‌పి ₹ 199 / ₹ 195
జియోమార్ట్ ధర ₹124/ ₹136
ఆదా చేసుకోండి ₹ 75 / ₹ 59
విజయా ఘీ 1 L
ఎమ్ఆర్‌పి ₹ 690
జియోమార్ట్ ధర ₹559
ఆదా చేసుకోండి ₹ 131
ఆశీర్వాద్ సుపీరియర్ ఎంపీ వీట్ ఆటా 5 kg
ఎమ్ఆర్‌పి ₹ 355
జియోమార్ట్ ధర ₹295
ఆదా చేసుకోండి ₹ 60
దావత్ దెవాయా బాస్మతి రైస్ 5 kg + సఫోలా గోల్డ్ ఆయిల్ 3 L
కంబైన్డ్ ఎమ్ఆర్‌పి ₹ 1496
జియోమార్ట్ ధర ₹849
ఆదా చేసుకోండి ₹ 647
కోల్గేట్ స్ట్రాంగ్ టీత్ టూత్‌పేస్ట్ 500 g
ఎమ్ఆర్‌పి ₹ 350 మొదలుకుని
ఆదా చేసుకోండి ₹100
జియోమార్ట్ ధర ₹ 250 మొదలుకుని
ప్యారాచూట్ కోకనట్ ఆయిల్ 300 ml
ఎమ్ఆర్‌పి ₹ 188 మొదలుకుని
ఆదా చేసుకోండి ₹45
జియోమార్ట్ ధర ₹ 143 మొదలుకుని
సర్ఫ్ ఎక్సెల్ ఈజీ వాష్ డిటర్జెంట్ పౌడర్ 1.5 kg
ఎమ్ఆర్‌పి ₹ 235 మొదలుకుని
ఆదా చేసుకోండి ₹50
జియోమార్ట్ ధర ₹ 185 మొదలుకుని
*నియమ నిబంధనలు వర్తిస్తాయి. స్టాక్స్ ఉన్నంతవరకు ఆఫర్లు చెల్లుతాయి. ఆఫర్లన్నీ నోటీస్ చేయకుండానే మార్పు చేయబడగలవు. చూపించబడిన ఉత్పాదనల బొమ్మలు / ఫోటోగ్రాఫ్‌లు కేవలం ప్రదర్శన కోసం మాత్రమే. ఉత్పాదనలన్నిటి యొక్క ఎమ్ఆర్‌పి అన్నీ పన్నులతో కూడి ఉంటుంది. డిస్కౌంట్ పర్సెంటేజ్‌ను ఆఫర్ ధర యొక్క సమీప పర్సెంటేజ్‌కు రౌండ్ ఆఫ్ చేయబడింది. ఆఫర్లు అన్నీ 6 జూలై 2025 వరకు ఎంపిక పిన్ కోడ్స్ లో చెల్లుతాయి. నూనె, నెయ్యి, ఆటా మరియు పసి పిల్లల ఆహారం పై కూపన్ ఆఫర్ చెల్లదు. మరే ఇతర ఆఫర్ తో కూపన్ ఆఫర్ కలవ రాదు. ప్రతి యూజర్ కు కూపన్ ఒకసారి చెల్లుతుంది. కూపన్ ఆక్షేపణలన్నీ ముంబయిలోని కోర్టులో ప్రత్యేక అధికారానికి మాత్రమే లోబడి ఉంటాయి.

ఏ జ్ఞానము చేత మోహము కలుగదో, ఏ జ్ఞానము చేత సమస్త జీవరాశులలో ఆత్మను, ఆత్మలో జీవరాశులున్నట్లు తెలియునో అట్టి జ్ఞానమును పొందగలవు.
– హిందూ ధర్మం

సాక్షి
శనివారం, 5 జూలై 2025

ఈసీకి జ్ఞానోదయం కలగాలి!

ఏ ఫిర్యాదు వచ్చినా, ఎలాంటి సమస్య ముంచుకొచ్చినా తక్షణం స్పందించాల్సిన బాధ్యతల్లో ఉన్న వారు మౌనంగా ఉండిపోతే అనుమానాలు బలపడతాయి. అలాంటివారి తటస్థత ప్రశ్నార్థకమవుతుంది. నిరుడు జరిగిన ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల లొసుగులపై అప్పట్లోనే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఫిర్యాదులు చేసింది. కానీ ఎన్నికల సంఘం(ఈసీ) నిమ్మకు నీరెత్తినట్టు ఉండిపోయింది. ఏడాదికాలం గడిచాక ఎట్టకేలకు గురువారం ఢిల్లీలోని ఈసీ ప్రధాన కార్యాలయంలో సీఈసీ జ్ఞానేశ్ కుమార్, కమిషనర్లు వివేక్ జోషి, సుఖ్‌బీర్ సింగ్ సంధు ఆ ఫిర్యాదులపై వైఎస్సార్ కాంగ్రెస్ నాయకుల వివరణల్ని విన్నారు. ప్రజాస్వామ్యంలో కీలకమైన ఎన్నికల నిర్వహణ లోపరహితంగా ఉండాలి. అనుమానాలకు తావీయకూడదు. కానీ ఏపీలో ఆద్యంతమూ అందుకు విరుద్ధంగా నడిచింది. నోటిఫికేషన్ విడుదల చేసిన మొదట్లోనే కూటమి నాయకులు ఫిర్యాదు ఇవ్వటం తడవుగా జిల్లాల్లో ఉన్నతాధికారుల్ని మార్చారు. అయిదేళ్లుగా అమలవుతున్న పథకాలను సైతం ఆపేయాలని ఆదేశించారు. నిర్ణయం తీసుకునేముందు కనీసం కూటమి నేతల ఆరోపణలకు ఆధారాలున్నాయో లేదో చూసుకోవాలన్న స్పృహ కూడా లేకపోయింది. ఫలితంగా అలాంటి జిల్లాల్లో పోలింగ్ రోజున ఎన్ని అవకతవకలు చోటుచేసుకున్నాయో మీడియా సాక్షిగా బయటపడింది. చాలా గ్రామాల్లో బడుగు వర్గాల్ని ఓటేయకుండా భయభ్రాంతులకు గురిచేశారు. వారి దౌర్జన్యాలకు అనేకమంది తలలు పగిలాయి. ఇళ్లు ధ్వంసమయ్యాయి. కొంపా గోడూ వదిలి చెట్లల్లో పుట్టల్లో తల దాచుకోవాల్సి వచ్చింది. అటు తర్వాత ఇక ఎదురులేదనుకుని ఈవీఎంలను దొంగవోట్లతో నింపేశారు. వీటిపై ఏ క్షణానికాక్షణం ఫిర్యాదులు వెల్లువెత్తినా దిక్కులేకుండా పోయింది. పోలైన నాలుగు కోట్లకుపైగా ఓట్లలో 51 లక్షల ఓట్లు సాయంత్రం 6 తర్వాతే పడ్డాయి. ఇదంతా మాయాజాలం అనిపించదా? ఎన్నికలు ముంగిట్లోకొచ్చాక ల్యాండ్ టైట్లింగ్ చట్టంపై వదంతులు వ్యాపింపజేసినా ఈసీలో వెంటనే కదలిక లేదు. అటు తర్వాత చంద్రబాబు, లోకేష్‌లపై కేసుపెట్టాలని ఆదేశించారు సరే... దాని అతీగతీ ఏమిటో ఎవరికీ తెలియదు. వేరే రాష్ట్రాల్లో విపక్షాలు ప్రధాని నరేంద్ర మోదీని ఏమైనా అంటే నొచ్చుకుని వెనువెంటనే చర్యలకు ఉపక్రమించిన ఈసీ... అప్పటి ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని రాళ్లతో కొట్టాలని బాబు నోరు పారేసుకున్నా చోద్యం చూసింది.

ఇవన్నీ ఒక ఎత్తయితే లెక్కింపు నాడు వెల్లడైన వైపరీత్యాలకు అంతూ దరీ లేదు. పోలైన ఓట్లకూ, లెక్కించిన ఓట్లకూ మధ్య భారీ వ్యత్యాసాలున్నాయి. నిరుడు మే నెల 13న రాత్రి 8 గంటలకు ఏపీ పోలింగ్ శాతం 68.12 అని ఈసీ ప్రకటించింది. రాత్రి 11.45కి దీన్ని సవరించి 76.50 శాతమన్నారు. మరో నాలుగు రోజులకల్లా అది 80.66 శాతం అని మాట మార్చారు. మొదట, చివరి ప్రకటనల్లోని అంకెల మధ్య 12.5 శాతం తేడా ఉంది. గతంలోనూ మారిన సందర్భాలు లేకపోలేదు. కానీ ఈ తేడా ఒక శాతంకన్నా ఎప్పుడూ ఎక్కువ లేదు. పర్యవసానంగా సగటున ఒక్కో శాసనసభ స్థానంలో 28,000 ఓట్లు, లోక్‌సభ స్థానం పరిధిలో 1.96 లక్షల ఓట్లు పెరిగాయి. ఇది 87 అసెంబ్లీ స్థానాల్లో గెలుపోటముల్ని నిర్దేశించింది. అంతేనా... పోలింగ్ ముగిసిన రోజున ఈవీఎంలలో ఉన్న చార్జింగ్ శాతం కౌంటింగ్ రోజుకు అమాంతం పెరిగింది. పదో, పదిహేను శాతమో చార్జింగ్ ఉన్నట్టు కనబడింది కాస్తా 98 శాతానికి ఎగబాకింది. రీచార్జబుల్ బ్యాటరీలు కనుక అలాంటిది జరగదని చెప్పటం తప్ప ఈసీ దగ్గర సంతృప్తికరమైన జవాబు లేకపోవటం దిగ్భ్రాంతికరం.

బాహాటంగా బయటపడిన ఇలాంటి అవకతవకల పర్యవసానంగానే ఈవీఎంలలోని ఓట్లూ, వీవీ ప్యాట్ స్లిప్‌ల సంఖ్యనూ లెక్కేసి, అవి ఒకదానితో ఒకటి సరిపోయాయో లేదా తేల్చాలని వైఎస్సార్ కాంగ్రెస్ డిమాండ్ చేసింది. అలాగే పోలింగ్ కేంద్రాల్లో సీసీ టీవీ ఫుటేజ్‌లు ఇవ్వాలని కూడా కోరింది. ఇవేమీ గొంతెమ్మ కోరికలు కాదు. నదురూ బెదురూ లేకుండా కూటమి నేతలు తిమ్మిని బమ్మి చేసిన పర్యవసానంగానే వైఎస్సార్ కాంగ్రెస్ ఈ డిమాండ్లు చేసింది. తమ నిర్వాకం కళ్లముందు కనబడుతున్నప్పుడు మొండిగా అవేమీ ఇచ్చే ప్రసక్తి లేదని చెప్పటం ప్రజాస్వామికమేనా? అసలు సీసీ టీవీ ఫుటేజ్‌లూ, వీవీ ప్యాట్‌లూ ఎందుకొచ్చాయో, ఏ ప్రయోజనాన్ని ఆశించి ఎన్నికల ప్రక్రియలో వాటిని చేర్చాల్సివచ్చిందో సీఈసీకి, మరో ఇద్దరు కమిషనర్లకూ తెలుసా? ఎన్నికల్లో పాల్గొన్న పార్టీలు అనుమానాలు వ్యక్తం చేసినప్పుడు వాటిని నివృత్తి చేయటం వారి బాధ్యత కాదా? కనీసం హేతుబద్ధమైన జవాబైనా ఇచ్చే ప్రయత్నం చేయొద్దా?

ఈసీ తీరు దేవతా వస్త్రాల కథను తలపిస్తోంది. కోట్లాది రూపాయలు వ్యయం చేసి సీసీ కెమెరాలూ, వీవీ ప్యాట్‌లు సమకూర్చుకోవటం, వాటిని ఉపయోగంలోకి తీసుకురావటం– తీరా రాజకీయ పార్టీలు సందేహం వెలిబుచ్చినప్పుడు వెల్లడించటం కుదరదని మొండికేయటం, నిబంధనలు ఒప్పుకోవనటం ఏం నీతి? పారదర్శకత లేని ఎన్నికలు జరపటం ఎవర్ని ఉద్ధరించటానికి? ప్రజాస్వామ్యంలో అన్ని వ్యవస్థలకూ శిరోధార్యం రాజ్యాంగం. అది నిర్దేశించిన ప్రకారం నడుచుకోవాలి తప్ప ఇతరేతర ప్రభావాలకు లోను కాకూడదు. మళ్లీ బ్యాలెట్ పత్రాలతోనే ఎన్నికలకు వెళ్లాలన్న డిమాండ్ సర్వత్రా వినిపించటానికి తమ నిర్వాకం కూడా కారణమని ఈసీ తెలుసుకోవాలి. ఈసీ తటస్థతపై తలెత్తుతున్న సందేహాల కారణంగానే ఇప్పుడు బిహార్‌లో ప్రారంభించిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) పేరిట ఓటర్ల జాబితాల నవీకరణకు చేస్తున్న ప్రయత్నాలపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఇప్పటికైనా ఈసీ వైఖరి మారాలి. పారదర్శకంగా వుండే ప్రయత్నం చేయాలి.

చైనాతో దోస్తీకి దేశాల ఉబలాటం

విశ్లేషణ



ప్రశాంత్ ఝా

అమెరికా, భారత్, జపాన్, ఆస్ట్రేలియా దేశాల కూటమిని 'క్వాడ్'గా పిలుస్తున్నారు. ఈ కూటమి జూలై 1న వాషింగ్టన్ డి.సి.లో సమావేశమై ఒక సంయుక్త ప్రకటనను విడుదల చేసింది. దీన్ని పరిశీలించినవారికి 'క్వాడ్' దాని సుదీర్ఘ పయనంలో మొదటిసారిగా అస్పష్టతకు స్వస్తి పలికి, తన ప్రధాన కర్తవ్యాన్ని వెల్లడించినట్లుగా కనిపించింది. సముద్ర జలాలలో చైనా చర్యలను అది ఈసారి గతంలోకన్నా ఎక్కువగా వేలెత్తి చూపుతూ విమర్శలను గుప్పించింది. ఇతర దేశాలను ఆర్థికంగా లొంగదీసుకునేందుకు అనుసరిస్తున్న ఎత్తుగడలు, ధరలలో కపటత్వం, సరఫరాలకు అవాంతరాలు కల్పించడం, కీలక ఖనిజాల ఉత్పత్తిపై దృష్టి కేంద్రీకరించేందుకు మార్కెటేతర సూత్రాలను ఉపయోగించుకోవడం వంటివాటిని ప్రస్తావిస్తూ చైనాను కడిగేసింది. అదే సమయంలో, ప్రకటనకు ఉపయోగించిన భాషలో దౌత్యపరమైన యుక్తిని ప్రదర్శించింది.

తేటతెల్లమైన చైనా తీరు

'క్వాడ్' సమావేశమైన ప్రతిసారీ బీజింగ్‌పై కత్తులు నూరుతూనే ఉంది. కానీ, ఈ వారంలో జరిగిన సమావేశం తమ లక్ష్య సాధనపై సంకోచాలకు తావు ఇవ్వలేదు. అవి సముద్ర జలాల్లో భద్రత, ఆర్థిక భద్రత, కీలక, ప్రవర్ధమాన టెక్నాలజీలు, మానవతా సహాయంలో సహకారాన్ని పెంపొందించుకోవాలని నిర్ణయించాయి. కానీ దృష్టి అంతా చైనాపైనే ఉండటంతో ఎజెండాలోని అంశాలు మరుగున పడ్డాయి. కానీ, దౌత్యపరంగా చైనాను తీవ్రంగా మందలించడం అరుదైన విషయం కనుక 'క్వాడ్' ప్రకటన ప్రాధాన్యం సంతరించుకుంది. ఐదేళ్ళ విరామం తర్వాత, చైనా భౌగోళిక రాజకీయ యవనికపై తిరిగి తన పాత్రను చేజిక్కించుకునే ప్రయత్నంలో ఉండటం వల్ల అదే పెద్ద అంశంగా మారింది.

కోవిడ్–19 మహమ్మారి 2020 ప్రారంభంలో ప్రపంచ దేశాలను అతలాకుతలం చేయడం ప్రారంభించింది. సమాచారాన్ని బయటకు పొక్కనీయని వ్యవస్థల వల్ల ఏర్పడే ప్రమాదాలు ప్రపంచవ్యాప్తంగా ఎలాంటి విధ్వంసకర పర్యవసానాలకు దారితీయగలవో ఆ సందర్భంగా ప్రపంచానికి తెలిసి వచ్చింది. తూర్పు లద్దాఖ్ లోకి చైనా దళాలు చొచ్చుకు రావడంతో భారత్ అప్రమత్తమైంది. భారతీయ సార్వభౌమాధికారాన్ని ఉల్లంఘించేందుకు సుముఖంగా ఉన్న, మొండిగా మారిన పొరుగుదేశం నుంచి ఎదురుకాగల ప్రమాదాలను ఇండియా గ్రహించింది. తూర్పు చైనా సముద్రం, దక్షిణ చైనా సముద్రాలలో, తైవాన్ చుట్టుపక్కల జలాలలో చైనా దూకుడు కొనసాగుతూండటంతో చైనాకున్న ప్రాదేశిక, సాగర జలాల ఆకాంక్షలు ఆ ప్రాంతంలోని దేశాలకు తేటతెల్లమయ్యాయి. అభివృద్ధికి ఊతంగా నిలుస్తామనే సాకుతో రుణాలు, పెట్టుబడుల రూపంలో కొన్ని దేశాలలోకి చైనా ప్రవేశించి తర్వాత అక్కడ స్థావరాలు ఏర్పరుచుకుని మాటువేయడం, వనరులను చేజిక్కించుకునే ప్రయత్నం చేయడంతో ప్రపంచంలోని పేద దేశాలు అది మేకవన్నె పులిలా వ్యవహరిస్తోందని తెలుసుకున్నాయి. సాంకేతిక, సైనిక, ఆర్థిక రంగాల్లో చైనా ముందడుగు వేయడంతో అది తనకు 'సమ–స్థాయి పోటీదారు'గా అవతరించిందని అమెరికా ఉలిక్కిపడింది.


అమెరికాలో జూలై 1న జరిగిన 'క్వాడ్ విదేశాంగ మంత్రుల సమావేశం'లో జపాన్, ఇండియా, అమెరికా, ఆస్ట్రేలియా విదేశాంగ మంత్రులు

◆ 'క్వాడ్' సంయుక్త ప్రకటన ఏమాత్రం సంకోచించకుండా చైనాను విమర్శించింది. బెదిరించి లొంగదీసుకునే చైనా విధానాలను ఎండగట్టింది. సాగర జలాల, ఆర్థిక పరమైన భద్రతకు ప్రాధాన్యం ఇచ్చింది. 'క్వాడ్' చెక్కుచెదరని స్వభావాన్ని కనబరుస్తున్నా, చైనాతో మళ్ళీ దోస్తీకి ప్రతి దేశమూ తహతహలాడుతోంది.

2025తో మారిన పరిస్థితి

ట్రంప్, బైడెన్‌లతోపాటు కొందరు ఇండో–పసిఫిక్ నాయకులు చైనాకు ముకుతాడు వేయక తప్పదని నిర్ణయానికి వచ్చారు. ఇండో–పసిఫిక్ ప్రాంతంలో చైనా ప్రాబల్యానికి అడ్డుకట్ట వేసేందుకు అమెరికా కొత్త కూటమిలను నిర్మించడం మొదలెట్టింది. అమెరికా వ్యూహాత్మక, రక్షణ అవసరాలను వ్యాపార అవకాశాలతో ముడివేసింది. అంతవరకు నిర్లక్ష్యం చేస్తూ వచ్చిన పసిఫిక్ దీవుల వంటి ప్రాంతాలకు అది తన అభివృద్ధి, వాతావరణ, భద్రతా అడుగుజాడలను విస్తరింపజేసింది.

సరిగ్గా అదే సమయంలో, చైనా ఆంతరంగిక బలహీనతలు మరింత ప్రస్ఫుటమయ్యాయి. కోవిడ్–19 సందర్భంగా, బీజింగ్ చేపట్టిన అణచివేత చర్యలు ఎదురుతన్నాయి. స్థిరాస్తులు, మౌలిక సదుపాయాల రంగాలు సృష్టించిన విజృంభణ గాలి బుడగలా పేలి సంక్షోభానికి కారణమైంది. మితిమీరిన ఉత్పత్తితో పోల్చి చూస్తే దేశీయ వినిమయం సన్నగిల్లింది. సాపేక్షంగా చూస్తే ఈ ప్రాంతంలో దానికి మిత్రదేశాలు ఏవీ లేనట్లు కనిపించింది. చైనాతో ఎడమొహం పెడమొహంగా వ్యవహరించే అంతర్జాతీయ ధోరణి 2020 నుంచి 2024 వరకు కొనసాగింది. కానీ చైనాతో చెలిమి చేయాలని మళ్ళీ ప్రతి దేశం కోరుకుంటున్న స్థితికి 2025 అంకురార్పణ చేసినట్లుగా కనిపిస్తోంది.

ఎందుకంటే, ఐరోపా–అట్లాంటిక్ మధ్య, ఇండో–పసిఫిక్ మధ్య సంబంధాలను పటిష్ఠపరిచే ప్రయత్నం చతికిలపడింది. రష్యా–చైనా మరింత కలసికట్టుగా పనిచేస్తున్నాయి. 'నాటో', ఇండో–పసిఫిక్ మిత్ర దేశాల మధ్య వ్యత్యాసాన్ని తగ్గించేందుకు అమెరికా చేస్తున్నది ఏమీ లేదు. ఎవరి రక్షణను వారు సమాంతరంగా పెంపొందించుకోవాల్సిందిగా అది రెండింటిపైన ఒత్తిడి తెస్తోంది. అందుకే ద హేగ్ 'నాటో' శిఖరాగ్ర సదస్సుకు దూరంగా ఉండాలని ఆస్ట్రేలియా, దక్షిణ కొరియా, జపాన్ నిర్ణయించుకున్నాయి. చైనాతో ఒప్పందాలు కుదుర్చుకోవాలని ఐరోపా దేశాలు సమష్టిగానూ, విడివిడిగానూ కూడా కోరుకుంటున్నాయి. ఎప్పుడు ఎలా వ్యవహరిస్తుందో తెలియని అమెరికా వైపు మొగ్గేకన్నా, చైనాతో సన్నిహిత కార్యనిర్వాహక సంబంధాలను నెలకొల్పుకోవడమే మేలని ఐరోపాలోని అనేక మందికి అనిపిస్తోంది. సాక్షాత్తూ అమెరికాయే చైనాతో ఒప్పందం కుదుర్చుకోవాలని కోరుకుంటున్నట్లుగా సంకేతాలు పంపిస్తోంది. ట్రంప్ ఒక అగ్రస్థాయి వ్యాపార ప్రతినిధి బృందంతో చైనాను సందర్శించే ఆలోచనలో ఉన్నారని వార్తలు వెలువడుతున్నాయి.

పొరుగు దేశాలూ అదే బాటలో...

భద్రతాపరంగా చైనాతో జపాన్‌కు ప్రాథమికంగానే వైరుధ్యం ఉంది. దానికి తోడు టోక్యోకు పరిస్థితులను ట్రంప్ మరింత విషమంగా మార్చారు. అమెరికాతో మంత్రిత్వ స్థాయి చర్చలను జపాన్ రద్దు చేసుకుంది. మోటారు వాహనాల సుంకాలపై అది అమెరికాతో బాహాటంగానే తగవు పడుతోంది. దక్షిణ కొరియాలో ఇంతకు ముందరి ప్రభుత్వం అమెరికాకు అనుకూలంగా ఉండేది. ప్రస్తుత నూతన ప్రభుత్వం విదేశాంగ విధానంలో మరింత సమతూకంతో కూడిన దృక్పథాన్ని ప్రదర్శిస్తోంది. 'ఆకస్' ఒడంబడికను సమీక్షించాలనే పెంటగాన్ అభిప్రాయం ఆస్ట్రేలియాను అస్థిమితానికి గురిచేసింది. ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ ఆల్బనీస్‌ను ట్రంప్ ఇంతవరకూ కలుసుకోలేదు.

ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్తాన్ సైనిక ప్రతిస్పందన వెనుకనున్న శక్తి చైనాయే అయినప్పటికీ, చైనాతో సరిహద్దు సమస్యలు ఉన్నప్పటికీ, చైనాతో సయోధ్యకు వెనుకాడబోమనే సంకేతాలను భారత్ బహిరంగంగానే పంపుతోంది. చైనాతో తేల్చుకోవాల్సిన అంశాలు భారత్‌కు చాలానే ఉన్నాయి. వస్తూత్పత్తి రంగంలో చైనా ప్రాబల్యం వల్ల వాణిజ్యపరంగా చాలా అసమతౌల్యం ఉంది. దక్షిణాసియాలో భారతదేశానికి వ్యతిరేకంగా పావులు కదపడంలో బీజింగ్ బిజీగా ఉంది. కానీ తాను మధ్యవర్తిత్వం నెరపడం వల్లనే భారత్–పాక్ ఇటీవల యుద్ధాన్ని విరమించాయనే ట్రంప్ అసత్య వచనాలతో అమెరికాతో న్యూఢిల్లీకి రాజకీయపరమైన సమస్యలు కూడా తలెత్తుతున్నాయి. వాణిజ్యంపై చర్చలు కూడా పూర్తిగా ఒక కొలిక్కి రాలేదు. ఇవన్నీ చైనాకు సంతోషం కలిగించేవే.

గత నాలుగేళ్ళలో, చైనా కుప్పకూలేంత స్థితికి వెళ్ళలేదు. దాన్ని ఏకాకినీ చేయలేకపోయారు. అలా అని చైనా ఇపుడు ప్రపంచంపై పెత్తనం చలాయించగల స్థితిలోనూ లేదు. కానీ, బీజింగ్‌కు అనుకూలంగా పరిస్థితులు పరిణమిస్తున్నాయి. దౌత్యపరంగా ఉన్న ఈ ప్రతికూల వాతావరణాన్ని లెక్కలోకి తీసుకుంటూ విశ్వసనీయమైన, పటిష్ఠమైన ఎజెండాను రూపొందించే సవాల్‌ను 'క్వాడ్' తదుపరి అధ్యక్ష హోదాలోకి వచ్చే భారత్ ఎదుర్కోవాల్సి ఉంటుంది.

వ్యాసకర్త జర్నలిస్ట్, రాజకీయ విశ్లేషకుడు
('ది హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

అమెరికాకు శుభాకాంక్షలు



అమెరికాకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు (జూలై 4). ఉమ్మడి ప్రజాస్వామిక విలువలు, సాంస్కృతిక వినిమయాలు, పరస్పర గౌరవానికి కట్టుబడి మన ఇరు దేశాలూ మరింత సన్నిహితం అవుతుండటం పట్ల ఒక భారతీయుడిగా నేను గర్విస్తున్నాను.

– జాహక్ తన్వీర్, జర్నలిస్ట్

ఓటమికి ఉత్సవమా?



అమెరికన్లు జూలై 4న స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఎందుకు జరుపుకొంటారంటే, 1776లో ఆ రోజు తమకు తాము స్వాతంత్ర్యం ప్రకటించుకున్నారు కాబట్టి. కానీ నిజమైన స్వాతంత్ర్యం వారికి 1783లో బ్రిటిష్‌వారిని తరిమికొట్టడంతో వచ్చింది. కానీ మనం భారతీయులం ఆగస్ట్ 15న స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఎందుకు జరుపుకొంటున్నామంటే, దాన్ని లార్డ్ మౌంట్‌బాటన్ ఎంపిక చేశారు కాబట్టి. ఎందుకంటే అదే రోజున 1945లో జపాన్ లొంగిపోయింది; సుభాష్ చంద్రబోస్ సైనిక పోరాటం అదే రోజున ఓటమిని చవిచూసింది.

– అనూజ్ ధర్, రచయిత

మనుషుల్ని లేకుండా చేయడమా?



అటు రెండు దేశాల పరిష్కారాన్ని తిరస్కరిస్తూ, ఇటు పాలస్తీనియన్లకు సమాన హక్కులు కల్పించే ఏక దేశ పరిష్కారాన్ని వ్యతిరేకించేవాళ్లకు నాది ఒకటే ప్రశ్న. పాలస్తీనా– ఇజ్రాయెల్ ఘర్షణకు మీ దగ్గరున్న కచ్చితమైన పరిష్కారం ఏమిటి?

– ఇహాబ్ హసన్, పాలస్తీనా యాక్టివిస్ట్

వాళ్లు పట్టరా?



5 కోట్ల జనాభా ఉన్న యుద్ధ పీడిత సూడాన్‌కు గత రెండేళ్లలో 1,300 ట్రక్కుల సహాయం అందింది. ఐదేళ్ల లోపు చిన్నారులు సుమారు 5 లక్షల మంది ఆకలి, పోషకాహార లోపంతో బాధపడుతున్నారు. దీనికి భిన్నంగా, 20 లక్షల జనాభా ఉన్న గాజాకు గత 20 నెలల్లో 2,800 ట్రక్కుల సాయం అందింది.

– ఇంతియాజ్ మహమూద్, ఫ్రీ థింకర్

కనిపెట్టండి ప్లీజ్



రక్తాన్ని తీయడానికి నొప్పి లేని విధానాన్ని ఇంతవరకూ ఎవరూ ఎందుకు కనిపెట్టలేదు? రక్త పరీక్షలకు వెళ్లాలంటేనే... అమ్మో!

– కాజోల్ శ్రీనివాసన్, స్టాండప్ కమెడియన్

ఆర్‌ఎస్‌ఎస్‌ను నిషేధిస్తారా!

ప్రపంచంలోని స్వచ్ఛంద సంస్థల్లో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆరెస్సెస్)కు ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. దేశ ప్రజలలో 'ఈ దేశం నాది, ఈ దేశానికి గొప్ప ఆధ్యాత్మిక, మానవీయ చరిత్ర ఉంద'నే జాతీయ భావాన్ని నిర్మాణం చేయడంలో ఈ సంస్థతో సరితూగే సంస్థ మరొకటి ఉండదని ఉవాచ. అటువంటి సంస్థపై ఇటీవల కర్ణాటక మంత్రి, కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కుమారుడు ప్రియాంక్ ఖర్గే ఆరెస్సెస్‌పై చేసిన వ్యాఖ్యలపై దేశంలో పెద్ద చర్చ జరుగుతోంది. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే– ఆ సంస్థపై నిషేధం విధించబడుతుందనీ, గతంలో ఆ సంస్థపై విధించిన నిషేధాన్ని రద్దుచేసి కాంగ్రెస్ పార్టీ తప్పు చేసిందనీ అన్న మాటలు నవ్వు తెప్పిస్తున్నాయి. గాంధీ హత్యను సాకుగా చూపి, నెహ్రూ ప్రభుత్వం 1948లో ఆ సంస్థపై నిషేధం విధించింది. గాంధీ హత్యపై విచారణ చేసిన న్యాయస్థానం ఈ విషయంలో ఆరెస్సెస్ హస్తం లేదని, ఆ సంస్థపై నిషేధం ఎత్తివేయాలని నెహ్రూ ప్రభుత్వానికి మొట్టికాయ వేసింది. అప్పుడు అధికారంలో ఉన్నది నెహ్రూ ప్రభుత్వం, పటేల్ ప్రభుత్వం కాదు. పటేల్ ప్రభుత్వం నిషేధం విధించిందని చెప్పడంతో ప్రియాంక్ ఖర్గేకు చారిత్రక అవగాహన లేదని అర్థమవుతోంది. ఇలాంటి వ్యాఖ్యల వల్ల చారిత్రక సందిగ్ధత ఏర్పడుతుంది.



ఇక రెండోసారి ఎమర్జెన్సీ సమయంలో ఈ సంస్థపై నిషేధం ఇందిరాగాంధీ ప్రభుత్వం విధించింది. ఈ సందర్భంగా అనేక పత్రికలు, రాజకీయ సంస్థలపై నిషేధం విధించబడింది. 1977లో అధికారాన్ని కోల్పోయిన ఇందిరాగాంధీ జైలుకు సైతం వెళ్ళవలసిన పరిస్థితి వచ్చింది. జనతా ప్రభుత్వంలోని పెద్దలు రాజనీతిజ్ఞతతో ఆలోచించడం వల్ల ఈ గడ్డు పరిస్థితి నుండి ఆమె గట్టెక్కింది. ప్రియాంక్ ఖర్గేకు ఈ విషయం తెలియదేమో! కేంద్రంలోనూ, అనేక రాష్ట్రాల్లోనూ కాంగ్రెస్ పార్టీ తుడిచిపెట్టుకు పోవడానికీ, ఆరెస్సెస్ రాజకీయ క్షేత్రమైన భారతీయ జనతా పార్టీ అధికారంలోకి రావడానికీ కారణాలను ఆ పార్టీ అధినాయకత్వం విశ్లేషించే పరిస్థితిలో లేదు.

భారత రాజ్యాంగంపై, ప్రజాస్వామ్య విలువలపై; స్వేచ్ఛ, సమానత్వంపై ఆరెస్సెస్‌కు విశ్వాసం లేదని మరో విమర్శ. ఈ సంస్థను గుడ్డిగా వ్యతిరేకించే నెహ్రూ సైతం 1963 రిపబ్లిక్ డే ఉత్సవాలలో పాలు పంచుకోవాలని కోరడం, 3 వేల మంది స్వయం సేవకులు పాల్గొనడం తెలిసిన సంగతే. ఈ దేశంలో వరదలు, భూకంపాలు, రైలు ప్రమాదాలు, విమాన ప్రమాదాలు సంభవించినప్పుడు కులమతాలకు అతీతంగా సేవలందించేది స్వయంసేవకులే.

– ఉల్లి బాలరంగయ్య । సామాజిక, రాజకీయ విశ్లేషకుడు

అంతర్జాతీయ ఒడంబడికలు పాటించవద్దా?

అభిప్రాయం


ఎన్ వేణుగోపాల్

ఐక్యరాజ్య సమితి ఏర్పడిన తరువాత అంతర్జాతీయ, బహుపాక్షిక, ద్వైపాక్షిక చర్చల, ఒడంబడికల పాత్ర పెరుగుతూ వచ్చింది. ప్రపంచంలో చాలా దేశాలు ఇటువంటి అంతర్జాతీయ ఒడంబడికల మీద సంతకాలు చేసి, వాటిని వీలైనంత మేరకు అమలు చేస్తూనే ఉన్నాయి. అటువంటి ఒక అంతర్జాతీయ ఒడంబడిక మీద సంతకందారు అయిన భారత ప్రభుత్వం దాన్ని అమలు చేస్తుందా లేదా అనే ఉత్కంఠ ఇప్పుడు నెలకొని ఉంది.

ఆ ఒడంబడిక పేరు 'పౌర, వాణిజ్య వ్యవహారాల చట్టబద్ధ, చట్టాతీత పత్రాల పంపిణీ ఒడంబడిక'. దీన్ని సులభంగా 'హేగ్ సర్వీస్ కన్వెన్షన్' అని పిలుస్తారు. ఇది 1965 నవంబర్‌లో తయారయింది కాని, భారత ప్రభుత్వం మాత్రం 2006 నవంబర్ 23న సంతకం చేసి, 2007 జనవరి 1 నుంచి అమలు చేస్తున్నది. భిన్న దేశాలలో భిన్నమైన న్యాయవ్యవస్థలు, చట్టాలు, చట్టాల అమలు పద్ధతులు ఉన్నప్పుడు ఒక దేశంలో పౌర, వాణిజ్య వివాదంలో మరొక దేశపు పౌరులు నిందితులుగా ఉన్నప్పుడు వారితో ఎలా వ్యవహరించాలి, వారికి న్యాయస్థానపు పత్రాలు ఎలా చేర్చాలి అనే పద్ధతులను ఈ ఒడంబడిక నిర్దేశించింది.

ఒక దేశంలోని పౌర, వాణిజ్య కేసులో నిందితులు మరొక దేశంలో ఉన్నప్పుడు... విచారణ జరిగే దేశపు న్యాయస్థానం ఇచ్చే సమన్లు, అభియోగ పత్రాలు, సాక్ష్యాధారాలు, న్యాయస్థానపు ఆదేశాలు ఆ నిందితులకు ఎట్లా చేర్చాలనే ప్రక్రియను ఈ ఒడంబడిక నిర్దేశిస్తుంది. ఒడంబడిక మీద సంతకం చేసే దేశాలన్నీ బయటి దేశం నుంచి తమ దేశంలోకి వచ్చే ఇటువంటి పత్రాలను నిందితులకు అందజేయడానికి ఒక కేంద్రీకృత వ్యవస్థను నియమిస్తాయి. ఫిర్యాది కానీ, ఫిర్యాది న్యాయవాదులు కానీ, కేసు నడుస్తున్న న్యాయస్థానం కానీ నేరుగా నిందితులతో వ్యవహరించే చిక్కులో పడనక్కరలేదు. వారు ఆ ప్రభుత్వం నియమించిన అధికారిక వ్యవస్థ ద్వారానే తమ లావాదేవీలు జరపవలసి ఉంటుంది. భారత ప్రభుత్వం తన చట్ట, న్యాయ వ్యవహారాల మంత్రిత్వ శాఖలోని చట్టవ్యవహారాల విభాగానికి ఈ బాధ్యతను ఇచ్చింది. సంప్రదించవలసిన అధికారిగా ఒక ఉప న్యాయ సలహాదారు పేరు సూచించింది. ఈ ఒడంబడిక మీద సంతకం చేసిన విదేశాల న్యాయస్థానాల పత్రాలు తన పౌరులకు అందజేసే బాధ్యత తనది మాత్రమేననీ, ఆ న్యాయస్థానాలు ఇతర మార్గాలు ఎంచుకోగూడదనీ భారత ప్రభుత్వం ప్రకటించింది. అయితే ఇన్ని ఏర్పాట్లు ఉన్నప్పటికీ, ఏడు నెలల కింద అమెరికా న్యాయస్థానం నుంచి భారత ప్రభుత్వానికి అందిన సమన్లు ఇప్పటివరకూ ఆ కేసులో అసలు నిందితులకు అందనే లేదు!



◆ భారత ప్రభుత్వం ఒడంబడికకు కట్టుబడి నిందితులకు సమన్లు అందజేయకపోతే ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. ఈ నిందితులు లేకుండానే, వీరి వాదనలు వినకుండానే ఆ న్యాయస్థానం శిక్షలు విధించవచ్చు. భారత ప్రభుత్వం ఇకముందు తనకు అవసరమైన కేసులలో ఈ ఒడంబడిక ఆధారంగా ఇతర దేశాలలో ఉన్న నిందితులను భారతదేశానికి రప్పించే అవకాశం రద్దయిపోతుంది.

ఒక భారతీయ కంపెనీ తన వ్యాపారానికి ఒక అమెరికన్ అనుబంధ కంపెనీ ద్వారా పెట్టుబడులు సంపాదించిందనీ, కెనడాలోని ఒక పింఛన్ నిధుల సంస్థ నుంచి పెట్టుబడులు సంపాదించిందనీ, ఈ క్రమంలో అమెరికన్ పౌరులైన మదుపుదార్లకు అబద్ధాలు చెప్పిందనీ, భారతదేశంలో సౌర విద్యుత్ ప్రాజెక్టులు సంపాదించడంలో అధికారులకు లంచాలు ఇచ్చిందనీ, ఈ కారణాల వల్ల ఈ నిందితులందరినీ అమెరికాలోని విదేశీ అవినీతి ప్రవర్తనల చట్టం (ఫారిన్ కరప్ట్ ప్రాక్టీసెస్ యాక్ట్) కింద, ఎలక్ట్రానిక్ నిధుల, సెక్యూరిటీల ప్రవాహంలో వంచన నేరం కింద శిక్షించాలనీ అమెరికాలో సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ (సెక్) న్యాయస్థానానికి వెళ్లింది. ఈస్టర్న్ డిస్ట్రిక్ట్ ఆఫ్ న్యూయార్క్‌కు చెందిన డిస్ట్రిక్ట్ కోర్ట్ జడ్జి 2024 నవంబర్ 22న భారతదేశంలోని ఏడుగురు వ్యక్తులకు, సింగపూర్‌లో నివాసం ఉండే ఫ్రెంచ్–ఆస్ట్రేలియన్ పౌరుడు ఒకరికి సమన్లు జారీ చేశారు. 2024 నవంబర్‌లో వెలువడిన తొలి వార్తల్లో అవి అరెస్ట్ వారంట్లు అన్నారు గాని, ప్రస్తుతం న్యాయస్థానానికి సెక్ దాఖలు చేసిన లేఖలో సమన్లు, సంబంధిత పత్రాలు అంటున్నారు.

ఆ సమన్లను పద్ధతి ప్రకారం భారత ప్రభుత్వానికి, అంటే చట్ట, న్యాయ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు పంపారు. ఆ మంత్రిత్వ శాఖ తమకు ఆ పత్రాలు అందాయని వెంటనే అమెరికన్ న్యాయస్థానానికి తెలియజేసింది కూడా. కాని 2025 ఫిబ్రవరి 8న, ఏప్రిల్ 23న న్యాయస్థానానికి అందిన స్టేటస్ రిపోర్టులు రెండిటి ప్రకారం కూడా భారత ప్రభుత్వం ఆ సమన్లను నిందితులకు అందజేయలేదు. జూన్ 27న న్యాయస్థానానికి సెక్ సమర్పించిన తాజా స్టేటస్ రిపోర్టు కూడా భారత ప్రభుత్వం ఆ సమన్లను నిందితులకు ఇవ్వలేదని అంటున్నది. ఇంకా ప్రయత్నిస్తున్నామని, ఆగస్ట్ 11న మరొక స్టేటస్ రిపోర్టు ఇస్తామని వారు న్యాయమూర్తికి చెప్పారు.

భారత ప్రభుత్వం ఒడంబడికకు కట్టుబడి నిందితులకు సమన్లు అందజేయకపోతే ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. ఈ నిందితులు లేకుండానే, వీరి వాదనలు వినకుండానే ఆ న్యాయస్థానం శిక్షలు విధించవచ్చు. భారత ప్రభుత్వం ఇకముందు తనకు అవసరమైన కేసులలో ఈ ఒడంబడిక ఆధారంగా ఇతర దేశాలలో ఉన్న నిందితులను భారతదేశానికి రప్పించే అవకాశం రద్దయిపోతుంది. భారత ప్రభుత్వం అంతర్జాతీయ ఒడంబడికలను పాటించదనే అపకీర్తిని మూట కట్టుకోవలసి వస్తుంది. అది ఆర్థిక, రాజకీయ, దౌత్య ఆంక్షలకు దారి తీయవచ్చు. ఇంతకూ ఈ సమన్లలో ఉన్నాయని చెబుతున్న పేర్లేంటో తెలుసా? గౌతమ్ అదానీ, సాగర్ అదానీ, వినీత్ జైన్, రంజిత్ గుప్తా, రూపేష్ అగర్వాల్, సౌరభ్ అగర్వాల్, దీపక్ మల్హోత్రా!!

వ్యాసకర్త 'వీక్షణం' సంపాదకుడు

మమకార ఖండన

మనలో ఇతరుల పట్ల ఉన్న మమకారం గమ్యాన్ని చేరకుండా ప్రతిబంధకం అవుతుంది. అందుకు అనేక ఉదంతాలు ఉన్నాయి. ఒక రోజు సాయంత్రం ప్రసేనజిత్తు మహారాజు గౌతమ బుద్ధునితో మాట్లాడుతూ... బుద్ధుని శిష్యులను చూసి, 'వీరంతా ఎంత అదృష్టవంతులు! సంసారాన్ని త్యజించి ఏ చీకూ, చింతా లేకుండా ధ్యానం చేస్తూ ఎంత హాయిగా జీవిస్తున్నారు. నేను కూడా వీరిలాగే అన్నీ వదలి ధ్యానంలో గడపుదామంటే వృద్ధురాలైన మా అమ్మ ఉంది, ఆమె బాధపడుతుంది. నన్ను ఏమి చేయమంటారు?' అని అడిగాడు. సరిగ్గా అదే సమయంలో బుద్ధుని శిష్యుల్లో వృద్ధుడైన ఒక సన్యాసి వచ్చి బుద్ధునికి నమస్కరించి, 'నేను మీ బోధను ప్రచారం చేయటానికి చాలా దూరం వెళ్ళాల్సి ఉన్నది. నన్ను ఆశీర్వదించి పంపండి' అని వేడుకున్నాడు. బుద్ధుడు ప్రసేనజిత్తు మహారాజుకు అతణ్ణి చూపి 'మీ ప్రశ్నకు సమాధానం ఇతడే. ఇతడు తన తల్లితండ్రులను చంపి సాధువై నా బోధను గ్రహించి జీవిస్తూ, ఇతరులకూ బోధిస్తున్నాడు' అని చెప్పాడు.



ఆ మాటల్లో ఆ వ్యక్తిని గూర్చి పొగడ్త కూడా కనిపించింది మహారాజుకు. ఆశ్చర్యంతో 'ఏమీ, ఈయన తన తల్లిదండ్రులను హత్య చేశాడా? అలాంటి హంతకుడిని మీరు పొగడుతున్నారా?' అని అడిగాడు. అందుకు బుద్ధుడు ప్రశాంత చిత్తంతో 'అతడు తల్లితండ్రులను భౌతికంగా చంపలేదు, వారిపైనున్న మమకారాన్ని చంపుకున్నాడు' అని వివరించాడు. 'నేను మీ ధ్యానంలో మీకు కనబడితే నన్ను నిర్దాక్షిణ్యంగా నరికి వేయండి' అని కూడా బుద్ధుడు తన శిష్యులకు చెప్పేవాడు. తమ మనసులో నుంచి తనను కూడా తీసేయాలన్నది ఆయన బోధ. రామకృష్ణ పరమహంసకు కాళికా దేవితో ఉన్న బంధాన్ని తొలగించడానికి తోతాపురి ఆయన నుదుటిపైన గాజు ముక్కతో కోశాడని రామకృష్ణ జీవిత చరిత్ర చెబుతుంది. అప్పుడాయనకు అద్వైత అనుభూతి కలిగింది. మనుషులను కాదు, మమకారాన్ని ఖండించాలి. అదే ముఖ్యం.

– రాచమడుగు శ్రీనివాసులు

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, ఆషాఢ మాసం, తిథి: శు.దశమి సా.6.23 వరకు, తదుపరి ఏకాదశి; నక్షత్రం: స్వాతి రా.8.06 వరకు, తదుపరి విశాఖ; వర్జ్యం: రా.2.19 నుండి 4.05 వరకు; దుర్ముహూర్తం: ఉ.5.32 నుండి 7.17 వరకు; అమృత ఘడియలు: ఉ.10.21 నుండి 12.05 వరకు; రాహుకాలం: ఉ.9.00 నుండి 10.30 వరకు; యమగండం: మ.1.30 నుండి 3.00 వరకు; సూర్యోదయం: 5.33; సూర్యాస్తమయం: 6.35.

నిబద్ధతకు నిలువెత్తు సంతకం రోశయ్య

- ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే
- సీఎం రేవంత్‌తో కలసి రోశయ్య విగ్రహావిష్కరణ

లక్డీకాపూల్(హైదరాబాద్): కాంగ్రెస్ పార్టీలో నిష్ఠ, నిబద్ధతకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య నిలువెత్తు సంతకమని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. రోశయ్య జయంతి సందర్భంగా లక్డీకాపూల్‌లో ఏర్పాటు చేసిన ఆయన కాంస్య విగ్రహాన్ని శుక్రవారం ఖర్గే, సీఎం రేవంత్‌రెడ్డితో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఖర్గే మాట్లాడుతూ.. ప్రజల పట్ల ఆయన చూపిన సేవా దృక్పథం అందరికీ ప్రేరణగా నిలుస్తుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. రాజకీయాల్లో మచ్చలేని నాయకుడిగా రోశయ్య ఎదిగారని కొనియాడారు. రోశయ్య చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. పాలనా దక్షుడిగా, ఆర్థికవేత్తగా పేరుగాంచారని రేవంత్ కొనియాడారు. ఆయనకు సరైన గౌరవం కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏటా అధికారికంగా జయంతి కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఉత్తర్వులు జారీ చేసిందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్, రోశయ్య కుటుంబసభ్యులు పాల్గొన్నారు.



రోశయ్య విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ఖర్గే, సీఎం రేవంత్‌రెడ్డి, పొన్నం, కోమటిరెడ్డి, భట్టి, మహేశ్‌కుమార్‌గౌడ్, శ్రీధర్‌బాబు, చామల, దానం తదితరులు

రోశయ్య సేవలు చిరస్మరణీయం

- వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, అమరావతి: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా, సుదీర్ఘకాలం ఆర్థికశాఖ మంత్రిగా కొణిజేటి రోశయ్య రాష్ట్రానికి అందించిన సేవలు చిరస్మరణీయమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొనియాడారు. 'శుక్రవారం రోశయ్య జయంతి సందర్భంగా నివాళులు'అని వైఎస్ జగన్ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్టు చేశారు.

అల్లు అరవింద్‌ను విచారించిన ఈడీ

- బ్యాంక్ స్కామ్ కేసుకు సంబంధించి ఆరా



సాక్షి, హైదరాబాద్: రామకృష్ణ ఎలక్ట్రానిక్ బ్యాంక్ స్కామ్ కేసులో సినీ నిర్మాత అల్లు అరవింద్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు విచారించారు. జూలై 2న అల్లు అరవింద్ బషీర్‌బాగ్‌లోని ఈడీ కార్యాలయంలో అధికారుల ఎదుట విచారణకు హాజరుకాగా.. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. 2018 – 2019లో మొత్తం రూ.101.4 కోట్ల రుణం తీసుకుని ఆ నిధులను మళ్లించిన ఆరోపణలపై యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఫిర్యాదు మేరకు రామకృష్ణ ఎలక్ట్రానిక్స్, రామకృష్ణ టెలిట్రానిక్స్, సంస్థ డైరెక్టర్లు, భాగస్వాములు వి.రాఘవేంద్ర, వి.రవికుమార్, ఇతరులపై బెంగళూరు సీబీఐ అధికారులు కేసు నమోదు చేశారు. అయితే ఆ నిధుల మళ్లింపులో మనీలాండరింగ్ అంశంపై ఈడీ దర్యాప్తు చేపట్టింది. ఈడీ హైదరాబాద్ జోనల్ కార్యాలయం హైదరాబాద్, కర్నూలు, ఘజియాబాద్‌లోని వివిధ ప్రదేశాలలో గత నెల 15న సోదాలు చేపట్టింది. ఈ కేసులోని కొందరు నిందితుల బ్యాంకు ఖాతాలతో అల్లు అరవింద్ సంస్థలు లావాదేవీలు జరిపినట్టు ఆధారాలు లభించడంతో ఆయన్ను ఈడీ సుమారు 2 గంటల పాటు విచారించింది. ఈ సందర్భంగా ఆయన పలు పత్రాలను ఈడీ అధికారులకు అందజేయడంతో పాటు వారు కోరిన సమాచారం ఇచ్చినట్టు తెలిసింది.

నిందితుడి నుంచి ఆస్తి కొనడంతో..: అల్లు అరవింద్

తాను ఒక మైనర్ వాటాదారుని నుంచి 2017లో ఒక ఆస్తి కొన్నానని, ఆ మైనర్ వాటాదారుడు రుణం తీసుకుని చెల్లించక పోవడంతో ఈడీ తనపై కేసు నమోదు చేసిందని అల్లు అరవింద్ చెప్పారు. తనపై విచారణ జరుగుతున్న సమయంలో తాను కొన్న ఆస్తికి సంబంధించి.. ఆ వ్యక్తి బుక్ ఆఫ్ అకౌంట్స్‌లో తన పేరుండడంతో తనను కూడా విచారణకు పిలిచారని మీడియాతో మాట్లాడుతూ వివరించారు. బాధ్యతగల పౌరునిగా తాను వెళ్లి వివరణ ఇచ్చానని అంతే తప్ప ఇందులో ఎలాంటి వివాదం, లోపాలు లేవని చెప్పారు.

మత సంప్రదాయాల్లో జోక్యం చేసుకోం

దలై లామా వారసుడి ఎంపికపై కేంద్రం వెల్లడి

న్యూఢిల్లీ: తమ విశ్వాసాలు, సంప్రదాయాలకు సంబంధించిన అంశాలపై తాము జోక్యం చేసుకోబోమని కేంద్ర ప్రభుత్వం శుక్రవారం స్పష్టం చేసింది. టిబెటన్ బౌద్ధ గురువు దలై లామా వారసుడి ఎంపిక కార్యక్రమం త్వరలో జరగనున్న నేపథ్యంలో ఈ మేరకు తన వైఖరిని వెల్లడించింది. విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ మీడియాతో మాట్లాడారు. 'తన వారసత్వం కొనసాగుతుందంటూ పూజ్య దలైలామా చేసిన ప్రకటన మా దృష్టికి వచ్చింది. ఇటువంటి మత సంబంధ అంశాల్లో భారత ప్రభుత్వం జోక్యం చేసుకోదు. మత విశ్వాసాలు, నమ్మకాలు, ఆచారాలకు సంబంధించిన విషయాలపై భారత ప్రభుత్వం ఏ పక్షంలోనూ చేరదు.. మాట్లాడదు'అని జైశ్వాల్ అన్నారు. దలై లామా వారసుడి ఎంపిక తమ ఇష్ట ప్రకారమే జరగాలని చైనా చేసిన హెచ్చరికపై కేంద్ర మంత్రి రిజిజు అభ్యంతరం వ్యక్తం చేయడం తెల్సిందే.

షాహీ ఈద్గాను వివాదాస్పద కట్టడం అనలేం

అలహాబాద్ హైకోర్టు స్పష్టీకరణ

ప్రయాగ్‌రాజ్: మథురలోని కృష్ణ జన్మభూమి, షాహీ ఈద్గా మసీదు వివాదంపై అలహాబాద్ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. షాహీ ఈద్గా మసీదును వివాదాస్పద కట్టడంగా రికార్డుల్లో పేర్కొనాలంటూ దాఖలైన అఫిడవిట్‌ను కొట్టివేసింది. కృష్ణ జన్మభూమి–షాహీ ఈద్గా మసీదు వివాదానికి సంబంధించిన విచారణ సందర్భంగా ఈద్గాను రికార్డుల్లో, తదుపరి విచారణ సమయంలోనూ వివాదాస్పద కట్టడమని పేర్కొనాలని హిందూ వర్గం తరఫున న్యాయవాది మహేంద్ర ప్రతాప్ సింగ్ అఫిడవిట్ వేశారు. ఈ వాదనను వ్యతిరేకిస్తూ మరో వర్గం సైతం పిటిషన్ వేసింది. శుక్రవారం వాదనలు విన్న జస్టిస్ రాం మనోహర్ నారాయణ్ మిశ్రా షాహీ ఈద్గాను వివాదాస్పద కట్టడమని పేర్కొనలేమని స్పష్టం చేశారు. తదుపరి విచారణను ఆగస్టు 2వ తేదీకి వాయిదా వేశారు.

బీజేపీతో పొత్తు ప్రసక్తే లేదు

సినీ నటుడు, టీవీకే చీఫ్ విజయ్ స్పష్టీకరణ

సాక్షి, చెన్నై: 2026లో తమిళనాడు అసెంబ్లీకి జరిగే ఎన్నికల్లో బీజేపీ–అన్నాడీఎంకే కూటమితో పొత్తు పెట్టుకోబోమని తమిళగ వెట్రి కళగం(టీవీకే) అధ్యక్షుడు, సినీ నటుడు విజయ్ స్పష్టం చేశారు. గత ఏడాది విజయ్ సొంతంగా టీవీకేను ప్రకటించిన విషయం తెలిసిందే. శుక్రవారం చెన్నైలో జరిగిన టీవీకే ఉన్నతస్థాయి సమావేశంలో విజయ్ మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీపై తీవ్ర స్థాయిలో విరుచుకు పడిన ఆయన తమిళనాడులో ఆ పార్టీ అధికారంలోకి రాలేదంటూ వ్యాఖ్యానించారు. విభజన రాజకీయాలతో తమిళనాట కుట్రలకు ఒడిగడితే ప్రజలు చూస్తూ ఊరుకోరని మండిపడ్డారు. అలాగే, తమిళనాడులో అరాచక పాలన సాగిస్తున్న డీఎంకే కూటమితోనూ చేతులు కలపబోమన్నారు. ఈ సమావేశం విజయ్ నేతృత్వంలోనే కూటమి ఏర్పాటు, ఆయనే సీఎం అభ్యర్థి అని తీర్మానం చేసింది.

బిడ్డను కంటే రూ.12 లక్షలిస్తాం

జనాభాను పెంచుకునేందుకు చైనా కొత్త ప్లాన్


బీజింగ్: జననాల రేటు ఏటికేడు పడిపోతుండటంపై చైనాలోని కమ్యూనిస్ట్ ప్రభుత్వానికి బెంగపట్టుకుంది. ఇదే కొనసాగితే భవిష్యత్తులో దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతుందని భయపడుతోంది. అందుకే, కొత్త పథకంతో ముందుకు వచ్చింది. ఈ ఏడాది జనవరి ఒకటో తేదీ తర్వాత పుట్టే ప్రతి బిడ్డకు నెలకు 3,600 యువాన్లు(సుమారు రూ.42 వేలు) అందిస్తామని ప్రకటించింది. ఆ చిన్నారి తల్లిదండ్రులకు ఇలా మూడేళ్లపాటు మొత్తం రూ.12 లక్షలను చెల్లిస్తామని తెలిపింది. ఇందుకు సంబంధించిన పథకంపై భారీ ఎత్తున ప్రచారం చేస్తోందని బ్లూమ్‌బర్గ్ తెలిపింది. చైనా ప్రభుత్వం దశాబ్దాలపాటు కొనసాగించిన ఒకే సంతానం విధానానికి 2016లో ముగింపు పలికింది. ఆ తర్వాత కూడా దంపతులు ఒకరికి మించి సంతానాన్ని కనేందుకు మొగ్గు చూపక పోవడంతో చైనా ఈ కొత్త పథకాన్ని ప్రవేశపెట్టింది.

కాక్‌పిట్‌లో కుప్పకూలిన ఎయిరిండియా పైలట్

ముంబై: బెంగళూరు–ఢిల్లీఎయిరిండియా విమానం మరికొద్ది నిమిషాల్లో టేకాఫ్ కావాల్సి ఉండగా పైలట్ కాక్‌పిట్‌లో కుప్పకూలిపోయారు. ఈ ఘటన శుక్రవారం ఉదయం బెంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయంలో చోటుచేసుకుంది. పైలట్‌గా బాధ్యతలు తీసుకునేందుకు ఉద్దేశించిన పత్రాలపై సంతకాలు చేస్తుండగానే పడిపోయారని, మెడికల్ ఎమర్జెన్సీ ప్రకటించి, ఆయన్ను వెంటనే ఆస్పత్రికి తరలించామని ఎయిరిండియా తెలిపింది. పైలట్ ఆస్పత్రిలోనే ఉన్నారని, పరిస్థితి నిలకడగా ఉందని తెలిపింది. దీంతో, ఆ విమానం ఆలస్యమైంది. మరో పైలట్ ప్రయాణికులను గమ్యస్థానం ఢిల్లీకి చేర్చారు.

గాజాలో కాల్పులు 35 మంది మృతి

డెయిర్ అల్–బలాహ్: గాజాలోని పాలస్తీనియన్లపై ఇజ్రాయెల్ మారణ కాండ కొనసాగుతోంది. శుక్రవారం దక్షిణ గాజాపై జరిగిన వైమానిక దాడుల్లో 15 మంది చనిపోగా ఆహార పంపిణీ కేంద్రాల వద్దకు వచ్చిన అన్నార్తులపై జరిపిన కాల్పుల్లో మరో 20 మంది ప్రాణాలు కోల్పోయారు. నాస్సెర్ ఆస్పత్రి వర్గాలు మృతుల సంఖ్యను నిర్ధారించాయి. కాగా, 2023 అక్టోబర్ నుంచి ఇజ్రాయెల్ సైన్యం కొనసాగిస్తున్న దాడుల్లో మృతి చెందిన వారి సంఖ్య 57వేలు దాటిందని గాజా ఆరోగ్య విభాగం తెలిపింది. వీరిలో సగానికి మించి మహిళలు, చిన్నారులే ఉన్నారంది.



భూమిపైకి కుసుమ ఖడ్గం

వాషింగ్టన్: అంతరిక్షంలో పుట్టుకొచ్చిన ఎర్రని కాంతి మొలకలా, అప్పుడే విచ్చుకుంటున్న కలువ పువ్వులా ఉంది కదూ! కానీ నిజానికది భూమిపైకి అమాంతంగా దూసుకొస్తున్న కాంతి ఖడ్గం! ఉరుములు మెరుపులతో కూడిన తుఫానుకు కారణమయ్యే మేఘాల పై ఆవరణలో, అంటే మిసోస్ఫియర్‌లో పిడుగుపాట్లు సంభవిస్తే ఇలాంటి కాంతిపుంజాలు ఏర్పడుతుంటాయి. వీటిని ట్రాన్సియెంట్ ల్యూమినస్ ఈవెంట్ (టీఎల్ఈ) చెబుతుంటారు. సాధారణంగా వీటిని భూమిపై నుంచి చూడడం కష్టం. అంతరిక్షం నుంచి మాత్రం స్పష్టంగా కనిపిస్తాయి. ఈ ఫొటోను వ్యోమగామి నికోల్ వేపర్ అయెర్స్ శుక్రవారం ఉదయం అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్) నుంచి తీశారు. మెక్సికో, అమెరికా మీదుగా ఐఎస్ఎస్ ప్రయాణిస్తున్న సమయంలో ఈ దృశ్యాన్ని కెమెరాలో బంధించి సోషల్ మీడియాలో పోస్టు చేశారు. 'భూమిపై కాంతి స్తంభం''గా దీన్ని అభివర్ణించారు. ఇదిప్పుడు శాస్త్ర, సాంకేతిక ప్రపంచాన్ని ఎంతగానో అబ్బురపరుస్తోంది. వీటిని సాంకేతిక భాషలో స్ప్రైట్ లైట్నింగ్ బోల్ట్ (ఎస్ఎల్‌బీ) అంటారు. సాధారణ పిడుగుపాట్లు మేఘాల నడుమ, లేదంటే మేఘాలకు, నేలకు నడుమ పడుతుంటాయి. ఈ ఎస్ఎల్‌బీలు మాత్రం మెసోస్ఫియర్‌లోని పలుచని ఆవరణలోనే పేలిపోతాయి. తద్వారా ఇలాంటి ఎర్రని 'మొలకలు' పుట్టుకొస్తుంటాయి.

నేవీలో మొట్టమొదటి మహిళా ఫైటర్ పైలట్‌గా పునియా

న్యూఢిల్లీ: నావికా దళంలోని యుద్ధ విమానం మొట్టమొదటి మహిళా పైలట్‌గా సబ్ లెఫ్టినెంట్ ఆస్థా పునియా రికార్డు సృష్టించనున్నారు. నేవీలో మహిళా యుద్ధ విమాన పైలట్ల నూతన శకానికి ఆమె నాంది పలకనున్నారని అధికారులు శుక్రవారం తెలిపారు. ఈ నెల 3న విశాఖపట్టణ తీరంలోని ఐఎన్ఎస్ డేగాపై సెకండ్ బేసిక్ హాక్ కన్వెర్షన్ కోర్సు స్నాతకోత్సవం జరిగింది. ఈ సందర్భంగా లెఫ్టినెంట్ అతుల్ ధుల్, సబ్ లెఫ్టినెంట్ పునియాకు ప్రతిష్టాత్మక 'వింగ్స్ ఆఫ్ గోల్డ్' అందుకున్నారు. దీంతో, నావికాదళ యుద్ధ విమానాలలోకి ప్రవేశించిన మొదటి మహిళగా సబ్ లెఫ్టినెంట్ ఆస్థా పునియా నిలిచారు. త్వరలోనే ఆమె ఫైటర్ పైలట్‌గా శిక్షణను అందుకోనున్నారు. నేవీలో ఇప్పటికే మహిళా పైలట్లు, ఎయిర్ ఆపరేషన్స్ ఆఫీసర్స్‌గా పనిచేస్తున్నారు.

ఆకాశం సైతం హద్దు కాదు

త్వరలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్

- దేశం నేడు అవకాశాల గనిగా మారింది
- ట్రినిడాడ్ అండ్ టొబాగోలో ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టీకరణ

పోర్ట్ ఆఫ్ స్పెయిన్: భారత్ త్వరలో ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించడం తథ్యమని ప్రధాని నరేంద్ర మోదీ మరోసారి స్పష్టం చేశారు. తమ దేశ ఆర్థిక వ్యవస్థ అత్యంత బలంగా ఉందని పేర్కొన్నారు. కృత్రిమ మేధ(ఏఐ), సెమీకండక్టర్లు, క్వాంటమ్ కంప్యూటింగ్ వంటి రంగాల్లో ఇండియా శరవేగంగా దూసుకెళ్తోందని, అవి సరికొత్త గ్రోత్ ఇంజన్లుగా మారాయని వెల్లడించారు. ఆయన స్థానిక కాలమానం ప్రకారం గురువారం కరీబియన్ దేశమైన ట్రినిడాడ్ అండ్ టొబాగో దేశంలోని కౌవా పట్టణంలో ప్రవాస భారతీయుల కార్యక్రమంలో ప్రసంగించారు. ఇండియా నేడు అవకాశాల గనిగా మారిందని, అభివృద్ధి ఫలాలు అట్టడుగు వర్గాలకు చేరుతున్నాయని పేర్కొన్నారు. నవ భారతదేశానికి ఆకాశం సైతం హద్దు కాదని వ్యాఖ్యానించారు. ట్రినిడాడ్ అండ్ టొబాగోలోని భారతీయులు వారి సొంత భూమిని వదిలేసి వచ్చినప్పటికీ భారతీయ ఆత్మను మాత్రం వదులుకోలేని చెప్పారు. గంగా, యమున నుంచి దూరంగా వచ్చారు గానీ రామాయణాన్ని హృదయంలోనే నిలుపుకున్నారని ప్రశంసించారు. ప్రవాస భారతీయులు కేవలం వలసదారులు కాదని.. గొప్ప నాగరికతకు దూతలు అని తెలి పారు. ప్రధాని మోదీ ఇంకా ఏం చెప్పారంటే... ''ప్రవాస భారతీయుల సేవలు ట్రినిడాడ్ అండ్ టొబాగో దేశ ప్రగతికి తోడ్పడుతున్నాయి. సాంస్కృతికంగా, ఆర్థికంగా, ఆధ్యాత్మికంగా వారు ఎంతో సేవ చేస్తున్నారు. ఇక్కడ ప్రవాస భారతీయుల ప్రభావం ఎలా ఉందో స్పష్టంగా కనిపిస్తోంది. అయోధ్య రామ మందిర నమూనా, సరయూ నది జలాలను, మహా కుంభమేళా జరిగిన త్రివేణి సంగమం నీటిని ఇక్కడికి నాతోపాటు తీసుకొచ్చా. అందుకు ఎంతగానో గర్విస్తున్నా. ఈ పవిత్ర జలా లను ఇక్కడి గంగా ధారలో చల్లాలని ప్రధానమంత్రి కమలకు విజ్ఞప్తి చేశా. ట్రినిడాడ్ అండ్ టొబాగో ప్రజలకు ఇదొక ఆశీర్వచనం అవుతుంది.

భారత్ ప్రగతికి యువతే చోదక శక్తి

పేదల అభివృద్ధి, సాధికారతకు పెద్దపీట వేయడం ద్వారా పేదరికాన్ని ఓడించవచ్చని భారత్ నిరూపించింది. పేదరికం నుంచి దేశానికి పూర్తిగా విముక్తి కల్పించవచ్చన్న విశ్వాసాన్ని పెంచాం. ఇండియా ప్రగతికి శక్తిసామర్థ్యాలు కలిగిన యువతే చోదక శక్తిగా నిలుస్తోంది. నేడు ప్రపంచంలో మూడో అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థ ఇండియాలోనే ఉంది. ఇందులో సగం స్టార్టప్‌లకు మహిళలే డైరెక్టర్లుగా పనిచేస్తున్నారు. 120 స్టార్టప్‌లు యూనికార్న్ స్థాయికి ఎదిగాయి. ప్రపంచంలోని మొత్త యూపీఐ చెల్లింపుల్లో 50 శాతం ఇండియాలోనే జరుగుతున్నాయి. ట్రినిడాడ్ అండ్ టొబాగోలో కొత్తగా యూపీఐ చెల్లింపుల వ్యవస్థ ప్రారంభించినందుకు అభినందనలు తెలియజేస్తున్నా. గుడ్ మార్నింగ్ అని మెసేజ్ పంపించుకున్నంత సులువుగా డబ్బులు పంపించుకోవచ్చు. వెస్టిండీస్ బౌలింగ్ కంటే కూడా ఇది స్పీడ్‌గా ఉంటుందని నేను ప్రామిస్ చేస్తున్నా'' అని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

ఉగ్రవాదానికి ఆశ్రయం ఇవ్వద్దు

పోర్ట్ ఆఫ్ స్పెయిన్: ఉగ్రవాదానికి మానవాళికి శత్రువుగా మారిందని, దానికి ఎట్టిపరిస్థితుల్లోనూ ఎవరూ ఆశ్రయం ఇవ్వొద్దని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఉగ్రవాదాన్ని కలిసికట్టుగా ఎదిరించాలని ప్రపంచ దేశాలకు పిలుపునిచ్చారు. ఆయన శుక్రవారం ట్రినిడాడ్ అండ్ టొబాగో పార్లమెంట్ సంయుక్త సమావేశంలో ప్రసంగించారు. ట్రినిడాడ్ అండ్ టొబాగో దేశం తమకు అత్యంత ప్రాధాన్యత కలిగిన దేశమని వెల్లడించారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా తాము సాగిస్తున్న పోరాటానికి ఈ దేశం మద్దతిస్తోందని, అందుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని పేర్కొన్నారు. మరోవైపు ట్రినిడాడ్ అండ్ టొబాగో ప్రభుత్వం తమ అత్యున్నత పురస్కారం 'ద ఆర్డర్ ఆఫ్ ద రిపబ్లిక్ ఆఫ్ ట్రినిడాడ్ అండ్ టొబాగో'తో నరేంద్ర మోదీని సత్కరించింది.



ట్రినిడాడ్ అండ్ టొబాగో ప్రధాని కమలకు గంగాజలం ఉన్న కలశాన్ని అందిస్తున్న మోదీ

బిహార్ వారసత్వం గర్వకారణం

ట్రినిడాడ్ అండ్ టొబాగోకు ఇండియాలోని బిహార్ రాష్ట్రంతో చక్కటి అనుబంధం ఉందని నరేంద్ర మోదీ చెప్పారు. బిహార్ వారసత్వం భారతదేశానికి, ప్రపంచానికి గర్వకారణమని అన్నారు. ఇక్కడున్న చాలామంది భారత సంతతి ప్రజల పూర్వీకులు బిహార్ నుంచి వచ్చినవారేనని తెలిపారు. బిహార్‌కు ఘనమైన వారసత్వం ఉందని పేర్కొన్నారు. ట్రినిడాడ్ అండ్ టొబాగో ప్రధానమంత్రి కమలా పెర్సాద్ బిసెసార్ పూర్వీకులు సైతం బిహార్‌కు చెందినవారేనని చెప్పారు. ఆమె బిహార్‌ను సందర్శించారని, భారతీయులు ఆమెను 'బిహార్ బిడ్డ'గా పిలుస్తుంటారని అన్నారు. భారత్, ట్రినిడాడ్ అండ్ టొబాగో మధ్య బలమైన సాంస్కృతిక సంబంధాలు ఉన్నాయని ప్రధాని మోదీ ఉద్ఘాటించారు. బిహార్‌కు చెందిన భోజ్‌పురి భాషను ట్రినిడాడ్ అండ్ టొబాగోలో కూడా చాలామంది మాట్లాడుతుంటారని వివరించారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో పోస్టు చేశారు.

మోదీకి సంప్రదాయ స్వాగతం

ఘనా నుంచి ట్రినిడాడ్ అండ్ టొబాగో చేరుకున్న ప్రధాని మోదీకి ఘన స్వాగతం లభించింది. దేశ ప్రధానమంత్రి కమలా పెర్సాద్ బిసెసార్‌తో పాటు మంత్రులు, అధికారులు ఆయనకు సంప్రదాయ రీతిలో స్వాగతం పలికారు. భారత సంతతికి చెందిన కమలా పెర్సాద్ బిసెసార్ ఈ సందర్భంగా భారతీయ సంప్రదాయ చీర ధరించారు. అనంతరం ప్రవాస భారతీయుల సమావేశంలో మోదీతోపాటు ఆమె పాల్గొన్నారు. 'బిహార్ కీ బేటీ' అంటూ కమలపై మోదీ ప్రశంసల వర్షం కురిపించారు. మోదీ రాసిన పుస్తకంలోని 'ఆంఖ్ కా ధన్యా చే' పద్యాన్ని కమల ఆలపించి అందరినీ ఆశ్చర్యపర్చారు. భారత్ నుంచి తీసుకొచ్చిన పవిత్ర గంగాజలాన్ని ఆమెకు మోదీ బహూకరించారు. ట్రినిడాడ్ అండ్ టొబాగో దేశ తొలి మహిళా ప్రధానమంత్రిగా కమలా పెర్సాద్ బిసెసార్ రికార్డుకెక్కారు.

7 గంటలు.. 550 డ్రోన్లు

కీవ్ లక్ష్యంగా రష్యా దాడులు తీవ్రతరం

కీవ్: ఉక్రెయిన్ రాజధాని కీవ్ లక్ష్యంగా రష్యా మరోసారి భీకర దాడులకు తెరతీసింది. గురువారం రాత్రి కేవలం 7 గంటల వ్యవధిలో 550 వరకు డ్రోన్లు, 11 క్షిపణులను ప్రయోగించింది. రష్యా మూడేళ్ల క్రితం ఉక్రెయిన్‌పై దురాక్రమణ ప్రారంభించాక చేపట్టిన అతిపెద్ద దాడి ఇదేనని చెబుతున్నారు. షహీద్ డ్రోన్లు, బాలిస్టిక్ క్షిపణుల పేలుళ్ల మోతలతో కీవ్ దద్దరిల్లింది. సైరన్లు రాత్రంగా మోగుతూనే ఉన్నాయి. కీవ్‌లో ఐదంతస్తుల నివాస భవనం పాక్షికంగా ధ్వంసం కాగా, ఏడంతస్తుల భవనంలో మంటలు చెలరేగాయి. ఒక గోదాము, ఒక గ్యారేజీ, ఆటో రిపేర్ కేంద్రం సైతం మంటల్లో చిక్కుకున్నాయి. కీవ్‌లోని రైల్వే వ్యవస్థ దెబ్బతిందని అధికారులు తెలిపారు. తెల్లారేసరికి కీవ్ రోడ్లన్నీ ధ్వంసమైన, కాలిపోయిన వాహనాలు, భవనాల వ్యర్థాలతో నిండిపోయాయి. ఈ దాడుల్లో 23 మంది గాయపడినట్లు సమాచారం. 'మా ప్రజలు కఠినమైన, నిద్ర లేని రాత్రి గడిపారు'అని అధ్యక్షుడు జెలెన్‌స్కీ పేర్కొన్నారు. ప్రజలు మెట్రో స్టేషన్లు, బేస్‌మెంట్‌లు, భూగర్భ పార్కింగ్ గ్యారేజీల్లోకి పరుగులు తీశారని ఉక్రెయిన్ మంత్రి యూలియా తెలిపారు. కీవ్‌తోపాటు మరో ఐదు ప్రాంతాలపైకి రష్యా దాడులు చేసిందని జెలెన్‌స్కీ చెప్పారు. తాము 270 డ్రోన్లను కూల్చివేశామని ఉక్రెయిన్ రక్షణ శాఖ తెలిపింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్, రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో ఫోన్‌లో సంభాషణ జరిపిన రోజే తాజా దాడి జరగడం గమనార్హం.



కీవ్‌లో ఓ భవనంలో చెలరేగుతున్న మంటలు

యుద్ధం ఆపుతాడని అనుకోవడం లేదు:ట్రంప్

రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో ఫోన్ సంభాషణ అనంతరం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మీడియాతో మాట్లాడారు. కాల్పుల విరమణపై పుతిన్ సానుకూలంగా స్పందించారా అన్న ప్రశ్నకు ఆయన.. లేదు. ఈ విషయంలో ఎలాంటి పురోగతి సాధించలేదు. ఉక్రెయిన్‌పై రష్యా సాగిస్తున్న దాడులపై నాకు సంతోషంగా లేదు. ఈ యుద్ధాన్ని పుతిన్ ఆపుతారని నేను అనుకోవడం లేదు'అని వ్యాఖ్యానించారు.

ఆపరేషన్ సిందూర్ సమయంలో పాక్‌కు చైనా, తుర్కియే సాయం

- రియల్ టైమ్ సమాచారం ఇస్తూ చైనా తోడ్పాటు
- ఆయుధాలు పరీక్షించుకోవడానికి పాక్‌ను ప్రయోగశాలగా వాడుకుంది
- ఆయుధాలు సరఫరా చేసిన తుర్కియే
- భారత డిప్యూటీ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ రాహుల్ ఆర్.సింగ్ వెల్లడి

న్యూఢిల్లీ: ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్తాన్‌కు దాని మిత్రదేశం చైనా సహకరించిందా? ఇండియాకు సంబంధించిన సమాచారం ఎప్పటికప్పుడు చేరవేసిందా? అంటే అవుననే చెబుతున్నారు భారత డిప్యూటీ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ లెఫ్టినెంట్ జనరల్ రాహుల్ ఆర్.సింగ్. పహల్గాం ఉగ్రవాద దాడి తర్వాత పాకిస్తాన్‌పై భారత సైన్యం ఆపరేషన్ సిందూర్ ప్రారంభించింది. మే 7 నుంచి 10వ తేదీ దాకా నాలుగు రోజులపాటు ఆ ఆపరేషన్ కొనసాగింది. భారత సైన్యం దాడిలో పాకిస్తాన్‌తోపాటు పాక్ ఆక్రమిత కశ్మీర్(పీఓకే)లోని ఉగ్రవాద శిబిరాలు, లాంచ్‌ప్యాడ్‌లు ధ్వంసమయ్యాయి. అయితే, ఆ సమయంలో పాకిస్తాన్‌కు చైనా సహకరించిందని, ఇండియన్ ఆర్మీ కదలికలకు సంబంధించి రియల్ టైమ్ సమాచారం చేరవేసిందని రాహుల్ ఆర్.సింగ్ తెలియజేశారు. తుర్కియే సైతం పాక్‌కు అండదండలు అందించిందని, కొన్ని రకాల ఆయుధాలు సరఫరా చేసిందని పేర్కొన్నారు. ఢిల్లీలో శుక్రవారం ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఆధ్వర్యంలో 'నూతన తరంలో సైనిక సాంకేతికతలు' అనే అంశంపై ఆయన మాట్లాడారు. భారత సైన్యం దాడులతో ఉక్కిరిబిక్కిరవుతున్న పాకిస్తాన్‌కు చైనా, తుర్కియేలు చేతనైనంత సాయం చేశాయని పేర్కొన్నారు. ఆ మూడు దేశాల కుట్రను తాము ఎదుర్కోవాల్సి వచ్చిందని చెప్పారు. తెరపైన కనిపించింది పాకిస్తాన్ కాగా, తెరవెనుక చైనా, తుర్కియే ఉన్నాయని వెల్లడించారు.



అరువు తెచ్చుకున్న కత్తి

చైనా తన ఆయుధాల సామర్థ్యం పరీక్షించుకోవడానికి పాకిస్తాన్‌ను ప్రయోగశాలగా వాడుకుంటోందని రాహుల్ ఆర్.సింగ్ స్పష్టం చేశారు. ఆ ఆయుధాలను చైనా గడ్డపై నుంచి ఇతర దేశాలపైకి ప్రయోగిస్తోందన్నారు. పాక్‌కు చైనా సహకరించడంలో ఆశ్చర్యం ఏమీ లేదన్నారు. గత ఐదేళ్ల గణాంకాలు చూస్తే పాకిస్తాన్‌కు 81 శాతం మిలటరీ హార్డ్‌వేర్ చైనా నుంచే వచ్చినట్లు స్పష్టమవుతోందని వెల్లడించారు. పాక్ భూభాగం చైనాకు లైవ్ ల్యాబ్‌గా మారినట్లు తేల్చిచెప్పారు. యుద్ధక్షేత్రంలోకి నేరుగా అడుగుపెట్టకుండా ఇండియాపైకి పాకిస్తాన్‌ను ఉసిగొల్పడమే డ్రాగన్ వ్యూహమని రాహుల్ ఆర్.సింగ్ తెలిపారు. 'అరువు తెచ్చుకున్న శక్తితో శత్రువును చంపడం' చైనా ప్రాచీన యుద్ధతంత్రంలో భాగమని గుర్తుచేశారు. సరిహద్దుల్లో ఘర్షణ పడడం కంటే పాకిస్తాన్‌ను ముందుపెట్టి భారత్‌కు ఇబ్బందులు సృష్టించడం చైనా ధ్యేయంగా కనిపిస్తోందని చెప్పారు. ఇదిలా ఉండగా, భారత్–పాక్ మధ్య కాల్పుల విరమణ ప్రక్రియ అమల్లోకి వచ్చిన కొద్దిరోజులకే తుర్కియే అధ్యక్షుడు ఎర్డోగాన్ పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌తో సమావేశమైన సంగతి తెలిసిందే. ఇరుదేశాల మధ్య పరస్పర సహకారాన్ని మరింత పెంపొందించుకోవాలని అప్పట్లో వారు నిర్ణయించుకున్నారు. తుర్కియే అందిస్తున్న సహకారానికి షెహబాజ్ షరీఫ్ కృతజ్ఞతలు తెలియజేశారు.

హిమాచల్‌లో వర్షాలతో నష్టం

- రెండు వారాల్లో 43 మంది మృతి
- ఉత్తరాఖండ్‌లో ఇద్దరు ఐఏఎఫ్ సిబ్బంది మృతి

న్యూఢిల్లీ: గడిచిన రెండు వారాలుగా ఏకధాటిగా కురుస్తున్న వర్షాలతో హిమాచల్ ప్రదేశ్‌లో తీవ్ర నష్టం సంభవించింది. వర్షాలకు సంబంధించిన ఘటనల్లో 43 మంది మృతి చెందగా 37 మంది కనిపించకుండా పోయారు. ఒక్క మండి జిల్లాలోనే 17 మంది చనిపోగా, 31 మంది గల్లంతయ్యారు. జూన్ 20వ తేదీ నుంచి హిమాచల్‌లో కురుస్తున్న వర్షాలు, వరదలు, కొండచరియలు విరిగిపడిన ఘటనల కారణంగా రాష్ట్రంలో రూ.5 వేల కోట్ల మేర నష్టం వాటిల్లింది. వచ్చే మంగళవారం వరకు వర్షాల తీవ్రత కొనసాగుతుందని వాతావరణ శాఖ తెలిపింది. ఉత్తరాఖండ్‌లోని భీమ్‌టల్‌లో గురువారం ఉప్పొంగుతున్న జలాశయంలో మునిగి నేవీకి చెందిన ఇద్దరు సిబ్బంది చనిపోయారు. పఠాన్ కోట్‌కు చెందిన ప్రిన్స్ యాదవ్(22), బిహార్‌లోని ముజఫర్‌పూర్‌కు చెందిన సాహిల్ కుమార్(23)గా వీరిని గుర్తించారు. నైనిటాల్ నుంచి సరదాగా గడిపేందుకు వచ్చిన 8 మంది ఐఏఎఫ్ సిబ్బందిలో వీరున్నారు. వర్షాల కారణంగా రాష్ట్రంలోని 100కు పైగా రహదారులను మూసివేశారు. చార్‌ధామ్ యాత్రకు అంతరాయం కలిగింది. యమునోత్రికి వెళ్లే జాతీయ రహదారిపై ఐదు రోజులుగా రాకపోకలు నిలిచిపోయాయి. కొండచరియలు విరిగిపడి ఈ రహదారిపైనున్న సిలాయి మలుపు వద్ద 12 మీటర్ల రోడ్డు కొట్టుకుపోయింది. దీంతో, 9 మంది నిర్మాణ కార్మికులు కొట్టుకుపోయారు. వీరి కోసం గాలింపు కొనసాగుతోంది. మరోవైపు, ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. నీటిని బయటకు పంపేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. మధ్యప్రదేశ్‌లో శుక్రవారం కురిసిన భారీ వర్షానికి చాలా ప్రాంతాల్లో జనజీవనం స్తంభించింది. మండ్లా, సియోని, బాలాఘాట్ జిల్లాల్లో వాతావరణ శాఖ రెడ్ అలెర్ట్ ప్రకటించింది. జబల్పూర్–మండ్లా జిల్లాలను కలిపే జాతీయ రహదారిపై కొండచరియలు విరిగి పడటంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. అదేవిధంగా, రాజస్తాన్‌లోని జైసల్మీర్ జిల్లా పొఖ్రాన్‌లో 128 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. రాష్ట్రంలోని పశ్చిమ ప్రాంతంలోనూ భారీ నుంచి అతి భారీ వర్షం కురిసింది.

'బ్లూటూత్' స్పీకర్లతో జాగ్రత్త!

భారత సైబర్ సెక్యూరిటీ ఏజెన్సీ హెచ్చరిక

న్యూఢిల్లీ: మీరు బ్లూటూత్ ఆధారిత స్పీకర్లు, ఇయర్‌బడ్లు ఉపయోగిస్తున్నారా? అయితే తస్మాత్ జాగ్రత్త. బ్రాండ్ ఏదైనా కానీ.. బ్లూటూత్ ఆధారిత స్పీకర్లు ముప్పు కలిగిస్తాయని ఇండియన్ సైబర్ సెక్యూరిటీ ఏజెన్సీ హెచ్చరించింది. ''హ్యాకర్లు ఆడియో పరికరాలను నియంత్రణలోకి తీసుకోవడానికి, సంభాషణలపై నిఘా పెట్టడానికి, కాల్‌ను హైజాక్ చేసి పరికరాన్ని రిమోట్‌గా నియంత్రించడానికి బ్లూటూత్ కారణమవుతుంది. ఐరోహా సిస్టమ్స్ చిప్ ఉన్న బ్లూటూత్ హెడ్‌ఫోన్లు, స్పీకర్లు, కార్ ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్ వినియోగదారులకు ఈ ప్రమాదం ఎక్కువ. బ్లూటూత్ ఇయర్‌బడ్, సోనీ, బోస్, సెన్‌హైజర్, బోట్ వంటి పెద్ద బ్రాండ్ల స్పీకర్లను వాడుతున్నా ప్రమాదమే. బ్లూటూత్‌తో దాడి చేసి ఫోన్ మెమరీని చదివే, మైక్రోఫోన్ ద్వారా వినే, కాల్ డేటా, కాంటాక్ట్‌లను దొంగిలించే అవకాశముంది. హానికరమైన ఆదేశాలు కూడా ఇవ్వొచ్చు. హ్యాకర్ బ్లూటూత్‌కు కనెక్ట్ అయి మీతకు తెలియకుండానే డివైజ్ మీద పూర్తి నియంత్రణ తీసుకోవచ్చు. వీటి నుంచి బయటపడాలంటే బ్లూటూత్ పరికరాలకు ఫర్మ్‌వేర్‌ను అప్‌డేట్ చేయండి. డివైజ్ తయారీదారు విడుదల చేసిన వెంటనే అప్‌డేట్స్‌ను ఇన్‌స్టాల్ చేయండి. బహిరంగ ప్రదేశాల్లో పరికరాలను బ్లూటూత్‌కు జత చేయకుండా ఉండండి'' అని సూచించింది.

శానిటరీ నేప్కిన్స్ ప్యాకెట్లపై రాహుల్ బొమ్మ



పట్నా: బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడుతున్న వేళ మహిళలను మచ్చిక చేసుకునేందుకు కాంగ్రెస్ చేసిన ప్రయత్నం విమర్శలపాలైంది. రాష్ట్రంలో 5 లక్షల మంది మహిళలకు ఉచితంగా శానిటరీ నేప్కిన్స్‌ను పంపిణీ చేయాలని పార్టీ తలపెట్టింది. అధికారంలోకి వస్తే మహిళలకు నెలకు రూ.2,500 అందజేయడంతోపాటు ఉచితంగా నేప్కిన్లు అందజేస్తామని ప్రకటించింది. ఆ ప్యాకెట్లపై రాహుల్ గాంధీ బొమ్మను ముద్రించడం వివాదం రేపింది. కాంగ్రెస్ దిగజారుడు రాజకీయాలకు ఇదో ఉదాహరణ అంటూ అధికార జేడీ(యూ) మండిపడింది.

అంతరిక్షం నుంచి భూమిని వీక్షించడం

అద్భుత అనుభూతి

- ఐఎస్ఎస్‌లో పలు దేశాల రుచులు ఆస్వాదిస్తున్నా
- భారత వ్యోమగామి శుభాంశు శుక్లా వెల్లడి

న్యూఢిల్లీ: భారత వ్యోమగామి శుభాంశు శుక్లా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లో వారం రోజులు పూర్తి చేసుకున్నారు. సహచర వ్యోమగాములతో కలిసి ఇప్పటికే భూమిని 113 సార్లు చుట్టేశారు. 40.66 లక్షల కిలోమీటర్లు ప్రయాణించారు. ఇది భూమికి, చంద్రుడికి మధ్యనున్న దూరానికి 12 రెట్ల దూరంతో సమానం. ఐఎస్ఎస్‌లో తన అనుభవాన్ని శుభాంశు శుక్లా శుక్రవారం పంచుకున్నారు. మన భారతీయ ఆమ్ రస్, గాజర్‌కా హల్వా, మూంగ్‌దాల్ హల్వా రుచులు ఆస్వాదిస్తున్నానని, వాటిని సహచరులతో పంచుకుంటున్నానని చెప్పారు. ఇతర దేశాల వంటకాలను సైతం రుచి చూస్తున్నానని తెలిపారు. ఆయన తన కుటుంబ సభ్యులు, మిత్రులతో ఐఎస్ఎస్ నుంచి సంభాషించారు. అలాగే హామ్ రేడియో ద్వారా బెంగళూరులోని యూఆర్ఎస్సీ సైంటిస్టులతో మాట్లాడారు. ఇక్కడంతా అద్భుతంగా ఉందని, తామంతా చక్కగా కలిసి ఉంటున్నామని పేర్కొన్నారు. వేర్వేరు దేశాలకు చెందిన ఆహార పదార్థాలను ఒకరికొకరం పంచుకుంటున్నామని వెల్లడించారు. వేర్వేరు దేశాల వ్యక్తులతో కలిసి పని చేయడం ఉత్సాహకరమైన అనుభవమని వ్యాఖ్యానించారు. అన్నింటికంటే ముఖ్యంగా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం నుంచి మన భూగోళాన్ని కళ్లారా వీక్షించడం మాటల్లో చెప్పలేని అద్భుత అనుభూతిని ఇస్తోందని వివరించారు. అత్యంత ఎక్కువ కాలం అంతరిక్షంలో గడిపిన మొట్టమొదటి భారతీయ వ్యోమగామిగా శుభాంశు శుక్లా గురువారం సరికొత్త రికార్డు సృష్టించారు. 1984లో రాకేశ్ శర్మ ఏడు రోజుల 21 గంటల 40 నిమిషాలు అంతరిక్షంలో గడిపారు. శుభాంశు శుక్లా ఆ రికార్డును అధిగమించారు.

సాక్షి
హైదరాబాద్
శనివారం । 5 । జూలై । 2025



లామకాన్.. కళా మకాన్!
బంజారా హిల్స్ రోడ్ నెం-1 వెంగళరావు పార్క్ సమీపంలోని గల్లీలో 'కళా'మకాన్ ఉంది. ఇక్కడ అన్ని రంగాలకు చెందిన కళాప్రియులు అధికంగా కనిపిస్తారు. - సిటీప్లస్‌లో



ఐటీ పార్క్‌లతో.. స్థిరాస్తి వృద్ధి
హైదరాబాద్ స్థిరాస్తికి ఐటీ బూస్ట్‌లా మారింది. ఐటీ ఉద్యోగులపై ఆధారపడి గృహ విక్రయాలు జరుగుతాయో..అంతకు రెట్టింపు స్థాయిలో ఐటీ సంస్థల లావాదేవీలు జరుగుతున్నాయి. -రియల్టీలో

గరిష్టం/కనిష్టం
32.0/24.0

వాతావరణం
నగరంలో శనివారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశముంది. గరిష్టంగా 32, కనిష్టంగా 24 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అంచనా.

కల్వర్టుల పైనా 'ఐ'డ్రా

మాన్సూన్ ఎమర్జెన్సీ టీమ్స్‌కు పర్యవేక్షణ బాధ్యత

- జీహెచ్ఎంసీ పరిధిలో ఉన్న కల్వర్టుల సంఖ్య 940
- వీటి వద్ద చెత్త పేరుకుపోకుండా పని చేయనున్న టీమ్స్
- అవసరమైన సహకారం అందించనున్న డీఆర్ఎఫ్ బృందాలు
- ఆదేశాలు జారీ చేసిన హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్

సాక్షి, సిటీబ్యూరో: వరద ముంపును సాధ్యమైనంత వరకు తగ్గించడంపై హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) దృష్టి పెట్టింది. వీటిలో భాగంగా మాన్సూన్ ఎమర్జెన్సీ టీమ్స్‌కు (ఎంఈటీ) కల్వర్టుల బాధ్యత అప్పగించింది. కాంట్రాక్టు ప్రాతిపదికన ఏర్పాటైన ఈ బృందాలను డిజాస్టర్ రెస్పాన్ ఫోర్స్ (డీఆర్ఎఫ్) సహకరించేలా ఆదేశాలు జారీ చేశారు.

కాంట్రాక్టు విధానంలో 150 బృందాలు..
విపత్తు సమయంలో స్పందించడం, సహాయక చర్యలు అందించడం హైడ్రా అధీనంలోని డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (డీఆర్ఎఫ్) ప్రధాన విధి. తొలిసారిగా ఎంఈటీల నిర్వహణను సైతం ప్రభుత్వం హైడ్రాకు అప్పగించింది. ఈ నేపథ్యంలో గతానికి భిన్నంగా ముందుకు వెళ్తున్న హైడ్రా అందుకు తగ్గట్టు ప్రణాళికలు సిద్ధం చేసింది. ఇప్పటికే కాంట్రాక్టు ప్రాతిపదికన 150 మాన్సూన్ బృందాల ఎంపిక పూర్తి చేశారు. ఒక్కో మాన్సూన్ టీమ్‌లో ముగ్గురు సభ్యులు ఉంటారు. ఒక్కో టీమ్ ఎనిమిది గంటల చొప్పున.. రోజుకు మూడు బృందాలు సిద్ధంగా ఉంటాయి. ఈ బృందాలకు హైడ్రా అధీనంలోని దాదాపు 50 డీఆర్ఎఫ్ జట్లు సహకరిస్తాయి. ఈ ఎంఈటీలను 30 మంది మాజీ సైనికోద్యోగులు పర్యవేక్షిస్తున్నారు.

నాలా పరిస్థితి గమనించిన కమిషనర్..
ఈ ఎంఈటీల ఏర్పాటు ప్రతి ఏడాదీ జరుగుతుంటుంది. ఇప్పటి వరకు ఈ బృందాలకు కేవలం వర్షం కురిసినప్పుడు మాత్రమే పని ఉండేది. మిగిలిన సమయంలో నిర్దేశిత ప్రాంతాల్లో వేచి ఉంటుండేవి. మరోపక్క ఇటీవల వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తున్న హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ నాలాల పరిస్థితిని పరిశీలిస్తున్నారు. అనేక ప్రాంతాల్లో అవి కబ్జా కావడంతో పాటు కల్వర్టుల వద్ద చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకు పోవడం కూడా నీటి ప్రవాహం తగ్గిపోతోంది. ఈ కారణంగా అనేక ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచిపోతున్నట్లు గుర్తించారు. కేవలం వర్షం కురిసినప్పుడే కాకుండా ఈ అడ్డంకులను ఎప్పటికప్పుడు తొలగించే బాధ్యతల్ని ఎంఈటీలకు అప్పగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో ఉన్న 940 కల్వర్టుల వద్ద ఎంఈటీల పని తీరును సాంకేతికంగా పర్యవేక్షించేలా చర్యలు తీసుకున్నారు.

ఎస్ఎన్‌డీపీ పనులూ పూర్తయ్యేలా...
ఈ ఎంఈటీలు, డీఆర్ఎఫ్ బృందాలు తమ పరిధిలో ఉన్న నాలాలతో ప్రధాన ఇంకుడు కుంటల పరిస్థితిని ఎప్పటికప్పుడు గమనిస్తుంటాయి. అవసరమైన వాటిలో పూడిక, పైన పేరుకుపోయిన చెత్తను తొలగిస్తుంటాయి. ఎంఈటీల పని తీరును ప్రతి వారం హైడ్రా కమిషనర్ పర్యవేక్షిస్తున్నారు. వర్షాలు జోరందుకోకుండానే వీలున్నంత వరకు స్ట్రాటజిక్ నాలా డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఎస్ఎన్‌డీపీ) పనులు పూర్తయ్యేలా చూడటం పైనా దృష్టి పెట్టింది. ఇందులో భాగంగానూ శుక్రవారం శేరిలింగంపల్లి జోన్ పరిధిలో కొన్ని కూల్చివేతల్ని చేపట్టింది. నాలా విస్తరణకు అడ్డుగా ఉన్న కొన్ని భవనాలను కూల్చేసింది. ఈ తరహాలో అడ్డుగా ఉన్న ఇతర అక్రమ కట్టడాల వ్యవహారాన్నీ ఆరా తీస్తోంది. వీటిలో వాణిజ్య భవనాలపై తక్షణం చర్యలు తీసుకునేలా ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.



జనార్దన్ రెడ్డి నగర్‌లో చెత్త తొలగింపు

ఎంఈటీ, డీఆర్ఎఫ్ బృందాలు శుక్రవారం యూసుఫ్‌గూడ, మధురానగర్, కృష్ణానగర్‌లలోని వరద కాలువలో, గచ్చిబౌలిలోని జనార్దన్ రెడ్డి నగర్‌లోని నాలాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించాయి. కాప్రా సర్కిల్ వార్డు నెం.2 మార్కండేయ కాలనీలో నాలా క్యాచ్‌పిట్ ఏరియాను శుభ్రం చేశాయి. ఎల్బీనగర్ సర్కిల్ పరిధిలో ఆర్‌సీఐ రోడ్డు, మిథిలానగర్ సమీపంలోని మంత్రాల చెరువు నుంచి జిల్లెలగూడ చెరువుకు వెళ్లే నాలాలోని పూడికను జేసీబీతో తొలగించాయి.



మాసబ్ ట్యాంక్ మార్గంలో..

ట్రాఫిక్ నరకం!

వాహన చోదకులకు శుక్రవారం చుక్కలు కనిపించాయి. సాయంత్రం నుంచి రాత్రి వరకు ట్రాఫిక్ చక్రబంధంలో చిక్కుకుని నగరవాసి విలవిల్లాడాడు. లక్డీకాపూల్‌లో మాజీ ముఖ్యమంత్రి రోశయ్య విగ్రహావిష్కరణ, ఎల్బీ స్టేడియంలో కాంగ్రెస్ సమావేశం.. ఈ రెండు కార్యక్రమాల నేపథ్యంలో ఆయా మార్గాల్లో వాహనాలు ముందుకు కదల్లేకపోయాయి. ట్రాఫిక్ ఎక్కడికక్కడే స్తంభించి నరకాన్ని తలపించింది.



ఖైరతాబాద్‌లో..

స్కైవాక్‌కు సై

జేఎన్టీయూ మెట్రో వద్ద 700 మీటర్ల పొడవుతో..

- మెట్రో స్టేషన్ నుంచి లూలూ మాల్ వరకు
- ప్రతిపాదనలు సిద్ధం చేసిన హెచ్ఎండీఏ
- ఉప్పల్, మెహిదీపట్నం తరహాలో..
- మెట్రోస్టేషన్ నుంచి ప్రగతినగర్ వైపు ఫుట్‌ఓవర్ బ్రిడ్జి



జేఎన్టీయూ మెట్రో వద్ద నిర్మించతలపెట్టిన స్కైవాక్ ఊహాచిత్రం

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్‌లో మరో స్కైవాక్ అందుబాటులోకి రానుంది. నిత్యం ట్రాఫిక్ రద్దీతో పద్మవ్యూహాన్ని తలపించే కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు జేఎన్టీయూ వద్ద మెట్రోస్టేషన్ నుంచి లూలూ మాల్ వరకు స్కైవాక్ నిర్మాణానికి హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ) ప్రతిపాదనలు సిద్ధం చేసింది. మరోవైపు జేఎన్టీయూ మెట్రో నుంచి ప్రగతినగర్ వైపు ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మించనున్నారు. దీంతో ప్రయాణికులు వివిధ మార్గాల్లో స్కైవాక్ నుంచి రాకపోకలు సాగించేందుకు అవకాశం లభించనుంది.

ఎంతో ప్రయోజనకారి..
- జేఎన్టీయూ నుంచి హైటెక్‌సిటీ వైపు వాహనాలు, ప్రయాణికులు ఎక్కువగా రాకపోకలు సాగుతుంటాయి. బాలానగర్, ప్రగతినగర్, నిజాంపేట్, గాజులరామారం తదితర ప్రాంతాల నుంచి హైటెక్ సిటీ వైపు వాహనాల రాకపోకలు ఎక్కువగా ఉంటాయి. దీంతో పాదచారులు జేఎన్టీయూ వద్ద రోడ్డు దాటడం చాలా కష్టం. మరోవైపు మెట్రో ప్రయాణికులకు కూడా నడక నరకప్రాయంగా ఉంటుంది. కొద్దిపాటి వర్షం వస్తే చాలు ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోతాయి. కాలినడకన వెళ్లేవాళ్లు, సిటీబస్సులు, మెట్రో ప్రయాణికులు అడుగు తీసి అడుగు వేయడం ఎంతో కష్టం. ఈ క్రమంలో జేఎన్టీయూ మెట్రో నుంచి లూలూమాల్ వరకు సుమారు 700 మీటర్ల పొడవున స్కైవాక్ నిర్మించడం వల్ల ప్రయాణికులకు భారీ ఊరట లభించనుంది.
- అలాగే మెట్రో నుంచి నేరుగా ప్రగతినగర్ వైపు వెళ్లేందుకు ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించనున్నారు. ఈ మేరకు హెచ్ఎండీఏ అనుబంధ హైదరాబాద్ యూనిఫైడ్ మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ (హుమ్టా) జేఎన్టీయూ మెట్రో పరిసర ప్రాంతాల్లో వాహనాల రద్దీ, పాదచారుల రాకపోకలపైన సమగ్రమైన అధ్యయనం చేసి స్కైవాక్, ఫుట్‌ఓవర్ బ్రిడ్జిల నిర్మాణాన్ని పరిష్కారంగా భావిస్తూ నివేదికను రూపొందించింది. ఈ మేరకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

రూ.30 కోట్లకు పైగా వ్యయం..
జేఎన్టీయూ స్కైవాక్ నిర్మాణానికి సుమారు రూ.30 కోట్లకు పైగా ఖర్చు కానున్నట్లు అంచనా. నగరంలో మొటమొదట ఉప్పల్ రింగ్ రోడ్డు వద్ద స్కైవాక్ నిర్మించిన సంగతి తెలిసిందే. సుమారు రూ.25 కోట్లతో 660 మీటర్ల పొడువున ఉప్పల్ రింగ్‌రోడ్డులో ప్రయాణికులు అన్ని వైపులకు రాకపోకలు సాగించే విధంగా ఆకాశ మార్గం నిర్మించారు. లిఫ్టులు, ఎస్కలేటర్లను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం 550 మీటర్ల పొడవున మెహిదీపట్నం కూడలిలో మరో స్కైవాక్‌ను హెచ్ఎండీఏ నిర్మిస్తోంది. త్వరలోనే వినియోగంలోకి తీసుకురానున్నట్లు అధికారులు చెప్పారు. కూకట్‌పల్లి జేఎన్టీయూ వద్ద నిర్మించతలపెట్టిన స్కైవాక్ సుమారు 700 మీటర్ల వరకు ఉంటుంది. మెట్రోస్టేషన్ నుంచి ప్రగతినగర్ వైపు ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి కూడా ప్రతిపాదనలు ఉన్నాయి.

దొడ్డి కొమురయ్యకు ఘన నివాళి



కొమురయ్య చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్

లక్డీకాపూల్: తెలంగాణ సాయుధ పోరాటంలో తొలి అమరుడు దొడ్డి కొమురయ్య అని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ అన్నారు. దొడ్డి కొమురయ్య వర్ధంతిని పురస్కరించుకొని శుక్రవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ... భూమికోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం దొడ్డి కొమురయ్య చేసిన పోరాటం మరువలేనిదని కొనియాడారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు అనురాగ్ జయంతి, రఘు ప్రసాద్, గీతా రాధిక, వేణుగోపాల్, సీఈ రత్నాకర్, చీఫ్ అకౌంట్ ఎగ్జామినర్ వెంకటేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మొహర్రం ఊరేగింపునకు పటిష్ట బందోబస్తు

నగర కొత్వాల్ సీవీ ఆనంద్



డబీర్‌పురా బీబీ కా అలావాలో ఆలంలకు దట్టీలు సమర్పిస్తున్న సీవీ ఆనంద్ తదితరులు

చార్మినార్: మొహర్రం సంతాప దినాలను పురస్కరించుకొని నగరంలో పటిష్టమైన భద్రత చర్యలు తీసుకోనున్నట్లు నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ తెలిపారు. మొహర్రం 8వ రోజు సందర్భంగా దార్-ఉల్-షిఫా, డబీర్‌పురాలోని బీబీ కా అలావాను శుక్రవారం సందర్శించి పూలు, దట్టీలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 9, 10వ మొహర్రం రోజుల్లో భారీ సంఖ్యలో ప్రజలు సందర్శించే అవకాశం ఉన్నందున, ముందస్తు చర్యల్లో భాగంగా 3వేల మంది పోలీసులతో ఊరేగింపు శాంతియుత వాతావరణంలో జరిగేలా బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం పదో మొహర్రం సందర్భంగా పాతబస్తీ ప్రధాన వీధుల్లో ఊరేగించే బీబీ కా ఆలం సామూహిక ఊరేగింపు రూట్‌ను ఆయన దక్షిణ మండలం డీసీపీ స్నేహ మెహ్రా, ట్రాఫిక్ డీసీపీ వెంకటేశ్వర్లు ఇతర అధికారులతో కలిసి పరిశీలించారు.

అంటువ్యాధుల నివారణకు చర్యలు తీసుకోండి



వైద్యారోగ్య అనుబంధ శాఖల వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న కమిషనర్ కర్ణన్

జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్

లక్డీకాపూల్: అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ అధికారులకు సూచించారు. శుక్రవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో వైద్యారోగ్య, అనుబంధ శాఖల అధికారులతో సీజనల్ వ్యాధులపై నిర్వహించిన వర్క్‌షాప్‌లో కమిషనర్ మాట్లాడారు. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరముందన్నారు. వైద్యాధికారి పద్మజ మాట్లాడుతూ.. అర్బన్ మలేరియా కింద ఫీవర్ సర్వే, ఏఎల్ఓ, ఫాగింగ్ కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టినట్లు వివరించారు. 150 వార్డుల్లో ఫాగింగ్ ప్రక్రియను వారం రోజుల్లో పూర్తి చేస్తామన్నారు. వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకన్న మాట్లాడుతూ.. నగరంలో ప్రతి యేటా సెప్టెంబర్ మాసంలో ఎక్కువగా డెంగీ కేసులు నమోదవుతున్నందున యాంటీ లార్వా ప్రోగ్రాంను ముమ్మరం చేయాలన్నారు. సమావేశంలో జోనల్ కమిషనర్లు అనురాగ్ జయంతి, అపూర్వ చౌహాన్, హేమంత్ సహదేవ్ రావు, అడిషనల్ కమిషనర్లు రఘు ప్రసాద్, సుభద్ర, డాక్టర్ ఉమా తదితరులు పాల్గొన్నారు.

స్వయం సహాయక సంఘాలకు రుణ సదుపాయం కల్పించాలి

అర్హత కలిగిన ప్రతి మహిళనూ స్వయం సహాయక సంఘంలో చేర్పించాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్వయం సహాయక సంఘాల ప్రగతిపై ప్రాజెక్ట్ ఆఫీసర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మహిళా సంఘాలకు విడతల వారీగా బ్యాంక్ లింకేజీ రుణ సదుపాయం కల్పించాలన్నారు. సమావేశంలో అడిషనల్ కమిషనర్ పంకజ, ప్రాజెక్ట్ ఆఫీసర్లు ఎం.దేవేందర్ రెడ్డి, పి.సురేష్ కుమార్ పాల్గొన్నారు.

గణేశ్ నిమజ్జనాలకు రెడీమేడ్ పాండ్స్

సాక్షి, సిటీబ్యూరో: రాబోయే వినాయక చవితి సందర్భంగా నిమజ్జనాల కోసం జీహెచ్ఎంసీ ఇప్పటి నుంచే దృష్టి సారించింది. ప్రజలు ఇళ్లలో ఏర్పాటు చేసుకునే విగ్రహాలను స్థానికంగా ఎక్కడికక్కడే నిమజ్జనాలు చేసేందుకు వీలుగా పోర్టబుల్ (రెడీమేడ్) పాండ్స్ సరఫరా కోసం సంబంధిత ఏజెన్సీల నుంచి ఆసక్తి వ్యక్తీకరణలను ఆహ్వానిస్తోంది. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ (పీఓపీ)తో చేసిన వినాయక విగ్రహాలను హుస్సేన్‌సాగర్‌తో పాటు నగరంలోని చెరువుల్లో నిమజ్జనం చేయరాదని హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో.. ఎక్కడివి అక్కడే నిమజ్జనం చేసేందుకు చిన్న విగ్రహాల కోసం ఇండస్ట్రియల్ గ్రేడ్ పీవీసీతో తయారు చేసిన పోర్టబుల్ పాండ్స్‌ను వినియోగించనున్నారు. పెద్ద విగ్రహాల నిమజ్జనాల కోసం తాత్కాలిక చెరువుల్ని ఏర్పాటు చేస్తున్నారు. గతంలో వినాయక ఉత్సవాలు ప్రారంభమయ్యాక పోర్టబుల్ పాండ్స్‌పై దృష్టించేవారు. ఈసారి మాత్రం ముందస్తుగానే అందుకు సిద్ధమయ్యారు. ప్రస్తుతానికి సికింద్రాబాద్ జోన్‌కు సంబంధించి 20 మీటర్ల పొడవు, 10 మీటర్ల వెడల్పు, 1.32 మీటర్ల లోతుతో ఉండే పోర్టబుల్‌పాండ్స్ తయారీ, ఏర్పాటు చేసేందుకు ఆసక్తికర వ్యక్తీకరణల నోటిఫికేషన్ వెలువరించారు. వీటిని కేవలం మూడు మీటర్ల కంటే తక్కువ ఎత్తు ఉంటే చిన్న విగ్రహాల నిమజ్జనం కోసమేనని, ఇళ్లలోని విగ్రహాలను ప్రజలు స్థానికంగా నిమజ్జనాలు చేసేందుకు వీలుగా వీటిని ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. జోన్ పరిధిలో యాభై ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వీటిని సరఫరా చేసేందుకు ముందుకొచ్చే ఏజెన్సీలే జీహెచ్ఎంసీ అధికారులు సూచించిన ప్రాంతాల్లో వాటిని అమర్చాలి. ఏర్పాటు చేశాక ఏవైనా అవాంతరాలు ఏర్పడితే వెంటనే బాగుచేసేందుకు వీలుగా ఐదారుగురు కార్మికులతో పాటు ప్రాజెక్ట్ హెడ్, ఎగ్జిక్యూటివ్‌లు నిమజ్జనాలు ముగిసేంత దాకా వాటిని ఏర్పాటు చేసిన ప్రాంతాల్లోనే అందుబాటులో ఉండాలి. మొత్తం కార్యక్రమం ముగిశాక, తిరిగి వాటిని వినియోగించేందుకు వీలుగా ప్యాకింగ్ చేసే బాధ్యత కూడా ఏజెన్సీలదేనని ఆసక్తి వ్యక్తీకరణ నోటిఫికేషన్‌లో స్పష్టం చేశారు. మిగతా జోన్లకు కూడా త్వరలోనే టెండర్లు పిలవనున్నట్లు తెలిసింది.



ఏర్పాట్లలో నిమగ్నమైన జీహెచ్ఎంసీ

'సెకండ్ హ్యాండ్' సో బెటరూ!

హైదరాబాద్ రహదారులపై ఢిల్లీ బండ్లు రయ్ రయ్

- అక్కడ కాల పరిమితి ముగిసిన వాహనాలకు ఇక్కడ గిరాకీ
- నగరానికి తరలించి విక్రయిస్తున్న ఏజెంట్లు



సాక్షి, సిటీబ్యూరో: ఢిల్లీ బండ్లు హైదరాబాద్ రోడ్లపై పరుగులు తీస్తున్నాయి. అక్కడ కాలపరిమితి ముగిసిన వాహనాలు నగరంలో జోరుగా అమ్ముడవుతున్నాయి. తక్కువ ధరల్లో లభిస్తుండటంతో నగరవాసులు వెనుకడుగు వేయకుండా కొనుగోలు చేస్తున్నారు. సెకండ్ హ్యాండ్ వాహనాలే అయినప్పటికీ కండీషన్ బాగా ఉన్నవి కొనుగోలుదారులను ఆకట్టుకుంటున్నాయి. సెకండ్ హ్యాండ్ వాహనాల దందా ఏజెంట్‌లకు లాభసాటిగా మారింది.

తక్కువ ధరలకు లభిస్తుండటంతో..
- ఇటీవల ఢిల్లీ సర్కారు పెట్రోల్, డీజిల్ వాహనాలపై ఆంక్షలను కఠినతరం చేసింది. కొద్ది రోజుల క్రితమే ఈ వాహనాలకు పెట్రోల్ బంకుల్లో 'నో పెట్రోల్, నో డీజిల్' అంటూ నిబంధనలు విధించింది. ప్రస్తుతం కొన్ని సాంకేతిక కారణాలతో ఈ నిబంధనను వాయిదా వేసినప్పటికీ ఢిల్లీలో వాహన కాలుష్యం ప్రమాదకర స్థాయికి చేరినందువల్ల పెట్రోల్, డీజిల్ వాహనాల వినియోగం ప్రశ్నార్థకంగా మారింది. దీంతో ఈ వాహనాలకు హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాల్లో డిమాండ్ ఏర్పడింది.
- మరోవైపు తక్కువ ధరలకు లభిస్తుండటంతో చాలామంది ఆసక్తి చూపుతున్నారు. కానీ ఈ క్రమంలో కొందరు ఏజెంట్‌లు సెకండ్ హ్యాండ్ వాహనాల ముసుగులో ఊరూపేరూ లేని వాహనాలను విక్రయించి భారీఎత్తున సొమ్ము చేసుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఎలాంటి డాక్యుమెంట్‌లు, ఆధారాలు లేని వాహనాలకు సైతం నగరంలోని కొన్ని ఆర్టీఏ కార్యాలయాల్లో తప్పుడు అడ్రస్‌లపై రిజిస్ట్రేషన్‌ల పునరుద్ధరణ జరుగుతోంది. దీంతో అటు ఏజెంట్‌లకు, ఇటు కొందరు ఆర్టీఏ అధికారులకు 'సెకండ్‌హ్యాండ్ బండి ఒక దందా'గా మారిందనే ఆరోపణలు ఉన్నాయి.

డాక్యుమెంట్లు ఉంటే ఓకే..
- ఒక రాష్ట్రంలో నమోదైన వాహనాలను మరో రాష్ట్రానికి తరలించేందుకు తప్పనిసరిగా రవాణాశాఖ అనుమతి అవసరం. వాహనాల రిజిస్ట్రేషన్ పత్రాలు, బీమా పత్రాలు, వాహన యజమాని చిరునామా ఉన్న వాటినే కొనుగోలు చేయాలి. అలా అన్ని డాక్యుమెంట్‌లు ఉన్నవాటికి మాత్రమే రవాణా అధికారులు నిరభ్యంతర పత్రం (ఎన్ఓసీ) అందజేస్తారు.దీంతో ఆ వాహనాన్ని ఎక్కడైనా విక్రయించవచ్చు. కానీ కొందరు ఏజెంట్‌లు ఎలాంటి ఎన్ఓసీలు లేకుండా దొంగబండ్లను హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. ఇలాంటి వాహనాలపై గతంలో పోలీసులు పలు కేసులు నమోదు చేసి నిందితుల పైన చట్టపరమైన చర్యలు సైతం తీసుకున్నారు.
- తాజాగా 15 ఏళ్లు ముగిసిన పెట్రోల్ వాహనాలు, 10 ఏళ్లు ముగిసిన డీజిల్ వాహనాలపై ఢిల్లీ రవాణాశాఖ ఆంక్షలను విధించింది. ప్రస్తుతానికి ఈ ఆంక్షలను సడలించారు. ఇలాంటి వాహనాల వినియోగాన్ని మాత్రం ప్రభుత్వం నిరుత్సాహపరుస్తోంది. దీంతో చాలామంది వాహన యజమానులు వాటిని తక్కువ ధరలకు విక్రయిస్తున్నారు. ఈ క్రమంలోనే ఢిల్లీ బండ్లకు హైదరాబాద్‌లో మరోసారి గిరాకీ నెలకొంది. ఈ ముసుగులో కొందరు ఏజెంట్‌లు ఎలాంటి ఆధారాలు లేని వాహనాల విక్రయాలకు పాల్పడడం గమనార్హం.

'వాహన్'లో నమోదు తప్పనిసరి..
గ్రేటర్ హైదరాబాద్‌లోని వివిధ ప్రాంతీయ రవాణా కార్యాలయాల్లో ప్రతి రోజు సుమారు 3000లకు పైగా వాహనాలు కొత్తగా నమోదవుతాయి. వాటిలో 600 నుంచి 800 వరకు ఇతర రాష్ట్రాలకు చెందిన సెకండ్ హ్యాండ్ వాహనాలే ఉన్నాయి. ప్రత్యేకించి సెకండ్ హ్యాండ్ కేటగిరీలో వ్యక్తిగత కార్ల కొనుగోళ్లు ఎక్కువ. ఈ కేటగిరీలో 70 శాతం కార్లు ఢిల్లీకి చెందినవే ఉన్నట్లు అంచనా. నగరంలో 15 ఏళ్లు దాటిన వ్యక్తిగత వాహనాల కాలపరిమితిని ప్రతి సంవత్సరం పొడిగించుకొనే అవకాశం ఉంది. ఈ వెసులుబాటును దృష్టిలో ఉంచుకొని 5 నుంచి 10 ఏళ్ల లోపు కాల పరిమితి కలిగిన ఢిల్లీ వాహనాలను ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. ఎలాంటి వాహనాలైనా కేంద్ర ప్రభుత్వం రూపొందించిన 'వాహన్' వెబ్‌సైట్‌లో నమోదై ఉంటేనే కొనుగోలు చేయాలని అధికారులు సూచిస్తున్నారు.

ఆన్‌లైన్‌లో ఆస్తిపన్ను సేవలు



సాక్షి, సిటీబ్యూరో: ఆస్తిపన్నుకు సంబంధించి ప్రజల సౌకర్యార్థం కొన్ని సదుపాయాలను జీహెచ్ఎంసీ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తెచ్చినట్లు అడిషనల్ కమిషనర్ (రెవెన్యూ, ఐటీ) అనురాగ్ జయంతి పేర్కొన్నారు. అవి ఇలా ఉన్నాయి.. ప్రాపర్టీ ట్యాక్స్ అసెస్‌మెంట్ రివిజన్, వేకెన్సీ రెమిషన్, యజమాని పేరు కరెక్షన్, డోర్ నెంబర్ కరెక్షన్, అసెస్‌మెంట్ మినహాయింపు, ప్రాపర్టీ టాక్స్ సెల్ఫ్ అసెస్‌మెంట్. ప్రజలు ఈ సదుపాయాలను వినియోగించుకోవాలని అనురాగ్ జయంతి శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు.

నగరంలో నేడు

- బంజారాహిల్స్ రోడ్ నెంబరు.1లోని జీవీకే ఎదురుగా ఉన్న హోటల్ హయత్ ప్లేస్‌లో ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఆకృతి ఆధ్వర్యంలో లైఫ్ స్టైల్ ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుంది.
- గచ్చిబౌలిలోని శరత్‌చంద్ర గార్డెన్‌లో ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఎగ్జిబిషన్ జరుగుతుంది.
- శ్రీనగర్ కాలనీలోని శ్రీ సత్యసాయి నిగమాగమంలో ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకు న్యూ క్రాఫ్ట్స్ సిల్క్ ఇండియా ఎగ్జిబిషన్ కమ్ సేల్ ఉంది.
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో డిజిటల్ ఆర్ట్, పెయింటింగ్ ఎగ్జిబిషన్ ఉదయం 10.30 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళా శక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

'సీఎం మా గల్లీలోనే ఉంటాడు..నీ అంతు చూస్తా'

- జూబ్లీహిల్స్ క్లబ్ జీఎంకు బెదిరింపులు
- క్లబ్ మాజీ సభ్యుడిపై కేసు నమోదు

బంజారాహిల్స్: 'ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మా గల్లీలోనే ఉంటాడు..మీ అంతుచూస్తా..రివాల్వర్ తెచ్చి కాల్చి పడేస్తా..' అంటూ ఫోన్‌లో బెదిరించడమే కాకుండా ముఖ్యమంత్రి ఇంటి నుంచి మాట్లాడుతున్నానంటూ ఫోన్ చేసి హెచ్చరించిన ఘటనలో ఓ వ్యక్తిపై జూబ్లీహిల్స్ క్రిమినల్ కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే..జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ సెంటర్ (జూబ్లీహిల్స్ క్లబ్)లో సభ్యుడిగా ఉన్న జ్యోతిప్రసాద్ కొసరాజును ప్రవర్తన సరిగాలేని కారణంగా గత మార్చి 12వ తేదీన క్లబ్ సభ్యత్వం నుంచి తొలగించారు. ఈ వ్యవహారం కోర్టు దాకా వెళ్లగా ప్రస్తుతం విచారణ దశలో పెండింగ్‌లో ఉంది. జూన్ 23వ తేదీన సాయంత్రం జ్యోతిప్రసాద్ జూబ్లీహిల్స్ క్లబ్ జనరల్ మేనేజర్ జగదీశ్వర్‌రెడ్డికి ఫోన్ చేసి తాను క్లబ్‌కు వస్తున్నానని, తప్పనిసరిగా లోపలికి అనుమతించాలని బెదిరించాడు. అయితే క్లబ్ నిబంధనల ప్రకారం సస్పెన్షన్‌కు గురైన సభ్యుడిని లోనికి అనుమతించడం కుదరదని చెప్పాడు. దీంతో కొద్దిసేపటి తర్వాత జ్యోతిప్రసాద్ క్లబ్ వద్దకు వచ్చి సెక్యూరిటీగార్డులను బెదిరిస్తూ..కేకలు వేస్తూ జీఎం జగదీశ్వర్‌రెడ్డిని అసభ్య పదజాలంతో దూషించాడు. అంతుచూస్తానంటూ బెదిరించాడు. రివాల్వర్‌తో కాల్చిపడేస్తానంటూ హెచ్చరించాడు. తాను సీఎం రేవంత్‌రెడ్డి నివాసం ఉండే గల్లీలోనే ఉంటానని మరింతగా బెదరగొట్టాడు. అంతేకాకుండా అదేరోజు సాయంత్రం 6.54 గంటల సమయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇంటి నుంచి ఫోన్ చేస్తున్నామని, జ్యోతిప్రసాద్‌కు క్లబ్‌లోకి ఎంట్రీ ఇవ్వాలని ఫోన్ చేశారు. తరచూ సీఎం ఇంటి నుంచి ఫోన్ చేస్తున్నామంటూ జీఎంకు కాల్స్ వచ్చాయి. ఇవన్నీ జీఎం కాల్ రికార్డ్ చేశారు. సరిగ్గా 20 నిమిషాల తర్వాత స్వయంగా జ్యోతిప్రసాద్ ఫోన్ చేసి తనను క్లబ్‌లోకి ఎంట్రీ ఇవ్వాలని, సీఎం ఇంటి నుంచి ఫోన్ వచ్చింది కదా? అంటూ చెప్పాడు. అంతకుముందు చేసిన ఫోన్ కాల్స్ వాయిస్‌తో పాటు జ్యోతిప్రసాద్ వాయిస్ కూడా ఒక్కటే కావడంతో సీఎం ఇంటిని వాడుకుని దురుద్దేశపూర్వకంగా తమను బెదిరించిన వ్యవహారంలో నిందితుడిపై కేసు నమోదు చేయాల్సిందిగా జీఎం ఫిర్యాదు చేశారు. దీంతో జూబ్లీహిల్స్ పోలీసులు క్లబ్ మాజీ సభ్యుడు జ్యోతిప్రసాద్ కొసరాజుపై బీఎన్ఎస్ సెక్షన్ 351 (2) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ట్రాఫిక్ మళ్లించినా తప్పని తిప్పలు!

- అనేక ప్రాంతాల్లో నిలిచిపోయిన వాహనాలు
- ఇబ్బందులు ఎదుర్కొన్న వాహనచోదకులు

సాక్షి, సిటీబ్యూరో: లక్డీకాపూల్ చౌరస్తాలో మాజీ సీఎం రోశయ్య విగ్రహావిష్కరణ, ఎల్బీ స్టేడియంలో టీపీసీసీ సమావేశం...వెరసి శుక్రవారం వాహనచోదకులకు ట్రాఫిక్ కష్టాలు తప్పలేదు. సీఎం రేవంత్‌రెడ్డితో పాటు ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే పాల్గొన్న కారణంగా అనేక బందోబస్తు, భద్రత ఏర్పాట్లు చేసిన పోలీసులు మధ్యాహ్నం 1 నుంచి రాత్రి 8 వరకు స్టేడియం కేంద్రంగా ట్రాఫిక్ మళ్లింపులు విధించారు. వీటికి సంబంధించి ముందు నుంచే మీడియా, సోషల్‌మీడియా ద్వారా ప్రచారం చేశారు. అయినప్పటికీ ట్రాఫిక్ తిప్పలు తప్పలేదు. శుక్రవారం ఉదయం రోశయ్య విగ్రహావిష్కరణ కారణంగా అనేక మార్గాల్లో ట్రాఫిక్ ఆగిపోయింది. మళ్లింపులు లేని రూట్లపై వాహనాల రద్దీ పెరగడంతో అక్కడా ట్రాఫిక్ జామ్స్ తప్పలేదు. మధ్యాహ్నం నుంచి ఎల్బీస్టేడియంలో మీటింగ్‌కు వచ్చే వారి వాహనాలు, బస్సుల కారణంగా ట్రాఫిక్ జామ్స్ తప్పలేదు. స్టేడియం చుట్టూ ఉన్న లిబర్టీ, బషీర్‌బాగ్, హిమాయత్‌నగర్, అబిడ్స్, నాంపల్లి మార్గాల నుంచి పెద్ద ఎత్తున వాహనాలు రావడంతో వాహనాలు ఎక్కడిక్కడ నిలిచిపోయాయి. నగరం నడిబొడ్డున ఉన్న లక్డీకాపూల్, ఎల్బీ స్టేడియం, అబిడ్స్, నాంపల్లి తదితర ప్రాంతాల్లో ఈ కార్యక్రమాలు జరగడంతో ఇబ్బందులు మరింత పెరిగాయి. మధ్యాహ్నం 12 గంటల తర్వాత పోలీసులు స్టేడియం చుట్టూ ఉన్న మార్గాల్లో బారికేడ్లు ఏర్పాటు చేయడం మొదలెట్టారు. దీంతో ఆ సమయంలో అక్కడ ఉన్న వాహనాలు ముందుకు సాగడం కొద్దిగా ఇబ్బందికరంగా మారింది. దీనికి తోడు ఈ కార్యక్రమానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పార్టీ శ్రేణులు హాజరయ్యాయి. వీరిని తీసుకువచ్చే వాహనాలను ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేశారు. సాంకేతికంగా ఇబ్బందులు రాకుండా ఏ వైపు నుంచి నగరంలోకి వచ్చే వాహనాలకు ఆ దిశలోని వీటిని కేటాయించారు. అయినప్పటికీ కొన్ని వాహనాలు స్టేడియం సమీపంలోకి వచ్చాయి. వీటి నుంచి దిగిన వాళ్లు స్టేడియంలోకి చేరుకోవడం తదితర కార్యకలాపాల వల్లా ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడ్డాయి. స్టేడియం చుట్టూ ఉన్న ప్రాంతాల్లోనే అనేక ప్రభుత్వ, ప్రైవేట్, కార్పొరేట్ కార్యాలయాలు, పాఠశాలలు ఉన్నాయి. వీటికి వచ్చిపోయే సందర్శకులు, ఉద్యోగులు, విద్యార్థులతో పాటు ఆయా మార్గాల్లో ప్రయాణించే సాధారణ వాహనచోదకులు సైతం ట్రాఫిక్‌లో చిక్కుకుని ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మరోపక్క ముఖ్యమంత్రి సహా ఇతర ప్రముఖుల రాకపోకలు సజావుగా సాగడానికి కొన్ని ప్రాంతాల్లో సాధారణ ట్రాఫిక్‌ను కొద్దిసేపు ఆపాల్సి వచ్చింది. ఈ రాకపోకల నేపథ్యంలో శంషాబాద్, మెహదీపట్నం, మాసబ్‌ట్యాంక్, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, పంజగుట్ట, ఖైరతాబాద్, లక్డీకాపూల్‌లోని ప్రధాన మార్గాలతో పాటు అనుబంధ రూట్లు, పీవీ నర్సింహ్మారావు ఎక్స్‌ప్రెస్ వేలపై వాహనాలు ఆగిపోయాయి. మొత్తమ్మీద శుక్రవారం పశ్చిమ, మధ్య మండలాలతో పాటు అనేక ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్స్ తప్పలేదు.


మసాబ్‌ట్యాంక్‌లో నిలిచిన వాహనాలు

ఇలాచీల దొంగ అరెస్టు

సనత్‌నగర్: నగలు, నగదు దొంగలించేవారిని చూశాం..మొబైల్స్‌ను తస్కరించిన వారిని చూశాం. ఆఖరికి కేబుళ్లను చోరీ చేసిన వారినీ చూశాం. కానీ ఓ దొంగ విచిత్రంగా ఇలాచీలు (యాలకులు) దొంగిలించడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. ఇదేమిటని పోలీసులు ప్రశ్నిస్తే ఇలాచీలు విలువైనవే కదా అంటూ సమాధానమివ్వడం గమనార్హం. సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఈ సంఘటన వివరాలను ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు తెలిపిన ప్రకారం..సనత్‌నగర్‌లోని డీమార్ట్ షోరూంలో ఇటీవల 100 గ్రాముల ఇలాచీ ప్యాకెట్లు మాయమవుతున్నట్లు సిబ్బంది గుర్తించారు. ఓ రోజు సీసీ ఫుటేజీని తనిఖీ చేయగా ఓ వ్యక్తి ఇలాచీ ప్యాకెట్లను తీసుకుని వాష్‌రూమ్‌లోకి వెళ్లి లో దుస్తుల్లో దాచుకుని వెళ్తున్నట్లు వెల్లడైంది. అదే రోజు సాయంత్రం మళ్లీ సదరు వ్యక్తి షోరూంకు వచ్చి ఇలాచీ ప్యాకెట్లు ఉన్న చోటికి వెళ్లి మరో రెండు 100 గ్రాముల ఇలాచీ ప్యాకెట్లను తీసుకుని లో దుస్తుల్లో దాచుకున్నాడు. అతను తిరిగి వెళ్లిపోతుండగా సిబ్బంది పట్టుకుని సనత్‌నగర్ పోలీసులకు అప్పగించారు. పోలీసుల విచారణలో తన పేరు దీపక్ అని, క్యాటరింగ్ పనులు చేస్తుంటానని వెల్లడించారు. ఇలాచీలు ఖరీదు ఎక్కువని చోరీకి పాల్పడుతున్నట్లు తెలిపాడు. ఇప్పటివరకు పలుమార్లు షోరూంకు వచ్చి 100 గ్రాముల చొప్పున ప్యాక్ చేసి ఉన్న 22 ప్యాకెట్లను తస్కరించినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. నిందితుడిని దీపక్‌కుమార్‌ను అరెస్టు చేసి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

లండన్ పారిపోతున్న మోసగాడి అరెస్టు

ఫిలింనగర్: విదేశాల్లో ఉద్యోగాల పేరుతో అమాయక నిరుద్యోగుల నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేసిన మోసగాడు..పోలీసుల కళ్లుగప్పి ఢిల్లీ నుంచి లండన్ పారిపోతుండగా ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లో ఫిలింనగర్ పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే..షేక్‌పేట ద్వారకానగర్‌లో దొడ్డిపల్లి శ్రీనాథ్ అనే వ్యక్తి కిరీటి ఓవర్సీస్ కన్సల్టెన్సీ పేరుతో ఓ సంస్థను ఏర్పాటుచేశాడు. వివిధ దేశాల్లో ఉద్యోగాలు కల్పిస్తామంటూ చాలా మంది నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేశాడు. జువ్వల జార్జి మల్లార్‌బాబు అనే యువకుడు కూడా ఈ కన్సల్టెన్సీని సంప్రదించగా జార్జియా దేశంలో ఉద్యోగం ఇప్పిస్తానంటూ రూ.5 లక్షలు వసూలు చేశాడు. తీరా బాధితుడు జార్జియా వెళ్లగా అక్కడ ఎలాంటి ఉద్యోగం లేకపోగా అక్కడ దిగిన గంట సేపటికే ఎయిర్‌పోర్ట్ అధికారులు తిరిగి ఇండియాకు పంపించారు. ఈ విషయంపై శ్రీనాథ్‌ను బాధితుడు నిలదీయగా పొంతన లేని సమాధానాలతో దాటవేయడమే కాకుండా కార్యాలయాన్ని కూడా ఎత్తేశాడు. తాను మోసపోయానని తెలుసుకుని గత ఏడాది మార్చి 6వ తేదీన బాధితుడు మల్లార్‌బాబు ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు శ్రీనాథ్‌పై ఐపీసీ సెక్షన్ 420, 406 కింద చీటింగ్ కేసు నమోదు చేసి అరెస్టు చేసేందుకు యత్నించగా పోలీసుల కళ్లగప్పి పరారయ్యాడు. దీంతో ఫిలింనగర్ పోలీసులు అన్ని ఎయిర్‌పోర్ట్‌లకు నిందితుడిపై లుక్‌అవుట్ నోటీసులు జారీ చేశారు. చీటర్ శ్రీనాథ్ గురువారం రాత్రి ఢిల్లీ నుంచి లండన్‌కు విమానంలో పరారయ్యేందుకు ఎయిర్‌పోర్ట్‌కు వెళ్లగా లుక్‌అవుట్ నోటీసు ఉన్న కారణంగా ఎయిర్‌పోర్ట్ అధికారులు నిందితుడిని అక్కడి పోలీసులకు అప్పగించారు. ఢిల్లీ పోలీసులు ఇచ్చిన సమాచారంతో ఫిలింనగర్ పోలీసులు శుక్రవారం నిందితుడిని అరెస్టు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ముగ్గురు సైబర్ నేరగాళ్లకు అరదండాలు

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో నమోదైన వేర్వేరు కేసుల్లో నిందితులుగా ఉన్న ముగ్గురు సైబర్ నేరగాళ్లను పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. నగరానికి చెందిన ఓ ప్రైవేట్ ఉద్యోగికి వాట్సాప్ ద్వారా ఎర వేసిన సైబర్ నేరగాళ్లు భారీ లాభాలు వచ్చే ట్రేడింగ్ అంటూ నమ్మించారు. ఆపై అయన నుంచి రూ.67.60 లక్షలు కాజేసి మోసం చేశారు. ఈ కేసు దర్యాప్తు చేసిన అధికారులు ఈ మొత్తంలో కొంత గుజరాత్‌కు చెందిన హార్దిక్ కుమార్ పేరుతో ఉన్న ఖాతాలోకి వెళ్లినట్లు గుర్తించారు. అక్కడకు వెళ్లిన బృందం అతడిని అదుపులోకి తీసుకుని విచారించింది. ప్రైవేట్ ఉద్యోగి అయిన ఇతగాడు స్క్రాప్ వ్యాపారి దేవ్‌రాజ్ భాయ్ కోరడంతో తన పేరుతో తెరిచిన బ్యాంకు ఖాతా వివరాలు అందించినట్లు వెలుగులోకి వచ్చింది. దీని ద్వారా జరిగే లావాదేవీలపై కమీషన్ పొందుతున్నాడని తేలింది. దీంతో పోలీసులు దేవ్‌రాజ్‌ను అరెస్టు చేశారు. వీరి నుంచి రెండు సెల్‌ఫోన్లు, రూ.లక్ష నగదు స్వాధీనం చేసుకున్నారు. ఇదే రకమైన మరో మోసంలో నగరవాసి నుంచి రూ.6.16 లక్షలు కాజేసిన కేసులో అకౌంట్ హోల్డర్‌గా ఉన్న ఉత్తరాఖండ్ వాసి మనీష్ కుమార్ శర్మనూ పోలీసులు పట్టుకున్నారు.

నగరవాసికి రాయలసీమ యూనివర్సిటీ డాక్టరేట్

సాక్షి, సిటీబ్యూరో: రాయలసీమ యూనివర్సిటీ మేనేజ్‌మెంట్ విభాగంలో 'ఇంపాక్ట్ ఆఫ్ ఈ- కామర్స్ ఆన్ కన్స్యూమర్ డెసిషన్ మేకింగ్ టువార్డ్స్ ది పర్చేజ్ ఆఫ్ ఎలక్ట్రానిక్ గూడ్స్ ఇన్ హైదరాబాద్' అనే అంశంలో చేసిన పరిశోధనకుగాను నగరానికి చెందిన యార్లగడ్డ వెంకట సుజన డాక్టరేట్ పట్టాను పొందారు. కుప్పంలోని స్కూల్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్, ద్రవిడియన్ యూనివర్సిటీ డీన్, ఆచార్యులు జీ.ఎల్.నారాయణప్ప పర్యవేక్షణలో చేసిన పరిశోధనలను గుర్తించి కర్నూలులోని రాయలసీమ యూనివర్సిటీ వై.వి.సుజనకి ఈ డాక్టరేట్ పట్టాను ప్రదానం చేసింది. ఈ సందర్భంగా ఆమె సన్నిహితులు, సహా ఉద్యోగులు ప్రత్యేక అభినందనలు తెలిపారు. యార్లగడ్డ వెంకట సుజన ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్(ఐపీఈ)లో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు.


సుజన

ఫోర్జరీ పత్రాలతో ప్లాట్ రిజిస్ట్రేషన్‌కు యత్నం

నలుగురి అరెస్టు

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ పేరుతో ఫోర్జరీ పత్రాలను సృష్టించి రూ.6 కోట్లకు పైగా విలువైన ప్లాట్ రిజిస్ట్రేషన్‌కు యత్నించిన నలుగురు నిందితులను నార్సింగి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళ్తే..మున్సిపాలిటీ కేంద్రంలోని మార్వా లేఅవుట్‌లో ప్లాట్ నెంబర్ 146ను మార్టిగేజ్ నుంచి విడుదల చేసినట్లుగా మున్సిపల్ కమిషనర్ జారీ చేసిన అథరైజేషన్ లెటర్‌తో సంతోష్ అనే వ్యక్తి జూన్ 17వ తేదీన గండిపేట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్‌కు స్లాట్ బుక్ చేసుకున్నారు. అప్పటికే సదరు ప్లాట్ యజమానురాలు నీరజ అరవింద్ అనే వ్యక్తికి ఇదే సంవత్సరం జనవరి నెలలో అమ్మినట్టు రికార్డులలో చూయిస్తుండటంతో అనుమానం వచ్చిన సబ్‌రిజిస్ట్రార్ మున్సిపల్ కార్యాలయం నుంచి ప్రతినిధిని పిలిపించాడు. ఈ విషయం గమనించిన సంతోష్ అక్కడి నుంచి పరారయ్యాడు. దాంతో విషయాన్ని నార్సింగి మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకుని వెళ్లి ఫోర్జరీ చేసినట్లుగా గుర్తించారు. కమిషనర్‌తో పాటు సబ్‌రిజిస్ట్రార్ నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు నకిలీ పత్రాలను తయారు చేసి మున్సిపల్ కమిషనర్ సంతకాన్ని ఫోర్జరీ చేసిన గులాం మహమ్మద్ ఖాన్, వెంకట్ సత్యనారాయణ, జహీర్ అహ్మద్, శివ నాగేశ్వర్‌రావులను గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇదే విచారణలో శివాని, సంతోష్, వీరబాబు మున్సిపల్ ఉద్యోగుల పేరిట వీరికి సహకరించినట్టు విచారణలో వెలుగులోకి వచ్చిందని నార్సింగి ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డి తెలిపారు.

జైపూర్ విమానంలో సాంకేతిక లోపం

శంషాబాద్: శంషాబాద్ విమానాశ్రయం నుంచి జైపూర్‌కు వెళ్లే విమానంలో సాంకేతిక లోపం తలెత్తడంతో తిరిగి వెనక్కి వచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి. శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి శుక్రవారం ఉదయం 6ఈ -815 విమానం 195 మంది ప్రయాణికులతో జైపూర్ వెళ్లేందుకు టేకాఫ్ తీసుకుని బయలుదేరింది. మార్గమధ్యలో సాంకేతిక లోపం తలెత్తడంతో పైలట్లు శంషాబాద్ ఏటీసీని సంప్రదించింది తిరిగి శంషాబాద్ విమానాశ్రయంలోనే సురక్షితంగా ల్యాండ్ చేశారు. విమానాన్ని రద్దు చేసిన ఎయిర్‌లైన్స్ ప్రయాణికులను ప్రత్యామ్నాయ విమానాల్లో పంపినట్లు వెల్లడించారు.

సెకండ్‌హ్యాండ్ కార్ల అమ్మకం పేరుతో మోసం

పోలీసులకు బాధితుల ఫిర్యాదు

అమీర్‌పేట: సెకండ్ హ్యాండ్ కార్ల అమ్మకం పేరుతో మోసాలకు పాల్పడుతున్న వ్యక్తిపై బాధితులు ఎస్ఆర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుంటూరు జిల్లా నరసరావుపేటకు చెందిన నందా హైటెక్ సిటీలో ఉంటున్నాడు. ఉపాధి లేకపోవడంతో కారు కొని నడపాలని అనుకున్నాడు. ఈ మేరకు బల్కంపేటలో ఉన్న శ్రీ బాలాజీ కార్స్..సెకండ్ సేల్స్ సంస్థను సంప్రదించి..వారి వద్ద రూ.7 లక్షలకు స్విఫ్ట్ డిజైర్ కారు కొన్నాడు. నెల రోజుల తర్వాత వాహనంపై ఫైనాన్స్ ఉందని, ఈఎమ్ఐ కట్ట లేదని మార్చి నెలలో ఫైనాన్స్ కంపెనీ నిర్వాహకులు కారు తీసుకు వెళ్లారు. దీంతో కారు విక్రయించిన బాలాజీ కార్స్ యజమాని వద్దకు వచ్చి జరిగిన విషయాన్ని తెలిపాడు. నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో పాటు ఎవరికి చెబుతావో చెప్పుకో అంటూ మాట్లాడాడని బాధితుడు తెలిపాడు. నెల రోజుల క్రితం పోలీసులకు ఫిర్యాదు చేయగా ఇప్పటి వరకు మోసానికి పాల్పడ్డ వ్యక్తిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని అన్నాడు.

మరో బాధితుడు..

బాలాజీ కార్స్ నిర్వాహకుడికి రూ.1.8 లక్షలు చెల్లించి స్విఫ్ట్ కారు తీసుకున్నానని సాగర్ అనే మరో యువకుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మిగతా డబ్బు మొత్తాన్ని ఫైనాన్స్ చేయించి కారును తన పేరుపై మార్చుతానని చెప్పడంతో కారు తీసుకుని వెళ్లానని తెలిపాడు. ఫైనాన్స్ ఇప్పించకపోవడంతో రూ.5.50 లక్షలు చెల్లించానని, నెల రోజుల తర్వాత పంజగుట్టలో ఉన్న తన వద్దకు కొందరు వ్యక్తులు వచ్చి కారు తమ పేరుపై ఉందంటూ తీసుకెళ్లేందుకు ప్రయత్నించారని, వారికి కారు ఇవ్వక పోవడంతో ఎస్ఆర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసి కారు తీసుకువెళ్లారని చెప్పాడు. తనకు డబ్బులు ఇప్పించాలని పోలీసులను కోరగా బాలాజీ కార్స్ నిర్వాహకుడిని పిలిపించి మాట్లాడతామని ఎస్ఐ చెప్పారన్నాడు. ఇప్పటి వరకు ఎలాంటి స్పందన లేదని, న్యాయం చేయాలని మరోసారి పోలీసులకు ఫిర్యాదు చేశానన్నాడు. కాగా దీనిపై ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి మాట్లాడుతూ బాధితులు ఫిర్యాదు చేశారని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

థానేలో ఎస్కేప్... సిటీలో అరెస్టు!

- మహారాష్ట్రలోని అనేక నగరాలకు డ్రగ్స్ సరఫరా
- ప్రధాన సూత్రధారిగా ఉన్న మహ్మద్ రహీమ్
- నగరం మీదుగా విదేశాలకు పారిపోయే యత్నం
- శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద అరెస్టు

సాక్షి, సిటీబ్యూరో: మహారాష్ట్రలోని థానే కేంద్రంగా సాగిన అంతర్జాతీయ డ్రగ్ సిండికేట్‌లో కీలక నిందితుడు మహ్మద్ రహీమ్ షేక్ అలియాస్ ఫర్హాన్ శంషాబాద్ విమానాశ్రయంలో పోలీసులకు చిక్కాడు. గత నెల 25 నుంచి పరారీలో ఉండి, బహ్రేన్ పారిపోయే ప్రయత్నాల్లో ఉన్న ఇతగాడిని మాన్‌పడా పోలీసులు గురువారం పట్టుకున్నారు. ఫర్హాన్ నేతృత్వంలో ఏర్పడిన గ్యాంగ్ థానే కేంద్రంగా పని చేసింది. మాదకద్రవ్యమైన మెఫెడ్రోన్‌ను మహారాష్ట్రలోని వివిధ నగరాలు, పట్టణాల్లోని పెడ్లర్స్‌కు సరఫరా చేసింది. కొన్నేళ్లుగా గుట్టుగా సాగుతున్న ఈ దందాపై గత నెల్లో థానేలో ఉన్న మాన్‌పడా పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఈ ముఠా వ్యవహారాలపై కన్నేసి ఉంచిన అధికారులు గత నెల 25న అక్కడి ఖోనీ ప్రాంతంలో దాడి చేశారు. ఓ మహిళ సహా ఐదుగురిని పట్టుకున్నారు. వీరి నుంచి రూ.2.12 కోట్ల విలువైన 1.93 కేజీల మెఫెడ్రోన్ స్వాధీనం చేసుకున్నారు. ఈ గ్యాంగ్ విచారణలోనే ఫర్హాన్ పేరు వెలుగులోకి వచ్చింది. డ్రగ్ అతడి ద్వారానే తమకు అందుతుందని, విక్రయించగా వచ్చిన సొమ్ములో తమ కమీషన్ పోను మిగిలింది అతడికే అప్పగిస్తామని గ్యాంగ్ మెంబర్స్ బయటపెట్టారు. దీంతో ఫర్హాన్ కోసం పోలీసుల వేట ముమ్మరమైంది. తన ముఠా పోలీసులకు చిక్కిన విషయం తెలుసుకున్న ఫర్హాన్ అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. విదేశీ లింకులు ఉన్న ఇతగాడు దేశం దాటి వెళ్లేపోయే అవకాశం ఉందని అనుమానించిన థానే పోలీసులు దేశంలోని అన్ని అంతర్జాతీయ విమానాశ్రయాల వద్దా కన్నేసి ఉంచారు. ఫర్హాన్ పాస్‌పోర్ట్ నెంబర్ ఆధారంగా అతడిపై లుక్ ఔట్ సర్క్యులర్ (ఎల్‌ఓసీ) కూడా జారీ చేశారు. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి బహ్రేన్ వెళ్లిపోవడానికి ఫర్హాన్ ప్రయత్నించాడు. ఈ విషయంపై ఉప్పందుకున్న థానే పోలీసులు నగరానికి చేరుకుని ఎయిర్‌పోర్టు మార్గాల్లో నిఘా ఉంచారు. ఓ వాహనంలో విమానాశ్రయం వైపు వస్తున్న ఫర్హాన్‌ను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. ఇతడిని అరెస్టు చేసిన థానే పోలీసులు అక్కడకు తరలించి శుక్రవారం కోర్టులో హాజరుపరిచారు. న్యాయస్థానం ఆదేశాల మేరకు జ్యుడీషియల్ రిమాండ్ నిమిత్తం జైలుకు తరలించారు.



అదుపుతప్పిన వృద్ధుడి కారు

పలువురికి గాయాలు

రాంగోపాల్‌పేట్: ఓ వృద్ధుడు నడుపుతున్న కారు అదుపు తప్పి పలు వాహనాలకు ఢీకొట్టగా ఓ యువతి తీవ్ర గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. ఈ ఘటన గోపాలపురం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..మారేడుపల్లికి చెందిన గోపాల్ చంద్రబోస్ (86) శుక్రవారం తన ఇంటి నుంచి ఈశ్వరీబాయి విగ్రహం మీదుగా బేగంపేట వెళుతున్నారు. ఈశ్వరీబాయి విగ్రహం దాటగానే ఆయన నడుపుతున్న వెర్నా కారు అదుపు తప్పి ఓ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో ఆ వాహనం నడుపుతున్న మల్కాజ్‌గిరికి చెందిన రింకు (22) అనే యువతికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఆ వృద్ధుడు మరింత భయంతో ముందుకు వెళ్లి మూడు ద్విచక్ర వాహనాలతో పాటు ఒక ఆటో, మరో ట్రాలీ ఆటోను కారుతో ఢీ కొట్టాడు. దీంతో తీవ్ర గాయాలపాలైన యువతిని సికింద్రాబాద్ యశోద ఆస్పత్రికి తీసుకుని వెళ్లి చికిత్స అందిస్తున్నారు. మరో ముగ్గురికి స్వల్ప గాయాలు కావడంతో ప్రాథమిక చికిత్స చేసి ఇంటికి పంపించారు. రింకూకు బేగంపేటలో ఇంటర్వ్యూ ఉండటంతో ద్విచక్ర వాహనంపై వెళుతుండగా ఈ ఘటన జరిగింది. ఆమె తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గోపాలపురం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.


ప్రమాదానికి కారణమైన కారు

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

శ్రీనగర్‌కాలనీ: కిలో టమాట రూ.35, నల్లవంకాయ.28, పొడుగువంకాయ.28, బెండకాయ.50, పచ్చిమిర్చి.50, బజ్జీమిర్చి.23, క్యాప్సికం.61, పచ్చికాకరకాయ.45, పందిరిబీర.38, క్యాబేజీ.18, క్యారెట్.40, దొండకాయ.28, గుండు బీన్స్ 95, గింజచిక్కుడు.55, గోకరకాయ.40, కీర.23, దోసకాయ.18, బీట్‌రూట్.27, ఉల్లిగడ్డ.22, ఆలుగడ్డ.24, చామగడ్డ.23, మొరంగడ్డ.23, కందగడ్డ.55, క్యాలిఫ్లవర్.23, సొరకాయ.09, పొట్లకాయ.23, అరటికాయ.11, మునగకాయ.4, మామిడికాయ.40, ముల్లంగి.4-5, ఉల్లిపొరక.40. ఈ ధరలు శనివారం ఉదయం 9 గంటల వరకూ అమలులో ఉంటాయి.

నిమిషాంబ ఆలయంలో ప్రత్యేక పూజలు

రహమత్‌నగర్: బోరబండ సైట్2 నిమిషాంబ అమ్మవారి ఆలయంలో అషాఢ, శ్రావణ మాస శుక్రవారాల పూజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మ వారికి గాజుల పూజ, అభిషేకం, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఉదయం నుంచే మహిళలు అమ్మవారి ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మ వారి పూజ వలన కలిగే పుణ్యఫలాలను ఆలయ పూజరి మహిళలకు వివరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు శివకుమార్ గుప్తా, బాలరాజు, రాజశేఖర్, నవనీత, సంజయ్ వర్మ, అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

ట్రేడ్ లైసెన్స్ లేని వ్యాపారులపై జీహెచ్‌ఎంసీ కొరడా



బంజారాహిల్స్: ట్రేడ్ లైసెన్స్ లేకుండా వ్యాపారాలు చేస్తున్న వ్యాపారులపై జీహెచ్‌ఎంసీ అధికారులు కొరడా ఝులిపిస్తున్నారు. గురువారం బంజారాహిల్స్ రోడ్ నెం.2లోని వరుణ్ మోటార్స్‌ను అధికారులు పరిశీలించారు. రెండేళ్లుగా సదరు సంస్థ ట్రేడ్‌లైసెన్స్ లేకుండా వ్యాపారం కొనసాగిస్తుండటంతో పాటు మూడేళ్లుగా అడ్వర్టయిజ్‌మెంట్ ఫీజు బకాయి ఉన్నట్లు అధికారులు గుర్తించి వెంటనే సముదాయాన్ని సీజ్ చేశారు. ట్రేడ్ లైసెన్స్ లేకుండా వ్యాపారాలు కొనసాగిస్తే జరిమానాలు తప్పవని, వ్యాపారాలను సీజ్ చేస్తామని ఈ సందర్భంగా జూబ్లీహిల్స్ సర్కిల్-18 ఏఎంహెచ్‌వో డాక్టర్ కే.ఎస్.రవికుమార్ హెచ్చరించారు.

వినూత్నం.. విభిన్నం









వెంగళరావు పార్కుకు నూతన శోభ

రంగురంగుల మొక్కలు ఆకట్టుకునే ఆకృతులు

హర్షం వ్యక్తం చేస్తున్న సందర్శకులు



బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం. 1లోని జలగం వెంగల్‌రావు పార్కు రూప రేఖలను అధికారులు పూర్తిగా మార్చేశారు. ఒకప్పుడు చెత్తా చెదారంతో పాటు పచ్చదనం కరువై, దోమల స్వైర విహారం చేస్తున్న పార్కును ఇప్పుడు అత్యద్భుతంగా తీర్చిదిద్దారు. ఇంకా కొన్ని అభివృద్ధి పనులు త్వరలో పూర్తవుతాయని అధికారులు పేర్కొంటున్నారు. పార్కులో ఎక్కడ చూసినా చక్కనైన పచ్చనైన ల్యాండ్ స్కేపింగ్‌తో పాటు పిల్లలు, సందర్శకులు, వాకర్లు కూర్చునేందుకు విభిన్న రూపాల్లో పులి, సింహం, ఏనుగు, ఒంటె, ఆవు ఆకారాల్లో బెంచీలను ఏర్పాటు చేశారు. వాకర్లు, సందర్శకులు ఈ బెంచీల్లో కూర్చొని ఫొటోలు దిగేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. మరో వైపు పార్కు చుట్టూ ఉన్న గోడలపై అందమైన ఆకృతులతో పెయింటింగ్స్ వేయించారు. ప్రభుత్వ సహకారంతో పాటు పలు స్వచ్ఛంద సంస్థల సహకారంతో ఈ పార్కులో అభివృద్ధి పనులు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇప్పటికే పార్కులో ఏర్పాటు చేసిన ఓపెన యాంఫీ థియేటర్‌కు మంచి స్పందన లభిస్తోంది. దీనికి తోడు ఓపెన్ జిమ్, యోగా చేసుకునేందుకు చేసిన ఏర్పాట్లను వాకర్లు అభినందిస్తున్నారు.







మంత్రి వివేక్ సుడిగాలి పర్యటన



బోరబండలో వాహన శ్రేణిని ప్రారంభిస్తున్న మంత్రి వివేక్

రహమత్‌నగర్: రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో శుక్రవారం సుడిగాలి పర్యటన చేశారు.రహమత్‌నగర్, బోరబండ డివిజన్ నుంచి ఎల్‌బీనగర్ సభకు వెళుతున్న కాంగ్రెస్ వాహన శ్రేణులను ఆయన ఎస్కార్ట్ లేకుండా బైక్‌పై వచ్చి పారంభించారు. రహమత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి ఆధ్వర్యంలో క్వారీ మైదానంలో ఏర్పాటు చేసిన వాహన శ్రేణిని, రహమత్‌నగర్‌లో నగర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి భవానిశంకర్ వాహన శ్రేణిని, బోరబండలో మాజీ డిప్యూటీ మేయర్ బాబా ఫసియుద్దిన్ ఏర్పాటు చేసిన వాహన శ్రేణులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జూబ్లీహిల్స్ నియోజకవర్గ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. పనులు చేసిపెట్టేది తాను అని, పనులు అడిగే బాధ్యత మీదని, రాష్ట్ర మంత్రిగా తాను హామీ ఇస్తున్నట్లు ప్రకటించారు.ఆరు గ్యారంటీలను సీఎం రేవంత్‌రెడ్డి అమలు పరుస్తున్నారని కొనియాడారు.

అల్లూరి దేశభక్తిని ఆదర్శంగా తీసుకోవాలి



వెంగళరావునగర్: అల్లూరి సీతారామరాజు దేశభక్తిని, ధైర్యాన్ని నేటితరం యువతీ యువకులు ఆదర్శంగా తీసుకోవాలని మధురానగర్ ఇండోర్ స్టేడియం, జిమ్ నిర్మాణ దాత డి.ఎల్.ఎన్.రాజు అన్నారు. శుక్రవారం వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని మధురానగర్‌కాలనీలో సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మన్నెం వీరుడు అల్లూరి సీతారామరాజు 128 జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రాజు మాట్లాడుతూ పరాయి పాలన నుంచి దేశాన్ని విడిపించడానికి ప్రాణత్యాగం చేసిన మహనీయుడు అల్లూరి అని కొనియాడారు. కాగా చదువుకునే ప్రతిభావంతులకు ఆయన పేరుతో పాటుగా ప్రొఫెసర్ జయశంకర్ పేర్ల మీద స్కాలర్‌షిప్స్ అందజేస్తున్నట్లు తెలిపారు. కాలనీ సంక్షేమ సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.ప్రతాప్ రెడ్డి, కోడె సాంబశివరావు, సంస్థ ఉపాధ్యక్షులు మనోహర్‌రావు, కోశాధికారి సుగుణ, మాజీ అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.సాంబశివరావు, కె.విశ్వప్రకాశ్, శేషాచారి పాల్గొన్నారు.

గంజాయి విక్రేత అరెస్టు..

బంజారాహిల్స్: గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే..జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్-60లోని రత్నదీప్ సమీపంలో ఓ వ్యక్తి గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో ఆ ప్రాంతంలో మాటు వేసిన పోలీసులు అనుమానాస్పదంగా కనిపించిన మాదాపూర్ ప్రాంతంలో ఉంటూ దోశ మాస్టర్‌గా విధులు నిర్వర్తించే సికిందర్‌కుమార్ మండల్ (32)ను అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా అతని వద్ద 200 గ్రాముల గంజాయిని గుర్తించారు. నిందితుడిని అరెస్ట్ చేసి అతడి నుంచి గంజాయితో పాటు రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

పెద్దమ్మగుడికి పోటెత్తిన భక్తులు..



బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లి శాకబరి ఉత్సవాలు శుక్రవారం ముగిశాయి. అత్యంత వైభవంగా జరిగిన ముగింపు వేడుకల సందర్భంగా ఆలయాన్ని వివిధ రకాల కూరగాయలు, పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఆకర్షణీయమైన రీతిలో కూరగాయల హారాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఉదయం అమ్మవారి సన్నిధిలో నవగ్రహ రుద్ర చండీహోమాలు, అనంతరం పూర్ణాహుతి నిర్వహించారు. రాత్రి విశేష బాణాసంచా విన్యాసాలు కనువిందు చేశాయి. పెద్దమ్మ తల్లి ఉత్సవ మూర్తి పల్లకీ సేవలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఆగస్టు 3న 'వైశ్య రాజకీయ రణభేరి'



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కాచం సత్యనారాయణ గుప్తా

హిమాయత్‌నగర్: వైశ్యుల ఆత్మగౌరవం, హక్కుల సాధనకు 'ఛలో హైదరాబాద్' పేరుతో ఆగస్టు 3న నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో 'వైశ్య రాజకీయ రణభేరి' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వైశ్య వికాస వేదిక ఫౌండర్ చైర్మన్ డా.కాచం సత్యనారాయణ గుప్తా తెలిపారు. శుక్రవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో రణభేరి వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జనాభా దామాషా ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల్లో వైశ్యులకు ప్రాధాన్యం కల్పించాలన్నారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లలో వర్గీకరణ తేవాలన్నారు. వైశ్య కార్పొరేషన్ స్థాపించి నిధులను కేటాయించాలని కోరారు. కులగణన నివేదికలోనే అగ్రవర్ణాల వివరాలు కులాల వారిగా ప్రకటించాలన్నారు. నామినేటెడ్ పదవుల్లో వైశ్యులకు తగిన ప్రాధాన్యం కల్పించాలని కోరారు. స్కిల్ యూనివర్సిటీలో వైశ్యులకు 25 శాతం సీట్లు కేటాయించాలని, విదేశీ విద్యా సహాయ నిధిని ఏర్పాటు చేసి వైశ్య విద్యార్థులకు తోడ్పాటు అందించాలన్నారు. 'వైశ్య రాజకీయ రణభేరి' కార్యక్రమంలో రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీల ప్రతినిధులు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో నంగునూరి రమేష్, రాజు గుప్తా, అనంత రాములు గుప్తా, వెంపటి వెంకటేశ్వర్లు, కొత్త రవి, వంగవీటి శ్రీనివాస్, దారా రమేష్, పశుపతి, నటరాజ్, రాంబాబు, దయాకర్, రామ్ నరేష్ పాల్గొన్నారు.

లక్కీషా బంజారా గొప్పతనాన్ని చాటి చెప్పాలి

హిమాయత్‌నగర్: బంజారా మహావీరుడు, గొప్ప చక్రవర్తి లక్కీషా బంజారా గొప్పతనాన్ని దేశ వ్యాప్తంగా చాటి చెప్పాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉందని మాజీ ఎంపీ రవీందర్ నాయక్ అన్నారు. శుక్రవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో గిరిజన శక్తి, భారత్ గోర్ బంజారా సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో బంజారా మహావీరుడు లక్కీషా బంజారా 445వ జయంతి వేడుకలను గిరిజన శక్తి రాష్ట్ర అధ్యక్షులు డా.వెంకటేష్ చౌహన్, గిరిజన జేఏసీ చైర్మన్ రాజేష్ నాయక్ సభ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రవీందర్ నాయక్ మాట్లాడుతూ లక్కీషా బంజారా చరిత్రపై పరిశోధన చేపట్టాలన్నారు. ఆయన విగ్రహాన్ని నగరంలో ఏర్పాటు చేయాలన్నారు. బంజారా వీరుల చరిత్రను బయటకు తెచ్చేందుకు తెలంగాణలో స్టడీ సర్కిల్‌తో పా టు మ్యూజియం ఏర్పాటు చేయాలని కోరారు.



లక్కీషా బంజారా చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎంపీ రవీందర్ నాయక్, వెంకటేష్ చౌహాన్ తదితరులు

రోడ్డు ప్రమాదానికి గురై.. అపస్మారకస్థితిలోకి వెళ్లి..

బంజారాహిల్స్: రోడ్డు ప్రమాదంలో అపస్మారక స్థితిలోకి చేరుకుని రెండు రోజుల తర్వాత స్పృహలోకి వచ్చిన ఓ మహిళ.. తనను ఆస్పత్రి పాల్జేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలంటూ బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివరాల్లోకి వెళితే..బంజారాహిల్స్ అరోరాకాలనీలోని ఓ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉండే అఖిల (37) నిరుద్యోగి. ఉద్యోగం కోసం ప్రయత్నాలు చేస్తుంది. గత నెల 6వ తేదీన బంజారాహిల్స్ స్కూపీ స్క్రబ్స్ పెట్ గ్రూమింగ్ పార్లర్ సమీపంలో పార్కు చేసిన తన ద్విచక్ర వాహనం తీసుకెళ్లేందుకు సిద్ధమవుతుండగా.. గుర్తుతెలియని వ్యక్తి వాహనంతో ఢీకొట్టి వెళ్లిపోయాడు. ఈ ఘటనలో అఖిల అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయింది. స్థానికులు ఆమెను ఆస్పత్రిలో చేర్చగా, రెండు రోజుల తర్వాత స్పృహలోకి వచ్చారు. 45 రోజుల పాటు తన సంరక్షణ కోసం కేర్ టేకర్‌ను నియమించుకోవాలని వైద్యులు సూచించారు. రెండు నెలలు విశ్రాంతి తీసుకోవాలని చెప్పారు. ఈ క్రమంలో తాను ఈ పరిస్థితికి కారణమైన వ్యక్తి ఆచూకీ కనుగొని తనకు న్యాయం జరిగేలా చూడాలని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నీటి సమస్యను పరిష్కరించండి

వెంగళరావునగర్: నియోజకవర్గంలోని అనేక ప్రాంతాల్లో మంచినీరు, మురుగునీటి సమస్య తీవ్రంగా ఉందని తక్షణమే పరిష్కరించాలని భారతీయ జనతాపార్టీ నేతలు జలమండలి అధికారులను కోరారు. ఈ మేరకు శుక్రవారం జలమండలి జీఎం ప్రభాకర్‌రావును కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. తొలుత వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని ఈస్ట్ రహమత్‌నగర్, కమాన్ గల్లీ, జవహర్‌నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి స్థానికులను అడిగి సమస్యలను తెలుసుకున్నారు. జీఎంను కలిసిన వారిలో బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షులు దీపక్‌రెడ్డి, ప్రేమ్‌కుమార్, గంగరాజు, సుప్రియాగౌడ్, నవీన్‌కుమార్, శివ, విజయ్, జబ్బార్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



జీఎం ప్రభాకర్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నేతలు

రోశయ్య విగ్రహం ఏర్పాటు అభినందనీయం

రహమత్‌నగర్: కాంగ్రెస్ ప్రభుత్వం లక్డీకాపూల్ వద్ద దివంగత మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య విగ్రహం ఏర్పాటు చేయడం పట్ల బోరబండ ఆర్య వైశ్య సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. బోరబండలో శుక్రవారం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు శివకుమార్ ,నాయకులు మూర్తి, శంకరయ్య, విఠల్ మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ము ఖ్యమంత్రిగా, గవర్నర్‌గా రాష్టానికి ఎన్నో సేవలందించిన దివంగత రోశయ్య సేవలను గత బీఆర్ఎస్ ప్రభుత్వం గుర్తింపు ఇవ్వలేదని వారు ఆరోపించారు. రోశయ్య విగ్రహాన్ని హైద్రాబాద్ నడి బొడ్డున ఏర్పాటు చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవాలి



వేడుకల్లో పాల్గొన్న వాటర్‌వర్క్స్ ఎండీ అశోక్‌రెడ్డి తదితరులు..

ఫిలింనగర్: భారతీయ విద్యాభవన్స్ ఆత్మకూరి రామారావు స్కూల్ ఫౌండేషన్ వేడుకలు శక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన వాటర్‌వర్క్స్ ఎండీ అశోక్‌రెడ్డి మాట్లాడుతూ సాంకేతికతను అందిపుచ్చుకుంటూనే మన సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా నిర్వహిస్తున్న వనమహోత్సవ వారోత్సవాల్లో విద్యార్థులు భాగస్వాములై విస్తృతంగా మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో భాగంగా టెన్నిస్ కోర్టుతో పాటు ఇకో ఫిట్‌జోన్‌ను ప్రారంభించారు. సంస్కృతి-2025 స్కూల్ మ్యాగజైన్‌ను ఆవిష్కరించారు. స్కూల్ మేనేజింగ్ కమిటీ చైర్మన్ గోపాలకృష్ణన్, డైరెక్టర్ రమాదేవి, జాయింట్ డైరెక్టర్ శ్రీరామ్, సౌత్ జోన్ రీజనల్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మదన్‌రావు, ప్రిన్సిపాల్ సీతానాయర్ పాల్గొన్నారు.

అసాంఘిక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు

హిమాయత్‌నగర్: స్పా సెంటర్‌లలో అసాంఘిక చర్యలకు పాల్పడినా, నిబంధనలు అతిక్రమించిన కఠిన చర్యలు తప్పవని నారాయణగూడ ఇన్‌స్పెక్టర్ యు.చంద్రశేఖర్ హెచ్చరించారు. శుక్రవారం ఇన్‌స్పెక్టర్ ఆదేశాల మేరకు హిమాయత్‌నగర్ పరిధిలోని స్పా సెంటర్‌లలో పోలీస్ సిబ్బంది ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. రిజిస్టర్, అందిస్తున్న సేవలు, అనుమతులకు చెందిన పత్రాలను పరిశీలించారు. నిబంధనలకు లోబడి చట్టప్రకారం స్పాలను నిర్వహించాలని సూచించారు.



స్పా సెంటర్లలో తనిఖీలు చేస్తున్న పోలీసులు

విద్యకు కేటాయింపులు పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్ రెడ్డి

హిమాయత్‌నగర్: సమున్నత ఆదర్శాలతో పట్టాలెక్కిన విద్యాహక్కు చట్టం ప్రతి బిడ్డకు విద్యను ప్రాథమిక హక్కుగా మార్చిందని, ప్రభుత్వాలు చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలి ఎంవీ ఫౌండేషన్ కార్యదర్శి ఆర్.వెంకట్ రెడ్డి అన్నారు. శుక్రవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ప్రైవేట్ పాఠశాలల ఫీజుల దోపిడీలపై 'ప్రభుత్వ పాఠశాలలలో నాణ్యమైన విద్య' అంశంపై ఆప్ రాష్ట్ర నాయకులు బుర్ర రాము గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆర్.వెంకట్ రెడ్డి మాట్లాడుతూ విద్యకు 15 శాతం బడ్జెట్ కేటాయించాలన్నారు. టీచర్స్ ఫోరమ్ ఫర్ చైల్డ్ రైట్స్ అధ్యక్షుడు జనార్దన్ మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించి, నాణ్యమైన విద్యను అందించాలన్నారు. తల్లితండ్రుల సంఘం అధ్యక్షురాలు జి.భాగ్యమ్మ మాట్లాడుతూ ఇప్పటికీ మురికివాడల్లో నివసించే పిల్లలు చదువుకు దూరంగా ఉన్నారన్నారు. ఎండి.అబ్బాస్ మాట్లాడుతూ విద్య సమస్యలపై పోరాటాలు తీవ్రతరం చేయాలన్నారు. ఆప్ రాష్ట్ర కన్వీనర్ డా.దిడ్డి సుధాకర్ మాట్లాడుతూ ప్రైవేట్ విద్య సంస్థల దోపిడీని ప్రభుత్వం తీవ్రంగా పరిగణించి, క్రిమినల్ చర్యలు చేపట్టాలన్నారు. వివిధ సంస్థల ప్రతినిధులు డి.ప్రకాష్, డా.ఎ.శ్రీనివాస్, కె.వెంకట్, సాయినాథ్, ఆంజనేయులు, ఆప్ నేతలు డా.సోలొమన్ రాజ్, సుధారాణి, నర్సింగ్, యమునా గౌడ్, డా.లక్ష్మ నాయుడు, జావీద్ షరీఫ్, జిల్లోజు హేమ, దర్శనం రమేష్, సోహైల్, షాబాజ్, అజీజ్ బేగ్, రాకేష్ రెడ్డి, రాకేష్ సింగ్ పాల్గొన్నారు.

ఖర్గే సభకు తరలిన కాంగ్రెస్ కార్యకర్తలు..

ఫిలింనగర్: తెలంగాణ కాంగ్రెస్ క్రియాశీల కార్యకర్తల సమావేశం శుక్రవారం ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథిగా ఏఐసీసీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్‌ఖర్గే హాజరయ్యారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆధ్వర్యంలో నియోజకవర్గం నలుమూలల నుంచి నేతలు, కార్యకర్తలు బహిరంగ సభకు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. ఫిలింనగర్ బస్తీల నుంచి కాంగ్రెస్ కార్యకర్తలు, నేతలు వందలాదిగా తరలివెళ్లారు. దారి పొడవునా కాంగ్రెస్ జిందాబాద్ నినాదాలతో ఖైరతాబాద్ రహదారులు హోరెత్తాయి. ఇదిలాఉండగా నాగేందర్ నియోజకవర్గవ్యాప్తంగా ఫ్లెక్సీలు ఏర్పాటుచేసి కాంగ్రెస్‌కు కొత్త ఊపును తీసుకువచ్చారు.

సాక్షి సిటీ ప్లస్
10
హైదరాబాద్, శనివారం, 5, జూలై, 2025



సిటీతో బలమైన అనుబంధం: పీవీఆర్

సాక్షి, సిటీబ్యూరో: నగరంతో తమ అనుబంధం అంతకంతకూ బలోపేతం అవుతోందని ప్రముఖ మల్టీప్లెక్స్ బ్రాండ్ పీవీఆర్ ఐనాక్స్ నిర్వాహకులు అన్నారు. నగరంలోని ఎస్ఎంఆర్ వినయ్ మాల్‌లో నెలకొల్పిన నూతన 4 'స్క్రీన్ల పీవీఆర్ ఐనాక్స్ థియేటర్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ అజయ్ బిజ్లీ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంజీవ్ కుమార్ బిజ్లీ మాట్లాడారు. నగరం తమకు ఎంతో ప్రధానమైన మార్కెట్ అనీ, అత్యుత్తమ సాంకేతిక పరిజ్ఞానంతో అత్యాధునిక వీక్షణ అనుభవాన్ని నగరానికి అందిస్తున్నందుకు ఆనందంగా ఉందన్నారు.

లామకాన్.. కళా మకాన్!

ఇల్లు కానిది.. విలువైనది.. 'కళ'కళలాడేది.. అదే లామకాన్. లామకాన్ అంటే ఇల్లు కానిదని అర్థం.. బంజారా హిల్స్ రోడ్ నెం-1లో వెంగళరావు పార్క్ సమీపంలోని గల్లీలో ఉంది ఈ 'కళా'మకాన్. ఇదొక సాంస్కృతిక నిలయం. ఇక్కడ అన్ని రంగాలకు చెందినవారు, వయోభేదం లేకుండా కళాప్రియులు, యువత అధికంగా కనిపిస్తారు. లోపలికి వెళితే సినిమాలు, నాటకాల గురించి కొందరు, సంగీతం నేర్చుకుంటూ మరికొందరు, సోషల్‌మీడియా, కార్పొరేట్ వ్యక్తుల బిజినెస్‌పై ఇంకొందరు చర్చిస్తూ కనిపిస్తారు. ఇక్కడికి అన్ని రంగాల ప్రముఖులు వచ్చి తమ ఆలోచనలను పంచుకుంటుంటారు. కళలను ప్రదర్శిస్తుంటారు. నగరవాసులతో పాటు తెలుగు రాష్ట్రాలు, దేశ, విదేశాల ప్రజలు ఇక్కడికి వచ్చి తమ ప్రతిభాపాటవాలను చాటుకుంటారు.

\- శ్రీనగర్‌కాలనీ

లామకాన్ అనేది ఒక కళాకారుడి కలల నిలయం.. నగరానికి చెందిన పెయింటర్, ఫొటోగ్రాఫర్ మొయిద్ హసన్ ఎంతో నచ్చి, మెచ్చి ఈ ఇల్లు నిర్మించుకున్నారు. ఆయన తన కళతోపాటు సామాజిక సమస్యలపై డాక్యుమెంటరీలను సైతం తీశారు. హసన్ జీవించినంత కాలం ఇక్కడ ఆయన కళా స్నేహితులు, సాహితీవేత్తలతో నిత్యం కళకళలాడుతుండేది. ఆయన మరణాంతరం నిలయం బోసిపోయింది. హసన్ జ్ఞాపకార్థం దీనిని లామకాన్‌గా మార్చారు.

ప్రవేశం, వైఫై ఉచితం...

లామకాన్‌లోకి ప్రవేశం, వైఫై ఉచితం. ఉదయం నుంచి రాత్రి వరకూ లామకాన్ సందర్శకుల కోసం అందుబాటులో ఉంటుంది. సోమవారం సెలవుదినం. కొన్ని కార్యక్రమాలకు మాత్రమే నిర్వహణ ఖర్చును కొద్దిపాటిగా తీసుకుంటారు. సందర్శకులు ఎటువంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదు. ప్రత్యేక ప్రదర్శనలకు టికెట్‌ను పెడతారు. ఇక్కడి క్యాంటీన్‌లో రుచికరమైన ఆహారం ధరలు అతి తక్కువగా ఉంటాయి. చాలామంది యువత ఇక్కడికి క్యాంటీన్ ఫుడ్ కోసం వచ్చి తమ ఆలోచనలను పంచుకుంటుంటారు.







కళాకారుల ఎమోషనల్ ప్రదేశం

- పెయింటర్, ఫొటోగ్రాఫర్ మొయిద్ హసన్ ఎంతో నచ్చి, మెచ్చి నిర్మించుకున్న ఇల్లు ఇది
- ప్రవేశం, వైఫై ఉచితం
- హసన్ జీవించినంత కాలం ఇక్కడ ఆయన కళా స్నేహితులు, సాహితీవేత్తలతో నిత్యం కళకళలాడుతుండేది

యువత మెచ్చిన ప్రాంతం..

కళాకారులకు లామకాన్ ఓ ఎమోషనల్ ప్రదేశం. ఏదైనా ఆలోచనను పంచుకోవాలన్నా, తమ టాలెంట్‌ను చెప్పుకోవాలన్నా ఖర్చుతో కూడుకున్న విషయం. కానీ, లామకాన్ మాత్రం వీటన్నింటికీ ప్రత్యేకం. ఈ ప్రదేశం కవి సమ్మేళనాలు, పెయింటింగ్, పుస్తకావిష్కరణ లాంటి కార్యక్రమాలకు ఉచితం. ఆలోచనలను పంచుకుంటూ ఎంతసేపైనా ఇక్కడ ఉండొచ్చు. సిటి మధ్యలో ఉండే ఈ లామకాన్ కళాకారులకు, యువతకు సుందర ప్రదేశం. ఇక్కడి ఫుడ్ కోసమే వచ్చేవారు ఉన్నారంటే అతిశయోక్తి కాదేమో! ఇక్కడ సమోస, ఛాయ్, బజ్జీ, పలావ్‌లు ప్రత్యేకం. ఇక్కడ ఎంతోమంది తమ ప్రదర్శనలతో ఉన్నతస్థాయికి చేరుకున్నారు. ఇక్కడ ఎలాంటి కార్యక్రమాలకు అనుమతి ఇవ్వాలో హసన్ మేనల్లుడితోపాటు మరికొంత మంది నిర్ణయిస్తారు. లామకాన్ పేరుకు కళంకం కాకుండా కొన్ని సమస్యాత్మక కార్యక్రమాలపై వీరు తమ అభిప్రాయాలను, అనుమతులను నిర్ణయిస్తారు. కొన్ని ఏళ్ళుగా లామకాన్ కళలకు నిలయంగా ఉంటూ వేలాది మందికి వేదికగా నిలిచింది.

దేశవ్యాప్తంగా అలెక్టా సేవల విస్తరణ

సాక్షి, సిటీబ్యూరో: దేశవ్యాప్తంగా విస్తృత భాగస్వామ్యాలతో సాంకేతిక సేవలు విస్తరించనున్నామని అమెరికా కేంద్రంగా పనిచేసే టెక్నాలజీ కన్సల్టింగ్, సాఫ్ట్‌వేర్ ఉత్పత్తుల సంస్థ అలెక్టా సొల్యూషన్స్ వ్యవస్థాపకుడు శ్రావణ్ కుమార్ బెలె తెలిపారు. నగరానికి చెందిన అఫ్లూయెన్స్ కన్సల్టింగ్‌తో భాగస్వామ్యం కుదుర్చుకుని ఏఐ ఆధారిత పినాకా సాఫ్ట్‌వేర్‌ను నగరంలో ఆవిష్కరించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2016లో అమెరికాలో ఏర్పాటు చేసిన అలెక్టా సొల్యూషన్స్ ప్రస్థానాన్ని వివరించారు. ఈ సందర్భంగా సరికొత్త పినాకా సాఫ్ట్‌వేర్ విశేషాలను అందించారు. కార్యక్రమంలో భాగంగా పలు టెక్నాలజీ సంబంధిత సమావేశాలు, చర్చలు నిర్వహించారు. కార్యక్రమంలో అఫ్లూయెన్స్ కన్సల్టింగ్ మేనేజింగ్ డైరెక్టర్ విజయ్ నదిపినేని పాల్గొన్నారు.



డిజిటల్ ఆర్ట్ ఎగ్జిబిషన్ షురూ..





మాదాపూర్: డిజిటల్ ఆర్ట్ ఎగ్జిబిషన్ సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటుంది. శుక్రవారం మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో డిజిటల్ ఆర్ట్, పెయింటింగ్ ఎగ్జిబిషన్‌ను సినీనటుడు బాబుమోహన్, హైదరాబాద్ ఆర్ట్స్ సొసైటీ అధ్యక్షుడు ఎం.వి.రమణారెడ్డి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ కళాకారులు వేసిన చిత్రాలు అద్భుతంగా ఉన్నాయని కొనియాడారు. కళాకారులు జయశ్రీ ప్రభాకర్, కాసుల పద్మావతి, శ్రీప్రభాత వేసిన చిత్రాలు చూపరులను ఆకట్టుకున్నాయని తెలిపారు. ఈ నెల 6వ తేదీ వరకు నిర్వహించనున్న ప్రదర్శనలో 250 చిత్రాలు అందుబాటులో ఉన్నాయని నిర్వాహకులు పేర్కొన్నారు. ఉదయం 10.30 నుంచి రాత్రి 7 గంటల వరకు అందుబాటులో ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో దైవాజ్ఞశర్మ తదితరులు పాల్గొన్నారు.



చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ఏర్పాటు చేసిన ప్రదర్శనను తిలకిస్తున్న బాబుమోహన్ తదితరులు


నేడు, రేపు డిజైనర్ దుస్తుల ప్రదర్శన



బంజారాహిల్స్: దేశంలోని ప్రఖ్యాత డిజైనర్లు తీర్చిదిద్దిన డిజైనర్ దుస్తుల ప్రదర్శన బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-1లోని తాజ్‌కృష్ణా హోటల్ ఎదురుగా లేబుల్స్ పాప్ అప్ స్పేస్‌లో ఈ నెల 5, 6 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు ఫ్యాషన్ ఇన్‌ఫ్లూయెన్సర్లు ఎస్.మానసరెడ్డి, స్నేహ, స్నిగ్ధ వెల్లడించారు. 'ది వెడ్డింగ్ ఎడిట్ ఫ్యాషన్ జిరాఫీ పాప్ అప్'పేరుతో నిర్వహిస్తున్న ఈ ఎగ్జిబిషన్‌లో 40 మంది ప్రఖ్యాత డిజైనర్లు తమ ఉత్పత్తులు ప్రదర్శిస్తారని శుక్రవారం ఇక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో వెల్లడించారు. కోల్‌కత్తా, బెంగుళూరు, లక్నో, ఇండోర్ తదితర నగరాల నుంచి పేరెన్నికగన్న దుస్తుల బ్రాండ్లు ఈ ప్రదర్శనలో ఆకట్టుకోనున్నాయని పేర్కొన్నారు. పైథానీ, పటోలా, కాంచీపురం, గద్వాల్, బనారసితోపాటు హ్యాండ్‌లూమ్ చీరలు చేనేత కళాకారుల నుంచే నేరుగా ఇక్కడ విక్రయించబోతున్నామని చెప్పారు. రూ.5 వేల నుంచి రూ.50 వేల వరకు ధర పలికే ఈ చీరలు నేరుగా చేనేత వస్త్ర కళాకారుల నుంచే కొనుగోలు చేయవచ్చన్నారు. ఫ్యాషన్ ప్రియులకు, నగర మహిళలకు ఈ ప్రదర్శన సరికొత్త ఆకృతులను అందించబోతున్నదని పేర్కొన్నారు.

షడ్రుచుల సండే





సాక్షి, సిటీబ్యూరో: వీకెండ్ షడ్రుచులకు నగరం వేదికగా మారనుంది. సంగీత ప్రియులను అలరించేందుకు 'సూపర్ సిక్స్'రెడీ.. ఒకవైపు సంగీత హోరు.. హాస్య వల్లరి.. నవ్వుల వడ్డన.. ఇంకోవైపు కవితా పఠనం.. ఇలా నగరవాసులకు సండే సందడే సందడి. ఆదివారం నగరంలో జరగనున్న కొన్ని ఈవెంట్స్ వివరాలివి...

- ఫిలింనగర్‌లోని ది మూన్ షైన్ ప్రాజెక్ట్ ఈఎక్స్‌టీలో ఆదివారం గిటార్ లైవ్ కార్యక్రమం ఉంది. గిటారిస్ట్ చందేష్ కుడ్వా ఈ కార్యక్రమంలో వీనుల విందు చేయనున్నారు. రాత్రి 8 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభం అవుతుంది.
- గచ్చిబౌలిలోని ప్రిజ్మ్ క్లబ్ అండ్ కిచెన్‌లో గ్లోవల్ లైవ్ పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని అందిస్తున్నారు.
- నగరంలోని లె మెరీడియన్ హోటల్‌లో క్యాండిల్ లైట్ కన్సర్ట్‌ను రాత్రి 8.30 గంటలకు సమర్పిస్తున్నారు.
- లక్డీకా పూల్‌లోని ఫిక్కీ మార్గ్‌లో ఉన్న కేఎల్ఎన్ ప్రసాద్ ఆడిటోరియంలో లైఫ్ కా తమాషా స్టాండప్ షో ఆదివారం జరగనుంది. కార్యక్రమంలో ప్రముఖ స్టాండప్ కమెడియన్ అమన్ దీప్ ఖయాల్ పాల్గొంటున్నారు. రాత్రి 8 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుంది.
- గచ్చిబౌలిలోని ది కామెడీ థియేటర్‌లో శనివారం నారామ్ లెహజాను ప్రముఖ కవి, రచయిత కన్హా కంబోజ్ ప్రత్యేక కార్యక్రమంగా నిర్వహిస్తున్నారు. రాత్రి 7 గంటల నుంచి ఈ కార్యక్రమం ఉంటుంది. మరుసటి రోజు ఫత్తా పోస్టర్ నికలా హీరో పేరిట మరో కార్యక్రమం కూడా కన్హా సమర్పిస్తున్నారు.
- శంషాబాద్‌లోని క్వేక్ ఎరీనా పార్టీ ప్లేస్‌లో డీజే చేతాస్ మ్యూజిక్ ఆదివారం సందడి చేయనున్నారు. క్వేక్ ఎరీనాలోని మరో వేదికపై రాత్రి 7 గంటల నుంచి నికో మొరానో లైవ్ పేరిట సంగీత ప్రదర్శన నిర్వహిస్తున్నారు. రాత్రి 7 గంటల నుంచి ఈ కార్యక్రమం ఉంటుంది.



7న రకేజ్ భారత రోడ్ షో

- మాదాపూర్‌లోని ట్రైడెంట్‌లో కార్యక్రమం
- టీ-కన్సల్ట్ ఆధ్వర్యంలో నిర్వహణకు ఏర్పాట్లు

రాయదుర్గం: యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యూఏఈ)లో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న గ్లోబల్ బిజినెస్‌కు అనుకూలమైన రాస్ అల్ ఖైమా ఎకనామిక్ జోన్(రకేజ్)-2025 భారత రోడ్ షోను జూలై 7వ తేదీన మాదాపూర్‌లోని ట్రైడెంట్ హోటల్‌లో నిర్వహిస్తుందని టీ కన్సల్ట్ గ్లోబల్ చైర్మన్ సందీప్ కుమార్ మక్తాల శుక్రవారం తెలిపారు. రకేజ్ గ్రూప్ సీఈఓ రమీజల్లాద్ నాయకత్వంలోని ప్రత్యేక యూఏఈ ప్రతినిధి బృందం హైదరాబాద్, ముంబై, పుణె నగరాల్లోని భారత వ్యాపార ప్రముఖులతో సమావేశ మవుతుందన్నారు. ఈ ఈవెంట్‌లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి 150కిపైగా వ్యాపారవేత్తలు పాల్గొంటారని చెప్పారు. పలు రంగాలకు చెందిన ఐటీ, మాన్యుఫ్యాక్చరింగ్, రియల్ ఎస్టేట్, ఫార్మా, హెల్త్‌కేర్, గోల్డ్ అండ్ జ్యువెలరీ స్టార్టప్‌ల ప్రతినిధులు ఈ కార్యక్రమంలో భాగస్వాములవుతారని వివరించారు. ఈ సందర్భంగా ఒక ఒప్పందాన్ని కుదుర్చుకుంటామన్నారు. రకేజ్ సంస్థ 30 వేల కంపెనీలకు నిలయమని, వీటిలో 7 వేలకుపైగా భారతీయ కంపెనీలు ఉంటాయని పేర్కొన్నారు. 100 శాతం విదేశీ యజమాన్యం, పన్ను మినహాయింపు, తక్కువ ఖర్చుతో కంపెనీ సెటప్, వేగవంతమైన ప్రక్రియల కారణంగా రకేజ్ సంస్థ భారత వ్యాపారాలకు అత్యంత అనుకూలమైనదిగా గుర్తించిందన్నారు.

ఇనార్బిట్‌లో షాపింగ్ ఫెస్ట్



- వందకుపైగా టాప్ బ్రాండ్లతో సందడి
- మ్యూజిక్ ఫెస్ట్, ఫ్లాష్ మాబ్ ప్రదర్శనలు కూడా..

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని ఇనార్బిట్ మాల్ వేదికగా మూడు రోజులపాటు షాపింగ్, మ్యూజిక్ ఫెస్ట్, ఫ్లాష్ మాబ్ వంటి వినూత్న కార్యక్రమాలతో సందడి నెలకొననుంది. ఇనార్బిట్ నియోటౌట్ పేరుతో ప్రత్యేక షాపింగ్ ఫెస్టివల్‌ను శుక్రవారం నుంచి అందుబాటులోకి తీసుకువచ్చారు. మాల్‌లో వందకుపైగా టాప్ బ్రాండ్లలో 50 శాతం ఆఫ్ అవుట్ అయ్యేలా నిర్వహిస్తున్న ఈ రెండో ఎడిషన్‌ను ఈ నెల 6 వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రత్యేక డిస్కౌంట్లతోపాటు ప్రత్యక్ష వినోదం, సందడి చేసే నైట్‌లైఫ్ వైబ్స్, ఇతర లైఫ్‌స్టైల్ ఈవెంట్లతో అలరించనున్నారు. ముఖ్యంగా రిటైల్ షాపింగ్ అర్ధరాత్రి వరకు తెరిచి ఉండటం విశేషం. మూడు రోజుల వేడుకలు శుక్రవారం ప్రత్యేకమైన కాఫీ రేవ్‌తో ప్రారంభమై సెంట్రల్ డీజే జోన్ టిమ్ హోర్టన్స్, థర్డ్ వేవ్, స్టార్‌బక్స్ బారిస్టాతోసహా ఐకానిక్ బ్రూవర్లు తదితరాలు ఉన్నాయి. సాయంత్రం సుగంధ కాఫీతో ఎలక్ట్రిక్ సంగీతాన్ని సమ్మిళితం చేస్తూ హోరెత్తించే కార్యక్రమాలు ఉన్నాయి. ప్రత్యేకంగా నేడు సందర్శకులకు అక్షర్ బ్యాండ్, రేపు గ్రాండ్ ఫైనల్ ఒక ఫ్లాష్ మాబ్ అలరించనుందని నిర్వాహకులు పేర్కొన్నారు. ఇందులో భాగంగా 15 మంది ప్రొఫెషనల్ డ్యాన్సర్లు మాల్ అంతటా 20 నిమిషాలపాటు అదిరిపోయే ఫ్లాష్ మాబ్ ప్రదర్శన ఇవ్వనున్నట్లు తెలిపారు.



హైధరబాద్

ముంబై తర్వాత అధిక ధరలు మన దగ్గరే..

- గ్రేటర్‌లో చ.అ.కు ప్రారంభ ధర రూ.5,800
- బాచుపల్లి, తెల్లాపూర్, గండిపేట, మియాపూర్ ప్రాంతాలకు డిమాండ్
- అందుబాటు ధరలలోని ఇళ్ల విక్రయాలలో అత్యధిక వృద్ధి

సాక్షి, సిటీబ్యూరో: ఒకప్పుడు దేశంలోని మెట్రో నగరాలతో పోలిస్తే మన నగరంలోనే అపార్ట్‌మెంట్ల ధరలు తక్కువగా ఉండేవి. కానీ, ఇప్పుడు పరిస్థితి మారింది. దేశంలో ముంబై తర్వాత ఖరీదైన సిటీగా మన నగరం అభివృద్ధి చెందింది. రెండో అత్యంత ఖరీదైన నగరంగా మారిపోయింది. వార్షిక ప్రాతిపదికన హైదరాబాద్‌లో ప్రాపర్టీల విలువ 6 శాతం వృద్ధి చెంది.. చ.అ. ధర సగటున రూ.5,800 నుంచి రూ.6 వేలకు పెరిగింది. ముంబైలో ఏడాదిలో 3 శాతం పెరిగి.. రూ.9,600 నుంచి రూ.9,800లకు చేరిందని ప్రాప్‌టైగర్.కామ్ నివేదిక వెల్లడించింది.

- దాదాపు పదేళ్ల కాలంలో అతి తక్కువ గృహ రుణ వడ్డీ రేట్లు ఉండటం, స్టాంప్ డ్యూటీలను తగ్గించడం, సర్కిల్ ధరలలో సవరణలతో పాటు గృహ కొనుగోళ్లలో కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న ప్రోత్సాహకాలతో అందుబాటు ధరలలోని ఇళ్ల విక్రయాలలో అత్యధిక వృద్ధి నమోదైంది. ఒకవైపు సిమెంట్, స్టీలు వంటి నిర్మాణ సామగ్రి ధరలు విపరీతంగా పెరుగుతున్నప్పటికీ.. నిర్మాణ సంస్థలు కొనుగోలుదారులకు రాయితీలను అందిస్తున్నారు. లేదంటే ఆయా నగరాలలో ధరలు విపరీతంగా పెరిగే ప్రమాదముంది.




రియల్ ఎస్టేట్‌లో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(ఐటీ) రంగం కీలకమైంది. మన సిటీ స్థిరాస్తికి ఐటీ బూస్ట్‌లాగా మారింది. ఐటీ ఉద్యోగులపై ఆధారపడి గృహ విక్రయాలు జరుగుతాయి.. అంతకు రెట్టింపు స్థాయిలో ఐటీ సంస్థల లావాదేవీలు జరుగుతున్నాయి. గచ్చిబౌలి, మాదాపూర్ వంటి పశ్చిమాది ప్రాంతాలకే పరిమితమైన ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(ఐటీ) ఆఫీస్ స్పేస్.. గ్రోత్ ఇన్ డిస్పర్షన్ (గ్రిడ్) పాలసీతో నగరం నలువైపులా విస్తరించింది. ఈ పాలసీలో భాగంగా ప్రభుత్వం ఔటర్ వెంబడి ఉత్తర, తూర్పు ప్రాంతాల్లో ఉన్న 11 పారిశ్రామిక పార్క్‌లను ఐటీ పార్క్‌లుగా మార్చింది. దీంతో పాటు కొంపల్లిలో ఐటీ టవర్, కొల్లూరులో ఐటీ పార్క్‌లను నిర్మిస్తోంది. ఫలితంగా పశ్చిమం వైపున కాకుండా ఇతర ప్రాంతాలలో కొత్తగా 3.5–4 కోట్ల చ.అ. ఐటీ ఆఫీస్ స్పేస్ అందుబాటులోకి రానుందని జేఎల్‌ఎల్ తెలిపింది. – సాక్షి, సిటీబ్యూరో

ఐటీ పార్క్‌లతో..

స్థిరాస్తి వృద్ధి

గ్రేడ్-ఏ ఆఫీస్ స్పేస్ లావాదేవీల్లో సిటీ టాప్

నగరంలో ఆఫీస్ స్పేస్ 10 కోట్ల చ.అ.	గ్రిడ్ పాలసీతో 3.5–4 కోట్ల చ.అ. స్థలం		జేఎల్‌ఎల్ నివేదిక వెల్లడి



గ్రేడ్-ఏ ఆఫీస్ స్పేస్ లావాదేవీల్లో హైదరాబాద్ దూసుకెళుతోంది. దేశంలోని ఇతర మెట్రో నగరాల కంటే గణనీయమైన వృద్ధి రేటు నమోదు చేస్తోంది. ఈ క్రమంలో ప్రస్తుతం 9.04 కోట్ల చ.అ. ఆఫీస్ స్పేస్ ఉన్న మన సిటీ.. ఈ ఏడాది ముగింపు నాటికి 10 కోట్ల చ.అ. మైలురాయిని దాటనుందని జేఎల్‌ఎల్ సర్వేలో తేలింది. ఆఫీస్ స్పేస్ మార్కెట్‌లో బెంగళూరు, ముంబై, ఢిల్లీ-ఎన్‌సీఆర్ తర్వాత హైదరాబాద్ నాల్గో స్థానంలో నిలిచింది. కొంత కాలంగా కొంపల్లి, బాచుపల్లి, మేడ్చల్ వంటి ఉత్తరాది ప్రాంతాలు, ఎల్బీనగర్, ఉప్పల్, పోచారం వంటి తూర్పు ప్రాంతాలలో నివాస క్రయవిక్రయాలు జోరందుకున్నాయి. ఆయా ప్రాంతాలలోని అందుబాటు గృహాలను ఐటీ ఉద్యోగులు కొనుగోలు చేస్తున్నారు.

81 శాతం వృద్ధి రేటు..

కొన్నేళ్లుగా గ్రేడ్-ఏ ఆఫీస్ స్పేస్ మార్కెట్లో హైదరాబాద్ నగరం మెరుగైన స్థానాన్ని నమోదు చేస్తుంది. హైదరాబాద్ తర్వాత రెండో స్థానంలో ఉన్న బెంగళూరు గత ఆరేళ్లలో 47 శాతం వృద్ధిని నమోదు చేసింది. దేశవ్యాప్తంగా అన్ని నగరాల్లోని గ్రేడ్-ఏ ఆఫీస్ స్పేస్ మార్కెట్ విభాగంలో హైదరాబాద్ నగర భాగస్వామ్యం ఇటీవలి వరకు 12.7 శాతంగా ఉండగా.. కొత్తగా అందుబాటులోకి వచ్చిన స్పేస్‌తో 25 శాతానికి పెరిగింది.

గ్రిడ్ పాలసీ అమలుతో..



గ్రిడ్ పాలసీతో నగరం నలువైపులా ఐటీ విస్తరించింది. డెవలపర్లకు ప్రభుత్వం ప్రోత్సాహకాలను కూడా అమలు చేస్తోంది. మూడు సంవత్సరాల వ్యవధిలో 500 లేదా అంతకంటే ఎక్కువ మందికి ఉపాధి కల్పిస్తున్న ఐటీ, ఐటీఈఎస్ యూనిట్లకు యాంకర్ యూనిట్ ప్రోత్సాహకాలను అందిస్తోంది. ఇందులో సంబంధిత భూమిని 50 శాతం ఐటీ, ఐటీఈఎస్ ప్రయోజనాల కోసం వినియోగించగా.. మిగిలిన సగంలో నివాస, వాణిజ్య ప్రయోజనాలకు వినియోగించవచ్చనే వెసులుబాటు కల్పించింది. హైదరాబాద్ ఆఫీస్ స్పేస్ మార్కెట్ అనేది కేవలం రెండు ప్రధాన కారిడార్లలోనే కేంద్రీకృతమై ఉంది. హైటెక్‌సిటీ, గచ్చిబౌలి ప్రాంతాలు గ్రేడ్-ఏ ఆఫీస్ స్పేస్ మార్కెట్ ఇంజిన్లుగా పనిచేస్తున్నాయి. 96 శాతం స్పేస్ ఈ ప్రాంతాల నుంచే ఉంటుంది.



బ్యూటీఫుల్.. లుక్



- చిత్రకారుడు గీసిన చిత్రంలా..
- విదేశీ గ్రానైట్‌కు ఆదరణ
- చదరపు అడుగుకి రూ.2,500 వరకు..

ఇంటి అందం ద్విగుణీకృతం చేయడానికి.. కొందరు గృహ యజమానులు ఖర్చుకు వెనకాడట్లేదు. ఇంటి అలంకరణలో తమదైన ప్రత్యేక ముద్ర ఉండాలని కోరుకుంటున్నారు. ఇలాంటి వారికోసమే ప్రపంచంలో అరుదుగా దొరికే గ్రానైట్లు బోలెడు ఉన్నాయి. వీటిని ఎంచుకోవడానికి ఏ అమెరికాకో ఆఫ్రికాకో వెళ్లక్కర్లేదు. ఎంచక్కా మన నగరంలోనే ఇవి లభిస్తున్నాయి. చిత్రకారుడి కుంచె నుంచి జాలువారిన చిత్రంలా దర్శనమిచ్చే గ్రానైట్ రకాలకు ప్రపంచ మార్కెట్లో ఎక్కడ్లేని గిరాకీ పెరుగుతోంది. వీటికోసం చదరపు అడుగుకి రూ.2,500 దాకా పెట్టాల్సి ఉంటుంది. వీటిని గోడలకు అమరిస్తే.. అచ్చం చిత్రకారుడు వేసిన బొమ్మల మాదిరిగానే కనిపిస్తాయి. – సాక్షి, సిటీబ్యూరో

యూరప్, అమెరికా, సౌదీ అరేబియా, ఆఫ్రికా, అంగోలా, నమీబియా, మడగాస్కర్, నార్వే, ఫిన్లాండ్, బ్రెజిల్, ఐస్‌ల్యాండ్ వంటి దేశాలకు చెందిన గ్రానైట్‌కు ప్రపంచ మార్కెట్లో ఎక్కడ్లేని గిరాకీ ఉంది. మరి ఇవి విదేశాల నుంచి ఇక్కడికి ఎలా చేరుకుంటాయనేది మీ సందేహమా? ఆయా దేశాల నుంచి ఇవన్నీ నౌకలో ముంబైకి దిగుమతి అవుతాయి. అక్కడి నుంచి రైలు మార్గంలో నగరానికి.. లారీల ద్వారా సిటీ చుట్టుపక్కల ఉన్న గ్రానైట్ పరిశ్రమలకు చేరుకుంటాయి.

ఒక్కో గ్రానైట్..

ఒక్కో గ్రానైట్ బ్లాకు 25 నుంచి 35 టన్నుల దాకా ఉంటుంది. మొదట్లో కాస్త ఎత్తుపల్లాలుగా ఉన్న గ్రానైట్‌ను.. బడా యంత్రాల సాయంతో డ్రెస్సింగ్ చేస్తారు. పాలిష్ చేసి ఎగుడుదిగుడు లేకుండా చేస్తారన్నమాట. ఆ తర్వాత స్టీల్ గ్రిట్ బ్లేడ్లతో కత్తిరించి డైమండ్ బ్రిక్సతో పాలిష్ చేస్తారు. బ్రెడ్డును ముక్కలుగా కోసినట్లే.. భారీ ఆకారం గల గ్రానైట్ బ్లాకును కోస్తారన్నమాట. ఈ ప్రక్రియ తర్వాత ఒక్కో ముక్కను వేడి చేసే ఓవెన్‌లో పెడతారు. ఫలితంగా గ్రానైట్‌లో ఉన్న నీరంతా ఆవిరవుతుంది. ఆ తర్వాత రెసిన్ పెడతారు. దీని వల్ల భవిష్యత్తులో గ్రానైట్ నీరు పీల్చుకోకుండా ఉంటుంది. తర్వాత ప్రక్రియ క్యూరింగే.. ఇదయ్యాక పాలిష్ అవ్వగానే గ్రానైట్ తళతళ మెరుస్తుంది. మొత్తం ఏడు రోజులు జరిగే ఈ ప్రక్రియ పూర్తయ్యాక.. గ్రానైట్ ప్రపంచ దేశాలకు ఎగుమతికి సిద్ధమవుతుంది.

ఇంటికే ప్రత్యేకం..

హైదరాబాద్ నుంచి దాదాపు ఎనభై రంగులు గల గ్రానైట్.. వివిధ దేశాలకు ఎగుమతి అవుతోంది. సౌదీ అరేబియాకు చెందిన 'ట్రాపిక్ బ్రౌన్' ధర చ.అ.కు 300 దాకా ఉంటుంది. అదే నార్వే 'బ్లూ పెరల్' రేటు రూ.500 వరకూ పలుకుతుంది. ఇక ఫిన్‌లాండ్ 'బాల్టిక్ బ్రౌన్' ధర కూడా ఇంచుమించు రూ.300లు ఉంటుంది. ఇవి కాకుండా ఖరీదైన రకాలు బోలెడున్నాయి.

మేలిమి గ్రానైట్..

యూరప్ ఐస్‌లాండ్‌ల మధ్య.. అక్కడక్కడా విసిరేసినట్లు కన్పించే చిన్న చిన్న దీవుల్లో మేలిమి రకమైన గ్రానైట్ లభిస్తోంది. యూరప్ నుంచి అక్కడికి వెళ్లడానికే కనీసం మూడు రోజులైనా పడుతుందని నిపుణులు చెబుతున్నారు. 'బ్లాక్ బ్యూటీ' గ్రానైట్ కోసం చదరపు అడుగుకి రూ.2 వేల దాకా పెట్టాల్సి ఉంటుంది. బ్రెజిల్‌లో దొరికే 'అమెజాన్' రకం ధర.. చదరపు అడుగుకి రూ.1,600 ఉంటుంది. ఇదే రకాన్ని మీ ఇంట్లో వేయాలనుకుంటే మీకయ్యేది సుమారు వెయ్యి రూపాయలే. అదెలా అంటారా? మీకేం కావాలో గ్రానైట్ సంస్థలకు చెబితే వాటిని చిన్నచిన్న బ్లాకులుగా తీసుకొచ్చి అందజేస్తారు. కాకపోతే ఆర్డర్ ఇచ్చిన మూడు నెలల తర్వాతే ఇవి ఇంటికి చేరుతాయి. కాబట్టి, ఇంటి నిర్మాణం నాటి నుంచే గ్రానైట్‌కు సంబంధించి అవగాహనకు రావడం ఉత్తమం.

విల్లాసం

- శివారు ప్రాంతాలలో జోరుగా విల్లా ప్రాజెక్ట్‌లు
- ఎన్నారై, హెచ్‌ఎన్‌ఐ కొనుగోళ్ల వృద్ధి

సాక్షి, సిటీబ్యూరో: కోవిడ్ తర్వాత విల్లాలపై ఆసక్తి మరింత పెరిగింది. సామాన్య, మధ్యతరగతితో పోలిస్తే కరోనా లగ్జరీ గృహ కొనుగోలుదారుల మీద పెద్దగా ప్రభావం చూపించలేదు. ఫలితంగా ఈ విభాగం గృహ విక్రయాలలో వృద్ధి నమోదవుతోంది. ఎక్స్ఛేంజ్ రేటు తక్కువగా ఉండటం కారణంగా ప్రవాసులు, హై నెట్‌వర్త్ ఇండివిడ్యువల్స్ (హెచ్‌ఎన్‌ఐ) లగ్జరీ గృహాల కొనుగోళ్లకు మొగ్గు చూపుతున్నారు. మరోవైపు డెవలపర్లు అందించే డిస్కౌంట్లు, ఆఫర్లు కూడా ఆయా వర్గాల కొనుగోలుదారులను ఆకర్షిస్తున్నాయి.

పశ్చిమంలో హవా..

హైదరాబాద్ రియల్టీ మార్కెట్‌లో పశ్చిమ ప్రాంతాల హవా కొనసాగుతోంది. మూడు త్రైమాసికాల నుంచి కొత్త ప్రాజెక్ట్స్ లాంచింగ్స్ పశ్చిమ హైదరాబాద్‌లో 57 శాతం జరిగాయి. ఉత్తరాదిలో 18 శాతం, తూర్పులో 15 శాతం, సెంట్రల్‌లో 8 శాతం, సౌత్ హైదరాబాద్‌లో 2 శాతం లాంచింగ్స్ జరిగాయి. వెస్ట్ హైదరాబాద్‌లో తెల్లాపూర్, బాచుపల్లి, సౌత్‌లో అత్తాపూర్‌లు రియల్టీ హాట్‌స్పాట్స్‌గా మారాయి. ఓపెన్ ప్లాట్లలో పెట్టుబడులు పెట్టే బదులు సొంతంగా ఇల్లు కట్టుకునేందుకు చాలా మంది కస్టమర్లు ఆసక్తి చూపిస్తున్నారు. డిమాండ్‌కు తగ్గట్టుగా సరఫరా ఉంటుందన్న సూత్రం ప్రకారమే.. డెవలపర్లు కూడా ప్రాజెక్ట్ లాంచింగ్‌లలో లగ్జరీకే ప్రాధాన్యం ఇస్తున్నారు.





స్టూడియో డౌన్

కరోనా తర్వాతి నుంచి విస్తారమైన ఇళ్లకు ఆదరణ
దీంతో స్టూడియో అపార్ట్‌మెంట్లకు తగ్గుతున్న గిరాకీ

సాక్షి, సిటీబ్యూరో: కరోనా కంటే ముందు ఇల్లు అంటే నాలుగు గోడల భవనం. సంపాదన బిజీలో పడిన సగటు జీవికి కాసేపు సేద తీరాలనుకునే గూడు. కానీ, కోవిడ్ తర్వాత నుంచి ఇల్లే ప్రపంచమైపోయింది. తినడం, పడుకోవడం మాత్రమే కాదు.. ఆఫీసు, స్కూల్, వ్యాయామం, వినోదం అన్నీ.. ఇంటి నుంచే! ఫలితంగా కోవిడ్ కంటే ముందు హాట్ కేకుల్లాంటి స్టూడియో అపార్ట్‌మెంట్లకు.. క్రమంగా డిమాండ్ పడిపోయింది. వీటి స్థానంలో విస్తీర్ణమైన గృహాలకు గిరాకీ పెరిగింది.

- బెడ్ కం లివింగ్ రూమ్, కిచెన్, అటాచ్‌డ్ బాత్‌రూమ్ ఉండే వాటిని స్టూడియో అపార్ట్‌మెంట్ అంటారు. కరోనా మొదలైన ఏడాది(2020) నుంచి దేశంలోని ఏడు ప్రధాన నగరాలలో ఈ తరహా అపార్ట్‌మెంట్ల సరఫరా క్రమంగా క్షీణిస్తూ వస్తోంది. ఈ ఏడాది తొలి అర్ధ వార్షికం(జనవరి-జూన్)లో 1,063 ప్రాజెక్ట్‌లు లాంచింగ్ కాగా.. ఇందులో కేవలం 9 శాతం(91 ప్రాజెక్ట్‌లు) మాత్రమే స్టూడియో అపార్ట్‌మెంట్ ప్రాజెక్ట్‌లు ఉన్నాయని అనరాక్ రీసెర్చ్ తాజా నివేదిక వెల్లడించింది. గతేడాది 1,207 ప్రాజెక్ట్‌లు లాంచింగ్ కాగా.. ఇందులో 145 ప్రాజెక్ట్‌లు స్టూడియో అపార్ట్‌మెంట్లున్నాయి. 2020లో 884 ప్రాజెక్ట్‌లు ప్రారంభం కాగా.. ఇందులో 15 శాతం వాటాతో 130 ప్రాజెక్ట్‌లు ఈ తరహా అపార్ట్‌మెంట్లున్నాయి. అలాగే 2019లో 1,921 ప్రాజెక్ట్‌లు లాంచింగ్ అయ్యాయి. 368 ప్రాజెక్ట్‌లు(19 శాతం) ఈ స్టూడియో ఇళ్లే..

లొకేషన్ ముఖ్యం..

స్టూడియో అపార్ట్‌మెంట్లను బ్యాచిలర్స్, పర్యాటకులు, వ్యాపార ప్రయాణికులు, యువ దంపతులు ఎక్కువగా కొనుగోలు చేస్తుంటారు. విస్తీర్ణంతో కాకుండా లొకేషన్ ఆధారంగా డిమాండ్ ఉంటుంది. తరచూ ఇవి ఉపాధి, వ్యాపార కేంద్రాలు చుట్టూ, ఖరీదైన ప్రదేశాలలో ఎక్కువగా ఉంటాయని అనరాక్ గ్రూప్ సంస్థ తెలిపింది. కరోనా కారణంగా వర్క్ ఫ్రం హోమ్ సంస్కృతి మొదలైంది. దీంతో 2020 నుంచి పెద్ద సైజు ఇళ్లకు డిమాండ్ పెరిగినట్లు చెప్పింది.

మన దగ్గర తక్కువే..

స్టూడియో అపార్ట్‌మెంట్లకు ఉత్తరాది నగరాలలో ఉన్నంత డిమాండ్ దక్షిణాదిలో ఉండదు. ముంబై, పుణే నగరాలో ఈ తరహా ఇళ్ల ట్రెండ్ నడుస్తోంది. 2013–20 మధ్య కాలంలో దేశంలోని 7 ప్రధాన నగరాలలో లాంచింగ్ అయిన స్టూడియో అపార్ట్‌మెంట్లలో 96 శాతం వాటా ముంబై, పుణేలదే.. ఇదే కాలంలో దక్షిణాది నగరాలైన బెంగళూరు, చెన్నై, హైదరాబాద్‌లలో కేవలం 34 స్టూడియో ప్రాజెక్ట్‌లు ప్రారంభమయ్యాయి. ఈ ఏడాది హెచ్-1లో 7 నగరాలలో ప్రారంభమైన 91 స్టూడియో ప్రాజెక్ట్‌లలో.. 71 ప్రాజెక్ట్‌లు ముంబైలోనే ఉన్నాయి. ఆ తర్వాత పుణేలో 18, బెంగళూరులో రెండు ప్రాజెక్ట్‌లు లాంచింగ్ అయ్యాయి.

రోబో.. ఈజీ

- నది ఇసుక కొరత, అధిక ధర
- ప్రత్యామ్నాయంపై రియల్టర్ల చూపు

సాక్షి, సిటీబ్యూరో: నది ఇసుక కొరత, అధిక ధరల కారణంగా గ్రేటర్ నిర్మాణ రంగంపై తీవ్ర ప్రభావం పడింది. ఇసుక రవాణాదారులు రేట్లు పెంచడం నిర్మాణ రంగానికి మరింత భారంగా పరిణమించింది. మహానగరంలో ఇసుక దొరకడం గగనమవడంతో బిల్డర్లు ప్రత్యామ్నాయంగా రోబో ఇసుక వినియోగాన్ని పెంచారు.

ధర తక్కువే..

ఇప్పటికే కాంక్రీట్ మిక్సింగ్ యూనిట్లలో రోబో ఇసుక (క్రష్డ్ రాక్ సాండ్)ను వినియోగిస్తున్న సంగతి తెలిసిందే. ఇసుక రేట్లతో పోలిస్తే దీని ధర ఎంతో తక్కువ. అయితే రోబో ఇసుక విరివిరిగా దొరక్కపోవడం.. ప్రత్యేకంగా కొన్ని క్రషర్లలోనే ఇలాంటి ఇసుకను ఉత్పత్తి చేస్తుండటంతో సాధారణ గృహ నిర్మాణాల్లో దీని వినియోగం తక్కువగా ఉంది. అలాగే రోబో ఇసులాగే మెటల్ క్రషింగ్ స్టోన్ డస్ట్ కూడా ఉండటం వీటిలో నాణ్యమైన ఇసుకను గుర్తించడం కష్టంగా మారుతోంది.

రోబో తయారీ ఈజీ..

నగర శివార్లలో విరివిగా లభ్యమయ్యే గ్రానైట్ శిలలతో రోబోశాండ్‌ను ఉత్పత్తి చేయవచ్చు. మెటల్ క్రషర్స్‌లో మిగిలిన వ్యర్థ శిలలను 2ఎంఎం, 1ఎంఎం పరిమాణంలో క్రష్ చేసి జల్లెడ పడితే ఈ ఇసుక తయారవుతుంది. తక్కువ సమయంలో నాణ్యత కలిగిన ఇసుకను తయారు చేయవచ్చన్నది నిపుణుల మాట. ఈ ఇసుకను నగరంలో రెడీమిక్స్ యూనిట్ల ద్వారా భారీ నిర్మాణాలకు వినియోగిస్తున్నారు.



క్లుప్తంగా...

రిజర్వేషన్లకు కేంద్రంపై ఒత్తిడి పెంచండి

ఖర్గేకు బీసీ సంక్షేమ సంఘం వినతి



సాక్షి, హైదరాబాద్: బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ కేంద్రానికి పంపిన బిల్లుకు ఆమోదం లభించేలా ఒత్తిడి పెంచాలని, సీఎం రేవంత్ నేతృత్వంలో అఖిలపక్ష బృందాన్ని త్వరగా ఢిల్లీకి తీసుకెళ్లాలని బీసీ సంక్షేమ సంఘం కోరింది. సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ నేతృత్వంలోని బృందం శుక్రవారం గాంధీభవన్‌లో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేసింది. బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించిన తర్వాతే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని కోరింది. రాష్ట్రంలో జనాభా దామాషా ప్రకారం బీసీలకు పదవులు ఇవ్వాలని, ఒక ఉపముఖ్యమంత్రితో పాటు మరో ఇద్దరు మంత్రు లుగా బీసీలకు అవకాశం కల్పించాలని, కార్పొరేషన్ పదవుల్లోనూ బీసీలకు తగిన వాటా కల్పించాలని ఖర్గేకు బీసీ సంఘం విజ్ఞప్తి చేసింది.

సొంత జిల్లా ప్రాజెక్టులపై సీఎంకు మమకారం లేదు

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ



క్రస్ట్ గేట్ల రోప్‌లను పరిశీలిస్తున్న జాన్‌వెస్లీ

అమరచింత: సీఎం రేవంత్‌రెడ్డికి సొంతజిల్లాలోని సాగునీటి ప్రాజెక్టు నిర్వహణపై ఏ మాత్రం మమకారం లేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. శుక్రవారం జూరాల ప్రాజెక్టును సందర్శించి తెగిన క్రస్ట్ గేట్ల రోప్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా జాన్‌వెస్లీ మాట్లాడుతూ ఉమ్మడి పాలమూరు జిల్లాకు వరప్రదాయినిగా ఉన్న జూరాల ప్రాజెక్టు ప్రమాదంలో ఉందని తెలిసినా రేవంత్‌రెడ్డి ప్రాజెక్టును సందర్శించలేనంత బిజీగా ఉన్నారని విమర్శించారు. ఈ ప్రాంత బిడ్డనని, ఇక్కడి సాగు, తాగునీరు సమస్యల తలెత్తకుండా చేస్తానని ప్రకటనలు చేయడం కాదని, ఇక్కడి ప్రాజెక్టుల నిర్వహణ కోసం వెంటనే రూ.2,500 కోట్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పాలమూరు వాసులు సాగునీరు అందక ఇతర ప్రాంతాలకు వలస వెళ్లకుండా ప్రభుత్వం వెంటనే ప్రాజెక్టులకు నిధులు మంజూరు చేయాలన్నారు. జూరాల గేట్ల రోప్‌లను ఐదేళ్లకోసారి మార్చాల్సి ఉండగా.. నిధులను అధికారులు దుర్వినియోగం చేస్తూ మరమ్మతులు మరిచారని ఆరోపించారు.

మోదీని ఇంట్లో కూర్చోబెట్టాలి

- అప్పుడే దేశంలో రాజ్యాంగ హక్కులకు రక్షణ ఉంటుంది
- టీపీసీసీ విస్తృత స్థాయి సమావేశంలో మల్లికార్జున ఖర్గే
- రాజ్యాంగం స్థానంలో మనుధర్మాన్ని తేవాలనేది బీజేపీ ఆలోచన
- మనుధర్మంలో మహిళలకు, బడుగు, బలహీన వర్గాలకు గౌరవం ఉండదు
- పార్టీ నేతలు ఈ విషయాలన్నీ ప్రజల్లోకి తీసుకెళ్లాలన్న ఏఐసీసీ చీఫ్
- కార్యకర్తలు ఆ పార్టీతో యుద్ధానికి సన్నద్ధం కావాలని పిలుపు



టీపీసీసీ విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న మల్లికార్జున ఖర్గే. చిత్రంలో సీఎం రేవంత్, కేసీ వేణుగోపాల్, పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి, ఇతర ముఖ్యనేతలు

సాక్షి, హైదరాబాద్: నరేంద్ర మోదీని ప్రధాని పదవి నుంచి దింపి ఇంట్లో కూర్చోబెడితేనే దేశంలో రాజ్యాంగం కల్పించిన హక్కులకు రక్షణ ఉంటుందని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వ్యాఖ్యానించారు. ఎప్పుడో ఇందిర విధించిన ఎమర్జెన్సీ గురించి బీజేపీ నేతలు మాట్లాడుతున్నారని, అయితే గత 11 ఏళ్లుగా దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ నడుస్తోందని మండిపడ్డారు. రాజ్యాంగం గురించి, దేశంలో హక్కుల గురించి మాట్లాడే హక్కు బీజేపీ నేతలకు లేదని స్పష్టం చేశారు. శుక్రవారం గాంధీభవన్‌లో టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి.మహేశ్‌కుమార్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన పార్టీ విస్తృతస్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

గాంధీ కుటుంబాన్ని అవమానించడమే పని

దేశ స్వాతంత్య్రం కోసం పోరాడిన కాంగ్రెస్ పార్టీని, దేశం కోసం ప్రాణాలనే త్యాగం చేసిన గాంధీ కుటుంబాన్ని అవమానించడమే బీజేపీ పనిగా పెట్టుకుందని ఖర్గే విమర్శించారు. స్వాతంత్య్రం కోసం కాంగ్రెస్ పార్టీ ఉద్యమం చేసినప్పుడు బీజేపీ, ఆరెస్సెస్‌లు ఎక్కడున్నాయని ప్రశ్నించారు. స్వాతంత్య్రం కోసం పోరాడిన గాంధీని కాల్చిచంపిన చరిత్ర వారిదని ధ్వజమెత్తారు. రాజ్యాంగం స్థానంలో మనుధర్మాన్ని అమలు చేయాలనేది బీజేపీ ఆలోచన అని, ఆ ధర్మంలో మహిళలకు, బడుగు, బలహీన వర్గాలకు గౌరవం ఉండదని చెప్పారు. మహిళలకు, బలహీన వర్గాలకు గౌరవం, చదువు, అధికారం, అవకాశాలు అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం ద్వారానే సాధ్యమని అన్నారు. ఈ విషయాలన్నింటినీ కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని, బీజేపీపై యుద్ధానికి కార్యకర్తలు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు.

ప్రభుత్వ కృషి అభినందనీయం

తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం బాగా పనిచేస్తోందని ఖర్గే కితాబిచ్చారు. ఎన్నికల మేనిఫెస్టో అమలుకు సర్కారు కృషి అభినందనీయమని, ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేసే ఏకైక పార్టీగా కాంగ్రెస్ చరిత్రలో నిలిచిపోతుందని అన్నారు. పార్టీ నేతలు తమకు వచ్చిన పదవులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పార్టీ కోసం కష్టపడిన వారికి, సమర్థులకు మాత్రమే పదవులు ఇవ్వాలని టీపీసీసీ అధ్యక్షుడికి సూచించారు. పార్టీ నేతలు ఎక్కడంటే అక్కడ ఇష్టానుసారం మాట్లాడవద్దని, పార్టీ నియమావళికి కట్టుబడి పని చేయాలని చెప్పారు

పదవులు సద్వినియోగం చేసుకోవాలి: మహేశ్‌గౌడ్

టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ మాట్లాడుతూ సామాజిక న్యాయం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని చెప్పారు. పార్టీ ఇచ్చిన పదవులను సద్వినియోగం చేసుకోవాల్సిన బాధ్యత నేతలపై ఉందని అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌లతో పాటు కార్పొరేషన్ల చైర్మన్లు, పార్టీ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, అధికార ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. మంత్రి పొన్నం ఆధ్వర్యంలో రూపొందించిన రవాణా, బీసీ సంక్షేమ శాఖల ప్రగతి నివేదికలను ఖర్గే, రేవంత్ తదితరులు ఈ సందర్భంగా ఆవిష్కరించారు.

పదేళ్లు కాంగ్రెస్‌దే అధికారం: సీఎం రేవంత్

సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. దేశంలోని అన్ని రాష్ట్రాలకు తెలంగాణ ఆదర్శంగా నిలుస్తోందని చెప్పారు. కేంద్రం మెడలు వంచి జనగణనలో భాగంగా కులగణన చేయించడంలో విజయం సాధించామని అన్నారు. విద్య, ఉద్యోగ, ఉపాధి కల్పనలో ముందుకెళుతున్నామని తెలిపారు. రాబోయే రోజుల్లో అసెంబ్లీ, పార్లమెంటు సీట్లు పెరుగుతాయని, మహిళా రిజర్వేషన్లు అమలవుతాయని చెప్పారు. 2029 ఎన్నికలు పార్టీలో నూతన నాయకత్వానికి వేదిక కావాలని ఆకాంక్షించారు. నాయకులుగా ఎదిగేందుకు ఇప్పటి నుంచే కష్టపడాలని, సుదీర్ఘకాలం ప్రజాప్రతినిధిగా ఉన్న ఖర్గేను స్ఫూర్తిగా తీసుకుని పనిచేయాలని సూచించా రు. తెలంగాణలో రాబోయే పదేళ్లలో కాంగ్రెస్ పార్టీదే అధికారమని, రెండోసారి అధికారంలోకి వచ్చేందుకు ఇప్పటి నుంచే ప్రణాళికలు రూపొందించుకోవాలని అన్నారు.

గ్రూపులు కడతామంటే కుదరదు: ఖర్గే

- నలుగురం కలిసి ఏదో కిందా మీదా చేద్దామనుకుంటే నేను, రాహుల్ భయపడం
- ఇష్టానుసారం మాట్లాడుతూ రచ్చకెక్కితే ఉపేక్షించం
- పార్టీ నేతలకు ఏఐసీసీ అధ్యక్షుడు సీరియస్ వార్నింగ్!
- పీఏసీ, సలహా కమిటీ సమావేశాల్లో పలు సూచనలు
- కాంగ్రెస్ కార్యకర్తలపై ప్రభుత్వం కేసులు ఎత్తేయాలి
- పదవుల భర్తీకి ఈ నెల 30 డెడ్‌లైన్‌గా పెట్టుకోవాలి
- బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చి తీరుతాం: సీఎం రేవంత్

సాక్షి, హైదరాబాద్: 'గ్రూపులు కట్టి ఏదో చేద్దామనుకుంటే కుదరదు. నలుగురం కలిసి కింద మీద చేద్దాం అనుకుంటే నేను, రాహుల్ భయపడే వాళ్లం కాదు..' అని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్పష్టం చేశారు. ఏ సమస్య ఉన్నా పార్టీ అంతర్గత వేదికలపైనే మాట్లాడుకోవాలంటూ సీరియస్ వార్నింగ్ ఇచ్చినట్లు సమాచారం. శుక్రవారం ఉదయం గాంధీభవన్‌లో టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ అధ్యక్షతన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ), సలహా కమిటీల సమావేశం జరిగింది. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, వివేక్, వాకిటి శ్రీహరిలతో పాటు సీనియర్ నేతలు జానారెడ్డి, వి.హనుమంతరావు, ఇతర పీఏసీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఖర్గే మాట్లాడుతూ.. పార్టీ నేతలందరూ కలిసికట్టుగా పనిచేయాలని, ఏవైనా సమస్యలుంటే అంతర్గతంగా మాట్లాడుకోవాలే తప్ప రచ్చకెక్కడం, ఇష్టానుసారంగా మాట్లాడడం మంచిది కాదని చెప్పారు. పార్టీకి నష్టం కలిగించే ఎలాంటి చర్యలనూ ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.

కార్యకర్తల కష్టంతోనే అధికారంలోకి..

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలపై నమోదైన అక్రమ కేసులను వెంటనే ఎత్తేయాలని ఖర్గే ప్రభుత్వాన్ని కోరారు. 'కార్యకర్తల కష్టంతోనే మనం అధికారంలోకి వచ్చాం. వారిని పట్టించుకోకపోతే ఎలా కుదురుతుంది?' అని అన్నారు. 'కార్యకర్తలకు పదవులు కూడా ఇవ్వాలి..'అని ఆదేశించారు. పార్టీ, ప్రభుత్వ పదవుల భర్తీకి ఈనెల 30ని డెడ్‌లైన్‌గా పెట్టుకోవాలని ఆదేశించారు. అంతకుముందు వీహెచ్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పనితీరు బాగుందని, అన్ని కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేస్తున్నారని ప్రశంసించారు. అయితే కొత్తగా పార్టీలోకి వచ్చిన వారితో పాత కేడర్‌కు ఇబ్బందులు వస్తున్నాయని, పదేళ్లు బీఆర్‌ఎస్‌ను ఎదిరించి పోరాడిన కాంగ్రెస్ కార్యకర్తలపై నమోదైన కేసులను ఇంతవరకు ఎత్తివేయలేదని అన్నారు. దీంతో అక్రమ కేసులు ఎత్తివేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని, కొత్తగా పార్టీలోకి వచ్చిన వారితో పాత నాయకులు కలిసిపోయి సమన్వయంతో పనిచేయాలని ఖర్గే సూచించారు.

పార్టీ ఎన్నికలకు కేడర్ సిద్ధం కావాలి: సీఎం

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. పార్టీ పదవుల భర్తీ విషయంలో నిర్లక్ష్యం తగదని అన్నారు. ప్రభుత్వ పదవుల కోసం ఇన్‌చార్జి మంత్రులు వెంటనే జాబితాలు పంపాలని కోరారు. కొందరు మంత్రులు పట్టీపట్టనట్టు వ్యవహరించడం సరైంది కాదని సీఎం వ్యాఖ్యానించినట్టు తెలిసింది. స్థానిక ఎన్నికలకు పార్టీ కేడర్‌ను పూర్తిస్థాయిలో సిద్ధం చేయాలని పిలుపునిచ్చిన రేవంత్.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను ఇచ్చి మాట నిలబెట్టుకుందామని అన్నారు. కాగా పాశమైలారం అగ్నిప్రమాద మృతులకు సంతాపం ప్రకటిస్తూ సమావేశంలో నేతలు రెండు నిమిషాలు మౌనం పాటించారు.

టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ భేటీ

వరంగల్ గొడవతో పాటు పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులపై చర్చ

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ మరోసారి సమావేశమైంది. శుక్రవారం ఉదయం గాంధీభవన్‌లో చైర్మన్ మల్లు రవి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సభ్యులు శ్యాంమోహన్, కమలాకర్‌రావు, జి.వి.రామకృష్ణ పాల్గొన్నారు. సమావేశంలో భాగంగా వరంగల్ జిల్లా నేతల మధ్య గొడవతో పాటు కమిటీ వద్ద పెండింగ్‌లో ఉన్న అన్ని ఫిర్యా దులపై చర్చించారు. ఈ ఫిర్యాదులపై కమిటీ అనుసరించాల్సిన విధివిధానాలను గురించి చర్చించిన నేతలు సోమవారం మరోసారి సమావేశం కావాలని నిర్ణయించారు.

ఏం ఉద్ధరించారని సభ పెట్టారు?

- ఆరు గ్యారంటీలు అమలు చేయడం లేదు
- దళిత, బలహీనవర్గాలను మోసం చేస్తున్నారు
- ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే దీనికి సమాధానం చెప్పాలి
- కేంద్ర మంత్రి బండి సంజయ్



సిరిసిల్ల: కాంగ్రెస్ పార్టీ ఏం ఉద్ధరించిందని 'సామాజిక న్యాయ సమర భేరీ'సభను నిర్వహిస్తోందని కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు. ఆ సభ పేరును 'సామాజిక అన్యాయ సమర భేరీ'గా మార్చుకోవాలని సూచించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం మరిమడ్లలోని ఏకలవ్య పాఠశాలలో రూ.5 కోట్లతో శుక్రవారం ఆయన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'ఈ దేశాన్ని, రాష్ట్రాన్ని అర్ధశతాబ్దానికిపైగా పాలించిన కాంగ్రెస్ పార్టీ.. ఇన్నేళ్లలో ఒక్కసారైనా బీసీని ప్రధానమంత్రిని, ముఖ్యమంత్రిని చేయలేదు. దళిత, బడుగు, బలహీనవర్గాలు అత్యధిక లబ్ధి పొందే అవకాశమున్న ఆరు గ్యారంటీలను కూడా అమలు చేయకుండా మోసం చేస్తోంది. ఏ ముఖం పెట్టుకుని ఈ సభను నిర్వహిస్తున్నారో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రజలకు సమాధానం చెప్పాలి'అని సంజయ్ నిలదీశారు. రాష్ట్రంలో 50 శాతానికిపైగా బీసీ జనాభా ఉంటే, కేబినెట్‌లో ఎంత మంది బీసీలకు అవకాశమిచ్చారని ప్రశ్నించారు. యూరియా కొరతపై కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు కావాలనే కేంద్రాన్ని బద్‌నాం చేస్తున్నాయన్నారు. కోరినంత యూరియా ఇచ్చేందుకు కేంద్రం సిద్ధంగా ఉందన్నారు. కాగా, దేశవ్యాప్తంగా 20 వేలకుపైగా గిరిజన జనాభా ఉన్న మండలాల్లో ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నామని, ఇలాంటివి 728 స్కూళ్లను ఏర్పాటు చేయడమే కేంద్రం లక్ష్యమని తెలిపారు. ఇప్పటికే 500 స్కూళ్లు ప్రారంభమయ్యాయని, వీటిల్లో 1.50 లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారని వివరించారు. రాష్ట్రంలో 23 పాఠశాలల్లో 10 వేల మంది విద్యార్థులు ఉన్నారని తెలిపారు. కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఇతర అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సభలో కాంగ్రెస్ ప్రభుత్వ సామాజిక న్యాయం జాడలేదు

బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం సామాజిక న్యాయ సమరభేరి పేరుతో ఆర్భాటంగా సభ నిర్వహించినప్పటికీ ఏడాదిన్నరగా చేసిన సామాజిక న్యాయం ఏంటో చెప్పకపోవడం విడ్డూరమని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు విమర్శించారు. శుక్రవారం ఆయన బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. కేవలం కేంద్ర ప్రభుత్వాన్ని, ప్రధాని మోదీని విమర్శించేందుకే ఈ సభ పెట్టినట్లు కనిపించిందన్నారు. ప్రధాని మోదీ ప్రభుత్వం తెలంగాణకు ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసిందని గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఇచ్చిన నిధులు, చేసిన కార్యక్రమాలకు సంబంధించిన వివరాలను పూర్తిగా లెక్కలతో సహా ప్రింట్ చేసి పంపిణీ చేశామని వెంకటేశ్వర్లు చెప్పారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు, 420 హామీలపైన చర్చ పెట్టాలని డిమాండ్ చేశారు.





వేదికపై మీనాక్షి నటరాజన్‌తో ముచ్చటిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో కోమటిరెడ్డి, శ్రీధర్‌బాబు, కేసీ వేణుగోపాల్, మహేశ్‌గౌడ్, భట్టి విక్రమార్క, దామోదర రాజనర్సింహ, పొంగులేటి, వీహెచ్, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ● సమ్మేళనానికి హాజరైన పార్టీ గ్రామ అధ్యక్షులు, కార్యకర్తలు

▶ మొదటి పేజీ తరువాయి

అగ్నిగుండంగా మారిన మణిపూర్‌కు మాత్రం వెళ్లలేదు. మణిపూర్ భారత్‌కు అత్యంత కీలకమైన ప్రదేశం. అక్కడ జరుగుతున్న ఆందోళనలను పరిశీలించేందుకు నేను, రాహుల్‌గాంధీ వెళ్లాం. బాధితులను పరామర్శించాం. మరి మోదీ ఎందుకు మణిపూర్ వెళ్లలేదు? వారు దేశ పౌరులు కాదా? దేశ ప్రజలను పట్టించుకోకుండా ప్రపంచ దేశాలు తిరుగుతూ దేశ ప్రజలను మోదీ రోడ్లపై వదిలేశారు. మోదీ మాదిరి అప్పట్లో ఇందిరాగాంధీ భయపడలేదు. బంగ్లాదేశ్‌కు స్వాతంత్య్రం కల్పిస్తామని చెప్పి చేసి చూపించారు..' అని ఖర్గే చెప్పారు.

కాంగ్రెస్ సర్కారు వచ్చాకే అందరికీ అభివృద్ధి ఫలాలు

'కార్యకర్తల కృషితోనే తెలంగాణలో పార్టీ అధికారంలోకి వచ్చింది. కార్యకర్తలే కాంగ్రెస్ పార్టీకి ఆత్మ. కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉన్నందున రాష్ట్రంలో కూడా బీజేపీ ప్రభుత్వం ఏర్పడుతుందని చేసిన ప్రచారాన్ని కాంగ్రెస్ కార్యకర్తలు తిప్పికొట్టారు. రాహుల్‌గాంధీ పాదయాత్ర సమయంలోనే కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని అర్థమైంది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాతే అన్ని వర్గాలకు అభివృద్ధి ఫలాలు అందుతున్నాయి. కీలక రంగాలు అద్భుతంగా పనిచేస్తున్నాయి. ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు, రైతుభరోసా, రుణమాఫీ లాంటి ఎన్నో పథకాలు అమల్లోకి వచ్చాయి. ఇవన్నీ ప్రజలకు చెప్పి ఓట్లు అడగాలి.

రాజ్యాంగం నుంచి లౌకిక పదాన్ని తొలగించలేరు..

హైదరాబాద్‌లోని కేంద్ర ప్రభుత్వ సంస్థలు దాదాపు 50కి పైగా కాంగ్రెస్ పాలనలో ఏర్పడ్డాయి. మరి మోదీ ప్రభుత్వం హైదరాబాద్‌కు ఏమిచ్చిందో చెప్పాలి. నల్లధనం తెచ్చి ప్రతి వ్యక్తికి రూ.15 లక్షలు ఇస్తానన్న మోదీ ఆ తర్వాత ఆ ఊసే ఎత్తడం లేదు. మోదీ, అమిత్‌షా అబద్ధాలు చెప్పి ప్రజలను పిచ్చోళ్లను చేస్తున్నారు. సెక్యులర్ అనే పదం రాజ్యాంగంలో లేదని బీజేపీ చెప్తోంది. కానీ రాజ్యాంగం నుంచి లౌకిక అనే పదాన్ని తీసేయలేరు. సెక్యులర్ అనే పదంతో ఇబ్బందిగా ఉంటే బీజేపీ పార్టీ ప్రణాళిక నుంచి ఆ పదం తొలగించి చూపించాలి..' అని ఖర్గే సవాల్ చేశారు.

యుద్ధాన్ని ఆపేశారేం?

కాంగ్రెస్‌కు కార్యకర్తలే బ్రాండ్ అంబాసిడర్లు: సీఎం

'తెలంగాణలో అధికార మదంతో తమకు తిరుగులేదనే అహంకారంతో ఉన్న బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని కూలదోసి ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన ఘనత కాంగ్రెస్ కార్యకర్తలకే దక్కుతుంది. కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే బ్రాండ్ అంబాసిడర్లు. కార్యకర్తల కృషితో ఏర్పాటైన ప్రజా ప్రభుత్వం..ఆర్థిక వ్యవస్థ దెబ్బతిన్నప్పటికీ ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. ప్రభుత్వం ఏర్పాటైన 18 నెలల్లోనే రైతులకు రుణమాఫీ, రైతు భరోసా, సన్న వడ్లకు బోనస్, పేదలకు సన్న బియ్యం, ఇందిరమ్మ ఇళ్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు లాంటి ఎన్నో పథకాలు అమలు చేస్తున్నాం. ఈ పథకాలు దేశానికే రోల్‌మోడల్‌గా నిలుస్తున్నాయి. తెలంగాణ మోడల్ దేశానికే ఆదర్శంగా మారుతోంది. ఈ పథకాలను కేంద్ర ప్రభుత్వం సైతం అమలు చేయాల్సిన పరిస్థితి వస్తోంది..' అని సీఎం రేవంత్ చెప్పారు.

ప్రభుత్వ పథకాలపై విస్తృత ప్రచారం చేయాలి

'అద్భుతమైన పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నప్పటికీ వాటిని ప్రచారం చేసుకోవడంలో విఫలమవుతున్నాం. ప్రతి శాఖలో ఒక సంక్షేమ పథకం ఉంది. ఈ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి విస్తృత ప్రచారం కల్పించాల్సిన బాధ్యత కార్యకర్తలపైనే ఉంది. ప్రజా ప్రభుత్వం ప్రతి హామీ అమలు చేస్తుంది. అసెంబ్లీ ఎన్నికలప్పుడు కుల సర్వే హామీ ఇచ్చి అమలు చేసి చూపించాం. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం దానిని జనగణనలో చేర్చింది. మహిళా సంఘాలకు ఆర్టీసీలో బస్సులు అద్దెకు ఇప్పించి లాభాలు గడించేలా ప్రోత్సహిస్తున్నాం. సోలార్ పవర్ ప్లాంట్లు, పెట్రోల్‌బంక్‌లు ఏర్పాటు చేయిస్తూ మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దుతున్నాం. కోటిమంది మహిళలను ఎస్‌హెచ్‌జీల్లో చేర్పించి కోటీశ్వరులుగా చేసే బాధ్యత ప్రభుత్వానిదే.

మోదీ, కిషన్‌రెడ్డి, కేసీఆర్ చర్చకు రావాలి

ప్రజా ప్రభుత్వం ఏర్పడిన మొదటి ఏడాదిలోనే 60 వేల ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలను భర్తీ చేశాం. 18 నెలల్లో రాష్ట్రానికి రూ.3 లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చాం. వంద నియోజకవర్గాల్లో రూ.20 వేల కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటు చేస్తున్నాం. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీలను స్థాపించాం. ఈ విషయాలన్నీ ప్రజలకు వివరించాలి. నిత్యం ప్రజల్లోనే ఉంటూ ప్రభుత్వ పథకాలపై విస్తృత ప్రచారం చేయాలి. ప్రభుత్వం రైతు భరోసా ఇవ్వదంటూ కొందరు వెకిలిగా వ్యాఖ్యానించారు. కానీ 9 రోజుల్లోనే రూ.9 వేల కోట్ల రైతు భరోసా అందించాం. ఈ అంశంపై మోదీ, కిషన్‌రెడ్డి, కేసీఆర్ చర్చకు రావాలి. రైతులకు ఎవరు మేలు చేశారో అసెంబ్లీ సాక్షిగా చర్చిద్దాం..' అని ముఖ్యమంత్రి సవాల్ చేశారు.

కార్యకర్తల ఎన్నికలొస్తున్నాయి..

'రాష్ట్రంలో నియోజకవర్గాల పునర్విభజనతో అసెంబ్లీ స్థానాలు పెరుగుతాయి. వచ్చే ఎన్నికల్లో 100 అసెంబ్లీ, 15 పార్లమెంటు స్థానాల్లో విజయం సాధించి అధిష్టానానికి బహుమతి ఇచ్చేందుకు కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారు. స్టేజీమీద ఉన్న నాయకుల ఎన్నికలు అయ్యాయి. ఇప్పుడు కార్యకర్తల ఎన్నికలు జరగబోతున్నాయి. ఈ ఎన్నికల్లో విజయం సాధించే బాధ్యత కార్యకర్తలపైనే ఉంది. కార్యకర్తల గెలుపు కోసం పూర్తి సహకారం అందిస్తాం. టిక్కెట్ల కోసం ఢిల్లీకి వెళ్లాల్సిన అవసరం లేదు. బీఫామే ఇంటికి వస్తుంది..' అని సీఎం అన్నారు.

రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ కుట్ర

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం భారత రాజ్యాంగాన్ని మార్చేందుకు కుట్రలు చేస్తోందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆరోపించారు. ప్రస్తుతం దేశంలో ఒక సైద్ధాంతిక పోరాటం జరుగుతుందని, ఇండియా కూటమి రాజ్యాంగాన్ని రక్షించాలని, ఎన్డీఏ కూటమి రాజ్యాంగాన్ని మార్చాలని పోరాటం చేస్తున్నాయన్నారు. సామాజిక న్యాయసభలో అయన ప్రసంగించారు. భారత రాజ్యాంగం అంటే కేవలం ఒక పుస్తకం కాదని.. మహానీయులు ఆలోచన అని చెప్పారు. రాజ్యాంగమే లేకపోతే హక్కులు కేవలం కొందరికే దక్కేవని, ప్రస్తుతం దానిని నిలబెట్టుకుంటేనే అందరి భవిష్యత్ అన్నారు. రాజ్యాంగ స్ఫూర్తితో సామాజిక న్యాయ సూత్రం కోసం రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నట్టు తెలిపారు. ప్రజాప్రభుత్వం ప్రజల కోసమే పని చేస్తోందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. అయితే ప్రభుత్వంపై బీఆర్‌ఎస్, బీజేపీ బురద జల్లుతున్నాయని, వారికి కొన్ని లెక్కలతో సరైన సమాధానం చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

ఖర్గే వెనుకబడిన వర్గాలకు ప్రేరణ

టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్

సభకు అధ్యక్షత వహించిన టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి నాయకత్వం వహిస్తున్న ప్రజానాయకుడు మల్లికార్జున ఖర్గే వెనుకబడిన వర్గాలకు ప్రేరణ అని చెప్పారు. సామాన్య స్థాయి కార్యకర్త నుంచి పార్టీ అత్యున్నత స్థాయికి చేరిన ఆయన జీవితం కృషి, నిబద్ధత, అంకితభావానికి నిదర్శనమన్నారు. బాల్యంలోనే మత కలహాల్లో తల్లిని కోల్పోయిన ఘటన ఆయన్ను జీవితాంతం సెక్యులరిజం, సామాజిక న్యాయం, సామరస్యానికి ప్రతీకగా నిలిచేలా మలిచిందని తెలిపారు. కాగా బహిరంగ సభ అనంతరం ఖర్గే బేగంపేట విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో ఢిల్లీ వెళ్లారు.

తమిళనాడు తరహాలో ముందుకెళ్దామా?

- స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై కాంగ్రెస్ అగ్రనేతల చర్చ
- జీవో విడుదలపై ఆచితూచి ముందుకెళ్లాలని నిర్ణయం
- రిజర్వేషన్లు పెంచిన తర్వాతే ఎన్నికలు
- జూబ్లీహిల్స్ అభ్యర్థి, ప్రచార వ్యూహాల ఖరారుకు కమిటీ

సాక్షి, హైదరాబాద్: బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించే విషయంలో ఆచితూచి ముందుకెళ్లాలని, బీసీ వర్గాలకు నష్టం జరగకుండా, పార్టీ ఇచ్చిన మాటను నిలబెట్టుకునే విధంగానే కార్యాచరణ రూపొందించాలని కాంగ్రెస్ అగ్రనేతలు నిర్ణయించారు. శుక్రవారం ఉదయం తాజ్‌కృష్ణా హోటల్లో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేశ్‌కుమార్‌గౌడ్, సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, సీనియర్ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమావేశమయ్యారు. స్థానిక సంస్థల ఎన్నికలు, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై చర్చించారు. గతంలో బీసీలకు రిజర్వేషన్లు కల్పించే విషయంలో తమిళనాడు అనుసరించిన విధానం (ప్రత్యేక జీవో ద్వారా రిజర్వేషన్ల అమలు)లో ముందుకెళ్లాలా లేదా అన్న దానిపై చర్చించినట్టు తెలిసింది. అయితే ఈ విషయంలో జాగ్రత్తగా ముందుకెళ్లాలని నిర్ణయించినట్లు సమాచారం.

జూబ్లీహిల్స్‌లో తప్పనిసరిగా గెలవాలి

కేరళ రాష్ట్రంలో ఎదురైన ప్రతికూలత గురించి కూడా మాట్లాడుకున్న నేతలు.. ఎట్టి పరిస్థితుల్లోనూ బీసీలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు పెంచిన తర్వాతే ఎన్నికలకు వెళ్లాలని సూత్రప్రాయంగా నిర్ణయించారు. ఇందుకు అవసరమైన అన్ని అంశాలను లోతుగా చర్చించి కార్యాచరణ రూపొందించాలని, ఆ తర్వాత ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో సీఎం రేవంత్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ చర్చించి నిర్ణయం తీసుకోవాలనే విషయంలో ఏకాభిప్రాయానికి వచ్చినట్టు సమాచారం. ఇక జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో తప్పనిసరిగా గెలవాలని, ఇందుకు అవసరమైన వ్యూహం రూపొందించాలని ఖర్గే రాష్ట్ర నాయకత్వాన్ని ఆదేశించారు. ఇక్కడ పోటీ చేసే అభ్యర్థి, ప్రచార వ్యూహాల ఖరారుకు ఓ కమిటీ వేయాలని నిర్ణయించారు.

నిరుద్యోగుల కష్టాలు కనిపించడం లేదా?

- ఉద్యోగాలు అడిగితే అరెస్టు చేస్తారా?
- నిరుద్యోగులకు కాంగ్రెస్ వెన్నుపోటు: కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: ఇందిరమ్మ రాజ్యంలో సచివాలయం తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయని ఊదరగొట్టిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి నిరుద్యోగుల కష్టాలు కనిపించడం లేదని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు మండిపడ్డారు. ఏడాదిలో రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తామని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఇచ్చిన హామీపై నిలదీసేందుకు సచివాలయానికి వచ్చిన నిరుద్యోగులను అరెస్టు చేయడం దుర్మార్గమని శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. యూత్ డిక్లరేషన్ పేరిట ఢిల్లీ పెద్దలను పిలిపించి మరీ మోసం చేసిన రేవంత్ ఏడాదిన్నరలో పట్టుమని 10 వేల ఉద్యోగాల నోటిఫికేషన్లు కూడా ఇవ్వకుండా నిరుద్యోగులకు వెన్నుపోటు పొడిచారని విమర్శించారు. జాబ్ కాలెండర్‌ను ప్రకటించి అమలు చేయకుంటే ఉద్యమ కార్యాచరణ ప్రకటించి కాంగ్రెస్ ద్రోహాన్ని ప్రజాక్షేత్రంలో ఎండగడతామని కేటీఆర్ హెచ్చరించారు. కాగా, పాశమైలారం సిగాచీ ఫ్యాక్టరీ పేలుడులో చనిపోయిన కార్మికుల మృతదేహాలను అట్టపెట్టెల్లో తరలించడం అమానవీయమని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు.

కేసీఆర్ క్షేమంగా ఉన్నారు..

బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ ఆస్పత్రిలో కోలుకుంటున్నారని, ఆయన ఆరోగ్యపరంగా క్షేమంగా ఉన్నారని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. సాధారణ ఆరోగ్య పరీక్షల్లో భాగంగా గురువారం సాయంత్రం వైద్యుల సూచన మేరకు కేసీఆర్ ఆస్పత్రిలో చేరినట్లు శుక్రవారం ఒక ప్రకటనలో చెప్పారు. కాగా, ఎమ్మెల్సీ కవిత, హరీశ్‌రావు కూడా శుక్రవారం కేసీఆర్‌ను కలిశారు.

బనకచర్ల దోపిడీని సహించం: హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలు దెబ్బతీసే కుట్రలను బీఆర్‌ఎస్ పార్టీ సహించబోదని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు స్పష్టంచేశారు. బనకచర్ల పేరుతో తెలంగాణకు రావాల్సిన గోదావరి జలాలను ఏపీ ప్రభుత్వం తరలించుకుపోతుంటే చూస్తూ ఊరుకోబోమని 'ఎక్స్'వేదికగా హెచ్చరించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పోలవరం, పోతిరెడ్డిపాడు, పులిచింతల వంటి ఏపీ అక్రమ ప్రాజెక్టులకు నిరసనగా సరిగ్గా 20 ఏళ్ల క్రితం 2005 జూలై నాలుగో తేదీన తాము మంత్రి పదవులకు రాజీనామా చేశామని గుర్తుచేశారు. తెలంగాణ కోసం పదవులకు రాజీనామా చేయడమే కాకుండా పేగులు తెగే దాక కొట్లాడతామని స్పష్టంచేశారు.

కాందిశీకుల భూ సమస్యపై ఇంత నిర్లక్ష్యమా?

అధీకృత అధికారిని ప్రశ్నించిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: కాందిశీకుల వారసులు పెట్టుకున్న దరఖాస్తును 25 ఏళ్లయినా పరిష్కరించరా అని హైకోర్టు ప్రశ్నించింది. అధీకృత అధికారి ఏం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేసిన న్యాయస్థానం రూ.50 వేలు జరిమానా విధించింది. ఈ మొత్తాన్ని నాలుగు వారాల్లో సైనిక సంక్షేమ నిధికి చెల్లించాలని ఆదేశించింది. జనగాం, సముద్రాల, మెట్టూరు, కుందరం, ఇప్పగూడ, రఘునాథ్‌పల్లి, పాలకుర్తి గ్రామాల్లో భూములపై హక్కుల కోసం ఫాతిమా బేగం వారసులు సేల్ సర్టిఫికెట్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఈ భూము లకు చెందిన వ్యక్తులు పాకిస్తాన్ వెళ్లిపోగానే అధీకృత అధికారి కాందిశీకుల చట్టం కింద వాటిని స్వాధీనం చేసుకున్నారు. హైకోర్టులో ఉత్తర్వుల మేరకు వారసులు 2000లో అధీకృత అధికారి వద్ద దరఖాస్తు చేసుకున్నారు. దీన్ని పరిష్కరించకపోవడాన్ని సవాల్ చేస్తూ నసీరుద్దీన్ కమ్రాన్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

తడారని కన్నులు
తరగని ఎదురుచూపులు!

ఇదో రోజూ అదే వేదన

- తమ వారి ఆచూకీ చెప్పాలని కలెక్టర్ కాళ్లపై పడిన బాధితులు
- సిగాచి పరిశ్రమను పరిశీలించిన సీఎస్ నేతృత్వంలోని కమిటీ
- చికిత్స పొందుతూ ఒకరి మృతి.. 39కి చేరిన మృతుల సంఖ్య.. ఇంకా దొరకని ఆ 9మంది ఆచూకీ



బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు



తమ వారి ఆచూకీ తెలియక విలపిస్తున్న బాధితులు

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి

సిగాచి పరిశ్రమలో పేలుడు దుర్ఘటన జరిగి ఐదు రోజులు గడుస్తున్నా..బాధిత కుటుంబాల వేదన తీరడం లేదు. తమవారి మృతదేహాలు, ఆచూకీ కోసం ఎదురుచూస్తున్నారు. సోమవారం ఉదయం 9 గంటలకు ఘటన జరిగితే శుక్రవారం వరకు కూడా మృతదేహం అప్పగించకపోవడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. అసలు కనిపించకుండా పోయిన తమ కుటుంబసభ్యులను ఎప్పుడు అప్పగిస్తారని ప్రశ్నిస్తున్నారు. ఈ ఘటనలో ఇప్పటికీ తొమ్మిది మంది ఆచూకీ లేదు. డీఎన్‌ఏ రిపోర్టులు రాక ఇంకా గుర్తించాల్సిన మృతదేహాలు ఐదు ఉన్నాయి. మొత్తం 14 కుటుంబాలు తీవ్ర ఆవేదన చెందుతున్నాయి. ఘటనాస్థలిలో రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతోంది. ఎస్‌డీఆర్‌ఎఫ్, హైడ్రా బృందాలు శిథిలాలను తొలగిస్తున్నాయి. పటాన్‌చెరులోని ధ్రువ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కార్మికుడు భీంరావు శుక్రవారం మృతి చెందాడు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. దీంతో మృతుల సంఖ్య 39కి చేరింది మొత్తంగా పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి ఇప్పటివరకు 38 మృతదేహాలు రాగా, శుక్రవారం రాత్రి 8 గంటల వరకు 33 మృతదేహాలను వారి కుటుంబసభ్యులకు అప్పగించారు. ప్రశాంత్ మహాపాత్రో అనే కార్మికుడు ఆచూకీకి డీఎన్‌ఏ ద్వారా గుర్తించి ఓ బాక్స్‌లో మాంసపు ముద్దలను పెట్టి భార్య సోనాలికి పటాన్‌చెరు ఆస్పత్రిలో అప్పగించారు. ఇంకా ఐదు మృతదేహాలకు సంబంధించి డీఎన్‌ఏ రిపోర్టు రావాల్సి ఉంది.

పరిశ్రమలో 3 గంటలు.. హైపవర్ కమిటీ

చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు నేతృత్వంలోని హైపవర్ కమిటీ శుక్రవారం సిగాచి పరిశ్రమను పరిశీలించింది. కమిటీ సభ్యులుగా ఉన్న రెవెన్యూ, పరిశ్రమలు, కార్మిక, అగ్నిమాపక, ఆరోగ్య తదితర శాఖలకు చెందిన ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. సుమారు మూడు గంటల పాటు పేలుడు చోటుచేసుకున్న ప్రాంతాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ఆపై రెస్క్యూ ఆపరేషన్ గురించి ఆరా తీశారు. అనంతరం అధికారులతో సమీక్షించారు. అయితే భద్రతకు సంబంధించి కనీస ప్రమాణాలు పాటించకపోవడంతోనే ఈ దుర్ఘటన చోటుచేసుకున్నట్టు కమిటీ ప్రాథమిక అంచనాకు వచ్చినట్టు సమాచారం. పలుశాఖల అధికారులు అడిగిన ప్రశ్నలకు కంపెనీ ప్రతినిధుల నుంచి సరైన సమాధానం రాలేదు. దీంతో వారిపై అధికారులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. పరిశ్రమ రికార్డులను స్వాధీనం చేసుకోవాలని కమిటీ సభ్యులు అధికారులను ఆదేశించినట్టు తెలిసింది.

మా వాళ్ల ఆచూకీ చెప్పండి..

సీఎస్‌కు బాధిత కుటుంబాల మొర

తమ వారి ఆచూకీ చెప్పాలని బాధిత కుటుంబాలు సీఎస్ రామకృష్ణారావుకు మొరపెట్టుకున్నాయి. ఐలా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సహాయక శిబిరాన్ని సీఎస్ సందర్శించారు. అక్కడే ఉంటున్న బాధిత కుటుంబాల వారు సీఎస్‌కు తమ గోడును వినిపించారు. ఐదు రోజులు గడిచిందని, తమ వారి జాడ ఎప్పుడు చెబుతారని ప్రశ్నించారు. జిల్లా అధికార యంత్రాంగం అంతా ఇక్కడే ఉన్నారని, ప్రభుత్వం తరఫున అందాల్సిన అన్ని రకాల సహాయం అందిస్తామని చెప్పారు. డీఎన్‌ఏ రిపోర్టులు రావడానికి కాస్త ఆలస్యమవుతోందని, రిపోర్టులు వచ్చిన వెంటనే మృతదేహాలను అప్పగిస్తామని సీఎస్ చెప్పారు. తమ వారి మృతదేహాన్ని అప్పగించాలని ఓ బాధిత కుటుంబ సభ్యులు సంగారెడ్డి జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య కాళ్లపై పడ్డారు. దుర్ఘటనలో కనిపించకుండా పోయిన తన సోదరుడు జస్టిన్ జాడ చెప్పాలని మరొకరును కలెక్టర్‌ను ప్రాథేయపడ్డారు.

మనోభావాలను గౌరవిస్తూ మృతదేహాలను అప్పగిస్తున్నాం : మంత్రి దామోదర

బాధిత కుటుంబసభ్యుల మనోభావాలను గౌరవిస్తూ మృతదేహాల అప్పగింతలో అధికారులు అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారని మంత్రి దామోదర రాజనరసింహ తెలిపారు. ఈ మేరకు మంత్రి తన ఎక్స్ ఖాతాలో చేసిన పోస్టును రాష్ట్ర వైద్యారోగ్యశాఖ విడుదల చేసింది. సిగాచి పరిశ్రమ పేలుడు స్థలంలో లభించిన మృతదేహాలకు సంబంధించిన శాంపిల్స్ ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపేందుకు ప్యాక్ చేసిన బాక్సులను మృతదేహాలను భద్రపరిచిన బాక్సులుగా తప్పుడు ప్రచారం చేస్తున్నారని స్పష్టం చేశారు.

ప్రమాదం జరిగినప్పుడు పరిశ్రమలో ఉన్నవారు	143
సురక్షితంగా బయటపడినవారు	61
ఇప్పటి వరకు మృతుల సంఖ్య	39
ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారు	22
కోలుకుని డిశ్చార్జి అయిన వారు	12
ఇంకా ఆచూకీ లభించని వారు	09

ధైర్యం, ధర్మం, కర్మ

▶ మొదటి పేజీ తరువాయి

అవసరం ఉందని రాజ్‌నాథ్‌సింగ్ అన్నారు. జాతి నిర్మాణంలో గిరిజనుల పాత్ర చాలా గొప్పదని కొనియాడారు. వారి అభివృద్ధి కోసం అనేక పథకాలు చేపట్టామని, 50 వేలకుపైగా ఆదివాసీ గ్రూపులను ఏర్పాటు చేశామని వెల్లడించారు. నక్సల్స్ అధీనంలోని ప్రాంతాల్లో ఇప్పుడు వేగంగా అభివృద్ధి జరుగుతోందని చెప్పారు. ఆదివాసీలను పీడిస్తున్న నక్సలిజాన్ని తుడిచిపెట్టేస్తామని ప్రకటించారు. 'అల్లూరి కలను మేం నిజం చేయబోతున్నాం. రెన్యూవబుల్ ఎనర్జీ, వెదురు పరిశ్రమలు అభివృద్ధి చెందుతున్నాయి. గిరిజనులకు ఉపాధి అవకాశాలు మెరుగుపరుస్తాం. ఏజెన్సీ ప్రాంతాల్లో 8 వేల సెల్ టవర్లు ప్రారంభిస్తాం. దానివల్ల టీవీ, ల్యాప్‌ట్యాప్, మొబైల్స్ వినియోగం పెరుగుతుంది'అని వివరించారు. అంతకు ముందు కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ మాట్లాడుతూ.. అల్లూరి జయంతి ఉత్సవాల్లో పాల్గొంటే హృదయం ఉప్పొంగుతోందని అన్నారు. క్షత్రియుడు ధైర్య సాహసాలతో తన మాతృభూమిని రక్షించుకోవడానికి ఎల్లప్పుడూ పోరాటానికి సిద్ధంగా ఉంటాడని పేర్కొన్నారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. అనేకమంది గిరిజన స్వాతంత్ర్య సమరయోధులకు చరిత్ర పుటల్లో స్థానం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. అల్లూరి చరిత్ర తెలుసుకున్న ప్రధాని నరేంద్రమోదీ.. ఆ యోధుడి 125వ జయంతిని ఘనంగా నిర్వహించాలని ఆదేశించినట్లు చెప్పారు. ప్రధాని ఆదేశాలతో అల్లూరి జన్మించిన ఆంధ్రప్రదేశ్‌లోని భీమవరంలో ఆయన జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించినట్లు తెలిపారు. అప్పటికి సీతారామరాజు వారసులు చిన్న గుడిసెలో నివసించేవారని, వారందరికీ పక్కా ఇళ్లు నిర్మించి ఇచ్చామని వెల్లడించారు. ఈ సందర్భంగా అల్లూరి జిల్లాలో సీతారామరాజు స్నానమాచరించిన మంపకొలనును వర్చువల్‌గా మంత్రులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ, కర్ణాటక మంత్రి ఎస్.సుభాష్‌చంద్రబోష్, మాజీ కేంద్ర మంత్రి అశోక్‌గజపతి రాజు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ క్షత్రియ సేవా సమితి నేతలు సత్యనారాయణరాజు, రఘురామరాజు పాల్గొన్నారు.



రాజ్‌నాథ్ సింగ్‌కు స్వాగతం పలుకుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు, కిషన్‌రెడ్డి

..బీజేపీ పగ్గాలు?

▶ మొదటి పేజీ తరువాయి

జరుగుతున్న రేసులో ఆమె ముందువరుసలో ఉన్నారనే చర్చ మొదలైంది. సీనియర్ నేతగా, గతంలో రక్షణ మంత్రిగా పనిచేసిన అనుభం కూడా ఉంది. ఈ నేపథ్యంలో ఆమెకు పార్టీ పగ్గాలు అప్పగిస్తే దక్షిణాదిలో పార్టీని మరింత బలోపేతం చేయడానికి, క్షేత్రస్థాయిలో పార్టీని విస్తరించేందుకు వీలవుతుందని అధిష్టానం భావిస్తున్నట్లు బీజేపీ వర్గాలు చెబుతున్నాయి.

రేసులో పురందేశ్వరి, వనతి శ్రీనివాసన్

నిర్మలా సీతారామన్ తర్వాత.. కేంద్ర మాజీ మంత్రి, ఏపీ బీజేపీ మాజీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి పేరు వినిపిస్తోంది. ఆమెకు పలు భాషల్లో ప్రావీణ్యం ఉంది. రాజకీయాల్లో ఎంతో అనుభవజ్ఞురాలు. అలాగే బీజేపీ మహిళా మోర్చా జాతీయ అధ్యక్షురాలు వనతి శ్రీనివాసన్ పేరు కూడా ప్రచారంలో ఉంది. తమిళనాడుకు చెందిన ఆమె వృత్తిరీత్యా న్యాయవాది. ప్రస్తుతం కోయంబత్తూర్ సౌత్ ఎమ్మెల్యేగా ఉన్నారు. గత ఎన్నికల్లో నటుడు, మక్కల్ నీది మయ్యం వ్యవస్థాపకుడు కమల్ హాసన్‌పై విజయం సాధించారు. 1993లో బీజేపీలో చేరిన నాటినుంచి ఎన్నో కీలక పదవులు చేపట్టారు. 2020లో మహిళా మోర్చా జాతీయ అధ్యక్షురాలిగా, 2022లో బీజేపీ కేంద్ర ఎన్నికల కమిటీ సభ్యురాలిగా ఎన్నికయ్యారు. ఈ స్థానానికి చేరుకున్న మొదటి తమిళనాటు మహిళా నేత వనతి. కాగా.. ఢిల్లీలో శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు ఆర్‌ఎస్‌ఎస్ ప్రాంత ప్రచారక్‌ల సమావేశాలు నిర్వహిస్తోంది. ఆర్‌ఎస్ చీఫ్ మోహన్ భాగవత్, ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హోసబలె, బీజేపీ ప్రధాన కార్యదర్శి(సంస్థాగత) బీఎల్ సంతోష్‌లు పాల్గొంటున్నారు. ఈ సమావేశాల్లో బీజేపీ కొత్త అధ్యక్ష ఎంపికపై తుది నిర్ణయం తీసుకునే అవకాశమున్నట్లు సమాచారం.

ఖాళీ గనులను శాస్త్రీయ పద్ధతుల్లో మూసివేస్తాం

కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి

- గడిచిన 8 నెలల్లో పదికి పైగా గనులు మూసి వేశాం
- వరల్డ్ మైనింగ్ కాంగ్రెస్ అంతర్జాతీయ సదస్సు ప్రారంభం



విజన్ నివేదికలను విడుదల చేస్తున్న కిషన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: ఖనిజాల వెలికితీత పూర్తయిన గనులను శాస్త్రీయ పద్ధతుల్లో మూసివేస్తామని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి ప్రకటించారు. తద్వారా ప్రమాదాలను నివారించడంతో పాటు పర్యావరణ పరిరక్షణ, స్థానికులకు ఉపాధి లక్ష్యంగా కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. స్వాతంత్రం వచ్చిన నాటి నుంచి నేటి వరకు దేశవ్యాప్తంగా 143 పైగా బొగ్గు, ఇతర గనుల్లో ఖనిజాల వెలికితీత ముగిసిందన్నారు. వీటిని ఖర్చుకు వెనుకాడకుండా వచ్చే మూడేళ్లలో శాస్త్రీయ పద్ధతుల్లో మూసి వేస్తామని, గత ఎనిమిది నెలల్లో ఇలాంటివి పదికి పైగా గనులను మూసివేశామని వెల్లడించారు. వరల్డ్ మైనింగ్ కాంగ్రెస్ (డబ్ల్యూఎంసీ) అనుబంధ ఇండియన్ నేషనల్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన అంతర్జాతీయ సదస్సును కిషన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'దేశంలో బొగ్గు, సున్నపురాయి, ఇనుము.. తదితర ఖనిజాల వెలికితీత పూర్తయిన తర్వాత ఆ గనుల మూసివేత శాస్త్రీయ పద్ధతుల్లో జరగడం లేదు. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇదే అంశంపై ఈ సదస్సులో చర్చించి విధానాలు, కార్యాచరణ రూపొందిస్తాం'అని ప్రకటించారు.

అవినీతికి అవకాశం లేకుండా వేలం

2015 తర్వాత మైనింగ్ బ్లాక్‌లను పారదర్శక పద్ధతుల్లో వేలం వేసి, అవినీతికి అవకాశం లేకుండా చేశామని కిషన్‌రెడ్డి తెలిపారు. ప్రైవేటు కంపెనీలకు 50 ఏళ్ల పాటు లీజుకు ఇవ్వడంతో పాటు ఖనిజాన్వేషణకు జాతీయ సంస్థ 'ఎన్‌మెట్'ద్వారా ఆర్థిక సహకారం అందిస్తున్నామని వివరించారు. రేర్ ఎర్త్‌ఎలిమెంట్స్ ఎగుమతులపై చైనా ఆంక్షలు విధించిన నేపథ్యంలో భారత్ ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి సారించిందని కిషన్‌రెడ్డి వెల్లడించారు. కోల్ ఇండియా చైర్మన్ పీఎం ప్రసాద్ తదితరులు ఈ సదస్సులో ప్రసంగించారు. అనంతరం మైనింగ్ రంగానికి సంబంధించిన విజన్ నివేదికలను విడుదల చేశారు.

మహబూబ్‌నగర్‌లో పట్టాలు తప్పిన గూడ్స్ రైలు

4 గంటల పాటు పలు రైళ్ల రాకపోకలకు అంతరాయం



స్టేషన్ మహబూబ్‌నగర్: మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రం బోయపల్లి రైల్వే గేటు సమీపంలో శుక్రవారం సాయంత్రం ఓ గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. ఈ ఘటనతో పలు రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. శుక్రవారం ఉదయం పెద్దపల్లి జిల్లా రామగుండంలో బయలుదేరిన ఈ రైలు తమిళనాడుకు ఎరువులు తీసుకెళుతోంది. ఈ గూడ్స్ సాయంత్రం 6 గంటల ప్రాంతంలో బోయపల్లి గేట్ వద్దకు వచ్చిన సమయంలో 6వ నంబర్ బోగీ పట్టాలు తప్పింది. ప్రమాదాన్ని గురించిన వెంటనే లోకో పైలట్ రైలుని నిలిపివేశారు. రైల్వే అధికారులు, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని పట్టాలు తప్పిన బోగీకి రెండు వైపులా ఉన్న ఇతర బోగీలను తొలగించారు. దెబ్బతిన్న బోగీకి రాత్రి 10 గంటల సమయంలో మరమ్మతులు పూర్తి చేశారు. ఈ ఘటనతో దాదాపు నాలుగు గంటల పాటు మహబూబ్‌నగర్ మీదుగా హైదరాబాద్–కర్నూలు మార్గంలో వెళ్లే పలు రైళ్లను ఎక్కడికక్కడ నిలిపివేశారు. కాచిగూడ– చెన్నై చెంగల్‌పట్టు (చెన్నూ ఎగ్మోర్‌ఎక్స్‌ప్రెస్)ను దివిటిపల్లి వద్ద, వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్‌ను తిమ్మాపూర్ వద్ద, హైదరాబాద్–కర్నూలు సిటీని దివిటిపల్లి వద్ద, కాచిగూడ–మైసూర్ ఎక్స్‌ప్రెస్‌ను (బెంగళూరు ఎక్స్‌ప్రెస్) ను బాలానగర్ వద్ద, కర్నూలు– కాచిగూడ వందే భారత్‌ను దోకూర్‌లో, ఔరంగాబాద్ ఎక్స్‌ప్రెస్‌ను కౌకుంట్ల, అలోక్ స్పెషన్‌ను కర్నూలు స్టేషన్‌లో నిలిపివేశారు.

రెండు లారీలు ఢీకొని.. ముగ్గురు సజీవ దహనం

మహబూబాబాద్ జిల్లా ఎల్లంపేట వద్ద ఘటన

తండ్రి చూస్తుండగానే మంటల్లో కాలిపోయిన కొడుకు



మరిపెడ రూరల్: రెండు లారీలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో మంటలు చెలరేగి ముగ్గురు యువకులు సజీవ దహనమయ్యారు. ఈ విషాద ఘటన మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం ఎల్లంపేట స్టేజీ కుడియా తండా వద్ద వరంగల్–ఖమ్మం 563వ జాతీయ రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. మరిపెడ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజస్తాన్ రాష్ట్రం జోధ్‌పూర్ జిల్లా కేజర్లకు చెందిన తండ్రీకొడుకులు రాజురాం చౌదరి, అతని కుమారుడు సర్వన్‌రాం తోపాటు క్లీనర్ బర్కత్ ఖాన్‌లు ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ నుంచి రెండు లారీల్లో చేపల దాణా లోడ్ చేసుకుని గుజరాత్ వెళ్తున్నారు. ముందు వెళ్తున్న సర్వన్‌రాం లారీ కుడియాతండా వద్దకు రాగానే రోడ్డుపై గుంతను తప్పించబోయి ఎదురుగా వస్తున్న గ్రానైట్ లారీని డీజిల్ ట్యాంకు వద్ద బలంగా ఢీకొట్టింది. దీంతో ఒక్కసారిగా మంటలు చెలరేగి రెండు లారీలు మంటల్లో చిక్కుకున్నాయి. తప్పించుకునే దారి లేకపోవటంతో సర్వన్‌రాం, బర్కత్ ఖాన్‌తో పాటు గ్రానైట్ లారీ డ్రైవర్ గుగులోత్ గణేశ్ (30) లారీల్లో కూర్చున్నచోటే సజీవ దహనమయ్యారు. గణేశ్‌ది వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం నల్లబెల్లి గ్రామశివారు రాంనాథ్‌తండా. అతడికి భార్య అనసూర్య, ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. తన కళ్లముందే కుమారుడు సర్వన్‌రాం సజీవదహనం కావటంతో అతడి తండ్రి రాజురాం తల్లడిల్లిపోయాడు. మరో మృతుడు బర్కత్ ఖాన్‌కు 15 రోజుల క్రితమే వివాహం అయినట్లు తెలిసింది. విషయం తెలుసుకున్న మరిపెడ సీఐ రాజ్‌కుమార్, ఎస్సైలు సతీశ్, సంతోష్‌లు ఫైర్ ఇంజన్లు రప్పించి మంటలను అదుపులోకి తెచ్చారు. ఖమ్మం–వరంగల్ 563 జాతీయ రహదారిపై మరిపెడ, నర్సింహులపేట, దంతాలపల్లి మండలాల్లో అనేకచోట్ల రోడ్డు ధ్వంసమై గుంతలు ఏర్పడటంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

అప్పులు తీర్చలేక రైతు ఆత్మహత్య



బద్దుల రాజు

రామన్నపేట: వ్యవసాయ పెట్టుబడుల కోసం చేసిన అప్పులు తీర్చలేక రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన శుక్రవారం యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలంలోని బోగారం గ్రామంలో జరిగింది. బోగారం గ్రామానికి చెందిన బద్దుల రాజు (39) తన భూమిలో గతేడాది కొత్తగా బోరు వేయడంతో పాటు సాగు పెట్టుబడుల కోసం రూ.2 లక్షల వరకు అప్పు చేశాడు. సరైన దిగుబడి రాకపోవడంతో అప్పు తీర్చలేక పోయాడు. తీవ్ర మనోవేదనతో శుక్రవారం గడ్డిమందు తాగాడు. కుటుంబ సభ్యులు అతడిని రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండటంతో నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్లగా పరీక్షించిన వైద్యులు అప్పటికే రాజు మృతిచెందినట్లు చెప్పారు. మృతుని భార్య లలిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై మల్లయ్య తెలిపారు.

ఉద్యోగం రాలేదని.. గురుకులంలో సీటు దక్కక..

వేర్వేరు చోట్ల ఇద్దరు విద్యార్థినుల ఆత్మహత్య



ప్రత్యూష

శాయంపేట/మద్దూరు: ప్రభుత్వ ఉద్యోగం రాలేదని ఓ విద్యార్థిని.. గురుకుల పాఠశాలలో సీటు రాలేదని మరో విద్యార్థిని వేర్వేరుచోట్ల ఆత్మహత్య చేసుకున్నారు. హనుమకొండ, నారాయణపేట జిల్లాల్లో చోటుచేసుకున్న ఘటనల వివరాలిలా ఉన్నాయి. హనుమకొండ జిల్లా శాయంపేట మండలం పెద్దకోడెపాక గ్రామానికి చెందిన రావుల ప్రత్యూష (24) బీటెక్ పూర్తిచేసి రెండేళ్లుగా ఉద్యోగవేటలో ఉంది. పలు ప్రభుత్వ ఉద్యోగాల ఎంట్రన్స్‌లు రాయగా, కొన్ని మార్కుల తేడాతో రాలేదు. దీంతో ప్రత్యూష మనస్తాపానికి గురై శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో చున్నీతో దూలానికి ఉరి వేసుకుంది. చనిపోయాక చున్నీ తెగడంతో కిందపడింది. కొద్దిసేపటికి అమ్మమ్మ లక్ష్మి ఇంట్లోకి వచ్చి చూడగా ప్రత్యూష కిందపడి ఉండటంతో భయంతో కేకలు వేసింది. చుట్టుపక్కల వారు వచ్చి చూడగా అప్పటికే ప్రత్యూష మృతి చెందింది. తల్లిదండ్రులు కూలీ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. ప్రత్యూష తండ్రి రావుల రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జక్కుల పరమేశ్ తెలిపారు.

గురుకులంలో సీటు రాలేదని..



మాలే మనీషా

నారాయణపేట జిల్లా మద్దూరు మండలం దమ్‌గాన్‌పూర్ గ్రామానికి చెందిన నర్సప్ప, లక్ష్మి దంపతులకు ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. నర్సప్ప బతుకుదెరువు కోసం హైదరాబాద్ వెళ్లి కూలీ పనిచేస్తుండగా, లక్ష్మి ఊళ్లో వ్యవసాయ కూలీ పనులకు వెళ్తుంది. కుమార్తె మాలే మనీషా (14) గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి పూర్తి చేసుకొని మద్దూరు బాలికల పాఠశాలలో 9వ తరగతి అడ్మిషన్ పొందింది. ఈ క్రమంలోనే గురుకుల పాఠశాలలో సీటు కోసం ఎంట్రన్స్ రాసింది. పరిగి గురుకుల పాఠశాలలో సీటు వచ్చిందని టీసీ తీసుకొని వెళ్లింది. తీరా అక్కడికి వెళ్లాక అక్కడ సీటు రాలేదని తెలిసింది. దీంతో మనస్తాపం చెందిన మనీషా 2వ తేదీ రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగు మందు తాగింది. ఇంటికి వచ్చిన తల్లి.. కూతురి పరిస్థితి గమనించి వెంటనే మహబూబ్‌నగర్ ప్రభుత్వాస్పత్రికి, అక్కడి నుంచి హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించింది. అక్కడే చికిత్స పొందుతూ మనీషా గురువారం అర్ధరాత్రి మృతి చెందింది.

తెలంగాణ తెచ్చుకుంది కడుక్కు తాగేందుకు కాదు

▶ మొదటి పేజీ తరువాయి

ప్రజలకు వివరిస్తా'అని బీఆర్‌ఎస్ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు తన పార్టీ నేతలతో అన్నారు. వైద్య పరీక్షల కోసం సోమాజిగూడ యశోద ఆస్పత్రిలో చేరిన కేసీఆర్‌ను పలువురు పార్టీ నేతలు శుక్రవారం పరామర్శించారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, ప్రభుత్వ కార్పొరేషన్ల మాజీ చైర్మన్లతో కేసీఆర్ ఇష్టాగోష్టి నిర్వహించారు. రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులు, రైతులకు యూరియా ఎరువుల లభ్యత, వ్యవసాయం, సాగునీరు తదితర ప్రజా సమస్యలు, వర్తమాన అంశాలపై మూడు గంటలపాటు సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ.. 'తెలంగాణ సాగు నీటి రంగంపై ప్రస్తుత పాలకులకు కనీస అవగాహన లేదు. వారికి తోక తెలియదు.. మూతి తెలియదు. బనకచర్ల లింక్ ప్రాజెక్టుతో తెలంగాణకు జరిగే నష్టంపై నేనే స్వయంగా ఆదివారం (సూచనప్రాయంగా) మీడియాతో మాట్లాడతా. నా ఆరోగ్యంపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. నేడు సాయంత్రం డిశ్చార్జి అయిన తర్వాత నందినగర్ నివాసంలోనే ఉంటా'అని కేసీఆర్ తెలిపారు.

కేటీఆర్, హరీశ్‌రావుతో భేటీ

నేతలతో ఇష్టాగోష్టి తర్వాత పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు, మాజీ మంత్రి హరీశ్‌రావుతో కేసీఆర్ సుదీర్ఘంగా భేటీ అయ్యారు. జాతీయ, రాష్ట్ర రాజకీయాలు, ప్రజా సమస్యలు, పార్టీ అంతర్గత అంశాలపై చర్చించినట్లు తెలిసింది. బనకచర్లపై తన ప్రెస్‌మీట్ తర్వాత పార్టీ పరంగా చేపట్టాల్సిన కార్యాచరణపై కేసీఆర్ దిశా నిర్దేశం చేసినట్లు సమాచారం. శాసనమండలి వైస్ చైర్మన్ బండా ప్రకాశ్, మాజీ మంత్రులు జగదీశ్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్యేలు డాక్టర్ సంజయ్, బండారు లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, చిరుమర్తి లింగయ్య, శంకర్‌నాయక్, పార్టీ నేతలు వాసుదేవరెడ్డి, ఎర్రోళ్ల శ్రీనివాస్, రాకేశ్, నాగేశ్, సతీశ్‌రెడ్డి తదితరులు ఇష్టాగోష్టిలో పాల్గొన్నారు.

ప్రియుడితో మాట్లాడొద్దన్నందుకు...

గొంతు నులిమి భర్తను హత్య చేసిన భార్య

- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన సంఘటన



అంజిలప్ప



రాధ

నారాయణపేట రూరల్: ప్రియుడితో మాట్లాడొద్దని చెప్పినందుకు.. కట్టుకున్న భర్త గొంతునులిమి భార్య హత్య చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామస్తులు, పోలీసుల కథనం ప్రకారం.. నారాయణపేట మండలం కోటకొండకు చెందిన కంపిలి అంజిలప్ప (32)కు పదేళ్ల క్రితం ధన్వాడ మండలం రామకిష్టయ్యపల్లికి చెందిన రాధతో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు. బతుకుదెరువు కోసం రెండు నెలల క్రితం ముంబైకి వలస వెళ్లి కూలి పనులు చేస్తున్నారు. అక్కడే పనిచేస్తున్న ధన్వాడ మండలానికి చెందిన ఓ యువకుడితో రాధకు పరిచయం ఉండేది. తనకంటే చిన్నవాడైనా అతడితో వివాహేతర సంబంధం పెట్టుకుంది. విషయం తెలుసుకున్న భర్త.. భార్యను మందలించాడు. ఆపై స్వగ్రామానికి తిరుగు పయనమయ్యారు. మార్గమధ్యలో తాండూరుకు చేరుకున్నాక ఇంటికి వెళితే.. పరువు పోతుందని, వేరేచోట పని చూసుకుందామని రాధ పట్టుబట్టడంతో హైదరాబాద్ వెళ్లారు. బాచుపల్లిలోని ఒక అపార్ట్‌మెంట్ వద్ద పనిచేస్తూ గుడిసెలో ఉన్నారు. అయితే రాధ తిరిగి ఆ యువకుడితో మాట్లాడటం అంజిలప్ప గమనించాడు. దీంతో ఇద్దరి మధ్య పలుమార్లు గొడవలు జరిగాయి.

హత్యచేసి.. పక్కింట్లో నిద్రించి

ఈ క్రమంలోనే గత నెల 23న రాత్రి అంజిలప్ప మద్యం తాగి ఇంటికొచ్చాడు. ఇద్దరి మధ్య గొడవ జరిగింది. తాగిన మైకంలో భర్త పడుకొని ఉండగా.. భార్య గొంతు నులిమి హత్య చేసింది. ఏమీ తెలియనట్టు పక్కనే ఉన్న గుడిసెలోకి వెళ్లి భర్త తనను ఇబ్బంది పెడుతున్నాడని చెప్పి అక్కడే పడుకుంటానని వారిని నమ్మించింది. తెల్లవారుజామున లేచి గుడిసెలోకి వెళ్లి భర్త చనిపోయాడని రోదిస్తూ అందరినీ నిద్రలేపింది. అనంతరం ప్రైవేట్ అంబులెన్స్‌లో కోటకొండకు తీసుకొచ్చింది. మృతుడి సోదరుడు, ఇతర కుటుంబ సభ్యులు అంజిలప్ప మృతిపై అనుమా నాలు ఉన్నాయని అదేరోజు నారాయణపేట రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సైబరాబాద్ కమిషనర్, డీసీపీ ఆదేశాలతో బాచుపల్లి పోలీసులు రంగంలోకి దిగి రాధను అదుపులోకి తీసుకొని విచారించారు. నేరం అంగీకరించడంతో కోర్టులో ప్రవేశపెట్టి రిమాండ్‌కు తరలించారు.

ఎలా... ఏ పాత్రలో.. వంట ఆరోగ్యకరం?



కూరగాయలను ఆవిరిపై వండటం ఉత్తమం

ఎక్కువసేపు, వేడితో వండితే పోషకాల నష్టం

ప్రస్తుత పరిస్థితుల్లో స్టీలు పాత్రలు శ్రేయస్కరం

జాతీయ పోషకాహార సంస్థ మార్గదర్శకాలు

అల్యూమినియం వంట పాత్రలకూ ఎక్స్‌పెయిరీ ఉంటుందని.. వాటిని సుదీర్ఘకాలం వాడటం ఆరోగ్యానికి ప్రమాదకరమని బ్యూరో ఆర్ ఇండియన్ స్టాండర్డ్స్ వెల్లడించింది. ఆరోగ్యదాయకమైన జీవనం కోసం ఏం తింటున్నాం అనే దానితో పాటు దాన్ని ఎలా వండుతున్నాం అనేది కూడా అంతే ముఖ్యమైన విషయం. ఆహారోత్పత్తులను అధిక ఉష్ణోగ్రతలో వండితే పోషకాలు నష్టపోవటంతో పాటు, హానికారక పదార్థాలు ఏర్పడతాయని మీకు తెలుసా? వంట అనేక పద్ధతుల్లో చేస్తుంటాం. ఇంతకీ, ఏ పద్ధతిలో వండితే మంచిది? ఏయే పాత్రల్లో ఎలా వండితే మంచిదో తెలుసా? భారత వైద్య పరిశోధనా మండలి (ఐసీఎంఆర్)కి అనుబంధ సంస్థ అయిన హైదరాబాద్‌లోని జాతీయ పోషకాహార సంస్థ (ఎన్ఐఎన్) ఏం చెబుతోందంటే..

ముంబైలో 50 ఏళ్ల వ్యక్తికి మతిమరుపు విపరీతంగా పెరిగిపోయింది. తీవ్రమైన అలసట, ఒళ్లంతా నొప్పులు ఎక్కువయ్యాయి. ఆసుపత్రిలో చేరిన అతడికి మెటల్ స్క్రీనింగ్ చేస్తే.. శరీరంలో సీసం స్థాయిలు భారీగా పెరిగిపోయాయని తేలింది. దానికి కారణం ఏంటా అని ఆరా తీస్తే.. అతడి భార్య ఇంట్లో 20 ఏళ్లుగా ఒకే ప్రెషర్ కుక్కర్‌లో వంట చేస్తోందట! ఆమ్లగుణం ఉన్న ఆహార పదార్థాలను అల్యూమినియం పాత్రల్లో వండేటప్పుడు అందులో సీసం, అల్యూమినియం కణాలు ఆహారంలో కలిసిపోయే ప్రమాదం ఉంటుంది. అందువల్ల వంట చేసే పద్ధతితో పాటు ఏ పాత్రలో వండుతున్నాం అన్నదాన్ని బట్టి ఆహారంలో పోషకాల సాంద్రత, నాణ్యత ఆధారపడి ఉంటుంది.



మట్టి పాత్రలు..: వంటకు ఇవే అత్యుత్తమం. ఇవి పర్యావరణహితమైనవే కాదు, వాటిల్లో వండే ఆహారంలో పోషకాలను చెక్కు చెదరకుండా ఉంచుతాయి. మట్టి పాత్రల గోడల్లోని సూక్ష్మ రంధ్రాల ద్వారా అధిక వేడి బయటకు పోతుంది కాబట్టి ఉడికే ఆహారంలో పోషకాలకు నష్టం వాటిల్లదు.

రాతి పాత్రలు..: గ్రానైట్ స్టోన్ పాత్రలు సమయాన్ని, ఇంధనాన్ని ఆదా చేస్తాయి. టెఫ్లాన్ పూతలు లేనివి వంటకు మంచివి. ఈ పాత్రలకు.. మంట మధ్యస్థానికి–అధికానికి మధ్యలోనే ఉంచాలి.

లోహ పాత్రలు

అల్యూమినియం, ఇనుము, ఇత్తడి, కంచు, రాగి వంటి లోహ పాత్రల్లో ఆహారం వండినా, నిల్వ చేసినా ఆ లోహాలు ఆహారంలో కలుస్తాయి.

- నిల్వ పచ్చళ్లు, చట్నీలు, సాంబారు వంటి ఆమ్ల గుణం ఉన్న పదార్థాలను అల్యూమినియం, ఇనుము; లోపలి పూత లేని ఇత్తడి, రాగి పాత్రల్లో నిల్వ చేయడం మంచిది కాదు.

స్టీలు పాత్రలు

ఇవి వంటకు బాగా అనువైనవి. ప్రపంచవ్యాప్తంగా విస్తారంగా వంటకు స్టీల్ గిన్నెలు వాడుతున్నారు. ఎక్కువ కాలం మన్నిక, తుప్పు పట్టకపోవటం, ఆహార పదార్థాలు ఉంచినప్పుడు రియాక్షన్ లేకపోవటం వంటి సానుకూల అంశాలు ఉండటమే ఇందుకు కారణం.

నాన్‌స్టిక్ పాత్రలు

పాలీ టెట్రా ఫ్లోరో ఇథిలిన్ (పీటీఎఫ్ఇ/టెఫ్లాన్) అనే పదార్థంతో లేపనం చేసిన పాత్రలను నాన్ స్టిక్ పాత్రలు అంటారు. 170 డిగ్రీల కన్నా ఎక్కువ ఉష్ణోగ్రతలో ఈ పాత్రల్లో వంట చెయ్యకూడదు. అలా చేస్తే టెఫ్లాన్ కోటింగ్ ఊడి వచ్చేసి విషతుల్యమైన వాయువులు వెలువడతాయి. టెఫ్లాన్ పొర ఊడిపోతే ఇక ఆ పాత్రలను వాడకూడదు.



ఎలా వండితే మంచిది?

మూత పెట్టి/పెట్టకుండా వంట: మూత పెట్టకుండా వండితే పోషకాలు కొన్ని గాలిలో కలిసిపోతాయి. ఎంత తక్కువ సమయం వండితే పోషకాల నష్టం అంత తగ్గుతుంది. మూత పెట్టి వండితే త్వరగా పూర్తై, పోషకాల నష్టమూ తగ్గుతుంది.

ఉడకబెట్టడం, ప్రెజర్ కుక్కర్‌లో వంట: పప్పుల్లో జీర్ణం కాకుండా అడ్డుకునే యాంటీ–న్యూట్రిషనల్ ఎంజైములు ఉంటాయి. ఎక్కువ నీరు పోసి ఉడకబెట్టటం, ప్రెజర్ కుక్కర్‌లో వండటం వల్ల ఇవి నశించి, జీర్ణమయ్యే గుణంతో పాటు మాంసకృత్తుల లభ్యత పెరుగుతుంది.

- ధాన్యాలు, పప్పుల్లో ఫైటిక్ ఆమ్లాలు ఉంటాయి. ఎక్కువ నీటిలో ఉడికించినప్పుడు లేదా కుక్కర్‌లో వండినప్పుడు ఇవి చాలా వరకు తగ్గిపోతాయి. తద్వారా ఇనుము, కాల్షియం, మెగ్నీషియం, జింక్ వంటి సూక్ష్మపోషకాలు మనకు ఎక్కువగా లభిస్తాయి.
- పప్పులను ఎక్కువ నీటితో ఉడకబెట్టి, ఆ నీటిని పారేస్తే ఫోలేట్, బి కాంప్లెక్స్ విటమిన్లు, సి విటమిన్లను నష్టపోతాం. ఎక్కువ సేపు ఉడకబెడితే మాంసకృత్తుల నాణ్యత క్షీణిస్తుంది.

ఆవిరిపై వంట: ఆకుకూరలు, కూరగాయలను ఆవిరిపై వండటం ఉత్తమం.

- నీటిలో కరిగిపోయే విటమిన్లు, ఇతర పోషకాలు నష్టపోకుండా చూసుకోవచ్చు. ఆవిరి వంట వల్ల బీటా కెరోటిన్, లుటీన్‌లు సులభంగా శరీరానికి వంటపడతాయి.

నూనెలో వేపుడు: ఎక్కువ ఉష్ణోగ్రతపై, ఎక్కువ నూనెలో ఫ్రై చేయడం వల్ల ప్రొటీన్లు, విటమిన్లు, యాంటీఆక్సిడెంట్లు వంటి పోషకాల్లో మార్పులొస్తాయి.

- నీరు ఆవిరైపోవటం వల్ల విటమిన్ సి వంటి నీటకరిగే పోషకాలు నష్టపోతాం.
- అధిక ఉష్ణోగ్రత, గాలి, నూనె కలిసినప్పుడు విష పదార్థాలు ఉత్పత్తయ్యే ప్రమాదం ఉంది.
- ఒకసారి వేపుడు కోసం వాడిన నూనెను మళ్లీ వేపుడుకు వాడటం గానీ, వాడని నూనెతో కలపటం గానీ ప్రమాదకరం.



లోతు తక్కువ గిన్నెలో వేపుడు: తక్కువ లోతున్న గిన్నెలో తక్కువ నూనెతో, ఎక్కువ మంటపై 'షాలో ఫ్రైయింగ్' చేయటం వల్ల పోషకాల నష్టం ఎక్కువ. డీప్ ఫ్రైతో పోల్చితే.. ఎక్కువగా ఆక్సీకరణానికి గురైనందున కొవ్వులు, నూనెల నాణ్యత దెబ్బతింటుంది.

వేగంగా తిప్పుతూ వేపటం: కూరగాయలు లేదా మాంసం ముక్కలను కొద్దిపాటి నూనె వేసి అధిక మంటపై వేగంగా తిప్పుతూ వేపటాన్నే స్టిర్ ఫ్రైయింగ్ అంటారు. ఎక్కువ నూనెలో వేపుడుతో పోల్చితే ఈ పద్ధతిలో పోషకాల నష్టం తక్కువే.



మైక్రోవేవ్ కుకింగ్

మైక్రోవేవ్‌లో చాలా తక్కువ సమయంలో, కొద్దిపాటి నీటితోనే వంట పూర్తవుతుంది. మిగతా పద్ధతులతో పోలిస్తే ఇందులో విటమిన్లు, ఖనిజాల నష్టం చాలా తక్కువ.

నెమ్మదిగా వండటం: తక్కువ వేగంగా, తక్కువ వేడిపై వండే పద్ధతి ఇది. ఇలా నూనెలో మాంసాన్ని వేపినప్పుడు పోషకాల నష్టం చాలా తగ్గుతుంది.

- టమాటాలు, మొక్కజొన్న, పాలకూర వంటి వాటిని ఇలా వండితే వాటి కణాల గోడలు ఛిద్రమై శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు విడుదలై శరీరానికి ఎక్కువగా అందుతాయి.

ఎయిర్ ఫ్రైయింగ్

- తక్కువ నూనెతో డీప్ ఫ్రైయింగ్ చేయడం. దీనివల్ల ఊబకాయం సమస్య రాదు.
- బంగాళదుంపలు వంటి స్టార్చ్ ఎక్కువ ఉండే ఆహారానికి ఇది నప్పుతుంది.
- అయితే, చేప ముక్కలను ఎయిర్ ఫ్రైయింగ్ చేస్తే వాటిలోని ఒమేగా 3 ఫ్యాటీ ఆమ్లాలు తగ్గిపోతాయి. వాపు (ఇన్‌ఫ్లమేషన్) కలిగించే మూలకాలు పెరుగుతాయి.



– సాక్షి, స్పెషల్ డెస్క్

క్లుప్తంగా...

'ఒకే దేశం - ఒకే బంజారా' గా గుర్తించండి

కేంద్రానికి మహా బంజారా సేవా సంఘ్ డిమాండ్

సాక్షి, న్యూఢిల్లీ: ఒకే దేశం–ఒకే సంవిధాన్, వన్ నేషన్–వన్ ఎలక్షన్ నినాదంతో ముందుకెళ్తున్న కేంద్రం ప్రభుత్వం 'ఒకే దేశం – ఒకే బంజారా'విధానాన్ని కూడా అమలు చేయాలని అఖిల భారతీయ మహా బంజారా సేవా సంఘ్ డిమాండ్ చేసింది. శుక్రవారం బంజారా సేవా సంఘ్ నేతృత్వంలో ఢిల్లీలోని జ్వాలాపురిలో బాబా లక్కీ షా బంజారా 445వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో తెలంగాణకు చెందిన మాజీ ఎంపీ రవీందర్ నాయక్, బంజారా నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సేవా సంఘ్ నేతలు మాట్లాడుతూ.. దేశంలో వివిధ వర్గాలుగా ఉన్న బంజారాలను ఒకే గొడుకు కిందకు తీసుకువచ్చేలా చట్టం చేయాలని కేంద్రాన్ని కోరారు. అలాగే పాత పార్లమెంట్ భవనానికి బంజారా భవన్‌గా నామకరణం చేయాలని విజ్ఞప్తి చేశారు.

నిరుద్యోగులను ముంచి ఓట్లు అడుగుతారా?

బీఆర్ఎస్ నేత డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్



సాక్షి, హైదరాబాద్: ఏటా రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తామన్న హామీతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. ఏడాదిన్నర పాలనలో కనీసం 11 వేల ఉద్యోగాలను ఇవ్వలేకపోయిందని బీఆర్ఎస్ నేత డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్ విమర్శించారు. చలో సెక్రటేరియట్ పేరిట నిరసనకు పిలుపునిచ్చిన నిరుద్యోగులు, బీఆర్ఎస్ విద్యార్థి విభాగం నాయకులను అరెస్టు చేయడాన్ని ఆయన ఖండించారు. తెలంగాణ భవన్‌లో పార్టీ నేతలతో కలిసి ఎర్రోళ్ల శ్రీనివాస్ శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఎన్నికల సమయంలో మాత్రమే తెలంగాణకు వస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో రైతులు సహా అన్ని వర్గాల వారు సమస్యలతో అల్లాడుతూ.. ఆత్మహత్యలకు పాల్పడుతుంటే ఖర్గే ఎక్కడున్నారని ప్రశ్నించారు. నిరుద్యోగులను నిండా ముంచి ఓట్లు అడిగేందుకు ఖర్గే వస్తున్నారని విమర్శించారు. పార్టీ నేత డాక్టర్ కె.వాసుదేవ రెడ్డి మాట్లాడుతూ.. జాబ్ కేలండర్‌ను అమలు చేయలేకపోతున్న కాంగ్రెస్.. నిరుద్యోగులకు అన్యాయం చేస్తోందని విమర్శించారు.

చేప పిల్లల పంపిణీ ఎప్పుడు?

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

సాక్షి, హైదరాబాద్: ఉచిత చేప పిల్లల పంపిణీ పథకంపై ఇప్పటి వరకు ఎలాంటి ప్రకటన రాలేదని, బడ్జెట్‌లో పూర్తి స్థాయిలో నిధులు కేటాయించలేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. జూన్, జూలై నెలల్లో వదలాల్సిన చేప, రొయ్య పిల్లలను.. సెప్టెంబర్ నుండి నవంబర్ నెల వరకు ఆలస్యంగా వదలడంతో మత్స్యకారులు తీవ్రంగా నష్టపోతున్నారని వివరించారు. మత్స్య సొసైటీలకు వెంటనే ఉచిత చేప, రొయ్య పిల్లల పంపిణీ పథకాన్ని ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. ఈ పథకాన్ని టెండర్ల ద్వారా కాకుండా.. నేరుగా మత్స్య సొసైటీల ఖాతాలో నగదు జమ చేసి మత్స్యకారులు లబ్ధి పొందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

రెడ్‌బుక్, పొలిటికల్ గవర్నెన్స్‌తో రక్తమోడుతోన్న రాష్ట్రం

చంద్రబాబు కూటమి ప్రభుత్వంపై వైఎస్ జగన్ ఆగ్రహం



సాక్షి, అమరావతి: రెడ్‌బుక్, పొలిటికల్ గవర్నెన్స్‌లతో రాష్ట్రం రక్తమోడుతోందని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ కూటమి ప్రభుత్వంలో రాష్ట్రంలో కొనసాగుతున్న దారుణాలపై నిప్పులు చెరిగారు. గుంటూరు జిల్లా మన్నవ గ్రామ దళిత సర్పంచి నాగమల్లేశ్వరరావును టీడీపీ గూండాలు పట్టపగలే కొట్టి చంపే ప్రయత్నం చేయడం దారుణమని మండిపడ్డారు. ఈ ఘటనపై శుక్రవారం 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ పోస్టు చేశారు. ఆ పోస్టులో వైఎస్ జగన్ ఏమన్నారంటే.. 'రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ పూర్తిగా క్షీణించింది. రెడ్‌బుక్, పొలిటికల్ గవర్నెన్స్‌లతో ఆంధ్రప్రదేశ్ రక్తమోడుతోంది. వైఎస్సార్‌సీపీకి చెందిన నాయకులు, కార్యకర్తలపై ఒక పథకం ప్రకారం తప్పుడు కేసులు, అరెస్టులు.. అదీ వీలుకాకపోతే, తన వాళ్లను ప్రోత్సహించి మరీ దాడులు చేయిస్తున్నారు. గుంటూరు జిల్లా పొన్నూరు నియోజకవర్గంలోని మన్నవ గ్రామ దళిత సర్పంచి నాగమల్లేశ్వరరావును పట్టపగలే కొట్టి చంపే ప్రయత్నం చేశారు. ఇందుకు సంబంధించి వైరల్ అయిన వీడియో రాష్ట్రంలో మాఫియా, దుర్మార్గపు పాలనను తెలియజేస్తోంది. నాగమల్లేశ్వరరావు కుటుంబం మొదటి నుంచి వైఎస్సార్‌సీపీలో ఉండడం, వారికి ప్రజల్లో మంచి గుర్తింపు ఉండడం టీడీపీ వారికి కంటగింపుగా మారింది. పలుమార్లు బెదిరించినా, భయపెట్టినా వెనకడుగు వేయలేదు. దీంతో రాజకీయంగా ఆ ప్రాంతంలో వైఎస్సార్‌సీపీ ప్రాబల్యాన్ని తట్టుకోలేక స్థానిక ఎమ్మెల్యే తన కార్యకర్తలను పురిగొల్పి ఈ దాడులు చేయించారు. ఆ వీడియోలు చూస్తే, జరిగిన దాడి ఎంత అన్యాయమో, ఎంత హేయమో స్పష్టంగా కనిపిస్తోంది. చంద్రబాబు స్వయంగా ప్రోత్సహిస్తూ, తన వాళ్లతో చేయిస్తున్న ఈ దారుణాలతో, వరుసగా జరుగుతున్న ఘటనల నేపథ్యంలో, రాష్ట్రంలో ఎవ్వరికీ రక్షణలేని పరిస్థితులు నెలకొన్నాయి. మాఫియా తరహాలో రాష్ట్రాన్ని నడుపుతున్న చంద్రబాబుకు అసలు పదవిలో ఉండే అర్హత ఉందా? రాజకీయ నాయకులకు, పౌరులకు రక్షణ లేని ఈ రాష్ట్రంలో రాజ్యాంగాన్ని, చట్టాన్ని ఉల్లంఘిస్తూ, లా అండ్ ఆర్డర్ కాపాడలేని పరిస్థితుల్లో రాష్ట్రపతి పాలన ఎందుకు పెట్టకూడదని ప్రశ్నిస్తున్నాను' అని పేర్కొన్నారు.

ఏపీలో ఇప్పుడంతా తలకిందులు!

అక్కచెల్లెమ్మలకు నాటి భరోసా కరువు

నాడు ఇల్లాలి చేతికి పథకాల సొమ్ము.. నేడు ఆశలు వమ్ము

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

- నీటి మూటలు, ఎండమావులుగా మారిన హామీలు
- నిరాశ, నిస్పృహలతో ఆత్మస్థైర్యం కోల్పోతున్న మహిళలు
- చేయూత లేదు.. 'ఆసరా' లేదు.. సున్నా వడ్డీ అసలే లేదు..
- కుంటుపడిన చిరు వ్యాపారాలు.. స్వయం ఉపాధికి బ్రేకులు
- అన్ని విధాలా చేయి పట్టుకుని నడిపించిన గత సర్కారు
- నేనున్నానంటూ ప్రతి పథకం ద్వారా ఆదుకున్న వైఎస్ జగన్
- క్రమం తప్పకుండా అందిన సాయంతో ఆర్థికంగా బలపడే దిశగా అడుగులు.. ఇంకొన్నేళ్లు ఆ సాయం అంది ఉంటే పూర్తిగా గాడిన పడేవి ఆ కుటుంబాలు
- ఆయన మేనిఫెస్టో సీఎం.. ఈయన మానిప్యులేట్ సీఎం అని సర్వత్రా ఆవేదన



ఏపీ ప్రభుత్వం, పోలీసులు ఏం చేస్తున్నారు?

- ఎస్టీల మీద దాడులపై జాతీయ ఎస్టీ కమిషన్ మండిపాటు.. ఈనెల 8న విచారణకు హాజరుకావాలని కలెక్టర్, ఎస్పీలకు సమన్లు
- ఎంపీ తనూజ రాణి ఫిర్యాదుపై కమిషన్ స్పందన

సాక్షి, న్యూఢిల్లీ: ఏపీలో ఎస్టీలపై జరుగుతున్న దాడులపట్ల జాతీయ ఎస్టీ కమిషన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఏపీ వ్యాప్తంగా వరుస దాడులు జరుగుతుంటే పోలీసులు, ఏపీ ప్రభుత్వం ఏం చేస్తోందంటూ ప్రశ్నించింది. ప్రభుత్వ వ్యవహారశైలి, పోలీసుల తీరుపై అసహనం వ్యక్తం చేసింది. ఇటీవల తిరుపతి జిల్లా, శ్రీకాళహస్తి మండలం, ఎంపేడులో ఎస్టీల మీద జరిగిన దాడులపై వైఎస్సార్‌సీపీ అరకు ఎంపీ డాక్టర్ గుమ్మా తనూజరాణి ఢిల్లీలోని జాతీయ ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. అమాయకులపై దాడులు జరిగినా ప్రభుత్వం, పోలీసులు పట్టించుకోవడం లేదని వారి దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు సంబంధించిన ఆధారాలను ఆమె కమిషన్‌కు అందచేశారు. దీనిపై కమిషన్ స్పందిస్తూ సంబంధిత కలెక్టర్, ఎస్పీలకు సమన్లు జారీచేసింది. తాము ఈనెల 8న విచారణ నిర్వహించనున్నామని, ఆ విచారణకు హాజరుకావాలని, లేనిపక్షంలో చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించింది.

అసెంబ్లీ మీడియా అడ్వైజరీ కమిటీ చైర్మన్‌గా ఐ.శ్రీనివాస్‌రెడ్డి

అసెంబ్లీ మీడియా సలహా కమిటీ ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ మీడియా సలహా కమిటీని ఏర్పాటు చేస్తూ అసెంబ్లీ కార్యదర్శి నరసింహాచార్యులు శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. మండలి చైర్మన్, అసెంబ్లీ స్పీకర్ ఆమోదంతో వివిధ పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియాలో పని చేస్తున్న సీనియర్ జర్నలిస్టులను ఈ కమిటీలో నియమించారు. చైర్మన్‌గా ఐ.శ్రీనివాస్‌రెడ్డి, కో చైర్మన్‌గా పోలోజు పరిపూర్ణాచారితో పాటు మరో 13 మంది సభ్యులతో కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కమిటీ సభ్యులుగా ఐతరాజు రంగారావు, బొడ్లపాటి పూర్ణ చంచల్‌రావు, ఎల్.వెంకట్రామిరెడ్డి, పోలంపల్లి ఆంజనేయులు, పవన్ కుమార్, భీమనపల్లి అశోక్, బుర్ర ఆంజనేయులుగౌడ్, సురేఖ అబ్బూరి, మహమ్మద్ నయీమ్, బసవ పున్నయ్య, సుంచు అశోక్, ప్రమోద్ కుమార్, గాంధీలను నియమించారు. 2025–27 సంవత్సరాలకు గాను ఈ కమిటీ పనిచేస్తుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



నివేదిక విడుదల చేస్తున్న ఖర్గే, సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో భట్టి, మీనాక్షి నటరాజన్, పొన్నం, మహేశ్ గౌడ్, కేసీ వేణుగోపాల్, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

బీసీ సంక్షేమం ప్రగతి నివేదిక విడుదల

సాక్షి, హైదరాబాద్: ప్రజాప్రభుత్వం ఏర్పాటైన తర్వాత బీసీ సంక్షేమ శాఖలో చేపట్టిన కార్యక్రమాలు, చేసిన అభివృద్ధి పనులు, శాఖాపరంగా తీసుకొచ్చిన సంస్కరణలతో కూడిన ప్రగతి నివేదికను శుక్రవారం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి విడుదల చేశారు. వసతిగృహాల కోసం రూ.100 కోట్లు కేటాయించామని, కొత్తగా 8 కార్పొరేషన్లు, ఈబీసీ బోర్డు, 10వేల మంది గీత కార్మికులకు కాటమయ్య కవచాలు అందజేసినట్లు నివేదికలో పేర్కొన్నారు. బీసీ గురుకులాల్లో 5,136 పోస్టులను భర్తీ చేసినట్లు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వివరించారు.

ఉద్యోగ భద్రత లేదు.. సకాలంలో జీతం రాదు

గెస్ట్ లెక్చరర్ల అసోసియేషన్ ఆవేదన




సాక్షి, హైదరాబాద్: సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని న్యాయస్థానాలు ఆదేశిస్తున్నా.. ప్రభుత్వాలు తమ గోడును పట్టించుకోవడం లేదని, జీతం మూడు నాలుగు నెలలకోసారి మాత్రమే అందుతోందని తెలంగాణ రాష్ట్ర గెస్ట్ లెక్చరర్ల అసోసియేషన్ ఆవేదన వ్యక్తం చేసింది. రాష్ట్రంలోని యూనివర్సిటీలతో పాటు రెసిడెన్షియల్స్, డైట్, బీఈడీ, ఎంఈడీ, ఇంటర్ కళాశాలల్లో గెస్ట్ లెక్చరర్లుగా పనిచేస్తున్న వారిని ఏటా రెన్యువల్ చేస్తున్నా.. తమకు మాత్రం ఇంటర్వ్యూలు నిర్వహించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించింది. ఈ మేరకు శుక్రవారం విద్యాశాఖ సెక్రటరీ యోగితా రాణాను డిగ్రీ గెస్ట్ లెక్చరర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొర్ర ఈశ్వర్, కో–ఆర్డినేటర్ పోతురాజు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి భగ్గు నాయక్, నరేందర్, శ్రీనివాస్, సురేందర్, జనార్దన్ తదితరులు కలిసి తమ సమస్యను విన్నవించారు. ప్రస్తుతమున్న 'అవర్లీ'చెల్లింపుల విధానాన్ని ప్రభుత్వం రద్దు చేయాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా గెస్ట్ లెక్చరర్లకు నెలకు రూ.50 వేల 'కన్సాలిడేషన్ పే'ను ప్రభుత్వం అమలు చేయాలని, ఏటా నిర్వహిస్తున్న డెమో విధానాన్ని రద్దు చేసి, హైకోర్టు తీర్పు ప్రకారం తమను రెన్యువల్ చేయాలని, ఉచిత వైద్యం, ప్రమాద బీమా వంటి సౌకర్యాలను కల్పించాలని, డిగ్రీ అధ్యాపకుల రెగ్యులర్ పోస్టుల నియామకంలో అనుభవం ఆధారంగా వెయిటేజ్ ఇవ్వాలని, పదోన్నతులతో ఏర్పడే ఖాళీల్లో గెస్ట్ లెక్చరర్లను నియమించి, కొనసాగించాలని కోరారు.

గుడి బడ్జెట్ ఆమోదానికి 'ముడుపు' కట్టాల్సిందే!

దేవాదాయశాఖలో విచ్చలవిడి వ్యవహారం

- ఆరోపణలున్నా.. ఏళ్లుగా అవే కుర్చీల్లో అధికారులు
- ప్రభుత్వ పర్యవేక్షణ నామమాత్రం కావటంతో ఇష్టారాజ్యం



సాక్షి, హైదరాబాద్: దేవుడి సేవలకు ఏడాది పొడవునా చేసే ఖర్చుకు సంబంధించిన అంచనా మొత్తానికి ఆమోదం లభించాలంటే అధికారి 'ప్రైవేట్ హుండీలో కానుక'లు వేయాల్సిందే. లేదంటే దేవుడి నైవేద్యానికి వస్తువులు కొనడమూ కష్టమే. భక్తులు స్వామి, అమ్మవార్ల దర్శనం కోసం భయభక్తులతో దేవాలయాలకు వస్తుంటే, ఆ ఆలయాలపై అజమాయిషీ చేసే కొందరు అధికారుల్లో మాత్రం అవేవీ మచ్చుకైనా కనిపించవు. దేవాదాయ శాఖపై ప్రభుత్వం చూసీచూడనట్టు పోవటాన్ని కొందరు అధికారులు తమకు అనుకూలంగా మలుచుకున్నారు. ఏం చేసినా పట్టించుకునేవారు లేరన్న ధీమాతో దేవుడి సొమ్మును దర్జాగా కాజేస్తున్నారు. దాన్ని క్రమంగా 'అధికారం'చేసేస్తున్నారు.

ఏటా అంచనా వ్యయంతో బడ్జెట్ రూపకల్పన

దేవాదాయ శాఖ ఆధీనంలోని ఆలయాల నిర్వహణకు ప్రతి సంవత్సరం ఓ అంచనా వ్యయంతో బడ్జెట్‌ను రూపొందిస్తారు. కమిషనర్ కార్యాలయంలోని సంబంధిత అధికారులు వాటికి ఆమోదముద్ర వేస్తారు. ఇక్కడే వసూళ్ల పర్వం కొనసాగుతోంది. బడ్జెట్‌కు ఆమోదముద్ర వేయాలంటే నిర్ణయించిన మొత్తాన్ని ఆ దేవాలయ ఈఓ ముట్టజెప్పాలి. లేనిపక్షంలో బడ్జెట్‌కు ఆమోదముద్ర వేయకుండా రకరకాల సాకులు చూపుతూ తిరస్కరించడమో, పెండింగ్‌లో ఉంచటమో చేస్తారు. దేవాలయాల్లో చిన్నాచితకా లోపాలు చోటుచేసుకుంటూనే ఉంటాయి. ఆ లోపాలను సాకుగా చూపి బడ్జెట్‌కు ఆమోదముద్ర వేయకుండా పెండింగ్‌లో ఉంచుతారు. ఆ అధికారి కోరిన మొత్తాన్ని ముట్టచెప్పగానే ఆమోదముద్ర లభిస్తుంది.

మేం తప్పుడు బిల్లులు పెట్టాల్సి వస్తోంది

'మా దేవాలయ బడ్జెట్‌కు ఆమోదం లభించాలంటే డబ్బులు ముట్టచెప్పాల్సి వస్తోంది. అంతమొత్తం నా జీతం నుంచి భరించలేను. చివరకు దేవాలయ డబ్బులను ఇవ్వాల్సి వస్తోంది. ఆ రూపంలో అయ్యే ఖర్చుకు లెక్క చూపాలంటే తప్పని పరిస్థితిలో అంతమేర తప్పుడు బిల్లులు పెట్టాల్సివస్తోంది'ఇది ఓ సీనియర్ కార్యనిర్వహణాధికారి ఆవేదన. దాదాపు అన్ని దేవాలయాల్లో ఇదే జరుగుతోంది.

సీటు వదులుకోని అధికారి

చాలా దేవాలయాలపై అజమాయిషీ సీటులో ఉన్న ఓ అధికారి ఆ పోస్టును వదులుకోవటానికి ఇష్టపడటం లేదు. ఏడెనిమిదేళ్లుగా అక్కడే తిష్ట వేశాడు. ఆయన్ను వేరే పెద్ద దేవాలయాలకు ఈఓగా మార్చినా, పాత సీటును మాత్రం 'ఇన్‌చార్జ్'రూపంలో అట్టిపెట్టుకునేలా తెర వెనుక చక్రం తిప్పుతున్నారు. పైస్థాయిలో ఉన్న పలుకుబడితో ఆ అధికారి సీటు వదులుకోకుండా కొనసాగుతున్నారు. ఆయన తీరుపై ఈఓలు మౌఖికంగా ఫిర్యాదు చేసినా బదిలీ చేయకపోవటం విశేషం.

ఏళ్లుగా అవే సీట్లలో..

దేవాదాయశాఖ ప్రధాన కార్యాలయంలోని కీలక సెక్షన్లను పర్యవేక్షిస్తున్న అధికారులపై అజమాయిషీ లేదని ఆరోపణలున్నాయి. ప్రధాన పెద్ద దేవాలయాలను, ఏసీ, డీసీ కార్యాలయాలను, ఎస్టాబ్లిష్‌మెంట్, దేవాలయ ఉద్యోగుల వ్యవహారాలను చూసే ప్రధాన సెక్షన్లలో కొందరు అధికారులు ఎనిమిదేళ్లుగా కొనసాగుతున్నారు. ఉద్యోగులకు సంబంధించి ఫైల్ పుటప్ చేయాలంటే కనీసం రూ.5 వేలు చొప్పున వసూళ్లు చేస్తున్నట్టు తీవ్ర ఆరోపణలున్నాయి. ఇక ఉద్యోగులపై క్రమశిక్షణ చర్యలు తీసుకునే ఆరోపణలు వస్తే చాలు వీరు రూ.లక్షల్లో వసూలు చేస్తున్నారు. డబ్బులివ్వకుంటే ఫైలు కదపకుండా మొండికేస్తున్నారని, సాధారణ సెక్షన్ స్థాయి అధికారులే అయినా, డిప్యూటీ కమిషనర్ స్థాయి అధికారులను కూడా డబ్బుల కోసం వేధిస్తున్నారన్న ఫిర్యాదులున్నాయి. ఆ సెక్షన్లకు వెళ్లాలంటే కచ్చితంగా జేబులో నోట్ల కట్ట పెట్టుకొని వెళ్లాల్సిందేనని ఉద్యోగులు వాపోతున్నారు. ఇలా వసూళ్ల ఆరోపణలు వస్తున్న అధికారులను సెక్షన్ కూడా మార్చకుండా ఏళ్లుగా కొనసాగిస్తుండటం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సాక్షి బిజినెస్

శనివారం
5-7-2025

స్టాక్ మార్కెట్లు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	193	83,433
నిఫ్టీ ▲	56	25,461

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	20,610	▲	208
డోజోన్స్	44,829	▲	344
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,823	▼	1
డాక్స్	23,787	▼	147
షాంఘై	3,472	▲	11
నికాయ్	39,810	▲	25

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	85.00	86.02
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	115.30	118.27
€	యూరో	ఎస్‌బీఐ	99.29	102.03
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	58.42	59.95
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	55.06	57.27
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	64.69	69.37
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.87	23.38
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.36	24.14
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.04	12.87

యూపీఎస్‌కూ పన్ను ప్రయోజనం

ఎన్‌పీఎస్ మాదిరే కల్పిస్తున్నట్టు కేంద్రం ప్రకటన



న్యూఢిల్లీ: యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ (యూపీఎస్)ను ప్రోత్సహించే దిశగా ఈ పథకాన్ని ఎంపిక చేసుకున్న ఉద్యోగులకు ఎన్‌పీఎస్ మాదిరే పన్ను ప్రయోజనాలు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు అవసరమైన చర్యలను కేంద్రం చేపట్టింది. యూపీఎస్‌ను సైతం పన్ను కార్యాచరణ పరిధిలోకి చేర్చడం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు విశ్రాంత జీవన భద్రత దిశగా ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నంలో ముందడు అని కేంద్ర ఆర్థిక శాఖ పేర్కొంది. ఎన్‌పీఎస్ కింద అమల్లో ఉన్న పన్ను ప్రయోజనాలను యూపీఎస్ ఎంపిక చేసుకునే వారికి సైతం వర్తింపచేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని చెబుతూ.. యూపీఎస్ కూడా ఎన్‌పీఎస్ కింద ఒక ఆప్షన్ అన్న విషయాన్ని గుర్తు చేసింది. దీనివల్ల యూపీఎస్ ఎంపిక చేసుకునే వారికి సైతం గణనీయమైన పన్ను ప్రయోజనాలు దక్కుతాయని తెలిపింది. 2025 ఏప్రిల్ 1 నుంచి కేంద్ర ప్రభుత్వ సర్వీసుల్లో చేరే ఉద్యోగులకు ఎన్‌పీఎస్ కింద యూపీఎస్‌ను ఒక ఆప్షన్‌గా ప్రవేశపెడుతూ ఈ ఏడాది జనవరి 24న కేంద్రం నోటిఫికేషన్ జారీ చేసింది. ఇప్పటికే ఎన్‌పీఎస్ కింద నమోదై ఉన్న ఉద్యోగులు యూపీఎస్‌కు మారేందుకు ఒక్కసారి అవకాశం ఇచ్చింది.

ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ చైర్మన్‌గా పీవీ కృష్ణారెడ్డి



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ చైర్మన్‌గా, అదనపు డైరెక్టర్ (నాన్–ఎగ్జిక్యూటివ్)గా పీవీ కృష్ణారెడ్డి నియమితులయ్యారు. ఇది జూలై 5 నుంచి అమల్లోకి వస్తుంది. ఇప్పటివరకు సీఎండీగా వ్యవహరించిన కేవీ ప్రదీప్ వ్యక్తిగత కారణాల రీత్యా రాజీనామా చేసినట్లు కంపెనీ వెల్లడించింది. ప్రదీప్ రాజీనామాతో ఎండీ, సీఈవో స్థానాన్ని భర్తీ చేసేందుకు తగిన అభ్యర్థిని అన్వేషించే ప్రక్రియలో ఉన్నట్లు వివరించింది. ఇన్‌ఫ్రా సహా వివిధ రంగాల్లో 35 ఏళ్ల పైగా సుదీర్ఘానుభవం గల పీవీ కృష్ణారెడ్డి.. మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రా ఎండీగా ఉన్నారు. మరోవైపు, పి.రాజేశ్ రెడ్డి హోల్‌టైమ్ డైరెక్టరుగా, బి.శరత్ చంద్ర సీఎఫ్‌వోగా, పి.హనుమాన్ ప్రసాద్ కంపెనీ సెక్రటరీగా నియమితులయ్యారు.

ఫైనాన్స్, ఐటీ షేర్లకు డిమాండ్

సెన్సెక్స్ లాభం 193 పాయింట్లు

ముంబై: ఫైనాన్స్, ఐటీ షేర్లు రాణించడంతో స్టాక్ సూచీలు శుక్రవారం లాభాలతో ముగిశాయి. సెన్సెక్స్ 193 పాయింట్లు పెరిగి 83,433 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 56 పాయింట్లు బలపడి 25,461 వద్ద నిలిచింది. సూచీలు ఉదయం సానుకూలంగా మొదలయ్యాయి. భారత్–అమెరికా వాణిజ్య ఒప్పందంపై వెలువడుతున్న వార్తల నేపథ్యంలో ఇన్వెస్టర్లు ఆచితూచి వ్యవహరించారు. ఫలితంగా ట్రేడింగ్ ఆద్యంతం తీవ్ర ఒడిదుడుకులకు లోనయ్యాయి. సెన్సెక్స్ 462 పాయింట్ల పరిధిలో 83,478 వద్ద గరిష్టాన్ని, 83,016 వద్ద కనిష్టాన్ని నమోదు చేసింది. నిఫ్టీ 25,332–25,470 శ్రేణిలో ట్రేడైంది. క్రూడాయిల్ ధరలు దిగిరావడం, అమెరికా కరెన్సీ బలహీనతతో డాలర్ మారకంలో రూపాయి విలువ 15 పైసలు బలపడి 85.40 వద్ద స్థిరపడింది.



'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
మెట్రోల్లోనే క్విక్ కామర్స్ జూమ్ | ఆట బొమ్మల ఉత్పత్తికి ప్రోత్సాహం

'జేన్ స్ట్రీట్' స్కామ్!

వేల కోట్ల అక్రమార్జనపై సెబీ ఉక్కుపాదం

- మార్కెట్ లావాదేవీలు నిర్వహించకుండా జేన్ స్ట్రీట్ గ్రూప్‌పై నిషేధం
- రూ. 4,843 కోట్ల అక్రమ లాభాలను చెల్లించేయాలంటూ ఆదేశాలు
- స్టాక్ మార్కెట్లో అవకతవకలకు పాల్పడటమే కారణం



న్యూఢిల్లీ: దేశీ స్టాక్ మార్కెట్లలో అవకతవకలకు పాల్పడినందుకు గాను అమెరికన్ సంస్థ జేన్ స్ట్రీట్ (జేఎస్) గ్రూప్‌పై మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ కొరడా ఝుళిపించింది. తదుపరి నోటీసులు ఇచ్చేంత వరకు ట్రేడింగ్ చేయకుండా గ్రూప్ సంస్థలపై నిషేధం విధించింది. అక్రమంగా ఆర్జించిన రూ. 4,843 కోట్ల మొత్తాన్ని ఎస్క్రో అకౌంటుకు బదిలీ చేయాలని ఆదేశించింది. స్టాక్ సూచీలను ప్రభావితం చేసి, జేఎస్ గ్రూప్ భారీగా లబ్ధి పొందిందనే ఆరోపణలపై చేపట్టిన విచారణలో భాగంగా సెబీ ఈ మేరకు మధ్యంతర ఆదేశాలు జారీ చేసింది. జేన్ స్ట్రీట్ (జేఎస్) గ్రూప్‌లో భాగమైన జేఎస్ఐ ఇన్వెస్ట్‌మెంట్స్, జేఎస్ఐ2 ఇన్వెస్ట్‌మెంట్స్, జేన్ స్ట్రీట్ సింగపూర్, జేన్ స్ట్రీట్ ఏషియా ట్రేడింగ్ సంస్థలకు ఇవి వర్తిస్తాయి. 2023 జనవరి–2025 మే మధ్య కాలంలో 21 ఎక్స్‌పైరీ తేదీల్లో సూచీలను ప్రభావితం చేసే విధంగా క్యాష్, ఫ్యూచర్స్ మార్కెట్లో గ్రూప్ పెద్ద ఎత్తున ట్రేడింగ్ చేసినట్లు, తద్వారా ఆప్షన్స్ మార్కెట్లో పొజిషన్లతో భారీగా లాభాలు ఆర్జించినట్లు సెబీ విచారణలో తేలింది. జేన్ స్ట్రీట్, దాని అనుబంధ సంస్థలు భారతీయ ఆప్షన్స్ మార్కెట్లో అనధికారిక ట్రేడింగ్ వ్యూహాలు అమలు చేస్తున్నాయంటూ 2024 ఏప్రిల్‌లో మీడియాలో వార్తలు రావడం ఈ కేసుకు బీజం వేశాయి. ఎక్స్‌పైరీ రోజు దగ్గరపడే సమయంలో, ఇండెక్స్ తీవ్ర హెచ్చుతగ్గులకు లోనయ్యేలా, జేఎస్ గ్రూప్ సందేహాస్పద ట్రేడింగ్ లావాదేవీలు నిర్వహిస్తోందని సెబీ గుర్తించింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో హెచ్చరికలు జారీ చేసినప్పటికీ, ఇలాంటివి చేయబోమంటూ ఎన్ఎస్ఈకి హామీ ఇచ్చినప్పటికీ గ్రూప్ సంస్థలు తమ తీరును మార్చుకోలేదని ఉత్తర్వుల్లో సెబీ ఆగ్రహం వ్యక్తం చేసింది.

''2025లో ఎన్ఎస్ఈ జారీ చేసిన అడ్వైజరీని కూడా పట్టించుకోకుండా, లెక్కలేనితనాన్ని ప్రదర్శిస్తూ జేఎస్ గ్రూప్ వ్యవహరించిన తీరు చూస్తే, మిగతా ఎఫ్‌పీఐలు, మార్కెట్ వర్గాల్లాగా, అది నమ్మతగినది కాదని అర్థం అవుతోంది. గతంలోలాగే లావాదేవీలు కొనసాగించేందుకు జేఎస్ గ్రూప్‌ను అనుమతిస్తే ఇన్వెస్టర్ల ప్రయోజనాలకు కచ్చితంగా భంగం వాటిల్లుతుందని ప్రాథమిక సాక్ష్యాధారాలు కనిపిస్తున్నాయి'' అని సెబీ వ్యాఖ్యానించింది. నిబంధనలను ఉల్లంఘిస్తూ జేఎస్ గ్రూప్ అక్రమంగా ఆర్జించిన రూ. 4,843.57 కోట్ల మొత్తాన్ని ఎస్క్రో అకౌంటుకు బదిలీ చేయాలని ఆదేశించింది. ఉత్తర్వులకు సంబంధించినవి అయితే తప్ప, తమ అనుమతి లేకుండా, జేఎస్ గ్రూప్ సంస్థల ఖాతాల్లో ఎలాంటి డెబిట్ లావాదేవీలను జరగనివ్వరాదంటూ బ్యాంకులకు సెబీ ఆదేశాలు ఇచ్చింది. ఇతరత్రా సూచీల్లోనూ జేఎస్ గ్రూప్ ట్రేడింగ్ లావాదేవీలపై సెబీ విచారణ చేపడుతోంది. సెబీ ఉత్తర్వుల ప్రకారం ఇండెక్స్, స్టాక్ ఆప్షన్లలో ట్రేడింగ్ ద్వారా జేఎస్ గ్రూప్ రూ.44,358 కోట్లు ఆర్జించింది. స్టాక్ ఫ్యూచర్స్‌లో రూ.7,208 కోట్లు, ఇండెక్స్ ఫ్యూచర్స్‌లో రూ. 191 కోట్లు, క్యాష్ సెగ్మెంట్లో రూ. 288 కోట్లు నష్టపోయింది. దీంతో 2023 జనవరి–2025 మార్చి మధ్య మొత్తం మీద రూ.36,671 కోట్లు అక్రమంగా ఆర్జించింది.

ఏమిటీ జేన్ స్ట్రీట్..

ఆర్థిక సేవల రంగానికి సంబంధించిన జేన్ స్ట్రీట్ గ్రూప్ 2000లో ట్రేడింగ్ సంస్థగా అమెరికాలో కార్యకలాపాలు ప్రారంభించింది. అమెరికాతో పాటు యూరప్, ఆసియాలోని 45 దేశాల్లో, 5 కార్యాలయాల్లో 2,600 మంది సిబ్బంది ఉన్నారు. 2020 డిసెంబర్‌లో ఇది భారత్‌లో కార్యకలాపాలు ఆరంభించింది.

వాల్యూమ్స్‌పై ప్రభావం..

జేన్ స్ట్రీట్‌పై సెబీ చర్యలను మార్కెట్ వర్గాలు స్వాగతించాయి. దీనితో చిన్న ట్రేడర్లకు కాస్త ఊరట లభించగలదన్నాయి. కాకపోతే ఆప్షన్స్ వాల్యూమ్స్‌పైనా ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని పేర్కొన్నాయి. ఆప్షన్స్ ట్రేడింగ్ వాల్యూమ్స్‌లో జేన్ స్ట్రీట్ లాంటి ట్రేడింగ్ సంస్థల వాటా దాదాపు 50 శాతం వరకు ఉంటుందని జిరోధా సహ వ్యవస్థాపకుడు నితిన్ కామత్ తెలిపారు. ఇలాంటి సంస్థలు వెనక్కి వెళ్లిపోతే దాదాపు రిటైల్ కార్యకలాపాలపైనా ప్రభావం పడొచ్చని వివరించారు. ఫలితంగా బిడ్–ఆస్క్ స్ప్రెడ్ (కొనుగోలు, అమ్మకం బిడ్ల మధ్య వ్యత్యాసం), తీవ్ర ఒడిదుడుకులు, అనిశ్చితి పెరిగిపోవచ్చన్నారు. ఇది ఇటు ఎక్స్ఛేంజీలకు, అటు బ్రోకర్లకు మంచి వార్త కాకపోవచ్చని పేర్కొన్నారు. ఇలాంటి పెద్ద సంస్థలపై మన మార్కెట్ ఎంతగా ఆధారపడిందనేది దీనితో తెలిసిపోతుందని కామత్ తెలిపారు.

ఏం చేసింది.. ఎలా చేసింది..

స్టాక్ మార్కెట్లో లిక్విడిటీ ఎక్కువగా ఉండే నిఫ్టీ, బ్యాంక్ నిఫ్టీ ఇండెక్స్ ఆప్షన్స్ సెగ్మెంట్స్‌లో ట్రేడింగ్ ద్వారా సూచీలను ప్రభావితం చేసి, దాన్నుంచి లాభాలు పొందిందని జేఎస్ గ్రూప్‌పై ఆరోపణలు ఉన్నాయి. ఇందుకోసం అది రెండు కీలక వ్యూహాలు అమలు చేసిందని సెబీ విచారణలో వెల్లడైంది. దీని ప్రకారం, బ్యాంక్ నిఫ్టీ స్టాక్స్, ఫ్యూచర్లలో 'జేఎస్ గ్రూప్' ఉదయం పెద్దయెత్తున కొనుగోళ్లు చేసి, సాయంత్రం భారీగా అమ్మేసేది. అలాగే ఎక్స్‌పైరీ రోజున ఆఖరు రెండు గంటల్లో సూచీలు తీవ్ర హెచ్చుతగ్గులకు లోనయ్యేలా ఏదో ఒకదాన్ని భారీగా కొనడమో లేదా అమ్మడమో చేసేది. ఉదాహరణకు.. జేఎస్ గ్రూప్ ఉదయాన్నే కొన్ని ఎంపిక చేసుకున్న బ్యాంక్ నిఫ్టీ ఇండెక్స్ షేర్లను భారీగా కొనేసేది. అదే సమయంలో ఇండెక్స్ ఆప్షన్స్‌ను షార్ట్ (అమ్మేయడం) చేసేది. ట్రేడింగ్ ముగిసే సమయం దగ్గరపడే కొద్దీ షేర్లను ఒక్కసారిగా అమ్మేసేది. దీంతో షేరు ధర పడిపోయేది. ఫలితంగా షేర్లపరంగా నష్టాలు వచ్చినప్పటికీ, సమాంతరంగా తీసుకున్న ఇండెక్స్ షార్ట్ ఆప్షన్లలో భారీగా లాభాలు వచ్చేవి. దీనివల్ల, ఉదయం రూ. 10 దగ్గర ఉన్న ఆప్షన్.. సాయంత్రానికి ఎకాయెకిన రూ.300–రూ.400 అయిపోతుంది. లేదా అటుది ఇటవుతుంది. ఇలా ఎక్స్‌పైరీ రోజుల్లో ఇలా అసాధారణ తీవ్ర ఒడిదుడుకులు ఏర్పడటంతో సాధారణ ట్రేడర్లు భారీగా నష్టపోతారు.



స్టాక్స్ కుదేలు..

జేఎస్ గ్రూప్‌పై సెబీ చర్యలతో ప్రతికూల ప్రభావం పడుతుందనే భయాలతో, విదేశీ సంస్థల ట్రేడింగ్ యాక్టివిటీ ఎక్కువగా ఉండే ప్లాట్‌ఫాంలు, సంస్థల షేర్లు శుక్రవారం గణనీయంగా క్షీణించాయి. బీఎస్ఈలో నువామా వెల్త్ మేనేజ్‌మెంట్ షేరు 11.26%, స్టాక్ బ్రోకింగ్ సంస్థ ఏంజెల్ వన్ షేరు 6%, బీఎస్ఈ షేరు 6.42%, సెంట్రల్ డిపాజిటరీ సర్వీసెస్ (ఇండియా) 2.3% క్షీణించాయి. జేఎస్ గ్రూప్‌పై సెబీ చర్యలతో ఇన్వెస్టర్ల సెంటిమెంటు దెబ్బతిందని లెమన్ మార్కెట్స్ డెస్క్ అనలిస్ట్ గౌరవ్ గర్గ్ తెలిపారు.

సాక్షి స్పోర్ట్స్



ప్రపంచకప్ బాక్సింగ్ ఫైనల్లో నుపుర్

అస్తానా: ప్రపంచకప్ బాక్సింగ్ టోర్నమెంట్‌లో భారత్‌కు మరో రెండు పతకాలు ఖాయమయ్యాయి. మహిళల ప్లస్ 80 కేజీల విభాగంలో నుపుర్ ఫైనల్లోకి దూసుకెళ్లగా... పురుషుల 65 కేజీల విభాగంలో అభినాశ్ జమ్వాల్ సెమీఫైనల్లోకి ప్రవేశించాడు. సెమీఫైనల్లో నుపుర్ 5–0తో సేమా దుస్తాజ్ (తుర్కియే)పై గెలుపొందగా... అభినాశ్ 5–0తో రెనీ కమాచో (అమెరికా)ను ఓడించాడు.



క్వార్టర్ ఫైనల్లో శ్రియాన్షి ఓటమి

కాల్గరీ: కెనడా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–300 బ్యాడ్మింటన్ టోర్నీ మహిళల సింగిల్స్‌లో భారత కథ ముగిసింది. క్వార్టర్ ఫైనల్లో హైదరాబాద్‌కు చెందిన శ్రియాన్షి వలిశెట్టి 12–21, 19–21తో అమేలీ మల్జ్ (డెన్మార్క్) చేతిలో ఓడిపోయింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో శ్రియాన్షి 21–15, 21–14తో ప్రపంచ 45వ ర్యాంకర్ లెట్సానా కరుపథెవన్ (మలేసియా)పై గెలిచింది.

సిరాజ్ 'సిక్సర్'

భారత బౌలింగ్ ధాటికి ఒకదశలో ఇంగ్లండ్ స్కోరు 84/5... ఇక మూడో రోజే మ్యాచ్ మన చేతికి చిక్కినట్లే అనిపించింది. అయితే జేమీ స్మిత్, హ్యారీ బ్రూక్ అసాధారణ బ్యాటింగ్‌తో ఎదురుదాడి చేసి 'ట్రిపుల్ సెంచరీ' భాగస్వామ్యం నెలకొల్పడంతో ఇంగ్లండ్ తేరుకోగలిగింది. హైదరాబాదీ పేసర్ మొహమ్మద్ సిరాజ్ ఆరు వికెట్ల ప్రదర్శన శుక్రవారం ఆటలో హైలైట్‌గా నిలవగా, ఇంగ్లండ్ ఇన్నింగ్స్‌లో ఆరుగురు 'డకౌట్' కావడం విశేషం. అయినా సరే తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం 180 పరుగులతో కలిపి ఇప్పటికే 244 పరుగులు ముందంజలో ఉన్న టీమిండియా మ్యాచ్‌ను శాసించే స్థితికి చేరింది. నేడు మన బ్యాటర్లు చెలరేగి ప్రత్యర్థి ముందు ఎంత లక్ష్యం ఉంచుతారనేది ఆసక్తికరం.

ఆరు వికెట్లతో మెరిసిన భారత పేసర్

- తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ 407 ఆలౌట్
- స్మిత్, బ్రూక్ భారీ సెంచరీలు
- రెండో ఇన్నింగ్స్‌లో భారత్ 64/1
- ప్రస్తుతం ఓవరాల్ ఆధిక్యం 244

బర్మింగ్‌హామ్: ఇంగ్లండ్‌తో రెండో టెస్టుపై భారత్ పట్టు బిగించింది. మ్యాచ్ మూడో రోజు ఆట ముగిసే సమయానికి టీమిండియా తమ రెండో ఇన్నింగ్స్‌లో వికెట్ నష్టానికి 64 పరుగులు చేసింది. ప్రస్తుతం జట్టు ఓవరాల్‌గా 244 పరుగుల ఆధిక్యంలో ఉంది. జైస్వాల్ (22 బంతుల్లో 28; 6 ఫోర్లు) అవుట్ కాగా... కేఎల్ రాహుల్ (38 బంతుల్లో 28 బ్యాటింగ్; 6 ఫోర్లు), కరుణ్ నాయర్ (7 బ్యాటింగ్) క్రీజ్‌లో ఉన్నారు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 77/3తో శుక్రవారం ఆట కొనసాగించిన ఇంగ్లండ్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 89.3 ఓవర్లలో 407 పరుగులకు ఆలౌటైంది. జేమీ స్మిత్ (207 బంతుల్లో 184 నాటౌట్; 21 ఫోర్లు, 4 సిక్స్‌లు), హ్యారీ బ్రూక్ (234 బంతుల్లో 158; 17 ఫోర్లు, 1 సిక్స్) భారీ సెంచరీలతో చెలరేగారు. వీరిద్దరు ఆరో వికెట్‌కు 303 పరుగులు జోడించారు. భారత పేసర్లు మొహమ్మద్ సిరాజ్ (6/70), ఆకాశ్ దీప్ (4/88) కలిసి ప్రత్యర్థిని పడగొట్టారు.

మెరుపు భాగస్వామ్యం...

మూడో రోజు ఆటలో తొలి 10 బంతులు ముగిసేసరికి మ్యాచ్ భారత్ చేతుల్లోకి వచ్చేసినట్లు అనిపించింది! 'హైదరాబాద్ పేసర్ సిరాజ్ వరుసగా రెండు చక్కటి బంతులతో రూట్ (22), స్టోక్స్ (0)లను పెవిలియన్ పంపించాడు. ఈ ఇన్నింగ్స్‌లో రెండోసారి ఇంగ్లండ్ వరుస బంతుల్లో రెండు వికెట్లు కోల్పోయింది. అయితే ఈ వికెట్ల తర్వాత పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. బ్రూక్, స్మిత్ కలిసి బౌండరీలతో చెలరేగిపోయారు. వీరిద్దరిని నిలువరించేందుకు తీవ్రంగా ప్రయత్నించిన భారత బౌలర్లు పూర్తిగా విఫలమయ్యారు. తొలి బంతి నుంచే దూకుడుగా ఆడిన స్మిత్ 80 బంతుల్లోనే సెంచరీ (14 ఫోర్లు, 3 సిక్స్‌లు) సాధించడం విశేషం. తొలి సెషన్‌లో ఇంగ్లండ్ 27 ఓవర్లలో ఏకంగా 172 పరుగులు రాబట్టడం విశేషం.



హ్యారీ బ్రూక్

తప్పిన ఫాలోఆన్...

లంచ్ తర్వాత కూడా బ్రూక్, స్మిత్ అంతే పట్టుదలతో బ్యాటింగ్‌ను కొనసాగించారు. ఈ క్రమంలో బ్రూక్ కూడా 137 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకోగా, భాగస్వామ్యం 200 పరుగులు దాటింది. రెండో సెషన్‌లో ఒక్క వికెట్ కూడా కోల్పోని ఇంగ్లండ్ 28 ఓవర్లలో 106 పరుగులు జోడించింది. విరామానంతరం సిరాజ్ ఓవర్లో స్మిత్ స్క్వేర్ లెగ్ దిశగా ఆడి రెండు పరుగులు తీయడంతో పార్ట్‌నర్‌షిప్ 300 పరుగులకు చేరింది. అయితే ఎట్టకేలకు ఈ జోడీని ఆకాశ్‌దీప్ విడదీశాడు. కొత్త బంతితో వేసిన మూడో ఓవర్లోనే బ్రూక్‌ను ఆకాశ్‌దీప్ బౌల్డ్ చేయగా... తర్వాతి ఓవర్లోనే ఇంగ్లండ్‌కు ఫాలో ఆన్ ప్రమాదం తప్పింది. అయితే ఆ తర్వాత 12 పరుగుల వ్యవధిలో చివరి 4 వికెట్లు కోల్పోవడంతో ఇంగ్లండ్ ఇన్నింగ్స్ ముగిసింది.

పట్టు వదిలినా... పైచేయి మనదే!



జేమీ స్మిత్

ఒకే ఓవర్లో 23 పరుగులు...

ప్రసిధ్ కృష్ణ ఓవర్లో స్మిత్ చెలరేగిన తీరు ఇంగ్లండ్ ఇన్నింగ్స్‌లో హైలైట్‌గా నిలిచింది. ఈ ఓవర్లో తొలి బంతికి పరుగు తీయని స్మిత్ ఆ తర్వాత వరుసగా 4, 6, 4, 4, (వైడ్), 4 బాదడంతో మొత్తం 23 పరుగులు వచ్చాయి. తొలి టెస్టులోనే ఆరుకు పైగా ఎకానమీతో చెత్త బౌలింగ్ ప్రదర్శన చేసిన ప్రసిధ్ ఈ టెస్టులోనూ ఘోరంగా విఫలమయ్యాడు.

క్యాచ్‌లు చేజారె...

మూడో రోజు ఆటలో బ్రూక్, స్మిత్ జోరును నిలువరించేందుకు కొన్ని అవకాశాలు వచ్చినా అవి వృథా అయ్యాయి. మరీ సులువైనవి కాకపోయినా... మూడు క్యాచ్‌లు వదిలేయడం ఇంగ్లండ్‌కు మేలు చేసింది. జడేజా బౌలింగ్‌లో బ్రూక్ (వ్యక్తిగత స్కోరు 63) ఇచ్చిన క్యాచ్‌ను గిల్ అందుకోలేకపోయాడు. వేగంగా వచ్చిన బంతి అతని తలకు కూడా తగిలింది. తన బౌలింగ్‌లోనే స్మిత్ ఇచ్చిన రిటర్న్ క్యాచ్ (స్కోరు 90)ను సుందర్ చేజార్చాడు. ఆ తర్వాత నితీశ్ బౌలింగ్‌లో స్మిత్ (స్కోరు 121) ఇచ్చిన క్యాచ్‌ను పంత్ నేలపాలు చేశాడు.

స్కోరు వివరాలు

భారత్ తొలి ఇన్నింగ్స్: 587; **ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్:** క్రాలీ (సి) నాయర్ (బి) సిరాజ్ 19; డకెట్ (సి) గిల్ (బి) ఆకాశ్‌దీప్ 0; పోప్ (సి) రాహుల్ (బి) ఆకాశ్‌దీప్ 0; రూట్ (సి) పంత్ (బి) సిరాజ్ 22; బ్రూక్ (బి) ఆకాశ్‌దీప్ 158; స్టోక్స్ (సి) పంత్ (బి) సిరాజ్ 0; స్మిత్ (నాటౌట్) 184; వోక్స్ (సి) నాయర్ (బి) ఆకాశ్‌దీప్ 5; కార్స్ (ఎల్బీ) (బి) సిరాజ్ 0; టంగ్ (ఎల్బీ) (బి) సిరాజ్ 0; బషీర్ (బి) సిరాజ్ 0; ఎక్స్‌ట్రాలు 19; **మొత్తం (89.3 ఓవర్లలో ఆలౌట్) 407. వికెట్ల పతనం:** 1–13, 2–13, 3–25, 4–84, 5–84, 6–387, 7–395, 8–396, 9–407, 10–407. **బౌలింగ్:** ఆకాశ్‌దీప్ 20–2–88–4, సిరాజ్ 19.3–3–70–6, ప్రసిధ్ 13–1–72–0, నితీశ్ రెడ్డి 6–0–29–0, జడేజా 17–2–70–0, సుందర్ 14–0–73–0. **భారత్ రెండో ఇన్నింగ్స్:** జైస్వాల్ (ఎల్బీ) (బి) టంగ్ 28; రాహుల్ (బ్యాటింగ్) 28; నాయర్ (బ్యాటింగ్) 7; ఎక్స్‌ట్రాలు 1; **మొత్తం (13 ఓవర్లలో వికెట్ నష్టానికి) 64. వికెట్ల పతనం:** 1–51. **బౌలింగ్:** వోక్స్ 5–0–28–0, కార్స్ 5–1–23–0, టంగ్ 3–1–12–1.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో



4 సిరాజ్ కెరీర్‌లో నాలుగో సారి ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్ల ప్రదర్శన నమోదు చేశాడు. ఈ నాలుగూ వేర్వేరు దేశాల్లో (ఆస్ట్రేలియా, వెస్టిండీస్, దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్) రావడం విశేషం.

ఇంగ్లండ్ గడ్డపై ఐదు వికెట్ల ప్రదర్శన కోసం ఎప్పటినుంచో ఎదురు చూస్తున్నా. అందుకే నమ్మశక్యంగా అనిపించడం లేదు. నిజానికి నేను చాలా బాగా బౌలింగ్ చేస్తున్నా వికెట్లు మాత్రం రావడం లేదు. ఇప్పటి వరకు నాలుగు వికెట్లకు మించి తీయలేదు. ఇప్పుడు ఆరు వికెట్లు సాధించడం ఎంతో ప్రత్యేకంగా అనిపిస్తోంది. పిచ్ నెమ్మదిగా ఉన్నా క్రమశిక్షణతో సరైన చోట బంతులు వేస్తే ఫలితం రాబట్టవచ్చని నమ్మాను. కట్టుదిట్టంగా బౌలింగ్ చేస్తూ పరుగులు నిరోధించే ప్రయత్నం చేశాను. మిగతా ఇద్దరితో పోలిస్తే నాకే అనుభవం ఎక్కువ కాబట్టి ఆ సవాల్‌ను స్వీకరించి బాధ్యతగా బౌలింగ్ చేశాను.
–సిరాజ్



నెవ్వర్ బిఫోర్.. ఎవ్వర్ ఆఫ్టర్

ఈవిడ ఎవరన్నది మీరు మర్చిపోయి ఉంటారు.. నాలుగేళ్ల క్రితం మీడియాలో మార్మోగిన పేరు.. హలీమా.. గంపెడు సంతానానికి కేరాఫ్ అడ్రస్. ఈ పిల్లలూ మామూలోళ్లు కారు.. రికార్డు బ్రేకింగ్ పిల్లలు. నాలుగేళ్ల క్రితం ఒకే కాన్పులో 9 మందికి జన్మనిచ్చి.. మాలీ దేశానికి చెందిన హలీమా గిన్నిస్ రికార్డు సాధించారు. 9 మంది పుట్టడం రికార్డైతే.. అందరూ బతికిబట్టకట్టడం.. ఇదిగో ఇప్పుడిలా నాలుగో జన్మదినాన్ని జరుపుకోవడం అరుదైన విషయమేకదా.. ఈ సందర్భంగా తండ్రి అర్బీ, తల్లి హలీమాతో వారు దిగిన ఈ ఫొటోను గిన్నిస్ బుక్ తన వెబ్‌సైట్లో షేర్ చేసుకుంది.



సర్పానికి చికిత్స

అచ్చంపేట రూరల్: గాయపడిన ఒక సర్పానికి వెటర్నరీ వైద్యుడు చికిత్స చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం లింగోటం సమీపంలోని కోళ్లఫారం వద్ద కొన్నిరోజులుగా పెద్ద పాము సంచరిస్తుండడంతో.. యజమాని స్నేక్‌క్యాచర్ సుమన్‌కు సమాచారం అందించాడు. శుక్రవారం కోళ్లఫారం వద్ద పామును పట్టుకునే క్రమంలో.. అతని వద్ద ఉన్న పరికరం గుచ్చుకుని పాముకి గాయమైంది. వెంటనే ఆయన పామును అచ్చంపేటలోని పశువుల ఆస్పత్రికి తీసుకురాగా.. వెటర్నరీ వైద్యుడు హరీశ్ చికిత్స చేశారు. అనంతరం పామును అడవిలో వదిలేశారు.

బెల్లం ధర ఎక్కువ.. చక్కెర చాలు!

ఆలయాల్లో మళ్లీ పాత పద్ధతిలో ప్రసాదాలు చక్కెరతో తయారీ

- 2018లో ప్రసాదాల్లో బెల్లం వినియోగం ప్రారంభం
- అప్పటి కమిషనర్ ఉన్నంతవరకు ప్రత్యేక శ్రద్ధతో కొనసాగింపు
- ఆయన పదవీ విరమణతో ఆ ప్రక్రియకు మంగళం
- భక్తుల నుంచి డిమాండ్ ఉన్నప్పటికీ పట్టించుకోని దేవాదాయశాఖ



సాక్షి, హైదరాబాద్: ఆలయాల్లో బెల్లంతో ప్రసాదం తయారీకి దేవాదాయ శాఖ మంగళం పాడుతోంది. దానికి బదులు గతంలోలాగా అన్ని తీపి ప్రసాదాల్లో చక్కెరనే వినియోగిస్తోంది. ఈ విషయంలో భక్తుల నుంచి తీవ్ర విమర్శలు వస్తున్నాయి. అయితే వీటిని ఆ శాఖ పట్టించుకునే పరిస్థితిలో లేదని చెపుతున్నారు. దేవాలయాల నిర్వహణలో ఉన్న లోపాలనే పట్టించుకోని ఈ తరుణంలో, ప్రసాదాల్లో బెల్లం వినియోగం అంశాన్ని ఆ శాఖ ఏం పట్టించుకుంటుందని భక్తులు మండిపడుతున్నారు.

చక్కెర వినియోగాన్ని తగ్గించేందుకు..

ప్రజల్లో ఆరోగ్యంపై స్పృహ పెరుగుతుండటంతో క్రమంగా చక్కెర వినియోగం తగ్గుతోంది. అనేక మంది చక్కెరకు బదులుగా బెల్లాన్ని వినియోగిస్తున్నారు. ఈ నేపథ్యంలో దేవాలయాల్లో కూడా బెల్లం వినియోగాన్ని పెంచాలన్న సూచనలు రావడంతో 2018లో నాటి దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్ దీనిపై దృష్టి సారించి బెల్లం వినియోగాన్ని ప్రారంభించారు. అదే సంవత్సరం చివరలో ఆ మేరకు ఆదేశాలు జారీ చేశారు. తొలుత అన్నిపెద్ద దేవాలయాల్లో బెల్లం ప్రసాదాల తయారీ ప్రారంభించి ఆ తర్వాత మిగతా దేవాలయాల్లో అమలు చేశారు. ఆయన దేవాలయాల ప్రసాద తయారీ కేంద్రాలను సందర్శించి ప్రసాదాలు తయారు చేసే వారితో స్వయంగా మాట్లాడి పలు సూచనలు చేశారు. అదే సమయంలో రవ్వ కేసరిని కూడా ప్రసాదంగా అందించే పద్ధతిని ప్రారంభించారు. చక్కెరతోపాటు బెల్లంతో తయారు చేసే ప్రసాదాలను అందుబాటులో ఉంచారు. దీంతో క్రమంగా బెల్లం ప్రసాదాలకు డిమాండ్ పెరిగింది. కొన్ని దేవాలయాల్లో చక్కెర ప్రసాదాల కంటే బెల్లం ప్రసాదాల విక్రయాలే అధికంగా నమోదు కావటం విశేషం. గతేడాది వరకు వీటి తయారీ కొనసాగింది. గత సంవత్సరం అనిల్‌కుమార్ పదవీ విరమణ చేయడం, ఆయన స్థానంలో వచ్చిన కమిషనర్లు దీనిపై దృష్టి సారించకపోవటంతో క్రమంగా బెల్లం ప్రసాదాల తయారీ ఆగిపోయింది. మూడునాలుగు పెద్ద దేవాలయాల్లో తక్కువ మోతాదులో బెల్లం ప్రసాదాలు తయారు చేస్తుండగా, మిగతా దేవాలయాల్లో పూర్తిగా నిలిపేశారు. చక్కెరతో పోలిస్తే బెల్లం ధర ఎక్కువ అని, బెల్లం ప్రసాదం తొందరగా కరుగుతోందని, దానితో తయారీ కొంత ఇబ్బందిగా ఉందని.. ఇలా రకరకాల సాకులు చెప్పి దాని వినియోగాన్ని ఆపేశారు.

చక్కెర వినియోగాన్ని రోజువారీ ఆహారంలో తగ్గించుకున్నవారు ఇప్పుడు బెల్లం ప్రసాదం తయారీని నిలిపేయటంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆరోగ్యానికి చక్కెరతో పోలిస్తే బెల్లం కొంత మెరుగైందైనందున మళ్లీ బెల్లం ప్రసాదాలు ప్రారంభించాలని కోరుతున్నారు. అప్పట్లో, బెల్లం ప్రసాదాలతోపాటు ప్రయోగాత్మకంగా తృణ ధాన్యాలతో కూడా ప్రసాదాల తయారీని ప్రారంభించారు. దీనిని క్రమంగా విస్తరించాలని భావించినా, ప్రస్తుత అధికారుల అనాసక్తి వల్ల తృణధాన్యాలతో ప్రసాదాల తయారీ దాదాపు నిలిచిపోయిందని భక్తులు చెపుతున్నారు.



ఒకే గది.. ఐదు తరగతులు.. ఒకరే టీచర్

తాండూరు రూరల్: వికారాబాద్ జిల్లా తాండూరు మండలం అంతారం తండా ప్రాథమిక పాఠశాలలో ఐదు తరగతులకు కలిపి ఒకే ఉపాధ్యాయుడు విధులు నిర్వర్తిస్తున్నాడు. ఒకటి నుంచి ఐదు తరగతులకు మొత్తం 26 మంది విద్యార్థులున్నారు. వీరికి ఒకే ఉపాధ్యాయుడు రమేశ్ విద్యాబుద్ధులు నేర్పిస్తున్నారు. ప్రభుత్వం స్పందించి మరో టీచర్‌ను నియమించాలని విద్యార్థులు, తండావాసులు కోరుతున్నారు.

బాలల హక్కులపై నేడు 'వాయిస్ ఫర్ ది వాయిస్‌లెస్'

ప్రారంభించనున్న సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్

సాక్షి, హైదరాబాద్: బాలలను లైంగిక నేరాల నుంచి కాపాడటం, వారి హక్కులను రక్షించాలన్న ఉద్దేశంతో 'వాయిస్ ఫర్ ది వాయిస్ లెస్'పేరిట నిర్వహించనున్న రెండ్రోజుల సదస్సును సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ శనివారం ప్రారంభించనున్నారు. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో శని, ఆదివారాల్లో ఈ సదస్సు జరగనుంది. కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్, డీజీపీ జితేందర్, మహిళా, శిశు సంక్షేమ కార్యదర్శి అనితా రామచంద్రన్, యునిసెఫ్ చీఫ్ ఫీల్డ్ ఆఫీసర్ డాకట్ జలాలెం టఫెస్సీ, రాష్ట్ర లీగల్ సెల్ అథారిటీ సభ్య కార్యదర్శి పంచాక్షరి హాజరు కానున్నారు.

లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న సుప్రీంకోర్టు జడ్జి

యాదగిరిగుట్ట: సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ సూర్యకాంత్ శుక్రవారం యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఆయనకు స్వాగతం పలికారు. గర్భాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకార మూర్తులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. జస్టిస్ సూర్యకాంత్‌కు అర్చకులు వేద ఆశీర్వచనం చేయగా, ఈవో వెంకట్రావ్ లడ్డూ ప్రసాదంతోపాటు శ్రీస్వామి వారి చిత్రపటం అందజేశారు. అంతకుముందు దేవాలయ అతిథిగృహం వద్ద జస్టిస్ సూర్యకాంత్‌కు భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు స్వాగతం పలికారు.



సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ సూర్యకాంత్‌కు పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న అర్చకులు

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

సాక్షి ప్లస్
శనివారం । 5-7-2025

ట్రిపుల్‌ఐటీలో 3 విడతల్లో కౌన్సెలింగ్

ఎంపిక జాబితా, కటాఫ్ వివరాలు వెల్లడించిన అధికారులు



జాబితా విడుదల చేస్తున్న వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్

భైంసా: నిర్మల్ జిల్లా బాసర ట్రిపుల్‌ఐటీలో ఈ విద్యాసంవత్సరానికి కేటాయించిన సీట్ల మెరిట్ జాబితా విడుదలైంది. బాసర, మహబూబ్‌నగర్ కేంద్రాలకు కలిపి 1,690 సీట్లకు విద్యార్థులను ఎంపిక చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 20,258 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఎంపికైన విద్యార్థులకు మూడు విడతల్లో కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. బాసర, మహబూబ్‌నగర్ కేంద్రాలకు కలిపి 1,690 సీట్లలో విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తున్నారు. బాసర సెంటర్‌లో 1,099 మంది బాలికలు, 410 మంది బాలురు, మహబూబ్‌నగర్ సెంటర్‌లో 126 మంది బాలికలు, 55 మంది బాలురకు సీట్లు కేటాయించారు. ట్రిపుల్‌ఐటీలో బాలికలు, బాలురను 72.28 నిష్పత్తిలో ఎంపిక చేశారు. ఎక్కువ మొత్తంలో బాలికలకే సీట్లు దక్కాయి. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన 88 శాతం మంది విద్యార్థులకు, ప్రైవేటు పాఠశాలల్లో చదివిన 12 శాతం మంది విద్యార్థులకు సీట్లు దక్కాయి.

20,258 మంది దరఖాస్తు

2025–26 విద్యా సంవత్సరంలో రాష్ట్రవ్యాప్తంగా 20,258 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 19,967 విద్యార్థుల దరఖాస్తులు క్యాంపస్‌కు అందాయి. వచ్చిన దరఖాస్తుల్లో 19,877 దరఖాస్తులు అర్హత పొందినట్లు గుర్తించారు. స్థానిక కేటగిరీ విద్యార్థులు 19,701 మంది ఇతర రాష్ట్రాల విద్యార్థులు 176 మంది దరఖాస్తు చేసుకున్నారు. వచ్చిన దరఖాస్తుల్లో ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన 8,241 మంది, ప్రైవేటు పాఠశాలల్లో 3,985 మంది, గవర్నమెంట్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో చదివిన 7,075 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. స్థానిక కేటగిరీలో 1,670 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఎస్సీ కేటగిరీ నుంచి 4,240 మంది, ఎస్టీ కేటగిరీ నుంచి 2,509, బీసీ నుంచి 12,076, ఈడబ్ల్యూఎస్ నుంచి 801, ఓసీ నుంచి 251 మంది విద్యార్థులు దరఖాస్తులు చేసుకున్నారు. వచ్చిన దరఖాస్తుల్లో పదో తరగతి పరీక్షల్లో 590కి పైగా మార్కులు సాధించిన విద్యార్థులు 318 మంది, 580కి పైగా మార్కులు సాధించిన విద్యార్థులు 1,018 మంది, 570కి పైగా మార్కులు సాధించిన విద్యార్థులు 2,409 మంది, 560కి పైగా మార్కులు సాధించిన విద్యార్థులు 4,573 మంది, 540 నుంచి 560 మార్కులు సాధించిన విద్యార్థులు 5,020 మంది, 500 నుంచి 540 మార్కులు సాధించిన విద్యార్థులు 6,862 మంది, 500కు తక్కువగా మార్కులు సాధించిన విద్యార్థులు 3,286 మంది ఉన్నట్లు క్యాంపస్ అధికారులు వివరించారు.

జిల్లాల వారీగా ఎంపికైన విద్యార్థులు

బాసర ట్రిపుల్ ఐటీకి ఈ విద్యాసంవత్సరంలో.. సిద్దిపేట జిల్లా నుంచి అత్యధికంగా 322 మంది విద్యార్థులు ఎంపికవగా, జోగులాంబ గద్వాల నుంచి ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. ట్రిపుల్‌ఐటీ ఉన్న నిర్మల్ జిల్లా నుంచి 92 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. నిజామాబాద్ నుంచి 297 మంది, సంగారెడ్డి నుంచి 222, కామారెడ్డి నుంచి 128, మహబూబాబాద్ నుంచి 125, రాజన్న సిరిసిల్ల నుంచి 117, మెదక్ నుంచి 76, జగిత్యాల నుంచి 66, కరీంనగర్ నుంచి 59, రంగారెడ్డి నుంచి 59, పెద్దపల్లి నుంచి 51, జనగామ నుంచి 49, ఖమ్మం నుంచి 46, సిద్దిపేట నుంచి 45, ఆదిలాబాద్ నుంచి 35, నిర్మల్ నుంచి 34, భద్రాద్రి నుంచి 33, మేడ్చల్ నుంచి 32, మంచిర్యాల నుంచి 30, సూర్యాపేట నుంచి 30, నాగర్‌కర్నూల్ నుంచి 21, హైదరాబాద్ నుంచి 20, మహబూబ్‌నగర్ నుంచి 20, నల్లగొండ నుంచి 17, ములుగు నుంచి 15, నారాయణపేట్ నుంచి 15, వరంగల్ అర్బన్ నుంచి 10, యాదాద్రి నుంచి 8, జోగులాంబ గద్వాల నుంచి 6, వికారాబాద్ నుంచి 6, వరంగల్ రూరల్ నుంచి 6, కొమురంభీం ఆసిఫాబాద్ నుంచి 5, వనపర్తి నుంచి 4, జయశంకర్ జిల్లా నుంచి 1 ఎంపికయ్యారు.

వెబ్‌సైట్‌లో వివరాలు

ఆర్జీయూకేటీ బాసర, మహబూబ్‌నగర్ సెంటర్లకు సంబంధించి 2025–26 విద్యా సంవత్సరానికి ఎంపికైన విద్యార్థుల జాబితా యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో ఉంటుందని వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ వెల్లడించారు. ఆయన బాసర క్యాంపస్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. ఈనెల 7 నుంచి కౌన్సెలింగ్ ప్రారంభం కానుందన్నారు. 7, 8, 9 తేదీల్లో విద్యార్థులు ఒరిజినల్ ధ్రువపత్రాలతో కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని సూచించారు. హాజరుకాని విద్యార్థులు ప్రవేశహక్కును కోల్పోతారని తెలిపారు. సాధారణ కేటగిరీకి చెందిన 1,690 సీట్లకు, ప్రత్యేక కేటగిరీకి చెందిన 158 సీట్లకు కౌన్సెలింగ్ వేర్వేరుగా జరుగుతుందన్నారు. www.rgukt.ac.inలో ఎంపికైన విద్యార్థుల జాబితా ఉంటుందన్నారు.

టాప్ 5 విద్యార్థులు వీరే

బాసర క్యాంపస్‌లో సంగారెడ్డికి జిల్లాకు చెందిన గడ్డం వర్షిక, వడ్ల గాయత్రి, హామిల్‌పూర్ ద్రిశిక, జగిత్యాల జిల్లాకు చెందిన అనదండుల వర్షిణి, నిజామాబాద్ జిల్లాకు చెందిన తోట రక్షిత టాప్ 5 విద్యార్థులుగా ఎంపికయ్యారు. మహబూబ్‌నగర్ క్యాంపస్‌లో సంగారెడ్డి జిల్లాకు చెందిన అనంతూరి హర్షిత, హాజీబేగం, నారాయణపేట్ జిల్లాకు చెందిన మిట్టి నిహారిక, నిజామాబాద్ జిల్లాకు చెందిన చింత శ్రీవిద్య, జనగామ జిల్లాకు చెందిన మహ్మద్ గులామ్‌సాధిక్ టాపర్లుగా నిలిచారు.

బాసర, మహబూబ్‌నగర్ కేంద్రాల్లో కేటగిరీల వారీగా కటాఫ్ మార్కులు

కేటగిరి	బాలికలు	బాలురు
ఓపెన్	579	579
ఈడబ్ల్యూఎస్	564	564
బీసీ–ఏ	571	572
బీసీ–బీ	578	578
బీసీ–సీ	534	539
బీసీ–డీ	579	579
బీసీ–ఈ	566	566
ఎస్సీ–1	566	566
ఎస్సీ–2	568	568
ఎస్‌సీ–3	572	572
ఎస్టీ	569	568

బాసర, మహబూబ్‌నగర్ సెంటర్లలో 1,690 సీట్లకు ఎంపికైన విద్యార్థులు

కేటగిరీ	బాలికలు	బాలురు	మొత్తం
ఓసీ	9	6	15
ఈడబ్ల్యూఎస్	137	59	196
బీసీ–ఏ	119	42	161
బీసీ–బీ	293	93	386
బీసీ–సీ	11	5	16
బీసీ–డీ	280	67	347
బీసీ–ఈ	62	25	87
ఎస్సీ–1	14	5	19
ఎస్సీ–2	113	43	156
ఎస్‌సీ–3	76	35	111
ఎస్టీ	111	85	196
మొత్తం	1,225	465	1,690





ధర్మాబాద్ కారంపొడి పేరుతో కామారెడ్డిలో ఏర్పాటైన దుకాణం ● దుకాణంలో వివిధ రకాల కారం పొడులు

ధర్మాబాద్ కారం పొడి

- వివిధ పట్టణాల్లో దుకాణాల ఏర్పాటు
- అన్ని సీజన్లలో పొడుల విక్రయం
- ఎగబడి కొంటున్న వినియోగదారులు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా ధర్మాబాద్ అనే చిన్న పట్టణం కారంపొడికి చిరునామాగా నిలుస్తోంది. కామారెడ్డి నుంచి నిజామాబాద్ మీదుగా మహారాష్ట్రకు వెళ్లే రైళ్లన్నీ ధర్మాబాద్ మీదుగానే నడుస్తాయి. బాసర దాటగానే ధర్మాబాద్ వస్తుంది. అక్కడ లభించే మిరపకాయల నాణ్యత బాగుంటుందన్న పేరు రావడంతో.. చాలామంది రైళ్లలో ధర్మాబాద్ వెళ్లి కిలోల కొద్దీ తెచ్చుకునేవారు. నిజామాబాద్, కామారెడ్డి, సిరిసిల్ల, సిద్దిపేట, మెదక్, జగిత్యాల, నిర్మల్ తదితర జిల్లాల నుంచి చాలామంది మహిళలు వెళ్లేవారు. నాణ్యమైన మిరపకాయలు కొనుగోలు చేసి, అక్కడే గిర్నీ పట్టించుకుని కారంపొడి ముల్లెలతో తిరిగి వచ్చేవారు. కాగా, మూడు నాలుగేళ్లుగా కొందరు ధర్మాబాద్ కారంపొడి పేరుతో తెలంగాణ ప్రాంతంలోని వివిధ పట్టణాలు, మండలాల్లో దుకాణాలను తెరిచారు. పట్టణ శివార్లలో ప్రధాన రహదారుల పక్కన షెడ్లను నిర్మించి గిర్నీలు ఏర్పాటు చేసుకుని అక్కడే విక్రయిస్తున్నారు. మిర్చి ధర్మాబాద్ నుంచే వస్తుందని చెబుతూ అమ్మకాలు సాగిస్తున్నారు.

ధర్మాబాద్ కారంపొడికి డిమాండ్

కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ, నిజామాబాద్, ఆర్మూర్, బోధన్, నిర్మల్ తదితర పట్టణాల్లో ధర్మాబాద్ కారం పొడి దుకాణాలు వెలిశాయి. పలు మండల కేంద్రాలలోనూ దుకాణాలను ఏర్పాటు చేసి మిరపపొడి అమ్ముతున్నారు. కారంపొడి గిర్నీలు, దుకాణాలన్నింటికీ ధర్మాబాద్ కారంపొడి అన్న బోర్డే ఉంటోంది. ప్రజలు కూడా ధర్మాబాద్ అన్న పేరుంటే చాలు వెళ్లి తెచ్చుకుంటున్నారు.

ధరల వివరాలు

నాణ్యమైన రకం కిలో కారం పొడిని రూ.300కు విక్రయిస్తున్నారు. రెండో రకం రూ.280, మామూలు రకం, ఉప్పు కలిపిన కారంపొడి కిలో రూ.250కు అమ్ముతున్నారు. దుకాణాలు, గిర్నీలు ఏర్పాటు చేసిన వారిలో.. కొందరు ధర్మాబాద్ నుంచి వచ్చిన వ్యాపారులు ఉండగా, మరికొందరు స్థానిక వ్యాపారులు ఉన్నారు.

రూ.లక్షల్లో వ్యాపారం..

కారంపొడి అమ్మకాలు పెద్దఎత్తున నడుస్తున్నాయి. మొన్నటి వరకు మామిడి తొక్కుల సీజన్ నడిచింది. ఆ సీజన్‌లో టన్నుల కొద్దీ కారంపొడి అమ్మకాలు సాగాయి. ధర్మాబాద్ కారంపొడి అనగానే జనం ఎగబడి కొనుగోలు చేస్తున్నారు. మిర్చి ఎక్కడి నుంచి వస్తుందో తెలియకున్నా.. ధర్మాబాద్ బ్రాండ్‌తో అమ్మకాలు భారీ ఎత్తున నడుస్తున్నాయి. సీజన్‌లో అయితే ఒక్కొక్క దుకాణంలో రూ.లక్షల్లో వ్యాపారం నడుస్తోందని సమాచారం.

చతుర్విధ జల ప్రక్రియతో కరువు నివారణ

బీజేపీ సీనియర్ నేత శశిధర్ రెడ్డి



సాక్షి, హైదరాబాద్: మహారాష్ట్రలో నీటి భద్రత, కరువు నివారణకు హనుమంతరావు రూపొందించిన చతుర్విధ జల ప్రక్రియ చక్కటి పరిష్కారమని బీజేపీ సీనియర్ నాయకుడు, డాక్టర్ ఎం.చెన్నారెడ్డి మెమోరియల్ ట్రస్ట్ కార్యదర్శి మర్రి శశిధర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ముంబై రాజ్‌భవన్‌లో మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌ను కలిసిన శశిధర్‌రెడ్డి.. హనుమంతరావు రూపొందించిన చతుర్విధ జల ప్రక్రియను వివరించారు. గంట పాటు జరిగిన సమావేశంలో, ఇతర వాటర్‌షెడ్ అభివృద్ధి కార్యక్రమాలు నీటి లభ్యతను పెంచలేకపోయినప్పుడు.. హనుమంత రావు విధానం అద్భుతమైన ఫలితాలను ఎందుకు అందించగలిగిందో తెలిపారు. ఈ విధానాన్ని తెలంగాణలోని గొట్టిగారిపల్లి గ్రామంలో, రాజస్థాన్‌లలో చూడవచ్చని స్పష్టం చేశారు. సీహెచ్ విద్యాసాగర్ రావు మహారాష్ట్ర గవర్నర్‌గా ఉన్నప్పుడు.. హనుమంతరావు మోడల్ గురించి వివిధ సంస్థలు, విభాగాలకు ఆదేశాలు జారీ చేయడాన్ని గుర్తు చేశారు. ఆ అంశాలన్నిటినీ పరిగణనలోకి తీసుకుని మహారాష్ట్రలో హనుమంతరావు వాటర్‌షెడ్ అభివృద్ధి భావనను అమలును పరిశీలించాలని అభ్యర్థించారు. సానుకూలంగా స్పందించిన గవర్నర్ రాధాకృష్ణన్.. అన్ని అంశాలను పరిశీలించి, వ్యవసాయ విశ్వవిద్యాలయాలలో పైలట్ ప్రాజెక్ట్‌గా అమలు చేస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో గవర్నర్ కార్యదర్శి డాక్టర్ ప్రశాంత్ నార్నవారే తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యానికి 7.24 లక్షల మంది దూరం

జూన్ 1 నుంచి 30 వరకు మూడు నెలల సన్న బియ్యం పంపిణీ

- రాష్ట్రంలో 91.83 లక్షల రేషన్ కార్డులు
- బియ్యం తీసుకున్నది 84.58 లక్షల మంది కార్డుదారులే..
- రేషన్ షాపులలో 30 వేల మెట్రిక్ టన్నుల బియ్యం నిల్వ
- మళ్లీ సెప్టెంబర్‌లోనే రేషన్ బియ్యం



సాక్షి, సిద్దిపేట: మూడు నెలల రేషన్ బియ్యం పంపిణీ ముగిసింది. ప్రభుత్వం జూన్, జూలై, ఆగస్టు నెలలకు సంబంధించిన సన్న బియ్యాన్ని.. రేషన్ షాపుల ద్వారా జూన్ 1 నుంచి 30వ తేదీ వరకు పంపిణీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 7.24 లక్షల మంది రేషన్ కార్డుదారులు బియ్యం తీసుకోలేదు. రెండు నెలల పాటు రేషన్ షాపులు మూతపడనున్నాయి. పలు రేషన్ షాపులలో నిల్వలు ఉండిపోయాయి. కొందరు రేషన్ బియ్యం కోసం కాకుండా.. కార్డు ఉండాలని తీసుకున్నవారు సైతం ఉన్నారు. దీంతో వారు రేషన్ షాప్‌కు వెళ్లి బియ్యం తీసుకోలేదని తెలుస్తోంది.

5,72,247.537 మెట్రిక్ టన్నుల బియ్యం కేటాయింపు

రాష్ట్ర వ్యాప్తంగా 91,83,153 రేషన్ కార్డులుండగా 5,72,247.537 మెట్రిక్ టన్నుల బియ్యం కేటాయించారు. 84,58,584 మంది రేషన్ కార్డుదారులు 5,42,219.852 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యం తీసుకున్నారు. రాష్ట్రంలో 92.10 శాతం మంది రేషన్ బియ్యం తీసుకున్నారు. ఇంకా 7,24,569 మంది రేషన్ కార్డుదారులు బియ్యం తీసుకోలేదు. దీంతో 30,027.685 మెట్రిక్ టన్నుల బియ్యం నిల్వలు పలు రేషన్ షాపుల్లో ఉన్నాయి. ఒకేసారి మూడు నెలల బియ్యం ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి రేషన్ షాపులకు సరఫరా చేయడంలో.. కొన్ని ఇబ్బందులు ఎదురయ్యాయి. గత నెలలో రేషన్ బియ్యం నిల్వ లేకపోవడంతో.. రెండు ,మూడు రోజులు రేషన్ షాపులను బంద్ చేశారు. తిరిగి స్టాక్ రాగానే పంపిణీ చేశారు.

అత్యధికంగా తీసుకున్నది మేడ్చల్‌లో..

పలు కుటుంబాలు ఉపాధి కోసం మేడ్చల్, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో నివసిస్తున్నాయి. రేషన్ బియ్యం రాష్ట్రంలో ఎక్కడైనా తీసుకునే అవకాశం ఉండటంతో.. అత్యధికంగా మేడ్చల్‌లో 112.66 శాతం, రంగారెడ్డిలో 106.16 శాతం, హైదరాబాద్‌లో 105.59 శాతం తీసుకున్నారు. రేషన్ షాప్‌కు కేటాయించిన కార్డుల కంటే.. ఎక్కువగా బియ్యం పంపిణీ జరిగింది. అత్యల్పంగా వనపర్తిలో 79.45 శాతం, నాగర్‌కర్నూల్‌లో 79.64 శాతం మంది బియ్యం తీసుకున్నారు.

రేషన్ కార్డు ఉంటే చాలు...

రేషన్ కార్డు ఉంటే చాలు అని కొందరు రేషన్ బియ్యం తీసుకోలేదు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు రేషన్ కార్డును ప్రామాణికంగా చేసింది. వాటికోసమే అధిక శాతం కుటుంబాలు రేషన్ కార్డు తీసుకుంటున్నాయి. కార్డు కావాలంటూ పుంఖానుపుంఖాలుగా దరఖాస్తులు రావడానికి కారణమిదే. ఇలా రేషన్ తీసుకోని వారి వివరాలతో అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి వారి రేషన్ కార్డు రద్దు చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

ఉమ్మడి జిల్లా	మొత్తం రేషన్ కార్డులు	బియ్యం తీసుకున్న వారు
అదిలాబాద్	7,78,477	7,15,777
ఖమ్మం	7,13,093	6,33,550
వరంగల్	11,25,355	9,66,526
కరీంనగర్	10,10,532	9,34,307
మహబూబ్‌నగర్	9,60,537	7,88,750
నిజామాబాద్	6,60,241	6,11,263
మెదక్	8,96,718	8,20,477
నల్లగొండ	10,29,227	8,79,106
రంగారెడ్డి	13,61,691	14,25,303
హైదరాబాద్	6,47,282	6,83,525



శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ



శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్



ఎల్బీ స్టేడియంలో జరిగిన కాంగ్రెస్ సభలో జెండావిష్కరణలో మహేశ్‌గౌడ్, కేసీ వేణుగోపాల్, ఉత్తమ్, భట్టి తదితరులు



కేసీ వేణుగోపాల్‌లో ముచ్చటిస్తున్న మీనాక్షి నటరాజన్. చిత్రంలో రేవంత్‌రెడ్డి. మల్లికార్జున ఖర్గేతో మాట్లాడుతున్న మహేశ్‌గౌడ్



ఎల్బీ స్టేడియం వద్ద కళాకారుల ఆటాపాట



5 కేజీల బియ్యం... 6 కి.మీ. ప్రయాణం

కూటమి ప్రభుత్వం నిత్యావసరాల పంపిణీలో ఇంటింటికీ రేషన్ సరఫరా వ్యవస్థను రద్దు చేసింది. గొప్ప సంస్కరణకు శ్రీకారం చుట్టామంటూ సంబరపడిపోతోంది. కానీ తెల్ల కార్డున్న లబ్ధిదారులు క్షేత్రస్థాయిలో ఎన్ని ప్రయాసలు పడుతున్నారో తెలుసుకోవడం లేదు. మైదాన ప్రాంతాల మాట అటుంచితే..గిరిజన గూడేల్లో అడవి బిడ్డల పాట్లు ఆవేదనాభరితం. ఒకరికిచ్చే 5కిలోల బియ్యం కోసం వారు కిలోమీటర్ల దూరం కాలినడకన పడుతున్న కష్టాలు వర్ణనాతీతం. కొండాకోనా, రాయీ రప్పలో నడుస్తూ, నెత్తిపై కిలోల కొద్దీ బియ్యం భారం మోయాల్సిన దుస్థితి దాపురించింది. శ్రీకాకుళం జిల్లా పాతపట్నం నియోజకవర్గం కొత్తూరు మండల పరి పలుగ్రామాల గిరిజనుల అవస్థలే ఇందుకు నిదర్శనం.వీరందరికీ గొట్టిపల్లి జీసీసీ డిపోనుంచే సరుకులు సరఫరా చేస్తుంటారు. కేవలం కూటమి ప్రభుత్వ అసంబద్ధ నిర్ణయమే ఇందుకు కారణమంటూ దుమ్మెత్తిపోస్తున్నారు. గతంలో ఇంటికే సరుకులు వచ్చే స్థితినుంచి అడవుల్లో కిలోమీటర్లు నడవాల్సిన పరిస్థితికి పాలకులు తీసుకువచ్చారంటూ శాపనార్థాలు పెడుతున్నారు.

సాక్షి ఫోటోగ్రాఫర్, శ్రీకాకుళం



క్లుప్తంగా...

జీఏడీకి పటాన్‌శెట్టి రవి సుభాష్

సాక్షి, అమరావతి: ఐఏఎస్ అధికారి పటాన్‌శెట్టి రవి సుభాష్‌ను ప్రభుత్వం జీఏడీకి(సాధారణ పరిపాలన విభాగం) అటాచ్ చేసింది. ఆరోగ్యశ్రీ సీఈవోగా వ్యవహరిస్తున్న ఈయన ఈ నెల 11వ తేదీ వరకూ వ్యక్తిగత సెలవుపై వెళ్లారు. సెలవు ముగిశాక తిరిగి సీఈవోగా బాధ్యతలు స్వీకరించేలా ఈ నెల 1న ఇచ్చిన ఉత్తర్వులను సవరించి, జీఏడీలో రిపోర్ట్ చేయాలని ఆదేశిస్తూ సీఎస్ ఉత్తర్వులు ఇచ్చారు.

కుప్పంలో ఎంఎస్ఎంఈ పార్కు

సాక్షి, అమరావతి: ఎంఎస్ఈ సీడీపీ పథకం కింద సీఎం చంద్రబాబు నియోజకవర్గం కుప్పంలో ఎంఎస్ఎంఈ పార్కును అభివృద్ధి చేయనున్నారు. కుప్పం మండలం పాలరాళ్లపల్లి లో ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేయనున్నారు. సుమారు రూ.12.65 కోట్లతో ఏర్పాటు కానున్న ఈ పార్కును ఆరు నెలల్లో నిర్మించి పూర్తి చేసేందుకు ఆసక్తిగల సంస్థల నుంచి ఏపీఐఐసీ టెండర్లను ఆహ్వానించింది.

15న నదుల అనుసంధానంపై ప్రత్యేక కమిటీ భేటీ

సాక్షి, అమరావతి: దేశంలో నదుల అనుసంధానంపై కేంద్రం ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిటీ ఈ నెల 15న సమావేశం కానుంది. కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ అధ్యక్షతన ఢిల్లీలో జరిగే ఈ భేటీలో రాష్ట్రాల జలవనరుల శాఖ మంత్రులు, అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొంటారు. గోదావరి-కృష్ణా-పెన్నా-కావేరి అనుసంధాన అంశం ఈ సమావేశం అజెండాలో చేర్చారు. ఈ అనుసంధానానికి బేసిన్ పరిధిలోని ఏపీ, తెలంగాణ సహా ఇతర రాష్ట్రాలను ఒప్పించనున్నారు.

జూలై 6న ఉచిత యాంటీరేబీస్ టీకాలు

సాక్షి, అమరావతి: ప్రపంచ జూనోసిస్ దినాన (జూలై 6) ఏటా మాదిరిగానే రాష్ట్రంలోని పశువైద్యశాలలు, ఏరియా వెటర్నరీ హాస్పిటల్స్, పాలీ క్లినిక్స్, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులలో ఉచితంగా యాంటీరేబీస్ టీకాలు వేయనున్నట్లు పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ డాక్టర్ టి.దామోదర నాయుడు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం రూ.75 లక్షలతో 5.37 లక్షల టీకాలను సిద్ధం చేశామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జంతువుల నుంచి మానవులకు లేదా మానవుల నుంచి జంతువులకు సంక్రమించే వ్యాధులను జూనోటిక్ వ్యాధులు అంటారు. వీటి గురించి అవగాహన కల్పించి నియంత్రించడానికి ప్రపంచవ్యాప్తంగా ఈ రోజును జరుపుకొంటారు.

పీటీఎం నిర్వహణలో నిబంధనలు సరికాదు

వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్

సాక్షి, అమరావతి: పాఠశాలలో మెగా పీటీఎం (పేరెంట్ టీచర్ మీట్) నిర్వహణ రికార్డు చేయడానికి సాక్షు (విట్నెస్)లను నియమించాలన్న నిబంధన సరికాదని వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ట్రెజరర్ వి.రెడ్డి శేఖర్ రెడ్డి విమర్శించారు. అధికారుల అనాలోచిత నిర్ణయాలతో ఉపాధ్యాయులు చులకనవుతారన్నారు. గత ప్రభుత్వంలో పీటీఎంలను చక్కగా, స్వేచ్ఛగా నిర్వహించామన్నారు. మెగా పీటీఎంల బాధ్యతలు పూర్తిగా ఆయా పాఠశాల ఉపాధ్యాయులకే వదిలి వేయాలని డిమాండ్ చేశారు.

వర్సిటీల్లో తాత్కాలిక అధ్యాపకులను కొనసాగించాలి

సాక్షి, అమరావతి: ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో(వర్సిటీలు) ఏళ్లతరబడి పనిచేస్తున్న అకడమిక్ కన్సల్టెంట్లు/అడ్-హాక్/గెస్ట్ ఫ్యాకల్టీ అధ్యాపకులను కొనసాగించాలని అఖిల భారతీయ రాష్ట్రీయ శైక్షిక్ మహాసంఘ్(ఏబీఆర్ఎస్ఎం) రాష్ట్ర శాఖ అధ్యక్షుడు ప్రొఫెసర్ వైవీ రామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ డీఎస్‌వీఎస్ బాలసుబ్రహ్మణ్యం ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు శుక్రవారం విద్యాశాఖ మంత్రి లోకేశ్, ఉన్నత విద్యా మండలి చైర్మన్ మధుమూర్తి, ఉన్నత విద్యా కార్యదర్శికి వినతిపత్రాలు పంపించారు.

విద్యుత్ పర్యవేక్షక కమిటీ ఏర్పాటు

సాక్షి, అమరావతి: విద్యుత్ శాఖలో ప్రాజెక్టులు, పనులు, సరఫరా, పంపిణీ వంటి వాటి పర్యవేక్షణకు పది మంది అధికారులతో స్టీరింగ్ కమిటీ ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులిచ్చింది. ఈ కమిటీకి చైర్మన్‌గా సీఎస్ కె.విజయానంద్‌ను, సభ్యులుగా రవాణా, రోడ్లు భవనాల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, ఏపీట్రాన్స్ కో, డిస్కంల సీఎండీలు ఏపీ జెన్ కో, నెడ్ క్యాప్‌ల ఎండీలు, ఏపీపీసీసీ కన్వీనర్‌లను నియమించింది. ఏపీ ట్రాన్స్ కో జేఎండీ కీర్తి చేకూరికి ఈ కమిటీలో మెంబర్ కన్వీనర్‌గా వ్యవహరిస్తూ విద్యుత్ సంస్థల నుంచి ప్రభుత్వానికి సమయానికి సమాచారాన్ని అందించే బాధ్యతలు నిర్వర్తించాలని ప్రభుత్వం ఆదేశించింది.

ప్రవేశం.. ఆక్రోశం

యూజీ, పీజీ సెట్ అడ్మిషన్లపై అలసత్వం ● ఫలితాలు విడుదలైనా జాడ లేని కౌన్సెలింగ్

ఉన్నత విద్యామండలి నిర్లక్ష్యంతో వేలాది మంది విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. యూజీ.. పీజీ సెట్ ఫలితాలు విడుదలైనప్పటికీ అడ్మిషన్లు చేపట్టకపోవడంపై ఆవేదన చెందుతున్నారు. విద్యా సంవత్సంర ఆరంభమైనా కౌన్సెలింగ్ నిర్వహణకు అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఇదే అదునుగా ప్రైవేట్ కళాశాలల యాజమానులు ప్రవేశాల కోసం కాసుక్కూర్చున్నారు. దీంతో పలువురు తల్లిదండ్రులు తమ పిల్లలను ఎక్కడ చేర్పించాలనే దానిపై మల్లగుల్లాలు పడుతున్నారు. ఆలస్యం చేస్తే రెంటికీ చెడ్డ రేవడిగా మిగలాల్సి వస్తుందేమో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కార్పొరేట్‌కు కొమ్ముకాసేలా ఉన్నత విద్యామండలి వైఖరి ఉందని ఆరోపిస్తున్నారు. దీనిపై ప్రభుత్వం వెంటనే స్పందించి తగు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

- పలు కోర్సుల్లో చేరేందుకు 80వేల మంది ఎదురుచూపులు
- కాసు క్కూర్చున్న ప్రైవేటు కళాశాలలు
- ఉన్నత విద్యామండలి వైఖరిపై మండిపడుతున్న విద్యార్థులు



పీజీ, యూజీ సెట్‌ల వివరాలు

కేటగిరీ	పరీక్ష జరిగిన తేదీ	ఫలితాలు విడుదల	కౌన్సెలింగ్ తేదీ
ఏపీ ఐసెట్	మే 7	మే 20	ఊసేలేదు
లాసెట్	జూన్ 5	జూన్ 19	ఇప్పటివరకు ప్రకటించలేదు
పీజీఈసెట్	జూన్ 608	జూన్ 25	ఇప్పటివరకు ప్రకటించలేదు
పీజీసెట్	జూన్ 9-12	జూన్ 25	కౌన్సిలింగ్ ఊసేలేదు
ఈఏపీసెట్	మే 21- 27	జూన్ 8	ఈ నెల 17నుంచి అంటూ సమాచారం
ఎడ్‌సెట్	జూన్ 5	జూన్ 20	ఈ నెల 20-26 వరకు అంటూ వెల్లడి
ఈసెట్	మే 6	మే 15	ఈనెల 4 నుంచి 8వరకు
పాలిసెట్	ఏప్రిల్ 30	మే 14	జూన్ 30న ప్రారంభమైంది
నీట్	మే 4	జూన్14	ఇప్పటివరకు ప్రకటించలేదు

తిరుపతి సిటీ: విద్యా సంవత్సరం ప్రారంభమై మాసం గడిచింది. డిగ్రీ, ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు పీజీ, యూజీ కోర్సులలో చేరేందుకు సిద్ధమయ్యారు. ఇందుకోసం రాష్ట్ర ఉన్నత విద్యామండలి పీజీ, యూజీ సెట్‌ను మే, జూన్‌లో నిర్వహించింది. దాదాపు అన్ని పీజీ, యూజీ సెట్‌ల ఫలితాలు సైతం విడుదలయ్యాయి. కానీ, ఇప్పటి వరకు ఒక్క పీజీ, యూజీ కోర్సులకు కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహించిన పాపాన పోలేదు. కొన్ని పీజీసెట్‌లకు కౌన్సెలింగ్ అధికారులను సైతం ఇప్పటివరకు నియమించిన దాఖలాలు లేవు. జూలై ప్రారంభమైనా కౌన్సెలింగ్ తేదీలను ప్రకటించకపోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

సందిగ్ధంలో తల్లిదండ్రులు

పీజీ, యూజీ సెట్‌ల ఫలితాలు విడుదలైనా కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభం కాకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. కౌన్సెలింగ్‌లో పిల్లలకు సీటు దక్కకపోతే ఏం చేయాలనే సందిగ్ధంలో ఉన్నారు. ఇప్పటికే ప్రైవేటు విద్యాసంస్థలలో ముందస్తు పీజీ, యూజీ, ఇంజినీరింగ్ అడ్మిషన్ల ప్రక్రియ పూర్తి కావస్తున్న నేపథ్యంలో తమ పిల్లల పరిస్థితి ఏంటనే ఆలోచనలో పడ్డారు. ఇటు ప్రభుత్వ సంస్థలలో సీటు దక్కక అటు ప్రైవేటు కళాశాలల్లో సీటు దొరకని పరిస్థితిలో ఏంచేయాలనే అయోమయంతో ఉన్నారు. దీంతో ఇప్పటికే పలు విద్యాసంస్థలలో టోకెన్ అమౌంట్ చెల్లించి సీటు రిజర్వ్ చేసుకుంటున్నారు.

తప్పని ఎదురుచూపులు

జిల్లాలో పలు పీజీ, యూజీ కోర్సులో చేరేందుకు సుమారు 80వేల మంది విద్యార్థులు కౌన్సెలింగ్ కోసం ఎదురు చూస్తున్నారు. ఇందులో ప్రధానంగా ఏపీ ఐసెట్, ఏపీ లాసెట్, ఏపీ పీజీఈ సెట్, ఏపీ ఈఏపీ సెట్, ఏపీ ఈసెట్, ఏపీ పీజీసెట్, ఏపీ ఎడ్ సెట్ ఫలితాలు ఇప్పటికే విడుదలై కౌన్సిలింగ్ ప్రక్రియ ప్రారంభం కావాల్సి ఉంది. ఇందులో పాలిసెట్‌కు మాత్రం కౌన్సిలింగ్ ప్రక్రియ ప్రారంభం కాగా, ఏపీ ఈఏపీసెట్ కౌన్సెలింగ్‌ను ఈనెల 17వ తేదీ నుంచి మొదలుపెట్టనున్నట్లు సమాచారం. మిగిలిన పీజీ సెట్లపై ఉన్నత విద్యామండలి ఇప్పటి వరకు కౌన్సెలింగ్ అధికారులను సైతం నియమించే ప్రయత్నం చేయకపోవడం గమనార్హం. మరో పక్క ఎంబీబీఎస్ ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్ ఫలితాలు విడుదలై నెలకు పైగా గడుస్తున్నా ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వం సైతం కౌన్సెలింగ్ ప్రారంభించకపోవడంతో తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు మండిపడుతున్నాయి.

అగమ్యగోచరం



ఎంబీఏ, ఎంసీఏ, ఏంఏ, ఎమ్‌కామ్, ఎమ్మెస్సీ కోర్సులలో అడ్మిషన్లు వర్సిటీలలో దారుణంగా పడిపోతున్నాయి. ఇందుకు ప్రధాన కారణం ఉన్నత విద్యామండలి అలసత్వమే. ప్రవేశ పరీక్షలు నిర్వహించి నెలలు గడుస్తున్నా కౌన్సెలింగ్ చేపట్టకపోవడంతో విద్యార్థులు తమకు సీటు రాదనే అనుమానంతో ప్రైవేటు కళాశాలలను ఆశ్రయిస్తున్నారు.

– డాక్టర్ బి.ఓబుల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు

సీటు వస్తుందో రాదో అని..



మా అబ్బాయి ఇంటర్ పూర్తి చేశాడు. ఎంసెట్‌లో అర్హత సాధించాడు. కానీ, ఇప్పటి వరకు కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభం కాలేదు. దీంతో తిరుపతిలోని ఓ ప్రైవేటు కళాశాలలో ముందస్తుగా ఫీజు చెల్లించి సీఎస్ఈ కోర్సులో అడ్మిషన్ చేయించాం. సకాలంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తే ఇలాంటి పరిస్థితి ఉండేది కాదు. ప్రభుత్వ విద్యాసంస్థలోనే చేర్పించేవాళ్లం.

– ప్రమీలమ్మ, విద్యార్థి తల్లి, తిరుపతి

ఆర్టీసీలో ఖాళీగా ఉన్న 10వేల పోస్టులను భర్తీ చేయాలి:ఈయూ

సాక్షి, అమరావతి: ఆర్టీసీలో ఖాళీగా ఉన్న 10వేల ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని ఎంప్లాయిస్ యూనియన్(ఈయూ) ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. కొత్తగా కొనుగోలు చేసే ఎలక్ట్రిక్ బస్సులను ఆర్టీసీయే నిర్వహించాలని కోరింది. ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఈయూ రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం ధర్నాలు నిర్వహించింది. విజయవాడలో నిర్వహించిన ధర్నాలో ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు పి.దామోదరరావు మాట్లాడుతూ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న పదోన్నతులను వెంటనే కల్పించాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ ఉద్యోగులకు 11వ పీఆర్సీ బకాయిలు, డీఏ బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. 12వ పీఆర్సీ నియామకంతో పాటు వెంటనే ఐఆర్‌ను ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈయూ రాష్ట్ర కార్యదర్శి టీవీ భవానీ మాట్లాడుతూ మరణించిన, రిటైర్డ్ ఉద్యోగులకు గ్రాట్యుటీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్‌లు వెంటనే చెల్లించాలని కోరారు. ఈ ధర్నాలో ఈయూ కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్‌కే హోహిద్దీన్, జోనల్ కార్యదర్శి వై.శ్రీనివాసరావు, ఎన్టీఆర్ జిలాకార్యదర్శి సాగర్, విజయవాడ డిపో కార్యదర్శి రాధాకృష్ణతోపాటు పెద్ద సంఖ్యలో ఈయూ సభ్యులు పాల్గొన్నారు.

నిరుద్యోగులను నిండా ముంచిన చంద్రబాబు

సాక్షి, అమరావతి: కూటమి ప్రభుత్వం నిరుద్యోగులపై అత్యంత హేయంగా వ్యవహరిస్తోందని నిరుద్యోగ ఐక్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర ఎంబేటి శుక్రవారం ఓ ప్రకటనలో విమర్శించారు. అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా ఒక్క ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వకపోగా, సచివాలయ ఉద్యోగులను డెప్యూటేషన్లపై వివిధ శాఖలకు కేటాయించడం నిరుద్యోగుల్లో ఆందోళనను కలిగిస్తోందని మండిపడ్డారు. ×రాష్ట్ర విభజన తర్వాత 2.50 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నట్టు సీఆర్ కమలనాథన్ కమిటీ తేల్చింది. భర్తీకి చర్యలు చేపట్టకుండా, గత ప్రభుత్వంలో గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి ఇచ్చిన 1.30లక్షలకు పైగా ఉద్యోగాలను సర్దుబాటు పేరుతో కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోంది. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా 30 శాతం కోటాను కూడా తుంగలో తొక్కుతోంది. ఏటా జనవరి 1న జాబ్ క్యాలెండర్ అని మాట తప్పారు. నిరుద్యోగ భృతి ఊసే లేదు. ప్రతి సారీ నిరుద్యోగులను చంద్రబాబు వంచిస్తూనే ఉన్నారు. నిరుద్యోగ సంఘాలు, ప్రజా సంఘాలతో త్వరలో జాయింట్ యాక్షన్ కమిటీ ఏర్పాటు చేసి నిరుద్యోగ సమస్యలు, హక్కుల మీద రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు, న్యాయ పోరాటాలు చేస్తాం౯ అని హెచ్చరించారు. ప్రభుత్వం తన విధానాలను మార్చుకోకుంటే నిరుద్యోగ యువత నుంచి తిరుగుబాటు ఎదుర్కోక తప్పదన్నారు.

అనైతిక బదిలీలను తక్షణమే రద్దు చేయాలి

ఏపీ గ్రామ/వార్డు సచివాలయ ఎంప్లాయీస్ ఫెడరేషన్ డిమాండ్

సాక్షి, అమరావతి: సచివాలయాల ఉద్యోగుల అనైతిక బదిలీల ప్రక్రియను తక్షణమే రద్దు చేసి, సీనియారిటీ ప్రకారం బదిలీలు నిర్వహించాలని ఏపీ గ్రామ/వార్డు సచివాలయ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు గ్రామ/వార్డు సచివాలయ శాఖ మంత్రి కార్యాలయంలోనూ, శాఖ డైరెక్టర్ శివప్రసాద్‌కు వినతిపత్రాలిచ్చినట్లు ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జానిపాషా, ప్రధాన కార్యదర్శి బత్తుల అంకమరావు శుక్రవారం తెలిపారు. గడువు ముగిసిన తర్వాత కూడా చాలా జిల్లాల్లో బదిలీల ప్రక్రియ ప్రభుత్వ ఉత్తర్వులకు విరుద్ధంగా కొనసాగుతుందని మండిపడ్డారు. సిఫారసు లేఖల ఆధారంగానే పోస్టింగులు ఇవ్వడం అన్యాయమన్నారు. కొన్ని జిల్లాల్లో కౌన్సెలింగ్ ప్రక్రియ కూడా జరగలేదని పేర్కొన్నారు. మరికొన్ని జిల్లాల్లో ఐదేళ్ల సర్వీస్ పూర్తి చేయని వారు బదిలీ కోసం దరఖాస్తు చేయనప్పటికీ..బలవంతంగా బదిలీలు చేస్తున్నారని తెలిపారు.

కువైట్‌లో నిర్మాణ రంగ నిపుణులకు ఉపాధి అవకాశాలు

సాక్షి, అమరావతి: నిర్మాణ రంగంలో నైపుణ్యం కలిగిన వారికి కువైట్‌లో ఉపాధి అవకాశాలను ప్రభుత్వ రంగ సంస్థ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ (ఓంక్యాప్) కల్పిస్తోంది. ఐటీఐ లేదా డిప్లొమా కలిగి ఉండి టైల్స్, పెయింటింగ్, ఎలక్ట్రికల్, సీలింగ్ వర్క్ రంగాల్లో కనీసం మూడు నుంచి ఐదేళ్ల అనుభవం ఉన్న వారికి కువైట్‌లో ఉపాధి అవకాశాలను కల్పిస్తోంది. కాంట్రాక్టు విధానంలో నెలకు రూ.56,000 నుంచి రూ.70,000 వరకు జీతం లభిస్తుందని, 25 నుంచి 50 ఏళ్ల మధ్య వయసు గలవారు అర్హులని, జూలై 12వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ఏపీఎస్ఎస్‌డీసీ శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలియజేసింది. మరిన్ని వివరాల కోసం https:// naipunyam.ap.gov.in వెబ్‌సైట్‌ను గానీ, skillinternational@apssdc.in ఈ-మెయిల్ ద్వారా గానీ, 9988853335 అనే హెల్ప్‌లైన్ నంబర్‌ను గానీ సంప్రదించాలని సూచించింది.

వైఎస్సార్ పేరుతో న్యూజిలాండ్‌లో రక్తదానం



సాక్షి,అమరావతి: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి సందర్భంగా ఆక్లాండ్‌లో వైఎస్సార్‌సీపీ న్యూజిలాండ్ బృందం శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించింది. ఈ కార్యక్రమానికి అనూహ్య స్పందన వచ్చింది. ఈ సందర్భంగా ఎన్ఆర్ఐ ఆనంద్ ఎద్దుల మాట్లాడుతూ జూలై 8న డాక్టర్ వైఎస్సార్ జయంతి సందర్భంగా ఆయనకు నివాళిగా ఈ కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. ఈ రక్తదానంలో ఆనంద్ ఎద్దుల, బుజ్జి బాబు నెల్లూరి, సమంత్ దేగపూడి, రమేశ్ పనాటి, విజయ్ అల్ల, గీతారెడ్డి, సంకీర్త్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సిడ్నీలో ఘనంగా జయంతి

దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతిని సిడ్నీలో శుక్రవారం ప్రవాసాంధ్రులు ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ సంక్షేమ, అభివృద్ధి పాలనను స్మరించుకుంటూ ఆయన ఆలోచనలు, ప్రజల పట్ల ఉన్న ప్రేమను గుర్తుచేసుకున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ, ఇళ్ల నిర్మాణం, ఐటీ రంగ అభివృద్ధి, 108 అంబులెన్స్‌లు, నీటి ప్రాజెక్టులు వంటి ఎన్నో పథకాల ద్వారా లక్షలాది మంది ప్రజలు లబ్ధి పొందారని ప్రవాసాంధ్రులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిడ్నీ కన్వీనర్ అమర్‌నాథ్ రెడ్డితో పాటు ఎన్ఆర్ఐలు రామనాథ్ రెడ్డి, రాజశేఖర్ లంకెల, మల్లికార్జున రెడ్డి, శ్రీనివాస్ బెతంశెట్టి, విష్ణువర్ధన్ రెడ్డి, పవన్ జవాజి, మను రెడ్డి, తిమ్మా రెడ్డి, రాజ్ బద్దం, చంద్ర మౌళి, పెద్దిరెడ్డి, ఉమేష్ కుర్బా, శ్రీనివాస్ గాయం, సురేశ్ రెడ్డి, మనోహర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మూసేయడానికే కూటమి మొగ్గు!

- వీవీవీ పాఠశాల ఉపాధ్యాయులకు వీఆర్ఎస్ యత్నం
- స్టీల్‌ప్లాంట్‌కు ఎంపీ, ఎమ్మెల్యేలు సిఫార్సు
- బయటపడ్డ కూటమి నైజం



స్టీల్‌ప్లాంట్ తెలుగు తల్లి విగ్రహం వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

సాక్షి, విశాఖపట్నం: పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన పాఠశాలను కొనసాగించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు బ్రతిమాలుతుంటే ఆ పాఠశాల ఉపాధ్యాయులకు వలంటరీ రిటైర్‌మెంట్ స్కీమ్(వీఆర్ఎస్) ఇచ్చి పంపేయాలని విశాఖ ఎంపీ, గాజువాక ఎమ్మెల్యేలు ఉక్కు యాజమాన్యానికి సిఫార్సు చేయడం పట్ల అందరూ నివ్వెరపోతున్నారు. అధికారంలో ఉన్నవారు పాఠశాలను నిలబెట్టాల్సింది పోయి మూసివేయడానికి మద్దతివ్వడం పట్ల సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. నాలుగు దశాబ్దాల క్రితం స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికుల పిల్లల కోసం ఉక్కునగరంలోని సెక్టార్-5లో విశాఖ విమల విద్యాలయం (వీవీవీ) తెలుగు మీడియం పాఠశాలను ఏర్పాటు చేశారు. నగరానికి చెందిన డయాసిస్ సంస్థకు పాఠశాల నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. అక్కడి ఉపాధ్యాయులకు ప్రభుత్వ ఉపాధ్యాయులతో సమానంగా వేతనాలు చెల్లించేవారు. దాదాపు రెండు వేల మంది విద్యార్థులు చదువుకుంటున్న ఈ పాఠశాలలో 28 మంది పర్మినెంట్, అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, 60 మంది సిబ్బంది ఉన్నారు. పాఠశాల నిర్వహణకు ఏడాదికి రూ.5 కోట్లు వ్యయం అవుతోంది. ఫీజుల రూపేణా రూ.2 కోట్లు వసూలవుతుండగా, మిగిలినది ఉక్కు యాజమాన్యం సహాయంగా అందజేస్తూ వస్తోంది. గతేడాది ఉక్కు యాజమాన్యం పాఠశాల నిర్వహణకు తాము సహకరించలేమని, సొంత నిధులతో నిర్వహించుకోవాలని తేల్చింది. దీంతో రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాల నేతృత్వంలో పెద్ద ఎత్తున ప్రజాగ్రహం వెల్లువెత్తింది. ఆ ఒత్తిడికి లొంగి గతేడాది పాఠశాల నిర్వహణకు యాజమాన్యం ముందుకు వచ్చింది. ఈ ఏడాది కథ మళ్లీ మొదటికి రాగా.. మూడు నెలల క్రితం డయాసిస్ సంస్థ పాఠశాల కొనసాగించడానికి అనుమతి కోసం ఉక్కు యాజమాన్యానికి లేఖ రాసింది. అయినప్పటికీ యాజమాన్యం నుంచి స్పందన కనిపించలేదు. ఇతర పాఠశాలలు ప్రారంభమై మూడు వారాలవుతున్నా వీవీవీ ప్రారంభం కాకపోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. ఈ అంశంపై గత నెల 23న ఉక్కు యాజమాన్యం ప్రతినిధులతో జరిగిన సమావేశంలో యాజమాన్యం పాఠశాలను తెరవడానికి సంబంధించిన అనుమతి పత్రం ఇస్తామని చెప్పినట్టు పాఠశాల ఉపాధ్యాయులు తెలిపారు. ఇది జరిగి రెండు వారాలు కావస్తున్నా పాఠశాల తెరవకపోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

బట్టబయలైన కూటమి ప్రభుత్వ నైజం..

ఇదిలా ఉండగా ఈ అంశంపై ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పలుమార్లు స్థానిక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ఎంపీ శ్రీభరత్‌లను కలిసి పాఠశాల తెరిచేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తాము ప్రయత్నిస్తున్నామని, ఉక్కు యాజమాన్యం వినటం లేదని ఎంపీ, ఎమ్మెల్యే పలుమార్లు వారికి చెబుతూ వచ్చారు. ఒకవైపు వారితో అలా చెబుతూ మరోవైపు యాజమాన్యానికి ఉపాధ్యాయుల వీఆర్ఎస్ కోసం సిఫార్సు చేయడం పట్ల కూటమి ప్రభుత్వం నైజం బయటపెట్టారు.

ఎంపీ, ఎమ్మెల్యేల వల్లే పాఠశాలకు ఈ దుస్థితి..



విశాఖ ఎంపీ, గాజువాక ఎమ్మెల్యేల వల్ల ప్రారంభం కావాల్సిన పాఠశాల మూసివేసే పరిస్థితులకు చేరుకుంది. అధికారంలో ఉన్న కూటమి ప్రజాప్రతినిధులు యాజమాన్యంపై ఒత్తిడి తెచ్చి పిల్లల చదువుల బాధ్యత తీసుకోవాల్సింది పోయి బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణలో భాగంగానే పాఠశాలను మూసివేయడానికి సన్నద్ధం చేస్తున్నారు. పాఠశాల తెరిచే వరకు ఉద్యమం ఉధృతం చేస్తాం.

– డాక్టర్ బి.గంగారావు, 78వ వార్డు కార్పొరేటర్

పిల్లల కోసమే పుస్తకం

PRATHAM BOOKS
A Book in Every Child's Hand

• ప్రథమ్ బుక్స్



పిల్లలూ! మీలో చాలామందికి పుస్తకాలు చదవడమంటే ఇష్టం. మీకోసం మార్కెట్లో ఎన్నో పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. రంగురంగుల్లో, అందమైన బొమ్మలతో ఆకట్టుకునేలా వాటిని తీర్చిదిద్దేందుకు ఓ సంస్థ ఉంటుంది. అందులోని ఉద్యోగులు ఎన్నో శ్రమల కోర్చి మీ చేతికి ఆ పుస్తకం అందేలా చేస్తారు. మనదేశంలో కేవలం పిల్లల కోసమే పుస్తకాలు ప్రచురిస్తున్న సంస్థలు ఉన్నాయి. వాటిలో ఒకటి 'ప్రథమ్ బుక్స్'.

2004లో రోహిణి నిలేకనీ, అశోక్ కామత్, రేఖామీనన్ కలిసి ఈ సంస్థను స్థాపించారు. చిన్నారుల్లో పఠనాభిలాషను పెంచి, వారి కోసం మేలైన పుస్తకాలు అందించడమే తమ సంస్థ లక్ష్యంగా పెట్టుకున్నారు. లావుగా ఉండే బైండింగ్ పుస్తకాల కంటే తేలిగ్గా ఉండే పుస్తకాలైతే పిల్లలకు నచ్చుతాయని భావించి 2006లో మొదట మినీ కథల పుస్తకాలు వేశారు. వీటి దేశమంతా ప్రచారం చేశారు. కార్డుల రూపంలో ఉండే ఆ కథల్ని చిన్నారులు ఎంతో ఇష్టంగా చదవడంతో తమ లక్ష్యం కొంత మేర నెరవేరిందని సంతోషించారు. అనంతరం తమ పరిధిని మరింత పెంచుకుంటూ ముందుకు సాగారు.

2009లో 'కావేరి' అనే పుస్తకాన్ని ప్రథమ్ బుక్స్ సంస్థ ప్రచురించింది. నీటిని పొదుపుగా వాడుకోవాలని, భావితరాలకు భద్రంగా అందించాలనే ఆలోచనతో ఈ పుస్తకాన్ని తీసుకొచ్చారు. చిన్నారులకు ఈ పుస్తకాలను అందించి, వారందరి చేతా 'నీటి పొదుపు'పై ప్రతిజ్ఞ చేయించారు. ఈ పుస్తకాన్ని రీసైకిల్ అయ్యే కాగితంతో ప్రచురించడం విశేషం. ఆ తర్వాత చిన్నారుల కోసం సంస్థ తరఫున స్కూళ్లలో గ్రంథాలయాలు ఏర్పాటు చేయించారు. తమ సంస్థ తరఫున వాలంటీర్లను ఎంపిక చేసి, వారి చేత చిన్నారులకు తమ పుస్తకాలు చదివి వినిపించే ఏర్పాటు చేశారు. 'ఆది కహానీ' పేరుతో 10 గిరిజన కథలు, నాలుగు పాటలతో పుస్తకం వేశారు. వీటికి గిరిజన కళాకారులతో చిత్రాలు గీయించారు. 'StoryWeaver' పేరుతో డిజిటల్ లైబ్రరీని ఏర్పాటు చేసి, పిల్లలు తమ మాతృభాషలో కథలు చదువుకునే సౌకర్యాన్ని కల్పించారు.

కొవిడ్ సమయంలో ఏర్పడిన కల్లోలాన్ని పిల్లల మనసుల్లోంచి తుడిచేసేలా వారిలో ఉత్తేజాన్ని నింపే రచనలతో పుస్తకాలు ప్రచురించారు. గిరిజన భాషలైన కుర్మలి, సద్రి, ముండరి, కురుఖ్‌లలో తొలిసారి పుస్తకాలు ప్రచురించారు. పిల్లల కోసం మరెంతో చేయాలని 'ప్రథమ్ బుక్స్' సంస్థ యోచిస్తోంది. 'ప్రథమ్ బుక్స్' ప్రచురించిన పుస్తకాలంటే పిల్లలంతా ఎంతో ఉత్సాహంగా చదువుతారు.



ఏనుగుల ఆర్ట్ ఎగ్జిబిషన్

చూశారా ఆ ఏనుగుల వరుస. నిజం ఏనుగులు అనిపించేంత పెద్దవిగా ఉన్నాయి. ఇవన్నీ జూలై 1 నుంచి అమెరికాలోని బేవర్లిహిల్స్‌లో జరుగుతున్న 'గ్రేట్ ఎలిఫెంట్ మైగ్రేషన్ ఆర్ట్ ఎగ్జిబిషన్'లో ఏర్పాటు చేసినవి. ఏనుగుల జీవితంలో వలస ఉంటుంది. ఒక్కో దేశంలో ఒక్కో కాలంలో అవి వలస వెళతాయి ఆహారం కోసం. కాని ఏనుగుల వేట ఇంకా సాగుతూనే ఉంది. వాటి ఆవాసం కోసం ఉండాల్సిన అడవులు కోతకు గురవుతూనే ఉన్నాయి. అందుకే యు.కె.కు చెందిన 'ఎలిఫెంట్ ఫ్యామిలీ' అనే పర్యావరణ పరిరక్షణ సంస్థ ఏనుగుల కోసం దేశ దేశాల్లో ఈ ఎగ్జిబిషన్‌ను నిర్వహిస్తోంది. ప్రస్తుతం అమెరికాలోని జరుగుతున్న ప్రదర్శన ఫొటోలు ఇవి.






వాళ్ల స్కూల్లో మధ్యాహ్న భోజనం





పిల్లలూ... మన బడుల్లో మనకు మధ్యాహ్న భోజనం పెడతారు తెలుసు కదా. ఒకప్పుడు గవర్నమెంట్ బడుల్లో పిల్లల అటెండెన్స్ తక్కువ ఉండేది. మధ్యాహ్న భోజనం వల్ల స్టూడెంట్స్ చదువుకోవడానికి వస్తారని ఈ పథకం మొదలు పెట్టాక మంచి రిజల్ట్స్ వస్తోంది. ఈ ఆలోచనను మొదట తమిళనాడులో ప్రవేశ పెట్టారు తెలుసా? ఇవాళ మన దేశంలోని ఇతర రాష్ట్రాల్లోనే కాదు ఆసియా దేశాల్లో చాలా చోట్ల ఈ విధంగా చేస్తున్నారు. ఇక్కడ చూడండి... ఇండోనేషియాలోని జకార్తాలో ఉన్న ప్రభుత్వ బడిలో పిల్లల కోసం ఎలాంటి భోజనం రెడీ చేస్తున్నారు. మనకు గుడ్డు ఇస్తున్నారు కాని అరటి పండు ఇవ్వడం లేదు. ఇటీవల కేరళలో అంగన్‌వాడిలోని ఒక చిన్నారి 'ఎగ్ బిర్యానీ' అడిగాడు. అక్కడ ఉచిత భోజనంలో ఎగ్ బిర్యానీ లేదు. కాని చిన్నారి అడిగాడని వారంలో ఒక రోజు పిల్లలందరికీ ఎగ్ బిర్యానీ ప్రవేశ పెట్టారు. మన దగ్గర ఇలా అరటి పండు కూడా ప్రవేశ పెట్టాలి. ఏమంటారు?

• పుస్తకం



కొండ ప్రాంతపు కథ

ఆ గొడుగులో ఏముంది?

రస్కిన్ బాండ్ రాసిన 'ది బ్లూ అంబ్రెల్లా' హిమాచల్ ప్రదేశ్ నేపథ్యంలో జరిగే బిన్యా అనే పదేళ్ల బాలిక కథ. పర్యాటకులుగా వచ్చిన ఒక కుటుంబం దగ్గర ఉన్న నీలం రంగు గొడుగు నచ్చడంతో తన మెడలో ఉన్న పులి గోరుని బదులుగా ఇచ్చి గొడుగుని తీసుకుంటుంది. ఆ గొడుగుని తనెంత అపురూపంగా చూసుకుంది. దాని కారణంగా తను ఎటువంటి సమస్యలు ఎదుర్కొంది. ఆ గ్రామంలో సావుకారి, బిన్యా గొడుగును దొంగిలించడానికి ఎన్ని పన్నాగాలు పన్నాడు. వాటిని ఈ చిన్న బాలిక ఏవిధంగా తిప్పికొట్టింది. గ్రామం మొత్తం కావాలనుకునేంత ఆ గొడుగులో ఏముంది అనేది తెలుసుకోవాలంటే ఈ పుస్తకం చదవాల్సిందే. కేవలం ముప్పై పేజీలు ఉండే ఈ నవల హిమాచల్ ప్రదేశ్ లోని గ్రామీణ వాతావరణాన్ని అనుభూతి చెందేలా చేస్తుంది.

అవును... అతను ప్రకృతి కోసం పాటుపడుతున్నాడు







పచ్చని చెట్లు, చల్లని గాలి, పారే సెలయేరు, పరుగులు పెట్టే జంతువులు.... ఇవన్నీ ప్రకృతి మనకు అందించే వనరులు. వీటిని కలకాలం కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిదీ. ప్రకృతికి మనం చూపించాల్సిన కృతజ్ఞత అది. ఈ పనిని తలకెత్తుకొని, పర్యావరణ పరిరక్షణకు పాటుపడుతున్నాడు ఓ యువకుడు. బాల్యం నుంచే దీక్షతో ఈ పని కొనసాగిస్తున్నాడు.

ఉత్తర ఐర్లాండ్ ప్రాంతానికి చెందిన దారా మెక్‌అనాల్టీ పర్యావరణ ప్రచారకుడు, రచయిత. ఇతను ప్రకృతి శాస్త్రవేత్త కూడా. అంటే మొక్కల్ని ఎందుకు నాటాలి, దాని వల్ల కలిగే సరికొత్త లాభాలేమిటి, మన చుట్టూ ఉండే జంతువులు, పక్షుల గురించి మనకెంత తెలుసు, వాటితో ఎలా మెలగాలి వంటి అంశాలపై పరిశోధనలు చేస్తూ ఉంటాడు. ఐదో ఏట అతనికి ఆటిజం ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. దీంతో అతని ప్రపంచం చిన్నదైపోయింది. ఎక్కడికీ వెళ్లకుండా తన ఇంటి పరిసరాల్లోనే గడిపేవాడు. ఇంట్లోనే ఉంటూ రకరకాల విషయాలు నేర్చుకునేవాడు. ఆ సమయంలో తన చుట్టూ ఉండే పరిసరాలను గమనించిన మెక్‌అనాల్టీ వాటిపై ఆసక్తి పెంచుకున్నాడు. పర్యావరణ పరిరక్షణ గురించి అనేక విషయాలు తెలుసుకుంటూ ఉండేవాడు.

ఆ తర్వాత మెల్లగా తన పరిసరాల్లో మొక్కలు నాటి సంరక్షించడం, చుట్టూ ఉన్నవారిని పర్యావరణం గురించి వివరించడం మొదలుపెట్టాడు. ఈ సమయంలో ఇతర ఎన్జీవోలతో కలిసి పనిచేయడం మొదలుపెట్టాడు. తన 14వ ఏట 2020లో 'Diary of a Young Naturalist' అనే పుస్తకం రాశాడు. ఆటిజంతో ఉన్న ఓ టీనేజర్ తన చుట్టూ ఉన్న ప్రకృతితో ఎలా మమేకమవుతాడన్నది అందులోని అంశం. ఈ పుస్తకం అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకోవడమే కాకుండా, ఎన్నో ప్రతిష్ఠాత్మక పురస్కారాలు అందుకుంది. అనంతరం మెక్‌అనాల్టీ అనేక పత్రికల్లో కాలమ్స్ రాయడం మొదలుపెట్టాడు.

ఆ తర్వాత 2021లో 'Wild Child: A Journey Through Nature' అనే మరో పుస్తకం రాశాడు. ఇది కూడా అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొంది అతనికి విశేషమైన పేరు తెచ్చింది. ప్రపంచంలో పర్యావరణవేత్తలకు ఇచ్చే 'రాయల్ సొసైటీ ఫర్ ది ప్రొటెక్షన్ ఆఫ్ బర్డ్స్'(ఆర్ఎస్పీబీ) పురస్కారం సైతం అందుకున్నాడు. ఈ అవార్డు అందుకున్న అతి చిన్నవయసు వ్యక్తిగా మెక్‌అనాల్టీ రికార్డు సాధించాడు. కేవలం పుస్తకాలు రాసి వదిలేయకుండా తనకు వీలైనంతమేర పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాల్లో పాల్గొంటున్నాడు. అనేక పర్యావరణ ఎన్జీవోల్లో మెక్‌అనాల్టీ సభ్యుడు. వారితో కలిసి పలు ప్రాంతాలు సందర్శిస్తుంటాడు. దీంతోపాటు ఆటిజంతో బాధపడేవారి హక్కుల కోసం మాట్లాడుతుంటాడు. జీవశాస్త్రవేత్త కావడం తన లక్ష్యమని, జీవితాంతం మెక్ అనాల్టీ ఒడిలో గడిపేయడం తనకు ఇష్టమని వివరిస్తున్నాడు.

కోళ్లు సూర్యోదయానికి ముందే ఎలా కూస్తాయి?

ఇప్పుడంటే మొబైల్ ఫోన్స్, వాచీలు ఉన్నాయి కాబట్టి టైం తెలుసుకోవడం చాలా సులభతరం అయింది. కొన్ని సంవత్సరాలు వెనక్కి వెళ్తే సాంకేతికంగా ఇంత వద్ది లేదు. మొబైల్స్, గోడ గడియారాలు ఉన్నా అవి పరిమితంగానే ఉండేవి. మరీ ముఖ్యంగా గ్రామాల్లో ఐతే ఇటువంటి సదుపాయాలు ఏమి లేకపోయినా తెల్లవారు జామునే లేచి వారి రోజువారీ పనులు మొదలుపెట్టే వాళ్ళు. వాళ్ళు వేకువజామునే అంత నిక్కచ్చిగా లేవడానికి కోడి కూతే కారణం అంటే నమ్ముతారా? అవును కోళ్ల ప్రతీరోజు సూర్యోదయానికి ముందే కూయడం మొదలు పెడతాయి. వాటికి సమయం ఎలా తెలుస్తుందని కదా మీ అనుమానం. శాస్త్రవేత్తల పరిశోధనల ప్రకారం కోళ్ళలో 'జీవ గడియారం (Circadian Rhythm) కారణంగా అవి మనుషులకంటే నలభై అయిదు నిమిషాల ముందే వెలుతురుని చూడగలవంట. అందుకే అవి మనకన్నా ముందే లేచి, వెలుతురు వస్తుందన్న సంకేతాన్ని కొక్కరకో అని కూస్తూ మిగతా జీవులకు చేరవేస్తాయి.



• కథ

ఎంగిలి విస్తరాకులు



మాధవ రాజ్యాన్ని శూరసేన మహారాజు పాలించేవారు. ఆయన మంత్రి బృహస్పతి మేధావి. రాజ్యానికి ఏ కష్టం వచ్చినా తన ఆలోచనతో దాన్ని ఎదుర్కొనేవాడు.

కొంతకాలానికి శూరసేనుడికి వేగుల ద్వారా ఓ వార్త అందింది. పక్కనే ఉన్న మైథిలి రాజ్యం తమ రాజ్యంపై దండెత్తేందుకు సిద్ధంగా ఉందని, మరో రెండు రోజుల్లో ఆ సేన రావొచ్చని. మైథిలి రాజ్యానికి తమకన్నా ఎక్కువ సైనిక బలం ఉంది. ఆ రాజ్యం తమ మీద దండెత్తితే తమకు ఓటమి తప్పదు అని శూరసేనుడు కలవరపడ్డాడు. ఏం చేయాలో పాలుపోక మంత్రి బృహస్పతికి పరిస్థితిని వివరించాడు.

'మరో రెండు రోజులుంది కదా, ఏమీ భయం లేదు' అని అభయమిచ్చాడు బృహస్పతి. వెంటనే సిబ్బందిని పిలిచి, రాజ్యంలోని ఒక్కొక్క ఇంటివారు రెండు రోజుల్లో వంద విస్తరాకులు కుట్టి ఇచ్చేలా చూడమని ఆదేశాలు జారీ చేశాడు. ఒక్కో ఇంటికి వంద విస్తరాకులు కుట్టడం సులభమే కాబట్టి అందరూ సంతోషంగా ఆ పని చేసి విస్తరాకుల్ని కోటకు పంపారు.

వేలాది సంఖ్యలో వచ్చిన విస్తరాకుల్ని చూసి బృహస్పతి సంతోషపడ్డాడు. వెంటనే కోటలోని సేవకులందరినీ పిలిచి, ఆ విస్తరాకులకు పెరుగు, పచ్చడి పూసి కోట బయట పడేయమన్నారు. అందరూ ఆయన చెప్పినట్లే చేశారు. ఈలోపు బృహస్పతి మారువేషం వేసుకొని మైథిలి రాజ్యసేనలకు ఎదురువెళ్లాడు. అతనెవరో గుర్తుపట్టని మైథిలి సైన్యం మాధవ రాజ్య కోటకు దారి ఎటు అని అడిగారు.

'అదిగో అక్కడే' అని కోటను చూపించాడు బృహస్పతి. కోట బయట వేలాదిగా పడి ఉన్న ఎంగిలి విస్తరాకుల్ని చూసి వారంతా ఆశ్చర్యపోయారు. అదంతా ఏమిటని బృహస్పతిని అడిగారు.

'అదా? నేను వంటవాణ్ని. ఇవాళ కోటలో సైన్యానికి ప్రత్యేకంగా విందుభోజనం ఏర్పాటు చేశారు రాజుగారు. వేలాది మంది సైన్యానికి వంట చేయడానికి వందలాది మంది వంటవాళ్లు కావాలి కదా? అందుకే నన్ను పిలిచారు. అబ్బో.. ఏం జనం..ఏం జనం. వేలమంది. ఒక్కొక్కడు భీముడిలా ఉన్నాడు, బకాసురుడిగా తిన్నాడు. వాళ్ల చేతిలో పడితే శత్రువులకు చావే' అని అంటూ అక్కడి నుంచి వెళ్లిపోయాడు బృహస్పతి.

ఇదంతా విన్న మైథిలి రాజ్య సేనకు వణుకు పుట్టింది. ఇప్పుడు తాము దండెత్తితే తమకు ఓటమి తప్పదని భావించి వచ్చిన దారినే తిరుగుప్రయాణమయ్యారు. తన ఎత్తు పారినందుకు బృహస్పతి, రాజ్యానికి ముప్పు తప్పినందుకు శూరసేనుడు ఆనందపడ్డారు.



• మహనీయులు

తెలుగువారి ఉక్కు మనిషి

జమలాపురం కేశవరావు



పిల్లలూ! సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్‌ని 'భారతదేశ ఉక్కు మనిషి' అంటారని తెలుసు కదా? అలాగే మన తెలుగువారికీ ఓ 'ఉక్కు మనిషి' ఉన్నారన్న సంగతి మీకు తెలుసా? ఆయనే జమలాపురం కేశవరావు. ఆయన వీరోచిత పోరాటాలకు గుర్తుగా 'దక్కన్ సర్దార్' అని ఆయన్ని పిలుచుకుంటారు. ఆయన గురించి తెలుసుకుందాం.

కేశవరావు ఖమ్మం జిల్లా (నాటి వరంగల్ జిల్లా)లోని ఎర్రుపాలెంలో 1908 సెప్టెంబర్ 3న జన్మించారు. తల్లిదండ్రులు జమలాపురం వెంకటరామారావు, వెంకటనరసమ్మ. ఆయనది సంపన్న జమీందారీ కుటుంబం. అయినా చిన్ననాటి నుంచి ఆయన సాధారణ జీవితాన్నే ఇష్టపడేవారు. అప్పట్లో తెలంగాణ ప్రాంతమంతా నిజాం ఏలుబడిలో ఉండేది. జనం ఎన్నో ఇబ్బందులు పడేవారు. ఆ పరిస్థితులను ఆయన గమనిస్తూ ఉండేవారు. హైదరాబాదు నిజాం కళాశాలలో చదువుతున్న సమయంలో కేశవరావు స్వాతంత్య్ర ఉద్యమం పట్ల ఆకర్షితులయ్యారు. వందేమాతరం గీతాలాపనను నిషేధించినందుకు నిరసనగా విద్యార్థులను కూడగట్టి నిరసన తెలిపారు. వెట్టి చాకిరితో కష్టాలు పడుతున్న ప్రజలను విముక్తం చేయడానికి వరంగల్, కరీంనగర్ జిల్లాల్లో కాలినడకన పర్యటించారు. 1923లో రాజమండ్రిలో మొదటిసారి గాంధీ ఉపన్యాసాన్ని విని ఉత్తేజితులయ్యారు. తెలంగాణలోని ప్రతి పల్లెలో గ్రంథాలయ ఉద్యమాన్ని ప్రచారం చేశారు. 'హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్' స్థాపనలో కీలకపాత్ర వహించి, దానికి మొదటి అధ్యక్షుడయ్యారు. సత్యాగ్రహ దీక్ష చేశారంటూ 18 నెలలు జైలు శిక్ష విధించినా పోరాటాలను మానలేదు. 1942లో మేరకు 'క్విట్ ఇండియా' ఉద్యమాన్ని తెలంగాణలో ఊరూరా ప్రచారం చేశారు. ఆయన పోరాట పటిమ చూసి జనం ఆయన్ను 'ఉక్కు మనిషి', 'సర్దార్' అని పిలిచేవారు. నిజాం సంస్థానం భారతదేశంలో విలీనమైన తరువాత 1952లో కేశవరావు రాజ్యసభకు ఎన్నికయ్యారు. అనారోగ్యంతో 1953 మార్చి 29న 46వ ఏట మరణించారు.

బిజినెస్ రీల్

మేక్‌మైట్రిప్ చేతికి ట్రిప్.కామ్ వాటా

3.4 కోట్ల క్లాస్ బి షేర్ల కొనుగోలు

న్యూఢిల్లీ: ట్రావెల్ బుకింగ్ ప్లాట్‌ఫామ్ మేక్‌మైట్రిప్‌లో చైనా సంస్థ ట్రిప్.కామ్‌కున్న 3.4 కోట్ల క్లాస్ బి షేర్లను తిరిగి కొనుగోలు చేసినట్లు మేక్‌మైట్రిప్ తాజాగా వెల్లడించింది. తద్వారా సంస్థలో ట్రిప్.కామ్ వోటింగ్ పవర్‌ను భారీగా తగ్గించినట్లు పేర్కొంది. వెరసి మేక్‌మైట్రిప్‌లో ట్రిప్.కామ్ వాటా 45.34 శాతం నుంచి 16.9 శాతానికి క్షీణించినట్లు వెల్లడించింది. కాగా.. షేర్ల తాజా కొనుగోలు నేపథ్యంలో ట్రావెల్ బుకింగ్ ప్లాట్‌ఫామ్ బోర్డులో ట్రిప్.కామ్ నామినేటెడ్ డైరెక్టర్ల సంఖ్య ఐదు నుంచి రెండుకు తగ్గినట్లు తెలియజేసింది. 2025 జులై 2న ట్రిప్.కామ్ గ్రూప్‌నకు చెందిన 3,43,72,221 క్లాస్ బి షేర్ల కొనుగోలుకి పూర్తి చేసినట్లు మేక్‌మైట్రిప్ వెల్లడించింది.

రాజ్ పెట్రో కొనుగోలుతో షెల్ జోరు

దేశీయంగా కార్యకలాపాల విస్తరణ



న్యూఢిల్లీ: గ్లోబల్ ఎనర్జీ దిగ్గజం షెల్ ఇటీవల ముంబై కంపెనీ రాజ్ పెట్రో స్పెషాలిటీస్‌ను కొనుగోలు చేసింది. తద్వారా ప్రపంచంలోనే మూడో పెద్ద లూబ్రికెంట్స్ మార్కెట్ భారత్‌లో కార్యకలాపాలను మరింత విస్తరించనుంది. దేశీయంగా షెల్ ఎల్ఎన్‌జీ దిగుమతి టెర్మినల్స్, రెనెవబుల్ ఎనర్జీ, టెక్నాలజీ సెంటర్లకు ఫ్యూయల్ స్టేషన్లు తదితర కార్యకలాపాలను నిర్వహిస్తోంది. ఇందుకు ఇప్పటికే 5 బిలియన్ డాలర్లు ఇన్వెస్ట్ చేసింది. కాగా.. రాజ్ పెట్రోలో జర్మన్ సంస్థ బ్రెన్‌టాగ్ గ్రూప్ నుంచి 100 శాతం వాటాను సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే. చెన్నై, సిల్వాసాలలో తయారీ యూనిట్లు కలిగిన రాజ్ పెట్రో ట్రాన్స్‌ఫార్మర్ ఆయిల్స్, పెట్రోలియం జెల్లీలు, వైట్ ఆయిల్స్ తదితర వివిధ ప్రొడక్టులను రూపొందిస్తోంది. 8 దశాబ్దాలకుపైగా చరిత్రగల రాజ్ పెట్రోను 2017-18లో బ్రెన్‌టాగ్ చేజిక్కించుకుంది. మహారాష్ట్రలోని తలోజాలో లూబ్రికెంట్ ఆయిల్ బ్లెండింగ్ ప్లాంటును షెల్ నిర్వహిస్తోంది. రాజ్ పెట్రో కొనుగోలు ద్వారా వృద్ధిలో ఉన్న ఫార్మాస్యూటికల్స్, వ్యక్తిగత సంరక్షణ, విద్యుత్ ప్రసారం, వైట్ ఆయిల్స్ తదితర రంగాలలో కొత్త ప్రొడక్టులను ప్రవేశపెట్టేందుకు వీలు చిక్కనున్నట్లు షెల్ పేర్కొంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

05-07-2025

విశాఖ	560-00
చిత్తూరు	633-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	535-00
విజయవాడ	570-00
రిటైల్ ధర (డజను)	78.00
హైదరాబాద్	560-00
వరంగల్	562-00
రిటైల్ ధర	6.20

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
BAJFINANCE	926	1.74
DRREDDY	1,310.00	1.45
INFY	1,639.70	1.3
HINDUNILVR	2,341.30	1.21
ICICIBANK	1,443.00	1.2

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
TRENT	5,487.00	-11.37
TATASTEEL	163.1	-1.69
EICHERMOT	5,625.50	-1.58
INDUSINDBK	854.5	-0.92
MARUTI	12,647.00	-0.82

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	6,624
ఎన్ఎస్ఈ	88,821
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,27,576
ఎఫ్ఐఐ	- 760
డీఐఐ	- 1,029

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	66.49 (రాత్రి 11.30కు)	$ 67.00 (క్రితం ముగింపు)
బ్రెంట్	68.51 (రాత్రి 11.30కు)	$ 68.08 (క్రితం ముగింపు)



మెట్రోల్లోనే క్విక్ కామర్స్ జూమ్

- నాన్ మెట్రోల్లో నత్తనడకనే
- రెడ్‌సీర్ సంస్థ అధ్యయనం

న్యూఢిల్లీ: క్విక్‌కామర్స్ రంగం శరవేగంగా వృద్ధి సాధిస్తున్నప్పటికీ.. మెట్రోలకు వెలుపల పట్టణాల్లో లాభదాయకమైన విస్తరణ పరంగా ఇబ్బందులు ఎదుర్కొంటోందని మార్కెట్ పరిశోధనా సంస్థ రెడ్‌సీర్ తెలిపింది. క్విక్‌కామర్స్ సంస్థల స్థూల వస్తు విక్రయ విలువ (జీఎంవీ)లో నాన్ మెట్రోలు 20 శాతం వాటానే భర్తీ చేస్తున్నట్టు పేర్కొంది. తక్కువ డిమాండ్, డిజిటల్ పరిణతి తక్కువగా ఉండడం, స్థానిక షాపింగ్ అలవాట్లను రెడ్‌సీర్ నివేదిక ప్రస్తావించింది. 2025 మొదటి ఐదు నెలల్లో క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూసినప్పుడు క్విక్ కామర్స్ సంస్థల ఆదాయం 150 శాతం వృద్ధి చెందినట్టు తెలిపింది. డార్క్ స్టోర్లను పెద్ద ఎత్తున ప్రారంభించడం, వివిధ విభాగాల్లోకి దూకుడుగా ఎంట్రీ ఇవ్వడం, తీవ్రమైన పోటీ ఈ వృద్ధికి నేపథ్యాలుగా వివరించింది. టాప్-10-15 పట్టణాల వెలుపల ఒక్కో డార్క్‌స్టోర్‌కు వచ్చే రోజువారీ ఆర్డర్ల తగ్గుదల వేగంగా ఉందని వెల్లడించింది. 1,000 దిగువకు ఆర్డర్లు తగ్గాయని.. టాప్15కు తదుపరి టాప్ 20 పట్టణాల్లో డార్క్ స్టోర్ వారీ ఆర్డర్లు 700 దిగువకు తగ్గినట్టు తెలిపింది. ఇది డిమాండ్ బలహీనతను తెలియజేస్తున్నట్టు పేర్కొంది. ఆన్‌లైన్ సంస్థల పట్ల నమ్మకం తక్కువగా ఉండడం, డిజిటల్ టెక్నాలజీల పట్ల అవగాహన తక్కువగా ఉండడం ఆర్డర్లు పరిమితంగా ఉండడానికి కారణంగా పేర్కొంది. జనాభా కూడా తక్కువగా ఉండడాన్ని గుర్తు చేసింది. క్విక్‌కామర్స్ సంస్థలు ఆఫర్ చేసే వస్తు శ్రేణి స్థానికుల అభిరుచులకు అనుగుణంగా ఉండకపోవడాన్ని పేర్కొంది.

దీనికితోడు ఈ ప్రాంతాల్లో స్థానిక రిటైల్ స్టోర్లకు, ప్రజలకు మధ్య ఉండే బలమైన సంబంధాలను ప్రస్తావించింది. దీంతో మెట్రోలతో పోల్చితే నాన్ మెట్రోల్లో ఒక్కో డార్క్‌స్టోర్ లాభం-నష్టాల్లేని స్థితి రావడానికి రెట్టింపు సమయం తీసుకుంటున్నట్టు వెల్లడించింది.

హైబ్రిడ్ పునరుత్పాదక ఇంధన శక్తిగా టాటా పవర్

- భవిష్యత్తులో అణు విద్యుత్‌లోకి ప్రవేశం
- సంస్థ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్



న్యూఢిల్లీ: టాటా పవర్ అచ్చమైన సోలార్, పవన విద్యుత్ సంస్థ నుంచి పూర్తిస్థాయి హైబ్రిడ్ పునరుత్పాదక ఇంధన రంగ శక్తిగా అవతరిస్తుందని సంస్థ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ ప్రకటించారు. అణు విద్యుత్ అభివృద్ధిని సైతం భవిష్యత్తులో చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నట్టు చెప్పారు. టాటా పవర్ 106వ వార్షిక వాటాదారుల సమావేశాన్ని ఉద్దేశించిన ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా కంపెనీ భవిష్యత్తు ప్రణాళికలను వెల్లడించారు. విద్యుదుత్పాదన, అమలు దశలో కలిపి మొత్తం 25 గిగావాట్ల సామర్థ్యాన్ని కంపెనీ 2024-25లో అధిగమించినట్టు చెప్పారు. ఇందులో 65 శాతం శుద్ధ, పర్యావరణ అనుకూల ఇంధనాల నుంచే ఉన్నట్టు తెలిపారు. ఇటీవలి ఎయిర్ ఇండియా ప్రమాదంలో ప్రయాణికులు ప్రాణాలు కోల్పోవడం పట్ల విచారం వ్యక్తం చేశారు. టాటా గ్రూప్ దశను మలుపు తిప్పిన దివంగత గౌరవ చైర్మన్ రతన్ టాటా సేవలను సైతం ఈ సందర్భంగా స్మరించుకున్నారు. గత ఆర్థిక సంవత్సరంలో టాటా పవర్ పునరుత్పాదక, హైడ్రో పవర్ ప్రాజెక్టులకు సంబంధించి భూటాన్ డ్రక్‌తో వ్యూహాత్మక ఒప్పందం చేసుకోవడం గమనార్హం. గత ఆర్థిక సంవత్సరంలోనే తమిళనాడులోని తిరునల్వేలిలో ఏర్పాటు చేసిన 4.3 గిగావాట్ల సోలార్ సెల్, మాడ్యూల్ తయారీ ప్లాంట్‌ను సంస్థ ప్రారంభించింది. రూ.4,800 కోట్ల విలువ చేసే విద్యుత్ పంపిణీ ప్రాజెక్టులను సైతం దక్కించుకుంది.

జీడీపీ వృద్ధి 6.4–6.7 శాతం

- జీఎస్టీ మూడు శ్లాబులకు తగ్గాలి
- సీఐఐ కొత్త అధ్యక్షుడు రాజీవ్‌మెమానీ



న్యూఢిల్లీ: దేశ జీడీపీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2025-26) 6.4-6.7 శాతం మేర వృద్ధి చెందుతుందని భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) అంచనా వేసింది. భౌగోళిక రాజకీయ అనిశ్చితుల రిస్కు నెలకొన్నప్పటికీ, బలమైన దేశీ డిమండ్ వృద్ధికి మద్దతుగా నిలుస్తుందని సీఐఐ ప్రెసిడెంట్ రాజీవ్ మెమాని అభిప్రాయపడ్డారు. సీఐఐ కొత్త అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం మెమానీ మీడియాతో మాట్లాడారు. రుతుపవనాలు మెరుగ్గా ఉంటాయన్న అంచనాలు, వ్యవస్థలో నగదు లభ్యత పెంచే దిశగా ఆర్‌బీఐ రేట్ల తగ్గింపు నిర్ణయాలు ఆర్థిక వృద్ధికి మద్దతుగా నిలుస్తాయని చెప్పారు. నగదు నిల్వల నిష్పత్తి (సీఆర్ఆర్)ని ఒక శాతం, రెపో రేటును అరశాతం తగ్గిస్తూ ఆర్‌బీఐ జూన్ మొదట్లో నిర్ణయం ప్రకటించడం తెలిసిందే. సీఆర్ఆర్ తగ్గించడం వల్ల వ్యవస్థలోకి రూ.2.5 లక్షల కోట్ల నిధుల లభ్యత పెరగనుంది. విదేశీ వాణిజ్యపరమైన రిస్కులున్నాయంటూ.. అవి తటస్థం చెందుతాయని అంచనా వేస్తున్నట్టు మెమానీ చెప్పారు. భౌగోళిక రాజకీయ అనిశ్చితులు వృద్ధికి ప్రతికూలంగా మారినా దేశీ డిమాండ్ ఆదుకుంటుందన్నారు.

జీఎస్టీ మరింత సరళం..

మూడు సులభతర శ్లాబులతో జీఎస్టీని మరింత సులభంగా మార్చాలని మెమానీ కోరారు. నిత్యావసరాలను 5 శాతం రేటు కింద, విలాసవంతమైన, హానికర వస్తువులను 28 శాతం రేటులో, మిగిలిన వస్తువులన్నింటినీ 12-18 శాతం మధ్య ఒక రేటు కిందకు తీసుకురావాలని సూచించారు. 28 శాతం రేటు అమలవుతున్న సిమెంట్ తదితర కొన్నింటిని తక్కువ రేటు కిందకు తీసుకురావాలన్నారు. అలా చేయడం ఆర్థిక వృద్ధికి ఊతమిస్తుందని అభిప్రాయపడ్డారు. పెట్రోల్, విద్యుత్, రియల్ ఎస్టేట్, ఆల్కహాల్‌ను జీఎస్టీ పరిధిలోకి తీసుకొచ్చేందుకు దేశవ్యాప్త ఏకాభిప్రాయం అవసరమన్నారు.

ఉక్కు దిగుమతులను కట్టడి చేయండి

ప్రభుత్వానికి జిందాల్ స్టెయిన్‌లెస్ ఎండీ జిందాల్ విజ్ఞప్తి



న్యూఢిల్లీ: చౌక ఉక్కు దిగుమతుల నుంచి దేశీ పరిశ్రమలను కాపాడే దిశగా ప్రభుత్వం మెరుగైన చర్యలు తీసుకుంటున్నా, దీనితో పాటు మరింత రక్షణాత్మక విధానాలు కూడా అమలు చేయాలని జిందాల్ స్టెయిన్‌లెస్ ఎండీ, ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ అభ్యుదయ్ జిందాల్ కేంద్రాన్ని కోరారు. అత్యంత తక్కువగా ఉత్పత్తి చేసే అమెరికా, యూరప్‌లోని దేశాలు కూడా రక్షణాత్మక చర్యలు తీసుకుంటున్నాయని జిందాల్ చెప్పారు. దేశీ డిమాండ్‌కి సరిపడేంత ఉక్కును ఉత్పత్తి చేసేంత సామర్థ్యం మనకు ఉందని ఆయన తెలిపారు. పరిశ్రమ అవసరాలకు అవసరమైన ఏ తరహా ఉక్కునైనా ఉత్పత్తి చేసే సత్తా దేశీ పరిశ్రమలకు ఉందని ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా తెలిపారు. ప్రస్తుతం దేశీయంగా ఉక్కు ఉత్పత్తి సామర్థ్యం 7.5 మిలియన్ టన్నులుగా ఉండగా వినియోగ రేటు 60 శాతంగా ఉంటోంది. డిమాండ్‌తో పాటు పాలసీపరంగా ప్రోత్సాహం ఉంటే దీన్ని మరింతగా పెంచుకునేందుకు అవకాశం ఉందని జిందాల్ చెప్పారు. ఒకవైపు దేశీయంగా ఉత్పత్తి సామర్థ్యాలను పూర్తిగా వినియోగించుకోకపోగా, దిగుమతి చేసుకున్న ఉక్కును 30 శాతం మేర వినియోగిస్తున్న నేపథ్యంలో స్టెయిన్‌లెస్ స్టీల్ పరిశ్రమలో పెట్టుబడులపై ప్రభావం పడే అవకాశం ఉందని ఆయన తెలిపారు. మార్కెట్ రీసెర్చ్ సంస్థ బిగ్‌మింట్ ప్రకారం గత ఆర్థిక సంవత్సరంలో ఉక్కు దిగుమతులు 1.73 మిలియన్ టన్నులకు పెరిగాయి. చైనా, ఇండొనేషియా, వియత్నాం, దక్షిణ కొరియా నుంచి అత్యధిక దిగుమతి అవుతున్నాయి.

మహిళా సిబ్బందితో హైదరాబాద్‌లో ఏబీఎస్ఎల్ఐ బ్రాంచ్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: జీవిత బీమా సంస్థ ఆదిత్య బిర్లా లైఫ్ ఇన్సూరెన్స్ (ఏబీఎస్ఎల్ఐ) తాజాగా హైదరాబాద్‌లో పూర్తిగా మహిళా సిబ్బందితో బ్రాంచీని ప్రారంభించింది. ఈ ఏడాది ప్రారంభంలో ముంబైలో ఈ తరహా ఆల్-ఉమెన్ బ్రాంచీని ప్రారంభించగా, ఇది రెండోదని వివరించింది. దీనితో హైదరాబాద్‌లో తమ శాఖల సంఖ్య 7కు, దేశవ్యాప్తంగా 433కి చేరిందని కంపెనీ ఎండీ కమలేష్ రావు తెలిపారు. మహిళా అడ్వైజర్లకు సహాయకరంగా ఉండేలా ఈ శాఖలో కిడ్స్ రూమ్‌లాంటి సదుపాయాలు కూడా ఉంటాయని వివరించారు.

బ్యాంకింగ్‌కు సంస్కరణల దన్ను

- వికసిత భారత్ లక్ష్యం సాకారానికి తోడ్పాటు
- ఐబీఏ సీఈవో అతుల్ కుమార్ గోయెల్



న్యూఢిల్లీ: సర్వీసులను మెరుగుపర్చుకోవడం, బ్యాంకింగ్ సేవలను మరింతగా అందుబాటులోకి తెచ్చేందుకు ఉద్దేశించిన ఈఏఎస్ఈ సంస్కరణలు, వికసిత భారత్ లక్ష్య సాధన దిశగా ప్రభుత్వ రంగ బ్యాంకులు ముందంజ వేసేందుకు తోడ్పడ్డాయని ఐబీఏ సీఈవో అతుల్ కుమార్ గోయెల్ తెలిపారు. చిన్న, మధ్య తరహా సంస్థలకు (ఎంఎస్ఎంఈ) చేరువ కావడం, పరిశ్రమ సామర్థ్యాలను పెంపొందించుకోవడం, రుణ లభ్యతను పెంచడం వంటి అంశాలకు ఇవి దోహదపడ్డాయని మైక్రో బ్లాగింగ్ సైట్ ఎక్స్‌లో ఆయన పోస్ట్ చేశారు. ప్రభుత్వ రంగ బ్యాంకులు (పీఎస్‌బీ) జెన్ ఏఐ సన్నద్ధతను మెరుగుపర్చుకున్నాయని, డేటా గవర్నెన్స్..అనలిటిక్స్‌ను పటిష్టం చేసుకున్నాయని, కార్యకలాపాల విస్తరణ కోసం క్లౌడ్‌ను వినియోగిస్తున్నాయని, అలాగే ఖర్చులను తగ్గించుకుని నాణ్యతను పెంచుకునేందుకు డిజిటల్ ఆపరేటింగ్ విధానాలను పాటిస్తున్నాయని గోయెల్ చెప్పారు. పనితీరు మదింపు, శాస్త్రీయమైన విధంగా లక్ష్యాల నిర్దేశం, డేటా ఆధారంగా ఉద్యోగుల వినియోగం లాంటి అంశాలు ఉద్యోగుల ఉత్పాదకతను పెంచేందుకు తోడ్పడ్డాయన్నారు.

ఆట బొమ్మల ఉత్పత్తికి ప్రోత్సాహం

- త్వరలో కొత్త పథకం
- వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్

న్యూఢిల్లీ: పరిశ్రమతో సంప్రదింపుల అనంతరం దేశంలో ఆటబొమ్మల ఉత్పత్తిని (టాయ్స్) పెంచేందుకు త్వరలోనే ఓ పథకాన్ని ఖరారు చేయనున్నట్టు కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. టాయ్స్ తయారీకి, ఎగుమతులకు భారీ అవకాశాలున్నట్టు చెప్పారు. టాయ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (టీఏఐ) ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ప్రారంభించిన సందర్భంగా మంత్రి గోయల్ మాట్లాడారు. ప్రభుత్వం తీసుకొచ్చే పథకం ఎగుమతులకు ప్రోత్సాహకాల రూపంలో ఉండదని.. దేశీయంగా తయారీని పెంచేందుకు, ఉపాధి కల్పనకు ఊతమిస్తుందన్నారు. డిజైన్ సామర్థ్యాలు, నాణ్యతతో కూడిన తయారీ, బ్రాండ్ నిర్మాణానికి మద్దతు రూపంలో ఈ పథకం ఉంటుందని చెప్పారు. ఒకప్పుడు ఆటబొమ్మల కోసం దిగుమతులపైనే పూర్తిగా ఆధారపడగా.. ప్రస్తుతం దేశీయంగానే పెద్ద ఎత్తున ఉత్పత్తి చేయడంతోపాటు, 153 దేశాలకు ఎగుమతులు చేస్తున్నట్టు మంత్రి చెప్పారు. విధానపరమైన మద్దతు చర్యలు, నాణ్యతా ప్రమాణాల అమలు, స్థానిక తయారీ క్లస్టర్లను బలోపేతం చేయడం ద్వారా ఇది సాధ్యమైనట్టు వివరించారు.

140 కోట్ల జనాభా కలిగిన దేశం కావడంతో తయారీ కార్యకలాపాల విస్తరణతో సహజ ప్రయోజనం కలుగుతుందన్నారు. ఆటబొమ్మల ఎగుమతులను పెంచుకునేందుకు చక్కని బ్రాండింగ్, ఆకర్షణీయమైన ప్యాకింగ్, బలమైన డిజైన్‌పై దృష్టి సారించాలని పరిశ్రమకు గోయల్ సూచించారు. వినూత్నమైన ఆటబొమ్మల నమూనాలను అభివృద్ధి చేసిన స్టార్టప్‌లకు పీఎం ముద్రాయోజన కింద పెద్ద ఎత్తున నిధుల మద్దతు అందించినట్టు చెప్పారు.



ఐఆర్‌బీ ఇన్విట్ ఫండ్ పెట్టుబడులు

ఐఆర్‌బీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ట్రస్ట్ రోడ్ ప్రాజెక్టుల కొనుగోలు

న్యూఢిల్లీ: ఐఆర్‌బీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ట్రస్ట్ నుంచి మూడు రోడ్ ఆస్తుల(ప్రాజెక్టులు)ను కొనుగోలు చేసేందుకు యూనిట్ హోల్డర్స్ అనుమతించినట్లు ఐఆర్‌బీ ఇన్విట్ ఫండ్ తాజాగా పేర్కొంది. ఈ ఎస్‌పీవీలలో 100 శాతం ఈక్విటీ వాటా కొనుగోలుకి రూ. 8,450 కోట్లు వెచ్చించనున్నట్లు వెల్లడించింది. ఐఆర్‌బీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ డెవలపర్స్‌కు ప్రయివేట్ ఇన్విట్ సహచర సంస్థగా ఐఆర్‌బీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ట్రస్ట్ వ్యవహరిస్తోంది. మరోపక్క ఐఆర్‌బీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ డెవలపర్స్ స్పాన్సర్ చేసిన పబ్లిక్ ఇన్విట్ విభాగంగా ఐఆర్‌బీ ఇన్విట్ ఫండ్ నిలుస్తోంది. కాగా.. డీల్‌లో భాగంగా ఐఆర్‌బీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ట్రస్ట్ రూ. 8,450 కోట్ల ఎంటర్‌ప్రైజ్ విలువలో మూడు జాతీయ రహదారి ప్రాజెక్టులను ఐఆర్‌బీ ఇన్విట్ ఫండ్‌కు బదిలీ చేయనుంది. ఈ వివరాలను ఐఆర్‌బీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ డెవలపర్స్ ఇప్పటికే తెలియజేసింది. నిర్మించు, నిర్వహించు, బదిలీ చేయు(బీవోటీ) ప్రాతిపదికన ఏర్పాటు చేసిన ఈ మూడు హైవే ఆస్తుల జాబితాలో ఐఆర్‌బీ హాపూర్ మొరాదాబాద్ టోల్‌వే, కైతల్ టోల్‌వే, కిషన్‌గఢ్ గులాబ్‌పురా టోల్‌వే ఉన్నాయి.

ఎమ్‌క్యూర్‌లో బెయిన్ వాటా విక్రయం

2.4 శాతం విలువ రూ. 563 కోట్లు



న్యూఢిల్లీ: గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సంస్థ బెయిన్ క్యాపిటల్ తాజాగా ఎమ్‌క్యూర్ ఫార్మాస్యూటికల్స్‌లో దాదాపు 2.4 శాతం వాటా విక్రయించింది. ఓపెన్ మార్కెట్ లావాదేవీ ద్వారా షేరుకి రూ. 1,250.44 సగటు ధరలో 45 లక్షల షేర్లు అమ్మివేసింది. ఎన్ఎస్ఈ గణాంకాల ప్రకారం వీటి విలువ సుమారు రూ. 563 కోట్లుకాగా.. అనుబంధ సంస్థ బీసీ ఇన్వెస్ట్‌మెంట్స్ 4 ద్వారా 2.37 శాతం వాటాను విక్రయించింది. తాజా లావాదేవీ తదుపరి ఎమ్‌క్యూర్ ఫార్మాలో బెయిన్ క్యాపిటల్ వాటా 8.68 శాతం నుంచి 6.31 శాతానికి క్షీణించింది. అయితే వాటా కొనుగోలుదారుల వివరాలు వెల్లడికాలేదు. కాగా.. గతేడాది చివరి త్రైమాసికం(జనవరి-మార్చి)లో ఎమ్‌క్యూర్ రూ. 197 కోట్ల నికర లాభం ఆర్జించింది. అంతక్రితం ఏడాది(2023-24) ఇదే కాలంలో రూ. 121 కోట్ల లాభం మాత్రమే సాధించింది. ఇక ఆదాయం సైతం రూ. 1,771 కోట్ల నుంచి రూ. 2,116 కోట్లకు బలపడింది. ఎమ్‌క్యూర్ ఐపీవో ద్వారా గతేడాది జులైలో స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టయిన సంగతి తెలిసిందే.

వాటా విక్రయం నేపథ్యంలో ఎమ్‌క్యూర్ షేరు ఎన్ఎస్ఈలో 2.34 శాతం నష్టపోయి రూ. 1,250 వద్ద ముగిసింది.

ఐటీసీ ఎఫ్ఎంసీజీ అమ్మకాలు

4.6 %

- ఈ విభాగంలో 100 కొత్త ఉత్పత్తులు
- స్థానిక కంపెనీల నుంచి పోటీ తీవ్రతరం
- కంపెనీ వార్షిక నివేదికలో వెల్లడి




న్యూఢిల్లీ: ఐటీసీ సంస్థ తన ఎఫ్ఎంసీజీ ఉత్పత్తులపై వినియోగదారుల వ్యయం గత ఆర్థిక సంవత్సరంలో (2024-25) 4.6 శాతం పెరిగి రూ.34,000 కోట్లకు చేరుకున్నట్టు ప్రకటించింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఐటీసీ ఎఫ్ఎంసీజీ ఉత్పత్తులపై వినియోగదారుల వ్యయం 12 శాతం మేర పెరిగి రూ.32,500 కోట్లుగా ఉండడం గమనార్హం. గత ఆర్థిక సంవత్సరంలో ఎఫ్ఎంసీజీ విభాగంలో 100 కొత్త ఉత్పత్తులను ప్రవేశపెట్టినట్టు వార్షిక నివేదికలో తెలియజేసింది. బ్రాండెడ్ ప్యాకేజ్ ఫుడ్స్, సిగరెట్లు, వ్యక్తిగత సంరక్షణ ఉత్పత్తులు, విద్య, స్టేషనరీ, అగర్‌బత్తీ తదితర ఉత్పత్తుల్లో ఐటీసీ కార్యకలాపాలు నిర్వహిస్తుండడం తెలిసిందే. కంపెనీ మొత్తం ఎఫ్ఎంసీజీ విక్రయాల్లో 31 శాతం అధునిక ఛానళ్ల (క్విక్, ఈ కామర్స్) ద్వారానే వస్తున్నట్టు ఐటీసీ తెలిపింది. డిమాండ్ స్తబ్దుగా ఉందని, స్థానిక/ప్రాంతీయ సంస్థల నుంచి పోటీ తీవ్రతరమైనట్టు పేర్కొంది. ఆర్థిక సంవత్సరం ద్వితీయ ఆరు నెలల్లో ముడి సరుకుల ధరలు పెరగడం మార్జిన్లపై ప్రభావం చూపించినట్టు వివరించింది. 2024-25లో ఐటీసీ ఎఫ్ఎంసీజీ ఆదాయం రూ.21,982 కోట్లుగా ఉండడం గమనార్హం.

కొత్త ఉత్పత్తులు..

ఆరోగ్యం, పోషకాహారం, వ్యక్తిగత సంరక్షణ తదితర విభాగాల్లో 100 కొత్త ఉత్పత్తులను విడుదల చేసినట్టు ఐటీసీ తెలిపింది. విలువ ఆధారిత విభాగాల్లోకి అడుగుపెట్టడం ద్వారా భవిష్యత్తులో వృద్ధిని పెంచుకోనున్నట్టు విశ్వాసం వ్యక్తం చేసింది. స్థూల ఆర్థిక పరిస్థితులు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2025-26) స్థిరంగా ఉంటాయని, జీడీపీ వృద్ధి 6.5 శాతం స్థాయిలో ఉండొచ్చని ఐటీసీ అభిప్రాయపడింది. గ్రామీణ ప్రాంతాల్లో వినియోగం కోలుకోవడం, మంచి వర్షాలు, పట్టణ డిమాండ్‌లో మెరుగుదల, ద్రవ్యోల్బణం స్థిరపడడం, పన్ను మినహాయింపుల ప్రయోజనాలు ఇవన్నీ ఖర్చు చేసే ఆదాయాన్ని పెంచుతాయంటూ.. వీటిని సానుకూలతలుగా పేర్కొంది.

అమెరికా సీఈవో ఫోరంపై నాస్కామ్ కసరత్తు



న్యూఢిల్లీ: భారత్, అమెరికా టెక్ దిగ్గజాలు కలిసి పని చేసేలా ఓ వేదికను ఏర్పాటు చేస్తున్నట్లు దేశీ ఐటీ సంస్థల సమాఖ్య నాస్కామ్ వెల్లడించింది. జూలై 9న అమెరికా న్యూయార్క్‌లోని భారత కాన్సులేట్ కార్యాలయంలో యూఎస్ సీఈవో ఫోరంను ప్రారంభించనున్నట్లు వివరించింది. కొత్త ఆవిష్కరణలు, పాలసీలు, నిపుణులను తయారు చేసుకోవడం వంటి అంశాలపై అత్యున్నత స్థాయి లో సంప్రదింపులు నిర్వహించేందుకు ఇది తోడ్పడుతుందని నాస్కామ్ పేర్కొంది. ప్రవాస భారతీయులు, ప్రభుత్వం, పరిశ్రమ, ఇన్వెస్ట్‌మెంట్, మేధావులు, విద్యావేత్తలు మొదలైన వర్గాలను సమన్వయపర్చడం ద్వారా భారత్-అమెరికా టెక్ భాగస్వామ్యాన్ని పటిష్టపర్చేందుకు సహాయకరంగా ఉంటుందని తెలిపింది.



నవ శకానికి నాంది

- భారత్‌లో తొలి అంతర్జాతీయ జావెలిన్ టోర్నీ
- ఫేవరెట్‌గా బరిలోకి దిగనున్న నీరజ్ చోప్రా
- పోటీలో 12 మంది అథ్లెట్లు

రాత్రి 7 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

బెంగళూరు: భారత్‌లో తొలిసారి జరుగుతున్న అంతర్జాతీయ జావెలిన్ ఈవెంట్‌కు రంగం సిద్ధమైంది. శనివారం బెంగళూరు వేదికగా ప్రతిష్ఠాత్మక 'నీరజ్ చోప్రా క్లాసిక్' ఈవెంట్ జరగనుంది. భారత స్టార్ జావెలిన్ త్రోయర్, ఒలింపిక్స్‌లో రెండు పతకాలు సాధించిన నీరజ్ చోప్రా పేరిట నిర్వహిస్తున్న ఈ టోర్నీలో 12 మంది జావెలిన్ త్రోయర్లు పాల్గొంటున్నారు. తన పేరిట జరుగుతున్న ఈ టోర్నీలో నీరజ్ ఫేవరెట్‌గా బరిలోకి దిగుతున్నాడు. ఇటీవల పారిస్ డైమండ్ లీగ్, ఓస్ట్రావా గోల్డెన్ స్పైక్ టోర్నీల్లో టైటిల్స్ నెగ్గిన 27 ఏళ్ల నీరజ్ చోప్రా... హ్యాట్రిక్ టైటిల్‌పై గురిపెట్టాడు. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో స్వర్ణం, 2024 పారిస్ ఒలింపిక్స్‌లో రజతంతో పాటు... ప్రపంచ చాంపియన్‌షిప్ స్వర్ణాలు, డైమండ్ లీగ్ టైటిల్స్, ఆసియా క్రీడలు, కామన్వెల్త్ క్రీడల్లో పతకాలు ఇలా అంతర్జాతీయ స్థాయిలో దాదాపు అన్నీ టోర్నీల్లో నీరజ్ సత్తా చాటాడు. ఇప్పుడు స్వదేశంలో నిర్వహిస్తున్న 'నీరజ్ చోప్రా క్లాసిక్' ఈవెంట్‌లో కూడా అదే పరంపర కొనసాగించాలని భావిస్తున్నాడు. దేశంలో అథ్లెటిక్స్‌కు మరింత ఊతం ఇచ్చేందుకు ఈ టోర్నీ దోహదపడుతుందన్న నీరజ్... యువ అథ్లెట్లు దీని నుంచి స్ఫూర్తి పొందితే సంతోషిస్తానని వెల్లడించాడు. ఈ ఏడాది తొలిసారి 90 మీటర్ల మార్క్ అందుకున్న నీరజ్... అదే ప్రదర్శన పునరావృతం చేయాలని అభిమానులు ఆశిస్తున్నారు. మే నెలలో దోహా వేదికగా జరిగిన పోటీల్లో నీరజ్ తన అత్యుత్తమ ప్రదర్శన నమోదు చేసుకొని ఫుల్ జోష్‌లో ఉన్నాడు. భారత్‌లో నీరజ్ ఓ టోర్నీలో పాల్గొననుండటం ఏడాది విరామం తర్వాత ఇదే మొదటి సారి.

భారత్‌లో ఇదే తొలిసారి..

భారత అథ్లెటిక్స్ సమాఖ్య, ప్రపంచ అథ్లెటిక్స్ సమాఖ్య, జేఎస్‌డబ్ల్యూ స్పోర్ట్స్ సంయుక్త ఆధ్వర్యంలో నీరజ్ చోప్రా పర్యవేక్షణలో ఈ ఈవెంట్ జరుగుతోంది. ప్రస్తుతానికి ఈ ఈవెంట్‌లో జావెలిన్ త్రో పోటీలు మాత్రమే జరుగుతుండగా... భవిష్యత్తులో దీన్ని మరింత విస్తృతం చేయాలని నీరజ్ భావిస్తున్నాడు. ప్రతి ఏటా దీన్ని నిర్వహించడంతో పాటు మరిన్ని క్రీడాంశాలను జతచేసే ఆలోచన ఉన్నట్లు వెల్లడించాడు. ముందస్తు షెడ్యూల్ ప్రకారం మే 24న హర్యానాలోని పంచకులలో ఈ ఈవెంట్ నిర్వహించాలని నిర్ణయించగా... అంతర్జాతీయ ప్రసారదారుల విజ్ఞప్తి మేరకు దీన్ని బెంగళూరుకు మార్చారు. అనంతరం సరిహద్దు ఉద్రిక్తతల నేపథ్యంలో ఈవెంట్ తేదీ సైతం మారింది. ప్రపంచ అథ్లెటిక్స్ సమాఖ్య దీనికి 'ఎ' కేటగిరీ గుర్తింపునివ్వగా... భారత్‌లో జరుగుతున్న తొలి అంతర్జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీ ఇదే కావడం విశేషం. అయితే ఈవెంట్ ప్రారంభానికి ముందే పలువురు స్టార్ అథ్లెట్లు వేర్వేరు కారణాల వల్ల టోర్నీ నుంచి వైదొలిగారు. గ్రెనడాకు చెందిన రెండుసార్లు ప్రపంచ చాంపియన్ అండర్సన్ పీటర్స్ గాయం కారణంగా పోటీలకు దూరం కాగా... భారత్‌కు చెందిన కిషోర్ జెనా సైతం గాయంతో టోర్నీకి దూరమయ్యాడు.

నేడు 'నీరజ్ చోప్రా క్లాసిక్' ఈవెంట్



జూలియస్ యెగో, థామస్ రోలెర్, నీరజ్ చోప్రా, సచిన్ యాదవ్

వరల్డ్ అథ్లెటిక్స్‌కు సన్నాహకంగా

ఈ ఏడాది సెప్టెంబర్‌లో టోక్యో వేదికగా ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ జరగనుండగా... దానికి ఇది సన్నాహకంగా ఉపయోగపడనుంది. మొత్తం 12 మంది అథ్లెట్లు ఈ పోటీల్లో పాల్గొంటుండగా... అందులో ఐదుగురు త్రోయర్లు ఇప్పటికే వరల్డ్ అథ్లెటిక్స్ అర్హత మార్క్ (85.50 మీటర్లు) అందుకున్నారు. పాకిస్తాన్‌కు చెందిన ఒలింపిక్ చాంపియన్ అర్షద్ నదీమ్‌ను కూడా ఈ ఈవెంట్‌కు ఆహ్వానించగా... అతడు వ్యక్తిగత శిక్షణకు ఇబ్బంది కలుగుతుందనే ఉద్దేశంతో పాల్గొనబోవడం లేదని ప్రకటించాడు. ఆ తర్వాత ఇరు దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో ఆ ఊసే లేకుండా పోయింది. 2016 రియో ఒలింపిక్స్ చాంపియన్ థామస్ రోలెర్ (జర్మనీ), ప్రపంచ మాజీ చాంపియన్ జూలియస్ యెగో (కెన్యా), కర్టిస్ థామ్సన్ (అమెరికా) నుంచి నీరజ్‌కు ప్రధాన పోటీ ఎదురయ్యే అవకాశం ఉంది. అయితే యెగో, రోలెర్ ప్రస్తుతం ఫామ్‌లో లేరు. మార్టిన్ కొనెస్నీ (చెక్ రిపబ్లిక్), లూయిజ్ మౌరిసియో డా సిల్వా (బ్రెజిల్), రమేశ్ పతిరగే (శ్రీలంక), సిప్రియన్ మిర్జిగ్లాడ్ (పోలాండ్) సంచలనం నమోదు చేయాలని చూస్తున్నారు. భారత్ నుంచి నీరజ్ చోప్రాతో పాటు సచిన్ యాదవ్, యశ్‌వీర్ సింగ్, రోహిత్ యాదవ్, సాహిల్ సిల్వాల్ బరిలో దిగనున్నారు. ప్రస్తుతం దిగ్గజ కోచ్ జాన్ జెలెజ్నీ వద్ద నీరజ్ శిక్షణ తీసుకుంటున్నాడు.

బరిలో ఉన్నది వీరే

నీరజ్ చోప్రా (భారత్)
సిప్రియన్ మిర్జిగ్లాడ్ (పోలాండ్)
లూయిజ్ మౌరిసియో డా సిల్వా (బ్రెజిల్)
థామస్ రోలెర్ (జర్మనీ)
కర్టిస్ థామ్సన్ (అమెరికా)
మార్టిన్ కొనెస్నీ (చెక్ రిపబ్లిక్)
జూలియస్ యెగో (కెన్యా)
రమేశ్ పతిరగే (శ్రీలంక)
సచిన్ యాదవ్ (భారత్)
రోహిత్ యాదవ్ (భారత్)
సాహిల్ సిల్వాల్ (భారత్)
యశ్ వీర్ సింగ్ (భారత్)



విజేతకు బహుకరించనున్న ట్రోఫీ

ఇలాంటి టోర్నమెంట్ మనదేశంలో జరగాలని ఎప్పటి నుంచో కలలు కంటున్నా. ఇప్పుడు దానికి సమయం ఆసన్నమైంది. కల నెరవేరినట్లు అనిపిస్తోంది. చాలా ఉత్సాహంగా ఉన్నా. ఒలింపిక్స్‌లో దేశం కోసం పతకాలు సాధించా. ఇప్పుడు దేశానికి తిరిగి ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నా. ఇది భారత యువ అథ్లెట్లకు, అభిమానులకు ఆనందం పంచుతుందనుకుంటున్నా. భారత అథ్లెటిక్స్‌లో నూతన అధ్యాయానికి ఇది నాంది. ఈ ఈవెంట్ ఇంత భారీ స్థాయిలో నిర్వహించేందుకు తోడ్పడిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు. మనదేశంలో అంతర్జాతీయ పోటీలకు ఇది శుభారంభం. భవిష్యత్తులో ఇలాంటి మరెన్నో టోర్నీలు జరగాలి. జర్మనీలో వారానికి ఒకటి చొప్పున కేటగిరి 'ఎ', 'బి', 'సి'పోటీలు జరుగుతుంటాయి. మనం కూడా ఆ స్థాయికి చేరాలి. అప్పుడు దేశంలో క్రీడా సంస్కృతి పెరుగుతుంది. మెరుగైన ప్రదర్శన చేసేందుకు ప్రయత్నిస్తా. అందుకోసం కఠోర సాధన చేస్తున్నా. ఈ పోటీల తర్వాత ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ కోసం ప్రాక్టీస్ ప్రారంభిస్తా. జావెలిన్‌ను విసిరే సమయంలో మరింత నియంత్రణ అవసరం. ప్రస్తుతం దానిపై దృష్టి పెట్టా. **-నీరజ్ చోప్రా**

ఆస్ట్రేలియా 286 ఆలౌట్

వెస్టిండీస్ తొలి ఇన్నింగ్స్ 174/7

సెయింట్ జార్జెస్: మిడిలార్డర్ రాణించడంతో వెస్టిండీస్‌తో జరుగుతున్న రెండో టెస్టులో ఆస్ట్రేలియా మంచి స్కోరు చేయగలిగింది. ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో 66.5 ఓవర్లలో 286 పరుగులకు ఆలౌటైంది. వెబ్‌స్టర్ (115 బంతుల్లో 60; 6 ఫోర్లు, 1 సిక్స్), వికెట్ కీపర్ అలెక్స్ కేరీ (81 బంతుల్లో 63; 10 ఫోర్లు, 1 సిక్స్) హాఫ్ సెంచరీలతో రాణించడంతో ఆసీస్ కోలుకుంది. విండీస్ బౌలర్లలో అల్జారీ జోసెఫ్ 4, జైడెన్ సీల్స్ రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన వెస్టిండీస్... శుక్రవారం కడపటి వార్తలు అందేసరికి 48 ఓవర్లలో 7 వికెట్లకు 174 పరుగులు చేసింది. వందో టెస్టు ఆడుతున్న ఓపెనర్ క్రెయిగ్ బ్రాత్‌వైట్ (0) ఖాతా తెరవకుండానే వెనుదిరిగాడు. బ్రాండన్ కింగ్ (108 బంతుల్లో 75; 8 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధశతకంతో మెరవగా... జాన్ క్యాంప్‌బెల్ (52 బంతుల్లో 40; 5 ఫోర్లు 1 సిక్స్) ఫర్వాలేదనిపించాడు. ఆస్ట్రేలియా బౌలర్లలో హాజల్‌వుడ్, కమిన్స్, లయన్ తలా 2 వికెట్లు పడగొట్టారు.


అలెక్స్ కేరీ

కీస్ కథ ముగిసె...

మూడో రౌండ్‌లో ఓడిన ఆరో సీడ్ • ఒసాకా కూడా ఇంటిముఖం



లండన్: వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీలో స్టార్ ప్లేయర్ల నిష్క్రమణ పర్వం కొనసాగుతోంది. తాజాగా మహిళల సింగిల్స్ విభాగంలో ఆరో సీడ్, ఈ ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్ చాంపియన్ మాడిసన్ కీస్ (అమెరికా)... ప్రపంచ మాజీ నంబర్‌వన్, నాలుగు గ్రాండ్‌స్లామ్ టోర్నీల విజేత నయోమి ఒసాకా (జపాన్) మూడో రౌండ్‌లో ఇంటిముఖం పట్టగా... పురుషుల సింగిల్స్ విభాగంలో నాలుగో సీడ్ జాక్ డ్రేపర్ (బ్రిటన్) రెండో రౌండ్‌లోనే వెనుదిరిగాడు. శుక్రవారం జరిగిన మూడో రౌండ్ మ్యాచ్‌లో ప్రపంచ 104వ ర్యాంకర్, 37 ఏళ్ల లౌరా సిగెమండ్ (జర్మనీ) 6-3, 6-3తో మాడిసన్ కీస్‌పై సంచలన విజయం సాధించి తన కెరీర్‌లో తొలిసారి వింబుల్డన్ టోర్నీలో ప్రిక్వార్టర్ ఫైనల్ చేరుకుంది. 93 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో లౌరా తన సర్వీస్‌ను రెండుసార్లు కోల్పోయి ప్రత్యర్థి సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేసింది. కీస్ నాలుగు డబుల్ ఫాల్ట్‌లతో పాటు 31 అనవసర తప్పిదాలు చేసింది. మరో మ్యాచ్‌లో పావ్లీచెంకోవా (రష్యా) 3-6, 6-4, 6-4తో ఒసాకాను ఓడించి 2016 తర్వాత మరోసారి వింబుల్డన్ టోర్నీలో ప్రిక్వార్టర్ ఫైనల్ చేరుకుంది.

డ్రేపర్ అవుట్

పురుషుల సింగిల్స్ రెండో రౌండ్‌లో 2017 రన్నరప్ మారిన్ సిలిచ్ (క్రొయేషియా) 2 గంటల 39 నిమిషాల్లో 6-4, 6-3, 1-6, 6-4తో డ్రేపర్‌ను ఓడించాడు. మరో రెండో రౌండ్ మ్యాచ్‌లో వరల్డ్ నంబర్‌వన్ యానిక్ సినెర్ (ఇటలీ) 6-1, 6-1, 6-3తో వుకిచ్ (ఆస్ట్రేలియా)పై గెలిచాడు. శుక్రవారం జరిగిన పురుషుల సింగిల్స్ మూడో రౌండ్ మ్యాచ్‌ల్లో ఐదో సీడ్ టేలర్ ఫ్రిట్జ్ (అమెరికా) 6-4, 6-3, 6-7 (5/7), 6-1తో ఫొకీనా (స్పెయిన్)పై, 14వ సీడ్ రుబ్లెవ్ (రష్యా) 7-5, 6-2, 6-3తో మనారినో (ఫ్రాన్స్)పై నెగ్గి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టారు.

యూకీ జోడీ బోణీ

మిక్స్‌డ్ డబుల్స్ తొలి రౌండ్‌లో యూకీ బాంబ్రీ (భారత్)-జిన్‌యు జియాంగ్ (చైనా) జోడీ 6-3, 1-6, 7-6 (10/6)తో హారిసన్-నికోల్ మెలిచార్ (అమెరికా) ద్వయంపై గెలిచి రెండో రౌండ్‌కు చేరుకుంది.



ముందుకెవరు ఇంటికెవరు?

నేడు భారత్, థాయ్‌లాండ్ మహిళల ఫుట్‌బాల్ జట్ల మధ్య రసవత్తర పోరు • గెలిచిన జట్టే ఆసియా కప్‌కు అర్హత

చియాంగ్ మయ్ (థాయ్‌లాండ్): ఆసియా ఫుట్‌బాల్ సమాఖ్య (ఏఎఫ్‌సీ) మహిళల ఆసియా కప్ క్వాలిఫయర్స్‌లో భారత అమ్మాయిలకు అసలైన సవాల్ ఎదురవుతోంది. ర్యాంకింగ్‌లోనూ, పోటీలోనూ పటిష్ఠమైన థాయ్‌లాండ్‌తో 'ఢీ' కొట్టేందుకు సిద్ధమైంది. ఈ నేపథ్యంలో నేడు గ్రూప్ దశలోని ఆఖరి క్వాలిఫయింగ్ పోరు రసవత్తరంగా జరగనుంది. ఈ క్వాలిఫయింగ్ టోర్నీలో పాయింట్ల పరంగా, గోల్స్ పరంగా సమఉజ్జీలుగా ఉన్న ఇరు జట్లలో గెలిచిన జట్టే ఆసియా కప్ ఫుట్‌బాల్ టోర్నీకి అర్హత సాధిస్తుంది. ఏఎఫ్‌సీ ఆసియా కప్ టోర్నీ వచ్చే ఏడాది ఆస్ట్రేలియాలో జరుగుతుంది. ప్రస్తుత క్వాలిఫయర్స్‌లో సత్తా చాటుకున్నప్పటికీ థాయ్‌లాండ్‌పై ఏనాడూ గెలవని భారత్ ఈ చెత్త రికార్డును చెరిపేయాలన్నా... ఏఎఫ్‌సీ ఆసియా కప్‌కు అర్హత సాధించాలన్నా సర్వశక్తులు ఒడ్డాల్సిందే! గ్రూప్ 'బి'లో భారత్, థాయ్‌లాండ్ జట్లు ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ గెలిచాయి. ఇరాక్, తిమోర్-లెస్టే, మంగోలియాలపై గెలుపొందిన రెండు జట్లు ఇప్పుడు ఆఖరి లీగ్‌లో ఎదురుపడుతున్నాయి. ఆఖరి మెట్టులో గట్టెక్కితే మాత్రం ఆసియా కప్ ఆడే అవకాశం లభిస్తుంది. ఇదే జరిగితే 'ఫిఫా' మహిళల ప్రపంచకప్ (2027) క్వాలిఫికేషన్ టోర్నీ ఆడే జట్టుగా చరిత్రలో నిలుస్తుంది. అందుకేనేమో కోచ్ క్రిస్పిన్ ఛెత్రి థాయ్‌లాండ్‌తో మ్యాచ్‌పై గంపెడాశలు పెట్టుకున్నారు. ఈ విజయంతో వచ్చే ఆసియా కప్ బెర్త్‌తో భారత ఫుట్‌బాల్ ముఖచిత్రమే మారుతుందని అన్నారు. దేశ ఫుట్‌బాల్ క్రీడకే కొత్త ఊపిరినిస్తుందని చెప్పారు. గతంలో 2003లో అమ్మాయిల జట్టు ఆసియా కప్ ఆడింది. కానీ అప్పుడు ఏఎఫ్‌సీ క్వాలిఫయర్స్ లేవు. ఎట్టకేలకు మళ్లీ మూడేళ్ల క్రితం 2022లో ఆతిథ్య జట్టుగా ఆడే భాగ్యం భారత్‌కు లభిస్తే 'కరోనా' మహమ్మారి గద్దలా తన్నుకుపోయినట్లు టోర్నీనే తుడిచి పెట్టేసింది. కోవిడ్ వల్ల భారత్ ఆ ఏడాది టోర్నీని నిర్వహించలేకపోయింది. ఇప్పుడు మాత్రం క్వాలిఫయింగ్ టోర్నీలో చేసిన పోరాటంతో దర్జాగా అర్హత సాధించాలనుకుంటున్న భారత్‌కు శనివారం విషమ పరీక్ష ఎదురవుతోంది. 13-0తో మంగోలియాపై, 4-0తో తిమోర్ లెస్టేపై, 5-0తో ఇరాక్‌పై గెలిచిన భారత్ ప్రత్యర్థులకు ఒక్క గోల్ ఇవ్వకుండా ఘన విజయాలు సాధించింది. మరోవైపు థాయ్‌లాండ్ కూడా ఒక్క గోల్ ఇవ్వకుండానే జైత్రయాత్ర సాగించింది. ఈ ఆఖరి మజిలీనే ఇరు జట్లను ఒంటికాలుపై నిలబడేలా చేస్తుంది. సాధారణంగా గ్రూప్ దశలో షూటౌట్ నిర్వహించరు. అయితే ఇరు జట్లు సమఉజ్జీగా ఉండటంతో ఫలితం కోసం ఈ మ్యాచ్‌లో 'షూటౌట్' నిర్వహించడం ఖాయమైంది.

చెస్‌ను ఆస్వాదించలేకపోతున్నా

గుకేశ్ చేతిలో ఓటమి అనంతరం కార్ల్‌సన్ వ్యాఖ్య



జాగ్రెబ్: ప్రపంచ నంబర్‌వన్ మాగ్నస్ కార్ల్‌సన్ మునుపటిలా తాను చెస్ ఆడటాన్ని ఆస్వాదించలేకపోతున్నానని చెప్పాడు. ఓ దశాబ్దంపాటు ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్ టైటిల్‌ను నిలబెట్టుకున్న కార్ల్‌సన్ ఇటీవల భారత టీనేజ్ సంచలనం, ప్రపంచ చాంపియన్ దొమ్మరాజు గుకేశ్ చేతిలో ఓడిపోతున్నాడు. ఇక్కడ జరుగుతున్న సూపర్ యునైటెడ్ ర్యాపిడ్, బ్లిట్జ్ టోర్నీలో గురువారం రెండోసారి గుకేశ్ చేతిలో కంగుతిన్న తర్వాత మీడియాతో మాట్లాడుతూ ఆటపై ఆసక్తి తగ్గి బలహీన ప్లేయర్‌గా మారుతున్నానని వ్యాఖ్యానించాడు. అయితే ప్రపంచ చాంపియన్ గుకేశ్ అద్భుతంగా ఆడుతున్నాడని కితాబిచ్చాడు. అవకాశాల్ని ఒడిసిపట్టుకోవడం, సందర్భోచిత ఎత్తులు వేయడంలో అతని ఆటతీరు గొప్పగా ఉందన్నాడు. 'నిజాయితీగా చెప్పాలంటే... ఇప్పుడు నేను చెస్ ఆడటాన్ని ఏమాత్రం ఆస్వాదించలేకపోతున్నాను. ఎత్తులు, పైఎత్తులపై ఆసక్తి సన్నగిల్లుతోంది. చెస్ బోర్డు ముందు కూర్చొని ఆడేటపుడు నాలో ఎలాంటి అనుభూతి కలగడం లేదు. అందుకే ఆటలో పేలవంగా ఆడుతున్నాను' అని నార్వే సూపర్ స్టార్ అన్నాడు. 2013 నుంచి 2023 వరకు ప్రపంచ చెస్‌ను శాసించిన ఈ సూపర్ గ్రాండ్‌మాస్టర్ బరిలో ఉన్న పదేళ్ల టైటిల్‌ను నిలబెట్టుకోవడం విశేషం. రెండేళ్ల క్రితం కార్ల్‌సన్ స్వయంగా వైదొలగడంతోనే డింగ్ లిరెన్ (చైనా) చాంపియన్ అయ్యాడు. ఇతన్ని గతేడాది ఓడించిన గుకేశ్ సరికొత్త చాంపియన్‌గా అవతరించాడు.



అమెరికాలోని కాలిఫోర్నియా రాష్ట్రం సాన్ లూయిస్ ఒబిస్పో కౌంటీలో కార్చిచ్చుతో చెలరేగిన మంటలు, కమ్ముకున్న పొగ



ఉత్తర కొరియాలోని ఒన్సాన్-కల్మా రిసార్టులో తేలియాడే ప్లాస్టిక్ వాటర్ బాల్‌లో సరదాగా దొర్లుతున్న వారిని ఆటపట్టిస్తున్న జనం



జమ్మూకశ్మీర్‌లో అమర్‌నాథ్ యాత్ర కొనసాగుతోంది. ఇందులో భాగంగా శుక్రవారం గందెర్‌బల్ జిల్లా బల్టాల్ వద్దకు చేరిన తీర్థయాత్రికులు

అలా తప్పించుకున్నారు!

సైనికుడి వేషంలో రాజభవనాన్ని విడిచి... | గడ్డకట్టే మంచులో 2 వారాలు ట్రెక్కింగ్ చేసి.. | 23 ఏళ్ల వయసులో భారత్‌కు దలైలామా సాహస యాత్ర

టిబెట్ ఆధ్యాత్మిక గురువు, 14వ దలైలామా రేపు 90వ ఏట అడుగుపెట్టనున్నారు. ఆయన 66 ఏళ్లుగా భారత్‌లో ఆశ్రయం పొందుతున్న విషయం తెలిసిందే. 23 ఏళ్ల వయసులో భారత్‌లో అడుగుపెట్టిన ఆయన మరిక తిరిగి టిబెట్ వెళ్లనే లేదు. టిబెటన్లు బుద్ధుని అంశగా భావించి ఆరాధించే దలైలామా భారత్‌కు ఎందుకు వచ్చారు? బుల్లెట్లను, ద్రోహాన్ని తప్పించుకుని ఒక యువ టిబెటన్ ఆధ్యాత్మిక నాయకుడు మన దేశానికి ఎలా చేరుకున్నారు? గడ్డకట్టుకుపోయే వాతావరణంలో, కఠినమైన దారుల్లో రెండు వారాలు ఎలా ప్రయాణించారు? ఇది టిబెట్ రాజకీయ కల్లోలాన్ని తెలిపే కథ.

అది 1950ల చివరి కాలం. చైనా ఆక్రమణలతో టిబెట్ ఉక్కిరిబిక్కిరి అవుతోంది. 1951లో బలవంతంగా సంతకం చేయించిన పదిహేడు పాయింట్ల ఒప్పందం, చైనా నియంత్రణలో ఉన్న టిబెటన్ ప్రజలకు మతపరమైన స్వయంప్రతిపత్తిని హామీగా ఇచ్చింది. కానీ స్వయంప్రతిపత్తి ఒక భ్రమ అని త్వరలోనే తెలిసొచ్చింది. 13వ దలైలామా ముందే చెప్పినట్టుగా టిబెట్‌పైనే కాదు, వారి మతంపైనా దాడి జరిగింది. చైనా సైనికులు టిబెట్ రాజధాని లాసాలో స్వేచ్ఛగా తిరుగడం, బౌద్ధ సన్యాసుల భూములను స్వాధీనం చేసుకోవడంతో దలైలామా అధికారం క్షీణించడం ప్రారంభమైంది. రాజీ కోసం దలైలామా మధ్యవర్తిత్వం వహించడానికి ప్రయత్నించినా లాభం లేకపోయింది. 1959 నాటికి, ప్రతిఘటనలు నిరసనగా మారాయి. తమ ఆధ్యాత్మిక గురువును నిర్బంధిస్తారని, లేదంటే చంపుతారని టిబెట్ ప్రజలు భయపడ్డారు. ఊహించనట్టుగానే లాసాను చైనా సైనిక దళాలు, ట్యాంకులు, ఫిరంగులు చుట్టుముట్టాయి. అదే రోజు, లాసాలో దలైలామాను అంగరక్షకులు లేకుండా వారి సైనిక ప్రధాన కార్యాలయంలో జరిగే నృత్య ప్రదర్శనకు హాజరు కావాలని చైనా జనరల్ కోరాడు. వేలాది మంది టిబెటన్లు వీధుల్లోకి వచ్చి, దలైలామా వేసవి రాజభవనమైన లాసాలోని నార్బులింగకా చుట్టూ మానవహారంగా ఏర్పడ్డారు. రాజభవనంలో చర్చల తరువాత ఆ రాత్రి దలైలామా లాసాను విడిచి భారత్‌కు వెళ్లాలని నిర్ణయమైంది. మార్చి 17న పొగమంచు కమ్ముకున్న రాత్రి, ఎప్పుడూ మెరూన్ కలర్ దుస్తుల్లో ఉండే దలైలామా తనను ఎవరూ గుర్తు పట్టకుండా సైనికుడి యూనిఫాం ధరించారు. తల్లి, తోబుట్టువులు, ట్యూటరు, కొందరు విశ్వాసపాత్రులైన అధికారులు వెంట రాగా చీకటి నడుమ వెనుకద్వారం నుంచి రాజభవనాన్ని వీడారు. చైనా సైన్యం చెక్‌పోస్టులను తప్పించుకుంటూ వారి బృందం ముందుకు నడిచింది. ఎవరూ గుర్తుపట్టకుండా ఉండేందుకు ఎక్కువగా రాత్రిపూటే ప్రయాణించింది. చుషుల్, లోకా, కైచు లోయ గుండా, ఖెంజిమనే సమీపంలోని హిమాలయాలను దాటి, నేటి అరుణాచల్ ప్రదేశ్‌లోని తవాంగ్‌కు చేరుకుంది. గడ్డకట్టుకుపోయే వాతావరణం. ఆహారం లేదు. పరిస్థితి అధ్వాన్నంగా ఉంది. అయినా కెచు నది దాటి, ఎత్తైన లోయల గుండా, మఠాలు, తిరుగుబాటు శిబిరాల గుండా ముందుకు సాగారు. ఒకసారి చైనీస్ నిఘా విమానం వీరిపైనుంచే వెళ్లింది. కానీ దాన్నుంచి తప్పించుకున్నారు. ఎట్టకేలకు మార్చి 26న భారత సరిహద్దుకు మైళ్ల దూరంలో ఉన్న లుంట్సే జోంగ్‌కు చేరుకుంది. వెంటనే ప్రధాని నెహ్రూకు సమాచారం అందింది. అప్పటికే చైనా నుంచి హెచ్చరికలున్నప్పటికీ ఖాతరు చేయకుండా నెహ్రూ నిర్ణయాత్మకంగా వ్యవహరించారు. తవాంగ్ సమీపంలోని చుటాంగ్ము సరిహద్దు పోస్టుకు వెళ్లి, దలైలామా, ఇతర టిబెటన్ శరణార్థులకు స్వాగతం పలకాల్సిందిగా అస్సాం రైఫిల్స్‌ను ఆదేశించారు. మార్చి 31 నాటికి, దలైలామా, ఆయన పరివారం ఖెన్జిమనే పాస్ ద్వారా భారత్‌లోకి ప్రవేశించారు. భారత్, చైనాలను విడదీసే అంతర్జాతీయ సరిహద్దు మెక్‌మోహన్ రేఖ సమీపంలో ఒక చిన్న పోస్ట్ వద్ద అస్సాం రైఫిల్స్‌కు చెందిన భారత జవాను హవల్దార్ నరేన్ చంద్ర దాస్ కంటికి అలసిపోయి, నలిగిన దుస్తుల్లో ఉన్న ఓ వ్యక్తి సమీపించడం కనిపించింది. ఆయనే 14వ దలైలామా అని ఆయనకే కాదు.. చాలామంది భారతీయులకు తెలియదు. అలా దలైలామా భారత్‌లో అడుగు పెట్టారు. ఆ వెంటనే, 'టిబెటన్ ఆధ్యాత్మిక నాయకునికి భారత్‌లో ఉండేందుకు స్వాగతం'అంటూ నెహ్రూ నుంచి సందేశం వచ్చింది. దాస్‌తో పాటు ఇతర అస్సాం రైఫిల్స్ సిబ్బంది దలైలామా, ఆయన పరివారాన్ని తవాంగ్‌కు తీసుకెళ్లారు. అక్కడ వారికి వైద్యం అందించారు. తరువాత కొన్ని నెలలు ఆయన ముస్సోరీలో ఉన్నారు. అనంతరం హిమాచల్ ప్రదేశ్‌లోని ధర్మశాలకు వెళ్లారు. అప్పటినుంచీ అదే టిబెటన్ల ప్రవాస ప్రభుత్వ కేంద్రంగా మారింది.



1959లో భారత్‌లోకి అడుగుపెట్టిన దలైలామాకు అధికారుల స్వాగతం

స్వేచ్ఛను ఆస్వాదిస్తున్నా

దలైలామా సాహసోపేత భారత యాత్రకు ఆరు దశాబ్దాలు నిండాయి. 'నేను శరణార్థిని. అయినా భారత్‌లో స్వేచ్ఛను ఆస్వాదిస్తున్నాను'అని దలైలామా అనేక సందర్భాల్లో గుర్తు చేసుకున్నారు. అంతేకాదు, భారత్‌లో తనకు స్వాగతం పలికిన హవల్దార్ నరేన్ చంద్ర దాస్‌ను 2017లో కలిసి భావోద్వేగానికి లోనయ్యారు కూడా! అప్పటికి దాస్‌కు 79 ఏళ్లు కాగా దలైలామాకు 81 ఏళ్లు. ''నేను కూడా వృద్ధుడిని అయ్యానని మీ ముఖం చూస్తుంటే నాకర్థమైంది. 58 ఏళ్ల కిందట నాకు భారత్‌లో రక్షణగా నిలిచినందుకు ధన్యవాదాలు. చాలా సంతోషంగా ఉంది''అంటూ ఆ రోజులను గుర్తు చేసుకున్నారు. దలైలామాను అనుసరించి చాలామంది టిబెట్‌ను విడిచి భారత్‌కు చేరారు. కానీ టిబెట్ సమస్యకు ఇప్పటికీ పరిష్కారం లభించలేదు. 60 ఏళ్లకిందట సైనికుడి వేషంలో దలైలామా భారత్‌లో అడుగుపెట్టినప్పుడు టిబెట్ పరిస్థితి ఎలా ఉందో ఇప్పటికీ అలాగే ఉంది. లక్షలాది మంది టిబెటన్ల రాజకీయ, మత, సాంస్కృతిక జీవితాలపై ఇప్పటికీ కత్తి వేలాడుతూనే ఉంది.

- సాక్షి, నేషనల్ డెస్క్

6న దలైలామా 90వ జన్మదిన వేడుక

- కేంద్ర మంత్రి రిజిజు, హాలీవుడ్ నటుడు రిచర్డ్ గెరె హాజరు
- మెక్లియోడ్ గంజ్‌లో భారీ ఏర్పాట్లు

ధర్మశాల: టిబెటన్ల బౌద్ధ గురువు దలై లామా 90వ పుట్టిన రోజు వేడుకకు భారీగా ఏర్పాట్లు సాగుతున్నాయి. హిమాలయాల్లోని మెక్లియోడ్‌గంజ్ పట్టణంలోగల ప్రధాన దలై లామా ఆలయం ట్సుగ్లాంగ్‌ఖంగ్‌కు కాషాయ వస్త్రాలు ధరించిన బౌద్ధ భిక్షువుల తాకిడి పెరుగుతోంది. టిబెటన్ ప్రవాస ప్రభుత్వం ఇక్కడే కొలువై ఉన్నందున ఈ పట్టణాన్ని లిటిల్ లాసా అని కూడా పేర్కొంటారు. లామా పుట్టినరోజు వేడుకలతోపాటు ఇక్కడ పలు కార్యక్రమాలు జరగనున్నాయి. దలై లామా తదుపరి వారసుడిని సైతం ప్రకటించనున్నారు. దీంతో, ఇక్కడ జరిగే పరిణామాలను ప్రపంచమే ఆసక్తిగా గమనిస్తోంది. జూన్ 30వ తేదీ నుంచి ప్రారంభమైన వారోత్సవాల్లో మత సదస్సులు, యువజన వేదికలు, సామూహిక ప్రార్థనలు జరుగనున్నాయి. ఈ నెల 2 నుంచి 4వ తేదీ వరకు జరిగిన 15వ టిబెటన్ మత సదస్సుకు 100 మందికి పైగా టిబెటన్ బౌద్ధ నేతలు, ప్రతినిధులు హాజరయ్యారు. అదేవిధంగా, 3- 5వ తేదీల్లో జరుగుతున్న ఇంటర్నేషనల్ టిబెటన్ యూత్ ఫోరం సదస్సుకు 15 దేశాలకు చెందిన 100 మందికి పైగా తరలివచ్చారు. దలై లామా పుట్టిన రోజును పురస్కరించుకుని ఈ నెల 5న ప్రవాసంలోని టిబెటన్ ప్రభుత్వ కేబినెట్ 'కషగ్'ఆధ్వర్యంలో సామూహిక ప్రార్థనలు జరగనున్నాయి. ప్రధాన టిబెటన్ ఆలయంలో జరిగే ఈ కార్యక్రమానికి టిబెటన్ల తరఫున దలై లామా సైతం హాజరై ప్రార్థనల్లో పాల్గొంటారని సెంట్రల్ టిబెటన్ యంత్రాంగం తెలిపింది. టిబెటన్ల స్వాతంత్ర్య పోరాటాన్ని వివరించే షెన్‌పెన్ ఖిమ్‌సార్ దర్శకత్వం వహించిన '4 రివర్స్ 6 రేంజెస్'సినిమా ప్రదర్శన 5న సాయంత్రం ఉంటుందని పేర్కొంది.



ధర్మశాలలో ఏర్పాటు చేసిన దలైలామా కటౌట్

ప్రముఖులు హాజరు

జూలై 6న 14వ దలై లామా 90వ పుట్టిన రోజు వేడుకలు జరగనున్నాయి. ప్రత్యేకంగా జరిగే ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు, అరుణాచల్ సీఎం పెమా ఖండూ, సిక్కిం ముఖ్యమంత్రి ప్రేమ్ సింగ్ తమాల్, హాలీవుడ్ స్టార్ రిచర్డ్ గెరె తదితర ప్రముఖులు హాజరవుతున్నారు. ఈ సందర్భంగా తదుపరి దలై లామాను సైతం ప్రకటిస్తారు. జూలై 7–9వ తేదీల్లో టిబెటన్ కళలు, వైద్యం, సాహిత్యం, మతం, విద్య సంబంధిత ప్రదర్శనలుంటాయి. వైద్య శిబిరం సైతం నిర్వహిస్తారు. టిబెటన్ బౌద్ధులు దలై లామాను బుద్ధుని సజీవ రూపంగా ఆరాధిస్తారు. దలై లామా వారసత్వం కొనసాగుతుందని, గడెన్ ఫొడ్రంగ్ ట్రస్ట్‌కు మాత్రమే భవిష్యత్తు లామాను నిర్ణయించే అధికారం ఉందని, ఈ విషయంలో ఎవరూ జోక్యం చేసుకోరాదని దలై లామా బుధవారం స్పష్టం చేయడం తెల్సిందే. అయితే, వారసుడి నిర్ణయంపై తమ అనుమతి తప్పక ఉండాల్సిందేనని చైనా వాదిస్తోంది. ఈ నేపథ్యంలో చైనా పాలక కమ్యూనిస్ట్ పార్టీతో టిబెటన్ బౌద్ధమతం దశాబ్దాలుగా సాగిస్తున్న పోరాటంలో నూతన అధ్యాయం మొదలుకానుంది.

క్షమాపణ చెప్పండి.. పరిహారం చెల్లించండి

- కొల్హాపురి చెప్పుల డిజైన్ కాపీ చేసినందుకు ప్రాడాపై కేసు

ముంబై: సాంస్కృతిక ప్రాముఖ్యత ఉన్న కొల్హాపురి చెప్పుల డిజైన్‌ను అనుమతి లేకుండా వాడుకున్న ఫ్యాషన్ బ్రాండ్ ప్రాడాపై పిల్ దాఖలైంది. మేధో సంపత్తి హక్కుల రంగంలో పనిచేసే ముంబై, పూణేలకు చెందిన న్యాయవాదుల బృందం ఈ పిటిషన్‌ను దాఖలు చేసింది. 'కొల్హాపురి చప్పల్' ఏఐ ఉత్పత్తిని అనధికారికంగా ఉపయోగించడాన్ని అంగీకరిస్తూ, ప్రాడా గ్రూప్, ప్రాడా ఇండియా ఫ్యాషన్ ప్రైవేట్ లిమిటెడ్ బహిరంగ క్షమాపణ చెప్పాలని, భవిష్యత్తులో ఏఐలను అనధికారికంగా ఉపయోగించకుండా ఉండేలా చూడాలని పిటిషన్ కోరింది. భారతీయ కళాకారుల హక్కులను గుర్తించాలని డిమాండ్ చేసింది. కళాకారుల ప్రతిష్ట, ఆర్థిక నష్టానికి పరిహారం చెల్లించాలని కూడా పిటిషన్ కోరింది. జూన్ 22న ఇటలీలోని మిలన్‌లో జరిగిన అంతర్జాతీయ ఫ్యాషన్ ఈవెంట్.. స్ప్రింగ్ సమ్మర్ మెన్స్ కలెక్షన్-2026 సందర్భంగా 'కొల్హాపురి చప్పల్'ను ప్రాడా బ్రాండ్ ఉపయోగించింది. ఫ్యాషన్ షో వీడియోలు వైరల్ కావడంతో ఈ విషయం బయటికి వచ్చింది. ప్రదర్శనలో ప్రాడా మోడల్స్ ధరించిన పాదరక్షలు అచ్చం సంప్రదాయ కొల్హాపురి చెప్పుల మాదిరిగానే ఉన్నాయి. వాటి డిజైన్లకు శతాబ్దాల వారసత్వం కలిగిన సంప్రదాయ పాదరక్షల నుంచి ప్రేరణ పొందినట్టు ప్రాడా కూడా అంగీకరించింది.

విమాన ప్రమాద ప్రాంతంలో శరీర భాగాలు లభ్యం

- డీఎన్ఏ పరీక్ష ద్వారా సంబంధీకులకు అప్పగింత

అహ్మదాబాద్: అహ్మదాబాద్‌లో జూన్ 12వ తేదీన చోటుచేసుకున్న ఎయిరిండియా విమాన ప్రమాదంలో 260 మంది అసువులు బాయడం తెల్సిందే. ఘటన జరిగిన ప్రాంతంలో శకలాల మధ్య మరికొన్ని శరీర భాగాలు లభ్యం కావడంతో అధికారులు డీఎన్ఏ పరీక్షలు చేపట్టి గురువారం వాటిని సంబంధీకులకు అందజేశారు. జూన్ 27వ తేదీన చిట్టచివరి, 260 బాధితుడి మృతదేహాన్ని సంబంధీకులకు అందజేసినట్లు అహ్మదాబాద్ ప్రభుత్వ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రాకేశ్ జోషి తెలిపారు. ఈ ప్రమాదం పేలుడు లాంటి ఘటన అయినందున, శరీర భాగాలు చెల్లాచెదురుగా దూరంగా పడిపోయాయి. మృతదేహాలను అప్పగించే సమయంలోనే, మరిన్ని అవశేషాలు తర్వాత బయటపడే అవకాశం ఉందని మేం బాధిత కుటుంబాలకు చెప్పాం'అని ఆయన వివరించారు. 'అలా దొరికినట్లయితే, నిబంధనల మేరకు అంత్యక్రియలు జరిపించే అధికారాన్ని సంబంధీకుల్లో అత్యధికులు మాకు అప్పగించారు. 16 కుటుంబాల వారు మాత్రం దొరికిన శరీర భాగాలను అందజేయాలని కోరారు. ఆమేరకు వాటిని అందజేస్తున్నాం'అని ఆయన స్పష్టం చేశారు.

ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ సంస్థ మోసం

- ఎయిర్‌బస్‌కు ఇంజన్ అమర్చినట్లు తప్పుడు రికార్డులు
- నోటీసు జారీ చేసిన డీజీసీఏ

న్యూఢిల్లీ: ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ సంస్థ తీరుపట్ల డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్(డీజీసీఏ) ఆగ్రహం వ్యక్తంచేసింది. ఎయిర్‌బస్ ఏ320 విమానానికి ఇంజన్‌ను సకాలంలో మార్చడంలో విఫలమైనట్లు ఆక్షేపించింది. ఈ మేరకు ఈ ఏడాది మార్చి నెలలో ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్‌కు నోటీసు జారీ చేసింది. యూరోపియన్ యూనియన్‌కు సంబంధించిన ఏవియేషన్ సేఫ్టీ అథారిటీ నిబంధనల ప్రకారం ఎయిర్‌బస్ ఇంజన్‌ను నిర్దేశిత గడువులోగా మార్చాల్సి ఉంటుంది. పాత ఇంజన్‌ను తొలగించి, కొత్త ఇంజన్ బిగించాలి. ఇదేమీ చేయకపోయినా ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ సంస్థ మోసపూరితంగా వ్యవహరించినట్లు డీజీసీఏ గుర్తించింది. కొత్త ఇంజన్ అమర్చినట్లు తప్పుడు రికార్డులు సమర్పించారని తేల్చింది. నిబంధనలు ఉల్లంఘించినందుకు తదుపరి చర్యలకు సిద్ధంగా ఉండాలని ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్‌ను డీజీసీఏ హెచ్చరించినట్లు సమాచారం.



మణిపూర్‌లో భారీగా ఆయుధాలు స్వాధీనం

ఇంఫాల్: మణిపూర్‌లోని కొండప్రాంత జిల్లాలో భద్రతా బలగాలు చేపట్టిన ఆకస్మిక దాడుల్లో ఇన్సాస్ రైఫిళ్లు, సెల్ఫ్ లోడింగ్ రైఫిళ్ల(ఎస్ఎల్ఆర్)వంటి తుపాకులు సహా 200కు పైగా ఆయుధాలతోపాటు ఇంప్రొవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైజెస్(ఐఈడీలు) బయటపడ్డాయి. నిఘా వర్గాల సమాచారం మేరకు గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు టెంగ్‌నౌపల్, కంగ్‌పోక్పి, చందెల్, చురాచంద్‌పూర్ జిల్లాల్లో సోదాలు చేపట్టామని అదనపు డీజీపీ ఎల్‌హరి దోర్జి వెల్లడించారు. ఈ ఆపరేషన్‌లో పోలీసులతోపాటు అస్సాం రైఫిల్స్, ఆర్మీ, కేంద్ర సాయుధ బలగాలు పాల్గొన్నాయన్నారు. లభ్యమైన వాటిలో 21 ఇన్సాస్ రైఫిళ్లు, 11 ఏకే రైఫిళ్లు, 26 ఎస్ఎల్ఆర్‌లు, రెండు స్నైపర్లు, మూడు కార్బైన్లు, 17 .303 రైఫిళ్లు, రెండు ఎంపీ అసాల్ట్ రైఫిళ్లు, మూడు ఎం79 గ్రెనేడ్ లాంఛర్లు, 9 పిస్టళ్లు తదితరాలున్నాయని వివరించారు.

తోటి ప్రయాణికుడితో ఘర్షణ..భారత సంతతి వ్యక్తి అరెస్ట్

న్యూఢిల్లీ: అమెరికాలోని మియామి-ఫిలడెల్ఫియా విమానంలో తోటి ప్రయాణికుడితో గొడవకు దిగిన 21 ఏళ్ల భారత సంతతి వ్యక్తి ఇషాన్ శర్మను అధికారులు అరెస్ట్ చేశారు. ప్రయాణికుడిని కొట్టినందుకు కేసు నమోదు చేశారు. ఘర్షణ అనవసరంగా మొదలైందని కీన్ రీవ్స్ చెప్పాడు. విమానం ల్యాండైన వెంటనే అధికారులు శర్మకు సంకెళ్లు వేసి తీసుకెళ్లారు. అతడి ముఖంపై గాటు పడిందని, కొన్ని కుట్లు పడ్డాయని తెలిపారు. శర్మ, రీవ్స్ గొడవ పడుతుండగా తోటి ప్రయాణికులు వారిని ఆగాలంటూ కేకలు వేస్తున్న వీడియోలు బయటకు వచ్చాయి. శర్మ తన గొంతు పట్టుకుని నులిమాడని, చంపుతానంటూ బెదిరించాడని రీవ్స్ చెప్పాడు. స్వీయ రక్షణ కోసమే ప్రతి దాడికి దిగాల్సి వచ్చిందన్నారు. జైలు నుంచి శర్మను విడుదల చేయాలంటే 500 డాలర్ల పూచీకత్తు చెల్లించాల్సి ఉంటుంది.

షుగర్ డ్రింక్స్, మద్యం, పొగాకుపై...

పన్నుల మోత మోగించండి!

- తద్వారా వ్యాధులను తగ్గించండి
- ప్రపంచ దేశాలకు డబ్ల్యూహెచ్ఓ పిలుపు

నానాటికి మారుతున్న జీవన శైలి ప్రజలను రోగాల బారిన పడేస్తోంది. డయాబెటిస్, కేన్సర్‌వంటి దీర్ఘకాలిక వ్యాధులు పెరిగిపోతున్నాయి. వీటికి చెక్ పెట్టడానికి ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) కొత్త రకం ప్రతిపాదన చేసింది. ''చక్కెర పానీయాలు, మద్యం, పొగాకు ధరలు రాబోయే పదేళ్లలో కనీసం 50 శాతం పెరగాలి. వాటిపై ఆ మేరకు పన్నులు పెంచండి'' అని ప్రపంచ దేశాలకు పిలుపునిచ్చింది. స్పెయిన్‌లోని సెవిల్లెలో జరిగిన ఫైనాన్స్ ఫర్ డెవలప్‌మెంట్ సమావేశం ఈ మేరకు సిఫార్సు చేసింది. దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలను అరికట్టడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకుంది. వాటిపై పన్నులను మరింతగా పెంచితే మధుమేహం, కేన్సర్ తదితర వ్యాధులకు కారణమయ్యే హానికరమైన ఉత్పత్తుల వాడకాన్ని బాగా తగ్గించవచ్చని డబ్ల్యూహెచ్ఓ భావిస్తోంది. ''దేశాల దగ్గరున్న అత్యంత సమర్థమైన నియంత్రణ సాధనాల్లో పన్నులు ముఖ్యమైనవి. ప్రజారోగ్యమే లక్ష్యంగా చక్కెర పానీయాలు, మద్యం, పొగాకు వంటివాటి వాడకాన్ని పూర్తిగా తగ్గించే దిశగా చర్యలు తీసుకోవాల్సిన సమయం వచ్చేసింది'' అని డబ్ల్యూహెచ్ఓ హెల్త్ ప్రమోషన్, వ్యాధి నివారణ విభాగం అసిస్టెంట్ డెరెక్టర్ జనరల్ జెరెమీ ఫర్రార్ అన్నారు.

ఆ దేశాల్లో సత్ఫలితం

కొలంబియా, దక్షిణాఫ్రికా వంటి దేశాల్లో ఈ దిశగా చేసిన ప్రయోగం మంచి ఫలితాలిచ్చింది. అదనపు పన్నులతో పొగాకు తదితరాల ధరలు విపరీతంగా పెరగడంతో వాటి వాడకం బాగా తగ్గింది. అయితే డబ్ల్యూహెచ్ఓ సిఫార్సులను పొగాకు తదితర పరిశ్రమలు వ్యతిరేకిస్తున్నాయి. ''చక్కెర, తీపి పానీయాలపై పన్నుల వల్ల ఏ దేశంలోనూ ఆరోగ్య ఫలితాలు మెరుగుపడలేదు. ఊబకాయం వంటివి తగ్గలేదు. ఇలాంటి స్పష్టమైన ఆధారాలను డబ్ల్యూహెచ్ఓ విస్మరించడం ఆందోళనకరం'' అని ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఆఫ్ బెవరేజెస్ అసోసియేషన్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేట్ లోట్‌మాన్ విమర్శించారు. మరోవైపు, ఇది ప్రజారోగ్యం సాకుతో పన్నుల భారం పెంచే యత్నమని కూడా విమర్శలొస్తున్నాయి. పన్నులు పెంచడం ఆల్కహాల్ సంబంధిత హానిని నివారిస్తుందనడం పక్కదారి పట్టించడమేనని డిస్టిల్డ్ స్పిరిట్స్ కౌన్సిల్‌లో సైన్స్ అండ్ రీసెర్చ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అమండా బెర్గర్ ఆందోళన వ్యక్తం చేశారు. కానీ బ్లూంబర్గ్, ప్రపంచ బ్యాంకు, ఆర్గనైజేషన్ ఫర్ ఎకనామిక్ కో ఆపరేషన్ అండ్ డెవలప్‌మెంట్ మాత్రం పన్ను పెంపు ప్రతిపాదనను సమర్థించాయి. ఇందుకు ముందుకొచ్చే దేశాలకు తోడ్పడతామని చెప్పుకొచ్చాయి. 2012–22 మధ్య దాదాపు 140 దేశాలు పొగాకు ఉత్పత్తులపై పన్నులను 50 శాతం పైగా పెంచాయి. అల్ట్రా ప్రాసెస్డ్ ఆహార పదార్థాలపైనా పన్ను పెంచే యోచనలో ఉన్నాయి.

భారత్‌లో ఇలా...

భారత్‌లో కూడా కొవ్వు, చక్కెర, ఉప్పు అధికంగా ఉండే ఆహారాలపై ఆరోగ్య పన్ను విధించాలని వైద్య నిపుణుల నేతృత్వంలోని జాతీయ కన్సార్టియం సూచించింది. అంతేగాక పిల్లల ఆహార పదార్థాల మార్కెటింగ్‌పై కఠినమైన నియమాలు విధించాలని కోరింది. భారత్‌లో కౌమార దశలో ఉన్నవారిలో ఊబకాయం బాగా పెరుగుతుండటంపై ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ ఆందోళన వ్యక్తం చేశాయి. యువత ఆహారపు అలవాట్లను మార్చడానికి, మెరుగుపరచడానికి తక్షణం చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చింది. క్యాంటీన్లలో, విద్యా సంస్థల సమీపంలో కొవ్వు, చక్కెర, ఉప్పు అధికంగా ఉన్న ఆహార పదార్థాల విక్రయాన్ని నిషేధించాలని డిమాండ్ చేసింది.

- సాక్షి, నేషనల్ డెస్క్

ప్రతి రూపాయికి ప్రతిఫలం రూ.2.54..!

- ఇస్రోకు కేంద్రం కేటాయింపులపై మాజీ చీఫ్ సోమ్‌నాథ్

న్యూఢిల్లీ: దేశ అంతరిక్ష కార్యక్రమం ప్రభుత్వానికి మంచి ఆదాయం తెచ్చిపెడుతోందని భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) మాజీ చైర్మన్ ఎస్.సోమ్‌నాథ్ చెప్పారు. ఇస్రోలో పెట్టే ప్రతి రూపాయిపై రూ.2.54 మేర ఆదాయం వస్తోందని వెల్లడించారు. శుక్రవారం ఆయన 'ఆక్స్‌ఫర్డ్ ఇండియా బిజినెస్ ఫోరం'లో ప్రసంగించారు. బడ్జెట్ తక్కువే అయినప్పటికీ అద్భుతమైన సామర్థ్యం కలిగిన భారత అంతరిక్ష రంగం ప్రపంచ గుర్తింపు సాధించిందని ఆయన వివరించారు. 'మేం ఖర్చు చేసే ప్రతి రూపాయికి అందుతున్న ప్రతిఫలం రూ.2.54. బడ్జెట్‌లో పెద్దగా కేటాయింపులు లేకున్నా మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసుకుని, ఉపగ్రహాలను నిర్మించి విజయవంతంగా ప్రయోగించాం'అని తన హయాంలో అనుభవాన్ని ఆయన తెలిపారు. చంద్రయాన్–3 లూనార్ ల్యాండింగ్, ఆదిత్య ఎల్–1 మిషన్ వంటి ఇస్రో సాధించిన మైలురాళ్లు అంతరిక్ష అన్వేషణలో భారత్ సత్తాకు నిదర్శనాలని చెప్పారు.

ప్రైవేట్ రంగం గణనీయ వృద్ధి

ప్రైవేట్ అంతరిక్ష పరిశ్రమ గణనీయంగా అభివృద్ధి సాధించిందని సోమ్‌నాథ్ చెప్పారు. '2014కు పూర్వం ఈ రంగంలో దేశంలో ఒకే ఒక్క స్టార్టప్ కంపెనీ ఉండేది. ఇప్పుడవి 250కి పెరిగాయి. ఉపగ్రహాలు, రాకెట్లను నిర్మించడంతోపాటు కక్ష్యలోకి ప్రవేశపెట్టే దిశగా ముందుకు సాగుతున్నాయి. ఈ రంగంలో అనుబంధ కంపెనీలు కూడా పెరుగుతున్నాయి. ప్రపంచ అంతరిక్ష ఆర్థిక వ్యవస్థలో భారత్ తన వాటాను పెంచుకునేందుకు అనువైన వాతావరణం ఏర్పడుతోంది' అని సోమ్‌నాథ్ తెలిపారు. వచ్చే 25 ఏళ్లలో భారతీయుడిని చంద్రుడిపైకి పంపి, అక్కడ ల్యాండ్ చేయించడంతోపాటు తిరిగి తీసుకువచ్చే బృహత్తర ప్రణాళిక ఇస్రో వద్ద ఉందన్నారు. ఇందులో పునర్వినియోగ రాకెట్ల నిర్మాణం, భారతీయ అంతరిక్ష కేంద్రం ఏర్పాటు, అంతరిక్షంలోకి భారతీయులను పంపడం, చంద్రుడితోపాటు గురుగ్రహంపైకి అన్వేషణలను చేపట్టడం వంటివి కూడా ఉన్నాయని వివరించారు.

ఇతర దేశాలకు సైతం సాయం

నేపాల్, భూటాన్, ఒమన్, దక్షిణాఫ్రికాతోపాటు ఆసియాన్ దేశాల అంతరిక్ష అన్వేషణ సామర్థ్యాలను ప్రోత్సహించేందుకు, పెంచేందుకు భారత్ కృషి చేస్తోందన్నారు. పునర్వినియోగ ప్రయోగ వాహనాలను అభివృద్ధి చేయడం, పరిశోధన-అభివృద్ధి వ్యయాన్ని పెంచడం, వ్యూహాత్మక అంతరిక్ష రంగంలో మరింత పెట్టుబడి పెట్టవలసిన అవసరం ఎంతో ఉందన్నారు. అంతరిక్ష శాస్త్రం, సాంకేతికతలో భారత్‌ను అగ్ర స్థానానికి తీసుకెళ్లాలన్నదే ఇస్రో లక్ష్యమని సోమ్‌నాథ్ చెప్పారు.

సోషలిస్ట్ మమ్దానీకి విమర్శల తాకిడి

న్యూఢిల్లీ: న్యూయార్క్ నగరంలో ఆర్థిక అసమానతలను రూపుమాపుతానంటూ సోషలిస్ట్ తరహా వాగ్దానాలు చేస్తున్న మేయర్ అభ్యర్థి జొహ్రాన్ మమ్దానీ(33)పై విమర్శల దాడి పెరిగింది. భారతీయ మూలాలున్న మమ్దానీ తల్లిదండ్రులు మీరా నాయర్, మహమూద్ మమ్దానీల ఆస్తిపాస్తుల వివరాలనే అస్త్రాలుగా మార్చుకున్న విమర్శకులు..ఆయనకు సోషలిజం గురించి మాట్లాడే అర్హత లేదని దెప్పిపొడుస్తున్నారు. మమ్దానీ కుటుంబ నేపథ్యానికి, ఆయనిస్తున్న వాగ్దానాలకు పొంతనే లేదంటున్నారు. జొహ్రాన్ మమ్దానీకి ఉగాండాలో ఉన్న నాలుగెకరాల ప్లాట్ విలువే 2.50 లక్షల డాలర్ల ఖరీదుంటుందని, ఖరీదైన మన్‌హట్టన్ ప్రాంతంలో విలాస వంతమైన నివాస భవనముందని చెబుతున్నారు. మమ్దానీ కుటుంబానికి 10 లక్షల డాలర్ల దాకా విలువైన ఆస్తులున్నాయని ట్రంప్ తరఫున లారా లూమర్, మెఘన్ మెక్‌కెయిన్ తెలిపారు. ఉన్నత విద్య, పలుకుబడి కలిగిన కుటుంబం నుంచి వచ్చిన మమ్దానీకి సగటు ఉద్యోగికి ఉండే ఇబ్బందులేమీ లేవని, ఇటువంటి వ్యక్తి సామాన్యుల ఇబ్బందులను ఎలా తీరుస్తాడని వారు ప్రశ్నిస్తున్నారు. మేయర్ ఎన్నికలు మరో నాలుగు నెలలుండగా, మమ్దానీపై విమర్శలు ఇప్పటికే తీవ్ర రూపం దాల్చడం గమనార్హం.

74 వ రాజ్యాంగ సవరణ

పట్టణ, నగర పాలక సంస్థలు

పట్టణ స్థానిక ప్రభుత్వాలు

1. మునిసిపల్ కార్పొరేషన్
2. నోటిఫైడ్ ఏరియా కమిటీ
3. కంటోన్మెంట్ బోర్డ్ 4. పోర్ట్ ట్రస్ట్,
5. మునిసిపాలిటీ 6. టౌన్ ఏరియా కమిటీ
7. టౌన్‌షిప్, 8. ప్రత్యేక ప్రయోజన సంస్థలు

దేశంలో తొలిసారిగా 1687లో మద్రాస్‌లో మునిసిపల్ కార్పొరేషన్‌ను బ్రిటిష్‌వారు ఏర్పాటు చేశారు. 1726లో బాంబే, కలకత్తా కార్పొరేషన్లు ఏర్పడ్డాయి. 1992లో 74వ రాజ్యాంగ సవరణ ద్వారా పట్టణ స్థానిక ప్రభుత్వాలకు రాజ్యాంగ ప్రతిపత్తి కల్పించారు. 1993, జూన్ 1 నుంచి దేశవ్యాప్తంగా 74వ రాజ్యాంగ సవరణ అమల్లోకి వచ్చింది.

74వ రాజ్యాంగ సవరణ

పట్టణ స్థానిక ప్రభుత్వాలకు సంబంధించిన అంశాలను రాజ్యాంగంలో 'IXA' భాగంలో ప్రకరణ 243P నుంచి 243ZG వరకు పొందుపరిచారు.

- మునిసిపాలిటీ: 243Q ప్రకరణ కింద ఏర్పాటైన స్థానిక స్వపరిపాలన సంస్థ.
- పంచాయతీ: 243B ప్రకరణ కింద పంచాయతీగా ఏర్పడిన ప్రాంతం.
- జనాభా: చివరిసారిగా జనాభా లెక్కల సేకరణ జరిగి, నోటిఫై అయిన సందర్భంలో నిర్ధారించిన జనాభా.

243Q మునిసిపాలిటీల నిర్మాణం గురించి తెలుపుతోంది.

- గ్రామీణ ప్రాంతం నుంచి పట్టణ ప్రాంతంగా పరివర్తన చెందుతున్న ప్రాంతాన్ని నగర పంచాయతీగా గుర్తిస్తారు.
- చిన్న పట్టణాల్లో మునిసిపల్ కౌన్సిల్‌ను ఏర్పాటు చేస్తారు.
- పెద్ద పట్టణాల్లో మునిసిపల్ కార్పొరేషన్లు ఉంటాయి.
- పట్టణంగా పరివర్తన చెందుతున్న ప్రాంతం, చిన్న పట్టణం, పెద్ద పట్టణం వంటి అంశాలకు సంబంధించి రాష్ట్ర గవర్నర్ సరైన అర్థ వివరణ ఇస్తారు.

మునిసిపాలిటీ ఎన్నికలు

ప్రకరణ **243R** మునిసిపాలిటీల నిర్మాణం, ఎన్నికల గురించి తెలియజేస్తోంది.

- మునిసిపాలిటీ సభ్యులను (అన్ని స్థాయిల్లో) ఓటర్లు ప్రత్యక్షంగా ఎన్నుకుంటారు.
- మునిసిపాలిటీ సభ్యుల కూర్పు, అధ్యక్ష ఎన్నిక ప్రక్రియకు సంబంధించిన చట్టాలను రాష్ట్ర శాసన నిర్మాణ శాఖ రూపొందిస్తుంది.
- నగర పంచాయతీ, మునిసిపాలిటీ, కార్పొరేషన్ అధ్యక్షుల ఎన్నిక రాష్ట్ర శాసన నిర్మాణ శాఖ నిర్ణయించిన మేరకు ప్రత్యక్ష లేదా పరోక్ష పద్ధతిలో జరుగుతుంది.
- సంబంధిత మునిసిపాలిటీ, కార్పొరేషన్ ప్రాంతంలో ప్రాతినిధ్యం వహించే ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీలు హోదా రీత్యా సభ్యులుగా కొనసాగుతారు.

వార్డు కమిటీలు

- ప్రకరణ **243S** ప్రకారం 3 లక్షలు లేదా అంతకంటే ఎక్కువ జనాభా కలిగిన మునిసిపాలిటీల్లో ఒకటి లేదా అంతకంటే ఎక్కువ వార్డులను కలిపి వార్డు కమిటీలను ఏర్పాటు చేయొచ్చు.
- వార్డ్ కమిటీ ఏర్పడినప్పుడు సంబంధిత వార్డ్ ప్రతినిధిని ఆ కమిటీకి అధ్యక్షుడిగా నియమించాలి. రెండు లేదా అంతకంటే ఎక్కువ వార్డులతో వార్డు కమిటీ ఏర్పాటు చేస్తే ఆయా వార్డుల ప్రతినిధులు తమలో ఒకర్ని అధ్యక్షునిగా ఎన్నుకుంటారు.
- కార్పొరేషన్‌లో వార్డ్ కమిటీల సంఖ్య 50కి తగ్గకుండా, 100కి మించకుండా ఉండాలి.

రిజర్వేషన్స్

ప్రకరణ 243T రిజర్వేషన్ల గురించి పేర్కొంటుంది.

- ఎస్సీ, ఎస్టీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కేటాయించాలి.
- ఎస్సీ, ఎస్టీలకు కేటాయించిన స్థానాల్లో ఆయా వర్గాలకు చెందిన మహిళలకు 1/3 వంతు స్థానాలను రిజర్వ్ చేయాలి.
- మొత్తం స్థానాల్లో కనీసం 1/3 వంతు స్థానాలను మహిళలకు రిజర్వ్ చేయాలి.
- రిజర్వేషన్లను రొటేషన్ పద్ధతిలో కేటాయించాలి.
- రాష్ట్ర శాసన నిర్మాణ శాఖ బీసీలకు రిజర్వేషన్లు కల్పించే అధికారాన్ని కలిగి ఉంది.

పదవీ కాలం, అనర్హతలు

ప్రకరణ 243U పదవీ కాలం గురించి తెలుపుతోంది. అన్ని స్థాయిల్లోని సభ్యులు, అధ్యక్షుల పదవీకాల పరిమితి ఐదేళ్లు. ప్రకరణ 243V అనర్హతల గురించి పేర్కొంటోంది.

- పంచాయతీరాజ్ వ్యవస్థలో అన్ని స్థాయిల్లో అధ్యక్ష, సభ్యుల అర్హతలను నిర్ణయించే అధికారం రాష్ట్ర శాసన నిర్మాణశాఖకు ఉంటుంది.
- పార్లమెంటుకు, అసెంబ్లీలకు పోటీచేసే అభ్యర్థులకు వర్తించే అర్హత, అనర్హత నిబంధనలే స్థానిక సంస్థలకు పోటీ చేసే అభ్యర్థులకు కూడా వర్తిస్తాయి.
- స్థానిక సంస్థల్లో పోటీ చేసేందుకు కనీసం 21 ఏళ్లు ఉండాలి.
- 1995 సంవత్సరం తర్వాత ఇద్దరి కంటే ఎక్కువ సంతానం కలిగుంటే పోటీకి అనర్హులు.

అధికార విధులు

- ప్రకరణ **243W** అధికార విధుల గురించి వివరిస్తోంది.

12వ షెడ్యూల్‌లో 18 విధులను పట్టణ స్థానిక సంస్థలకు నిర్దేశించారు. వీటిని రాష్ట్ర ప్రభుత్వాలు బదిలీ చేస్తాయి. పన్నెండో షెడ్యూల్‌లో పేర్కొన్న 18 విధుల వివరాలు..

1. నగర ప్రణాళిక
2. సమర్థవంత భూ వినియోగం, భవన నిర్మాణాలపై నియంత్రణ
3. ఆర్థిక, సామాజిక అభివృద్ధి ప్రణాళికలు
4. మురికివాడల నిర్మూలన, అభివృద్ధి
5. పట్టణ అడవులు, పర్యావరణ పరిరక్షణ
6. రహదారులు, వంతెనలు
7. ప్రజారోగ్యం, మురుగు నీటిపారుదల, చెత్త నియంత్రణ
8. అగ్నిమాపక వ్యవస్థ
9. పరిశ్రమలకు, గృహాలకు నీటి వసతి
10. బలహీన వర్గాల సంరక్షణ, వికలాంగులకు వసతి.
11. వీధి దీపాలు, బస్టాండుల నిర్వహణ
12. కబేళాలపై నియంత్రణ
13. నగర దారిద్ర్య నిర్మూలన పథకాలు
14. విద్య, సాంస్కృతిక అభివృద్ధికి చర్యలు
15. జంతువుల సంరక్షణ
16. ఆట స్థలాలు, ఉద్యానవనాల నిర్వహణ
17. శ్మశాన వాటికల నిర్వహణ
18. జనన, మరణాల నమోదు



ఆదాయ వనరులు, హక్కులు

ప్రకరణ **243X** ప్రకారం స్థానిక సంస్థలు తమ ఆదాయం కోసం శాసనసభ నిర్ణయించిన మేరకు పన్నులు విధించడం, వసూలు చేయడం చేయవచ్చు. దీంతోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా సహాయ నిధులు అందిస్తాయి.

ప్రకరణ 243Y ప్రకారం ఫైనాన్స్ కమిషన్

- 73వ రాజ్యాంగ సవరణలో పేర్కొన్న ప్రకరణ 243Iలోని రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ పట్టణ స్థానిక సంస్థలకు కూడా వర్తిస్తుంది.

ప్రకరణ 243Z ప్రకారం అకౌంటింగ్ అండ్ ఆడిటింగ్

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ పాలిటీ

పట్టణ, నగర కార్పొరేషన్ సంస్థల అకౌంట్లను పరిశీలించేందుకు రాష్ట్ర శాసనసభ ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయవచ్చు.

ప్రకరణ 243ZA ప్రకారం మునిసిపాలిటీల ఎన్నికల నిర్వహణ

ప్రకరణ 243Kలో ప్రస్తావించిన విధంగా రాష్ట్ర ఎన్నికల కమిషన్ పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహిస్తుంది.

ప్రకరణ 243ZB ప్రకారం కేంద్రపాలిత ప్రాంతాలకు వర్తింపు

74వ రాజ్యాంగ సవరణలోని అంశాలు కేంద్రపాలిత ప్రాంతాలకు కూడా వర్తిస్తాయి. పార్లమెంటు చట్టం ద్వారా వీటిని వర్తింప చేస్తుంది.

ప్రకరణ 243ZC ప్రకారం షెడ్యూల్డ్ ప్రాంతాలకు వర్తింపులో మినహాయింపులు

- 244(1) ప్రకారం షెడ్యూల్డ్ ప్రాంతాలు, 244(2) ప్రకారం షెడ్యూల్డ్ తెగల ప్రాంతాల్లో ఈ విభాగం వర్తించదు.
- పశ్చిమ బెంగాల్‌లోని డార్జిలింగ్ జిల్లాలోని కొండ ప్రాంతాలకు ఏర్పాటు చేసిన గూర్ఖాహిల్ కౌన్సిల్‌కు ఈ విభాగం వర్తించదు.
- ప్రకరణ 244(1), 244(2) ప్రకారం షెడ్యూల్డ్, ఆదివాసీ ప్రాంతాలకు ఈ విభాగాన్ని వర్తింపచేస్తూ పార్లమెంట్ శాసనాలను రూపొందించవచ్చు. అయితే వాటిని రాజ్యాంగ సవరణలుగా పరిగణించరు.

ప్రకరణ 243ZD ప్రకారం జిల్లా ప్రణాళికా కమిటీ

- ప్రతి రాష్ట్రంలో జిల్లా స్థాయిలో జిల్లా ప్రణాళికా కమిటీని ఏర్పాటు చేయాలి. ఈ కమిటీ పంచాయతీ, మునిసిపాలిటీలు రూపొందించిన ప్రణాళికలను సమీకరించి తుది ప్రణాళికలను రూపొందిస్తుంది. జిల్లా ప్రణాళిక కమిటీ నిర్మాణాన్ని రాష్ట్ర శాసనసభ చట్టం ద్వారా నిర్ణయిస్తుంది.

గమనిక: జిల్లా ప్రణాళిక కమిటీ కేంద్రపాలిత ప్రాంతమైన ఢిల్లీకి వర్తించదు.

ప్రకరణ 243ZE ప్రకారం మెట్రోపాలిటన్ ప్రణాళికా కమిటీ

10 లక్షల కంటే ఎక్కువ జనాభా ఉన్న మెట్రోపాలిటన్ ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేస్తారు. వీటి నిర్మాణం, విధులు వంటి అంశాలను రాష్ట్ర శాసనసభ చట్టం ద్వారా నిర్ణయిస్తుంది. నగర మేయర్ ఈ కమిటీకి చైర్మన్‌గా, మునిసిపల్ కమిషనర్ సెక్రటరీగా వ్యవహరిస్తారు. దీంతోపాటు కమిటీలో మునిసిపల్ పాలనలో అనుభవమున్న నలుగురు సభ్యులను రాష్ట్ర ప్రభుత్వం నియమిస్తుంది. మొత్తం సభ్యుల్లో 2/3 వంతు సభ్యులను గ్రామ పంచాయతీ అధ్యక్షులు, మునిసిపాలిటీ, కార్పొరేషన్ ప్రతినిధులు ఎన్నుకుంటారు.

ప్రకరణ 243ZF ప్రకారం పాత శాసనాల కొనసాగింపు

74వ రాజ్యాంగ సవరణ అమల్లోకి వచ్చిన ఒక సంవత్సరం వరకు రాష్ట్రంలో అమల్లో ఉన్న పాత చట్టాలే కొనసాగుతాయి. ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వాలు కొత్త చట్టాలను అనువర్తింప చేసుకోవాలి.

పట్టణ స్థానిక సంస్థలు - నిర్మాణం

1992లో 74వ రాజ్యాంగ సవరణ తర్వాత పట్టణాల్లో కూడా మూడంచెల స్థానిక ప్రభుత్వ వ్యవస్థను ఏర్పాటు చేశారు.

మొదటి అంచె – నగర పంచాయతీ
రెండో అంచె – పురపాలక సంస్థలు
మూడో అంచె – నగరపాలక సంస్థలు

నగర పంచాయితీ

గ్రామీణ వ్యవస్థ నుంచి పట్టణీకరణ దిశగా మారుతున్న సుమారు 20,000 నుంచి 40,000 వరకు జనాభా గల చిన్న పట్టణ ప్రాంతాలకు నగర పంచాయతీ హోదా కల్పిస్తారు. నగర పంచాయతీని జనాభా మేరకు వార్డులుగా విభజిస్తారు. ప్రతి వార్డు నుంచి ఓటర్లతో ఒక సభ్యుడు నేరుగా ఎన్నికవుతారు. ప్రతి నగర పంచాయతీలో గరిష్ఠంగా 10 మంది ఎన్నికైన వార్డు సభ్యులు, ముగ్గురు నామినేటెడ్ సభ్యులు ఉంటారు.

- నగర పంచాయతీలో నివాసముంటున్న ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు హోదా రీత్యా సభ్యులుగా ఉంటారు.
- నగర పంచాయతీ సభ్యులు తమలో ఒకర్ని అధ్యక్షుడిగా, మరొకరిని ఉపాధ్యక్షునిగా ఎన్నుకుంటారు.
- సర్పంచ్, ఉప సర్పంచ్‌లను తొలగించినట్లే వీరిని కూడా అవిశ్వాస తీర్మానం ద్వారా తొలగించవచ్చు.

పురపాలక సంస్థలు

1965లో సమగ్ర పురపాలక సంస్థల చట్టం ప్రకారం మునిసిపాలిటీలు ఏర్పడ్డాయి. 74వ రాజ్యాంగ సవరణకు అనుగుణంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1994లో కొత్త చట్టాన్ని రూపొందించింది. 40,000 నుంచి 3,00,000 జనాభా ఉన్న పట్టణాల్లో పురపాలక సంస్థలను ఏర్పాటు చేస్తారు. వార్షికాదాయ, పరిమాణాల ఆధారంగా పురపాలక సంస్థలను ఐదు రకాలుగా వర్గీకరించారు. అవి..

1. సెలక్షన్ గ్రేడ్ పురపాలక సంఘం: వార్షిక ఆదాయం రూ.8 కోట్ల కంటే ఎక్కువ ఉన్నవి.
2. స్పెషల్ గ్రేడ్ పురపాలక సంఘం:వార్షికాదాయం రూ.6 కోట్ల నుంచి రూ.8 కోట్ల మధ్య ఉన్నవి.
3. గ్రేడ్-1 పురపాలక సంఘం: వార్షికాదాయం రూ.4 కోట్ల నుంచి రూ.6 కోట్ల మధ్య ఉన్నవి.
4. గ్రేడ్-2 పురపాలక సంఘం: వార్షికాదాయం రూ.2 కోట్లు నుంచి రూ.4 కోట్ల మధ్య ఉన్నవి.
5. గ్రేడ్-3 పురపాలక సంఘం: వార్షికాదాయం కోటి రూపాయల నుంచి రూ. రెండు కోట్ల లోపు ఉన్నవి.

సూచన: ఈ వర్గీకరణను ప్రభుత్వం కాలానుగుణంగా మార్చవచ్చు.

ప్రతి పురపాలక సంస్థలో నాలుగు అంగాలు ఉంటాయి. అవి..

పురపాలక మండలి: పురపాలక సంస్థ చర్చా వేదికే పురపాలక మండలి. ఇందులో ఎన్నికైన సభ్యులు. కోఆప్టెడ్ సభ్యులు, ఎక్స్‌అఫీషియో సభ్యులు ఉంటారు.

మున్సిపల్ కౌన్సిలర్లు: వీరిని ఓటర్లు వార్డు ప్రాతిపదికన ఎన్నుకుంటారు. జనాభాను బట్టి వీరి సంఖ్యను నిర్ణయిస్తారు.

- 40 వేల వరకు జనాభా ఉంటే 21 మంది కౌన్సిలర్లు ఉంటారు.
- జనాభా 40 వేల నుంచి లక్ష వరకు ఉంటే 21 మంది సభ్యులు, ప్రతి 10 వేల జనాభాకు ఒక సభ్యుడు అదనంగా ఉంటారు.
- జనాభా లక్ష నుంచి రెండు లక్షల వరకు ఉంటే 27 మంది సభ్యులు, ప్రతి 15 వేల జనాభాకు ఒక సభ్యుడు అదనంగా ఉంటారు.
- జనాభా రెండు లక్షల మించి ఉంటే 33 మంది సభ్యులు, ప్రతి 20 వేల అదనపు జనాభాకు ఒక అదనపు సభ్యుడు ఉండవచ్చు. గరిష్ఠంగా 45 సభ్యులకు మించరాదు.

మూడో వ్యక్తి చెల్లించాల్సిన అద్దె?

భాగస్వామ్యం

- భాగస్వామ్యం: ఒక వ్యాపారాన్ని ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మంది ఉమ్మడిగా చేస్తే వారిని 'భాగస్వాములు' అని, ఆ వ్యాపారాన్ని 'భాగస్వామ్యం' అంటారు.
- భాగస్వాములందరి పెట్టుబడులు ఒకే కాలం వరకు ఉంటే, పెట్టుబడుల నిష్పత్తిలో లాభం లేదా నష్టం ఉంటుంది.
- వేర్వేరు పెట్టుబడులు వేర్వేరు కాలాల్లో ఉంటే పెట్టుబడి, వాటి కాలాల పరిమితి లబ్ధాల నిష్పత్తిలో లాభం లేదా నష్టం ఉంటుంది.

1. A, B అనే ఇద్దరు భాగస్వాములు వరుస గా రూ. 4,000, రూ. 6,000 పెట్టుబడులతో వ్యాపారం చేశారు. వారు సంవత్సరం వ్యాపారం చేయగా రూ.1500 లాభం వస్తే A, Bలకు వచ్చే లాభాల తేడా?
   1) రూ.100 2) రూ.200
   3) రూ.300 4) రూ.600

జ. వ్యాపారంలో పెట్టుబడులు పెట్టిన కాలాలు సమానం అయితే లాభాల నిష్పత్తి = పెట్టుబడుల నిష్పత్తి
= 4,000 : 6,000 = 2:3
మొత్తం లాభం = 2+3 →1500
⇒ 5 → 1500
$1 \rightarrow \frac{1500}{5} = 300$
A, B లకు వచ్చే లాభాల తేడా
= 3−2 = 1 → రూ.300

2. P, Q లు సమాన పెట్టుబడులతో వ్యాపారాన్ని ప్రారంభించారు. 9 నెలల తర్వాత Q వ్యాపారం నుంచి విరమించు కున్నాడు. ఏడాది చివర వచ్చిన లాభం రూ. 8540. అందులో Q వాటా?
   1) రూ.1220 2) రూ.2440
   3) రూ.4880 4) రూ.3660

జ. వ్యాపారంలో సమాన పెట్టుబడులు ఉంటే లాభాల నిష్పత్తి = కాలాల నిష్పత్తి
= 12 నెలలు : 9 నెలలు
= 4 : 3
వచ్చిన మొత్తం లాభం = 4+3 → రూ.8540
(సమస్య నుంచి)
7→ రూ.8540
$1 \rightarrow \frac{8540}{7}$ = Rs. 1220
Q వాటా = 3→ 3 × 1220 = రూ.3660

3. రూ.9000 పెట్టుబడితో A వ్యాపారం ప్రారంభించాడు. 5 నెలల తర్వాత రూ. 8000 పెట్టుబడితో B చేరాడు. ఏడాది చివర వారి లాభం రూ. 4100 అయితే A వాటా?
   1) రూ. 2700 2) రూ. 1400
   3) రూ. 4100 4) రూ. 1300

జ. వేర్వేరు పెట్టుబడులు, వేర్వేరు కాలాల్లో ఉండే లాభాల నిష్పత్తి =
పెట్టుబడి × కాలాల నిష్పత్తి
A, B ల లాభాల నిష్పత్తి =
9000 × 12 నెలలు : 8000 × 7 నెలలు
= 108:56 = 27:14
మొత్తం లాభం = 27+ 14 → 4100
41 → 4100
$1 \rightarrow \frac{4100}{41} = 100$
Aకు వచ్చే లాభం
27 → 27 × 100 = రూ. 2700

4. రూ. 8,000, రూ.4,000, రూ. 8,000 వరుస పెట్టుబడులతో రాజు, రమణ, రవిలు వ్యాపారం ప్రారంభించారు. 6 నెలల తర్వాత రాజు వ్యాపారం వదిలేశాడు. 8 నెలల తర్వాత రూ. 4005 లాభం వచ్చింది. దానిలో రమణ వాటా?
   1) రూ. 890 2) రూ.1335
   3) రూ. 1602 4) రూ. 1780

జ. లాభాల నిష్పత్తి
= పెట్టుబడి, కాలాల లబ్ధాల నిష్పత్తి
=(8000×6):(4000×8):(8000×8)
= 48:32:64 = 3:2:4
∴ రాజు, రమణ, రవిల లాభాల నిష్పత్తి
మొత్తం లాభం = 3+2+4 → రూ. 4005
9 → రూ. 4005
$1 \rightarrow \frac{4005}{9}$
రమణ వాటా $2 \rightarrow 2 \times \frac{4005}{9} = 890$



5. రాముడు వ్యాపారం ప్రారంభించిన కొద్ది మాసాలకు రహీమ్‌ను వ్యాపారంలో చేర్చుకున్నాడు. అప్పుడు వారి పెట్టుబడుల నిష్పత్తి 4:5. ఏడాది చివరన లాభంలో రాముడు, రహీంల వాటాలు వరుసగా రూ. 3300, రూ.2750 అయితే రహీం వ్యాపారంలో ఎప్పుడు చేరాడు?
   1) 8 నెలల తర్వాత 2) 6 నెలల తర్వాత
   3) 4 నెలల తర్వాత 4) 3 నెలల తర్వాత

జ. రాముడు పెట్టుబడి పెట్టిన కాలం 12 నెలలు
రహీం పెట్టుబడి పెట్టిన కాలం x నెలలు అనుకోండి.
పెట్టుబడుల నిష్పత్తి = 4: 5
లాభాల నిష్పత్తి = పెట్టుబడి, కాలాల లబ్ధాల నిష్పత్తి
3300 : 2750 = 4 × 12 : 5× x
$5x = \frac{2750 \times 4 \times 12}{3300} = 40$
$x = 40/5 = 8$
∴ రహీం పెట్టుబడి పెట్టిన కాలం = 8 నెలలు
అంటే 4 నెలల తర్వాత (12−8=4) రహీం వ్యాపారంలో చేరాడు.

6. A, B, Cలు కలిసి వ్యాపారంలో రూ. 50,000 మూలధనం సమకూర్చుకున్నారు. B కంటే A రూ. 4,000 ఎక్కువ, C కంటే B రూ. 5,000 ఎక్కువ పెట్టుబడి పెట్టారు. మొత్తం లాభం రూ. 35,000 అయితే A వాటా ఎంత?
   1) రూ. 8,400 2) రూ. 11,900
   3) రూ. 13,600 4) రూ. 14,700

జ. C పెట్టుబడి = x అనుకోండి
B పెట్టుబడి = $x + 5000$,
A పెట్టుబడి = $(x + 5000) + 4000$
A, B, C ల మొత్తం పెట్టుబడి
$= x + (x + 5000) +$
$[(x + 5000) + 4000]$ = రూ. 50,000
(సమస్య నుంచి)
⇒ $3x$+ 14,000= రూ. 50,000
⇒ x = రూ.12,000
A, B, Cల పెట్టుబడులు
= (12,000 + 5000) + 4000,
12,000 + 5000, 12,000
A, B, Cల పెట్టుబడుల నిష్పత్తి
= 21,000 : 17,000 : 12,000
= 21 : 17 : 12
మొత్తం లాభం = 21 + 17 + 12
→ 35,000
50→35,000
$1 \rightarrow \frac{35,000}{50} = 700$
A వాటా 21 → 21 × 700
= రూ. 14,700

7. భాగస్వామ్య వ్యాపారంలో A, Cల పెట్టుబడి 2 : 1గా, A, B ల పెట్టుబడి 3:2గా ఉంది. సంవత్సరాంతాన మొత్తం లాభం రూ.3,900 అయితే A, C వాటాల తేడా ఎంత?
   1) రూ.600 2) రూ.900
   3) రూ.1200 4) రూ.1500

జ. A : C = 2:1, A : B = 3 : 2
$\frac{A}{C} = \frac{2}{1} = \frac{2 \times 3}{1 \times 3} = \frac{6}{3}$
$\frac{A}{B} = \frac{3}{2} = \frac{3 \times 2}{2 \times 2} = \frac{6}{4}$
A : B : C = 6 : 4 : 3(లేదా)
C : A = 1:2
↘↑↘
A : B = 3:2
C : A : B = 1×3 : 2 ×3 : 2×2
= 3 : 6 : 4
మొత్తం లాభం
= 6 + 4 + 3 → 3,900
(సమస్య నుంచి)
13 → 3,900
$1 \rightarrow = \frac{3900}{13} = 300$
A, C ల వాటాల తేడా = 6 − 3 = 3
→ 3 × 300 = రూ.900

8. డేవిడ్, గోపి పెట్టుబడుల మొత్తం రూ.40,400. ఏడాది చివర వచ్చిన మొత్తం లాభం రూ.10,000. పెట్టుబడుల నిష్పత్తిలో కాకుండా సమానంగా పంచుకుంటే డేవిడ్‌కు రూ. 50 నష్టం వస్తుంది. గోపి పెట్టుబడి?
   1) రూ. 20,402 2) రూ. 19,998
   3) రూ. 31,428 4) రూ. 26,868

జ. మొత్తం లాభం = రూ.10,000
సమానంగా పంచుకుంటే డేవిడ్, గోపిల లాభాలు రూ. 5,000 : రూ. 5,000
డేవిడ్‌కు రూ. 50 నష్టం వస్తుంది. కాబట్టి లాభాలను పంచాల్సిన విధానం
రూ.5050:రూ. 4950
లాభాల నిష్పత్తి = 5050 : 4950
= 101: 99
పెట్టుబడుల నిష్పత్తి = లాభాల నిష్పత్తి
= 101 : 99
పెట్టుబడుల మొత్తం
= 101+99 → రూ. 40,400
(సమస్య నుంచి)
200 → 40,400
$1 \rightarrow = \frac{40,400}{200} = 202$
గోపి పెట్టుబడి
99 → 99 × 202 = రూ.19,998

9. అరుణ్, వరుణ్‌ల పెట్టుబడుల మొత్తం రూ. 65,000. సంవత్సర ఆదాయం రూ. 20,000. అందులో రూ.7,000 ఖర్చులకు పోనూ మిగిలింది పెట్టుబడుల నిష్పత్తిలో పంచుకోగా అరుణ్ కంటే వరుణ్‌కు రూ. 1,000 అధికంగా వచ్చింది. అయితే వరుణ్ పెట్టుబడి?
   1) రూ. 30,000 2) రూ. 35,000
   3) రూ. 25,000 4) రూ. 40,000

జ. సంవత్సర ఆదాయం = రూ. 20,000
ఖర్చులకు రూ. 7,000 పోను మిగిలిన ఆదాయం = 20,000− 7000 = 13,000
రూ.13,000ను అరుణ్ కంటే వరుణ్‌కు రూ. 1000 అధికంగా వచ్చేట్లు పంచుకొనే విధానం
= రూ. 6,000, రూ. 7,000
= 6:7
పెట్టుబడుల మొత్తం = 6+7 → 65,000
(సమస్య నుంచి)
13→65,000
$1 \rightarrow = \frac{65,000}{13} = 5000$
వరుణ్ పెట్టుబడి 7 → 7× 5,000
= రూ. 35,000

మాదిరి ప్రశ్నలు

1. గోపాల్, భూపాల్ వరుసగా రూ. 3,000, రూ. 5,000 పెట్టుబడితో వ్యాపారం చేశారు. సంవత్సరాంతమున వచ్చిన లాభం రూ. 1880 అయితే గోపాల్ వాటా?
   1) 705 2) 1175
   3) 1435 4) 1715
2. రాణి రూ. 2525 మూలధనంతో కూరల వ్యాపారం ప్రారంభించిన కొంతకాలానికి వాణి రూ. 1,200 పెట్టుబడితో వ్యాపారంలో చేరింది. సంవత్సరాంతాన వచ్చిన మొత్తం రూ. 1664 లాభంలో రాణి వాటా రూ. 1212 అయితే వాణి ఎన్ని నెలల తర్వాత వ్యాపారంలో చేరింది?
   1) 3 2) 4 3) 5 4) 6
3. లాల్ వర్తకం ప్రారంభించి కొంత కాలానికి పాల్‌ను భాగస్తునిగా చేర్చుకున్నాడు. వారి పెట్టుబడుల నిష్పత్తి 3:4. సంవత్సరాంతమున వారి లాభాల వాటాలు సమానంగా ఉన్న పాల్ వ్యాపారంలో ఉన్న కాలం ఎన్ని నెలలు?
   1) 3 2) 6 3) 9 4) 12
4. ఒక వ్యాపారంలో A రూ.6,000ను 5 నెలలు, B రూ.10,000ను 4 నెలలు, C రూ.15,000ను 6 నెలలు పెట్టుబడిగా పెట్టారు. వారికి వచ్చిన లాభం రూ.8000 అయితే A వాటా?
   1) రూ.4,500 2) రూ. 2,000
   3) రూ. 1,500 4) రూ. 3,000
5. రూ.15,000లతో A వ్యాపారం ప్రారంభించాడు. 3 నెలల తర్వాత రూ.10,000లతో B వ్యాపారంలో చేరాడు. సంవత్సరాంతమున లాభం రూ.6,000 అయితే B వాటా?
   1) రూ.2,000 2) రూ.3,000
   3) రూ.4,000 4) రూ.5,000
6. రూ.30,000లతో A వ్యాపారం ప్రారంభించాడు. 3 నెలల తర్వాత B వ్యాపారంలో చేరాడు. సంవత్సరాంత మున లాభాలను సమానంగా పంచుకున్నారు. అయితే B పెట్టుబడి?
   1) రూ.15,000 2) రూ.25,000
   3) రూ.35,000 4) రూ.40,000
7. A, B వరుసగా రూ. 8000, రూ.12,000లతో వ్యాపారం ప్రారంభించారు. వారు 10 శాతం లాభాన్ని దానధర్మాలు చేశారు. సంవత్సరాంతమునకు A వాటా రూ. 5400 అయితే మొత్తం లాభం?
   1) రూ.13,500 2) రూ.15,000
   3) రూ.14,800 4) రూ.12,000
8. A, B వరుసగా రూ.20,000, రూ.30,000లతో వ్యాపారం ప్రారంభించారు. 6 నెలల తర్వాత రూ. 10,000లను A అదనంగా పెట్టుబడి పెట్టాడు. కానీ రూ. 5000లను B వెనక్కు తీసుకొన్నాడు. సంవత్సరాంతానికి వారికి వచ్చిన లాభం రూ. 8400 అయితే A వాటా?
   1) రూ. 2,500 2) రూ. 4,000
   3) రూ. 4,400 4) రూ. 5,200
9. A, Bలు 9:6 నిష్పత్తిలో వ్యాపారం ప్రారంభించారు. సంవత్సరం చివరలో వచ్చిన లాభం రూ. 6,800ను పొరపాటున 6:9 నిష్పత్తిలో పంచుకున్నారు. అయితే Bకు వచ్చిన అదనపు లాభం?
   1) రూ.2,720 2) రూ.4,080
   3) రూ.1,360 4) రూ.2,180
10. A, B, C లు 2:3:5 నిష్పత్తిలో పెట్టుబడులు పెట్టి వ్యాపారం ప్రారంభించారు. మరుసటి సంవత్సరం తమ పెట్టుబడుల నుంచి ఒక్కొక్కరు వరుసగా 20%, 25%, 30% వెనక్కు తీసుకున్నారు. రెండో సంవత్సరం వారు పంచుకునే లాభాల నిష్పత్తి?
    1) 32: 45: 70 2) 4: 5:6
    3) 12:17:21 4) ఏదీకాదు
11. ముగ్గురు రైతులు ఒక తోటను అద్దెకు తీసుకొన్నారు. మొదటి వ్యక్తి 30 ఆవులను మూడు నెలలు, రెండో వ్యక్తి 20 ఆవులను 4 నెలలు, మూడో వ్యక్తి 15 ఆవుల్ని 8 నెలలు ఉంచారు. తోట మొత్తం అద్దె రూ.580 అయితే 3వ వ్యక్తి చెల్లించాల్సిన అద్దె?
    1) రూ. 200 2) రూ. 240
    3) రూ. 320 4) రూ. 360
12. ఉమ్మడి వ్యాపారంలో A, Bలు 3:5 నిష్పత్తి పెట్టుబడితో వ్యాపారం ప్రారంభిం చారు. B పెట్టుబడికి సమానంగా 6 నెలల తర్వాత C వాళ్లతో చేరాడు. ఒక సంవత్సరం చివర వచ్చిన లాభాన్ని వారు పంచుకొనే నిష్పత్తి?
    1) 3: 5: 2 2) 1: 2 : 3
    3) 3: 5: 5 4) 6: 10 : 5

సమాధానాలు

1) 1; 2) 1; 3) 3; 4) 3;
5) 1; 6) 4; 7) 2; 8) 2;
9) 3; 10) 1; 11) 2; 12) 4.

దేశంలో అతి పెద్ద ఇనుము-ఉక్కు కర్మాగారం?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ ఎకానమీ



భారతదేశం ఖనిజాధార పరిశ్రమలు

ఖనిజాలు, లోహాలను ముడి సరుకులుగా ఉపయోగించే పరిశ్రమలను ఖనిజాధార పరిశ్రమలు అంటారు. ఇనుము-ఉక్కు పరిశ్రమ, అల్యూమినియం, సిమెంట్, ఎరువులు, భారీ ఇంజనీరింగ్ పరిశ్రమలు, రాగి పరిశ్రమ మొదలైనవి కొన్ని ముఖ్యమైన ఖనిజాధార పరిశ్రమలు.

ఇనుము - ఉక్కు పరిశ్రమ

ఏ దేశ ఆర్థికాభివృద్ధికైనా ఇనుము-ఉక్కు పరిశ్రమల అభివృద్ధి అతి ముఖ్యమైంది. అందువల్లే ఈ పరిశ్రమను 'మూల పరిశ్రమ' అంటారు. ఖనిజాధార పరిశ్రమల్లో ఇనుము-ఉక్కు పరిశ్రమ అత్యంత ప్రధాన, అతి పెద్ద పరిశ్రమ.

- భారతదేశంలో మొదటి ఇనుము-ఉక్కు కర్మాగారాన్ని 1830లో తమిళనాడులోని పోర్టోనోవో వద్ద స్థాపించారు. 1866లో దీన్ని మూసేశారు.
- 1870లో పశ్చిమ బెంగాల్‌లోని కుల్టీ వద్ద 'బెంగాల్ ఐరన్ వర్క్స్' ఇనుము-ఉక్కు పరిశ్రమను నెలకొల్పారు. ఇది దేశంలో మొట్టమొదటి ఇనుము-ఉక్కు పరిశ్రమ. దీన్ని బర్నాపూర్‌లోని ఇండియన్ ఐరన్ అండ్ స్టీల్ కంపెనీ(ఐఐఎస్‌సీవో)లో విలీనం చేశారు.

టాటా ఇనుము - ఉక్కు కర్మాగారం(టిస్కో): ఇది దేశంలోని మొదటి భారీ ఆధునిక ఇనుము-ఉక్కు కర్మాగారం. దీన్ని జార్ఖండ్‌లోని సక్చీ వద్ద 1907లో జంషెడ్‌జీ టాటా స్థాపించారు. ప్రైవేట్ రంగంలో ఏర్పాటైన మొదటి కర్మాగారం ఇది. ప్రస్తుతం పనిచేస్తున్న అతి పురాతన ఇనుము - ఉక్కు కర్మాగారం. జంషెడ్‌జీ టాటా గౌరవార్థం సక్చీని 'జంషెడ్‌పూర్'గా వ్యవహరిస్తున్నారు.

- 1919లో పశ్చిమ బెంగాల్‌లోని 'బర్నాపూర్' వద్ద 'ఇండియన్ ఐరన్ అండ్ స్టీల్ కంపెనీ'(ఐఐఎస్‌సీవో)ని స్థాపించారు. దీన్ని 1972లో కేంద్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది.
- 1923లో కర్ణాటకలో షిమోగా జిల్లాలోని భద్రావతి వద్ద 'మైసూర్ స్టీల్ వర్క్స్' (మిస్కో) అనే ఇనుము-ఉక్కు కర్మాగారాన్నినిర్మించారు. అనంతరం విశ్వేశ్వరయ్య గౌరవార్థం ఈ పరిశ్రమకు 'విశ్వేశ్వరయ్య ఐరన్ అండ్ స్టీల్ లిమిటెడ్'(వీఐఎస్ఎల్) గా పేరు మార్చారు.

భిలాయ్ ఇనుము - ఉక్కు కర్మాగారం: దీన్ని రెండో పంచవర్ష ప్రణాళిక కాలంలో ఛత్తీస్‌గఢ్‌లోని దుర్గ్ జిల్లాలోని 'భిలాయ్' వద్ద రష్యా సహకారంతో నిర్మించారు. కోర్బా ప్రాంతంలోని బొగ్గు నిక్షేపాలను ఇది వినియోగించుకుంటోంది. దీని ఉత్పత్తి 1959లో ప్రారంభమైంది.

రూర్కెలా ఇనుము - ఉక్కు కర్మాగారం: దీన్ని ఒడిశాలో సుందర్‌గఢ్ జిల్లాలోని 'రూర్కెలా' వద్ద బ్రాహ్మణీ నది ఒడ్డున నిర్మించారు. దీనికి 'పశ్చిమ జర్మనీ' సహకారం చేసింది. ఇది 1959 నుంచి ఉత్పత్తిని ప్రారంభించింది.

దుర్గాపూర్ ఇనుము - ఉక్కు కర్మాగారం: దీన్ని పశ్చిమ బెంగాల్‌లోని బురద్వాన్ జిల్లాలో దామోదర్ నదీ ప్రాంతంలో దుర్గాపూర్ వద్ద నిర్మించారు. దీనికి బ్రిటన్ సహకారం చేసింది. ఇది 1962 నుంచి ఉత్పత్తిని ప్రారంభించింది.

భిలాయ్, రూర్కెలా, దుర్గాపూర్ ఇనుము-ఉక్కు కర్మాగారాలు ప్రభుత్వ రంగంలో ఏర్పాటు చేశారు.

బొకారో ఇనుము - ఉక్కు కర్మాగారం: ఇది మూడో పంచవర్ష ప్రణాళిక కాలం (1964)లో ఏర్పాటైంది. దీన్ని జార్ఖండ్‌లో హజారీబాగ్ జిల్లాలోని బొకారో, దామోదర్ నదుల సంగమ ప్రాంత సమీపంలో నిర్మించారు. అత్యధికంగా స్వదేశీ పరిజ్ఞానంతో, కొంత రష్యా సహకారంతో స్థాపించిన నాలుగో ప్రభుత్వరంగ ఇనుము-ఉక్కు కర్మాగారం.

- ప్రస్తుతం ఇది భారతదేశంలో అతిపెద్ద ఇనుము-ఉక్కు కర్మాగారం. 1972 నుంచి ఉత్పత్తిని ప్రారంభించింది.

విశాఖ స్టీల్ ప్లాంట్: ఇది ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో ఉంది. దీన్ని రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్. రష్యా సహాయంతో నిర్మించింది. 1992 ఆగస్టు 1న నాటి ప్రధాని పీవీ నరసింహారావు విశాఖ స్టీల్ ప్లాంట్‌ను జాతికి అంకితం చేశారు. ఈ కర్మాగారం భారతదేశంలో అత్యాధునిక, తీరప్రాంతంలో ఉన్న ఏకైక ఇనుము-ఉక్కు కర్మాగారం.

- 1982లో తమిళనాడులోని 'సేలం' వద్ద ఇనుము-ఉక్కు కర్మాగారాన్ని స్థాపించారు. ఈ కర్మాగారం నాణేల తయారీకి, స్టెయిన్‌లెస్ స్టీల్ ఉత్పత్తికి ప్రసిద్ధి. మరో కర్మాగారాన్ని కర్ణాటకలోని హోస్పేట్ సమీపంలోని విజయనగర్ వద్ద నిర్మించారు.

స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (సెయిల్): దీన్ని 1973లో న్యూఢిల్లీలో స్థాపించారు. ఇది పూర్తిగా ప్రభుత్వాధీన సంస్థ. దీనికి మహారత్న హోదా ఉంది. భిలాయ్, దుర్గాపూర్, రూర్కెలా, బొకారో, బర్నాపూర్, సమీకృత ఉక్కు కర్మాగారాలు మొదలైన వాటి నిర్వహణ బాధ్యత దీనిదే.

- భారతదేశంలో ఏర్పాటైన తొలి స్పాంజ్ ఐరన్ కర్మాగారం తెలంగాణ రాష్ట్రంలో ఖమ్మం జిల్లాలోని పాల్వంచ (కొత్తగూడెం)లో ఉంది.

అల్యూమినియం పరిశ్రమ

భారతదేశంలో ఇనుము తర్వాత ఇది రెండో పెద్ద ఖనిజరంగ పరిశ్రమ. దీన్ని మన దేశంలో వార్‌బోర్న్ పరిశ్రమ అంటారు. 'అల్యూమినియం'ను విశ్వలోహం అంటారు. భారతదేశంలో 1937లో పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో అసన్‌సోల్ సమీపంలో 'జాయక్‌నగర్' ప్రాంతంలో 'అల్యూమినియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా'ను స్థాపించారు.

- భారతదేశంలో 8 అల్యూమినియం శుద్ధి కర్మాగారాలు ఉన్నాయి. అవి..

1. **ఇందాల్కో (ఇండియన్ అల్యూమినియం కంపెనీ):** దీనికి అలువాపురం(కేరళ), హీరాకుడ్ (ఒడిశా), బెల్గాం (కర్ణాటక)లో యూనిట్లు ఉన్నాయి.
2. **హిందాల్కో(హిందుస్తాన్ అల్యూమినియం కంపెనీ):** ఇది రేణుకూట్ (ఉత్తరప్రదేశ్)లో ఉంది.
3. **బాల్కో(భారత్ అల్యూమినియం కంపెనీ):** దీనికి కోర్బా(ఛత్తీస్‌గఢ్), రత్నగిరి(మహారాష్ట్ర)లో యూనిట్లు ఉన్నాయి. బాల్కో మొదటిసారి లక్ష టన్నుల కెపాసిటీ సాధించింది.
4. **నాల్కో(నేషనల్ అల్యూమినియం కంపెనీ):** ఇది దామన్‌జోడి(ఒడిశా)లో ఉంది.
5. **మాల్కో(మద్రాస్ అల్యూమినియం కంపెనీ):** ఇది మెట్టూరు (తమిళనాడు)లో ఉంది.

సిమెంటు పరిశ్రమ

భారతదేశంలో మొదటి సిమెంటు పరిశ్రమ 1904లో చెన్నైలో ప్రారంభమైంది. ప్రస్తుతం దీన్ని మూసివేశారు. పూర్తి స్థాయిలో 1912లో గుజరాత్‌లోని పోర్‌బందర్‌లో సిమెంట్ పరిశ్రమను ఏర్పాటు చేశారు.

- సిమెంటు ఉత్పత్తిలో భారత్‌ది రెండో స్థానం కాగా మొదటి స్థానంలో చైనా ఉంది.
- భారతదేశంలో తమిళనాడు, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు సిమెంటు ఉత్పత్తిలో మొదటి మూడు స్థానాల్లో ఉన్నాయి. సిమెంటు పరిశ్రమకు ప్రధాన ముడి సరుకు సున్నపురాయి.
- ప్రస్తుతం మనదేశంలో 128 భారీ, 322 చిన్న సిమెంటు కర్మాగారాలున్నాయి.
- ప్రభుత్వ రంగంతోపాటు ప్రైవేటు రంగంలోనూ సిమెంటు కర్మాగారాలు ఉన్నాయి. ప్రైవేట్ కంపెనీలు దాదాపు 65 శాతం సిమెంటును ఉత్పత్తి చేస్తున్నాయి. అసోసియేట్ సిమెంటు కంపెనీ(ఏసీసీ) లిమిటెడ్ అతి పెద్ద సిమెంట్ తయారీ సంస్థ కాగా దాల్మియా గ్రూపు రెండోది.

ఎరువుల పరిశ్రమ

దేశంలో మొదటి ఎరువుల పరిశ్రమను 1906లో తమిళనాడులోని రాణిపేటలో ప్రారంభించారు. స్వాతంత్ర్యానంతరం ప్రభుత్వ రంగంలో మొదట 1951లో బిహార్‌లోని సింద్రీ (ప్రస్తుతం ఈ ప్రాంతం జార్ఖండ్‌లో ఉంది) వద్ద ఆధునిక ఎరువుల కర్మాగారాన్ని నిర్మించారు. చైనా, అమెరికా తర్వాత ప్రపంచంలో ఎరువుల ఉత్పత్తిలో భారతదేశం మూడో స్థానంలో ఉంది.

- 1961లో ఫెర్టిలైజర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్, 1974లో నేషనల్ ఫెర్టిలైజర్ లిమిటెడ్‌ను స్థాపించడం ద్వారా ఎరువుల పరిశ్రమ అభివృద్ధి చెందింది.

ఎరువుల ఫ్యాక్టరీ పేరు	యూనిట్లు ఉన్న ప్రాంతం
ఫెర్టిలైజర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (1961)	సింద్రీ (జార్ఖండ్), తాల్చేర్ (ఒడిశా), గోరఖ్‌పూర్ (ఉత్తరప్రదేశ్), రామగుండం (తెలంగాణ)
నేషనల్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్ (1974)	వంగాల్ (పంజాబ్)లో రెండు కేంద్రాలు, విజయపూర్ (మధ్యప్రదేశ్) రెండు కేంద్రాలు, భటిండా (పంజాబ్), పానిపట్ (హర్యానా)
గోదావరి ఫెర్టిలైజర్స్ లిమిటెడ్	కాకినాడ (ఆంధ్రప్రదేశ్)
పారాదీప్ ఫాస్ఫేట్ లిమిటెడ్	పారాదీప్ (ఒడిశా)
మద్రాస్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్	చెన్నై సమీపంలో ఉంది

గాజు పరిశ్రమ

భారతదేశంలో మొదటి గాజు పరిశ్రమను 1941లో ఉత్తరప్రదేశ్‌లోని ఫిరోజాబాద్‌లో స్థాపించారు. ఈ పరిశ్రమకు కావాల్సిన ముడి పదార్థాలు.. ఇసుక, సున్నపురాయి, సిలికా, సోడా యాష్. ఫిరోజాబాద్ పరిశ్రమ గాజులు, పూసలకు ప్రసిద్ధి.

ఇంజనీరింగ్ పరిశ్రమలు

మనదేశంలో 1958లో హెవీ ఇంజనీరింగ్ కార్పొరేషన్‌ను రాంచీ(జార్ఖండ్)లో స్థాపించారు. దీని స్థాపనతో ఇంజనీరింగ్ పరిశ్రమ అభివృద్ధి ప్రారంభమైంది. ప్రస్తుతం దేశ అవసరాలకు కావాల్సిన అన్ని రకాల సామగ్రిని మన దేశం తయారు చేస్తోంది.

దేశంలోని ప్రధాన ఇంజనీరింగ్ పరిశ్రమలు

హెవీ ఇంజనీరింగ్ కార్పొరేషన్ లిమిటెడ్: జార్ఖండ్‌లోని రాంచీలో ఉంది. ఇది ఉక్కు పరిశ్రమ. యంత్ర సామగ్రి, హెవీ క్రషింగ్, గ్రైండింగ్ యంత్రాలు, క్రేన్లు, రోలింగ్ యంత్రాలు, నూనె బావుల డ్రిల్లింగ్ రిగ్స్‌ను ఉత్పత్తి చేస్తోంది.

మైనింగ్ అండ్ అలైడ్ మిషనరీ కార్పొరేషన్ లిమిటెడ్: ఇది దుర్గాపూర్ (పశ్చిమ బెంగాల్) ఉంది. రకరకాల ఖనిజ యంత్రాలను తయారు చేస్తోంది.

భారత్ హెవీ ప్లేట్స్ అండ్ వెసల్స్: ఇది విశాఖపట్నం(ఆంధ్రప్రదేశ్)లో ఉంది. పెట్రో రసాయనాలు, ఎరువుల యంత్రాలను తయారు చేస్తోంది. దీన్ని 2009లో బీహెచ్‌ఈఎల్‌లో విలీనం చేశారు.

తుంగభద్ర స్టీల్ ప్రొడక్ట్స్ లిమిటెడ్: ఇది కర్ణాటకలో ఉంది. గేట్స్, ట్రాన్స్‌మిషన్ టవర్స్, పెన్‌స్టాక్ పైప్స్ తయారు చేస్తుంది.

ఇతర పరిశ్రమలు

1. **హిందుస్తాన్ మెషీన్ టూల్స్(హెచ్ఎంటీ):** దీన్ని 1953లో కర్ణాటకలోని బెంగళూరులో స్థాపించారు. దీనికి అయిదు యూనిట్లు ఉన్నాయి. శ్రీనగర్ (జమ్మూకశ్మీర్), బెంగళూరు (కర్ణాటక), హైదరాబాద్, కాలమస్సేరి (కేరళ) యూనిట్లలో హెచ్ఎంటీవాచ్‌లు, పింజోర్ (హర్యానా) యూనిట్‌లో ట్రాక్టర్లను తయారు చేస్తారు.
2. **భారత్ హెవీ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీహెచ్ఈఎల్):** దీన్ని 1956లో మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో స్థాపించారు. దీనికి జగదీశ్‌పూర్, హరిద్వారా (ఉత్తరప్రదేశ్) తిరుచిరాపల్లి (తమిళనాడు), హైదరాబాద్‌లో యూనిట్లు ఉన్నాయి.
3. **ప్రాగా టూల్స్:** ఇది సికింద్రాబాద్ లో ఉంది. ఇక్కడ రక్షణ సామగ్రిని తయారు చేస్తారు.
4. **హిందుస్తాన్ కేబుల్స్ లిమిటెడ్ (హెచ్‌సీఎల్):** దీనికి హైదరాబాద్, రూప్ నారాయణపూర్ (పశ్చిమబెంగాల్)లో యూనిట్లు ఉన్నాయి.
5. **హిందుస్తాన్ ఎయిర్ క్రాఫ్ట్ ఫ్యాక్టరీ:** ఇది బెంగళూరు (కర్ణాటక)లో ఉంది.
6. **హెవీ వెహికల్ ఫ్యాక్టరీ:** ఇది ఆవడి (చెన్నై) లో ఉంది.
7. **హిందుస్తాన్ హౌజింగ్ ఫ్యాక్టరీ లిమిటెడ్:** ఇది న్యూఢిల్లీ ఉంది.
8. **భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీఈఎల్):** ఇది బెంగళూరు (కర్ణాటక)లో ఉంది.
9. **హిందుస్తాన్ యాంటీబయాటిక్స్ లిమిటెడ్:** ఇది పింప్రీ(మహారాష్ట్ర)లో ఉంది.
10. **హిందుస్తాన్ ఫొటో ఫిల్మ్ మాన్యుఫ్యాక్చరింగ్ కంపెనీ లిమిటెడ్:** దీన్ని 1960లో భారత ప్రభుత్వం తమిళనాడులోని ఊటీ వద్ద ఏర్పాటు చేసింది.
11. **ఇండియన్ డ్రగ్స్ అండ్ ఫార్మాస్యూటికల్స్ లిమిటెడ్ (ఐడీపీఎల్):** దీని కేంద్ర కార్యాలయం న్యూఢిల్లీలో ఉంది.

గతంలో వచ్చిన ప్రశ్నలు

1. మనదేశంలో మొదటి స్పాంజ్ ఐరన్ ప్లాంట్‌ను ఎక్కడ ఏర్పాటు చేశారు? (కానిస్టేబుల్ -2012)
   1) కొత్తగూడెం 2) విశాఖపట్నం
   3) భోపాల్ 4) కోల్‌కతా
2. దేశంలోని అతిపెద్ద ఉక్కు కర్మాగారం ఎక్కడ ఉంది? (కానిస్టేబుల్ - 2009)
   1) భిలాయ్ 2) బొకారో
   3) రూర్కెలా 4) దుర్గాపూర్
3. భారత్ హెవీ ఎలక్ట్రికల్ కర్మాగారం ఎక్కడ ఉంది? (కానిస్టేబుల్ - 2009)
   1) విశాఖపట్నం 2) భువనేశ్వర్
   3) హైదరాబాద్ 4) ముంబై
4. దేశంలోని మొదటి ఉక్కు కర్మాగారమైన టాటా ఇనుము-ఉక్కు కంపెనీ ఎక్కడ ఉంది? (కానిస్టేబుల్ - 2009)
   1) దుర్గాపూర్ 2) నాగపూర్
   3) బీజాపూర్ 4) జంషెడ్‌పూర్
5. బొకారో ఉక్కు కర్మాగారాన్ని ఏ దేశ సహాయంతో నిర్మించారు? (జైల్ వార్డెన్ - 2012)
   1) అమెరికా సంయుక్త రాష్ట్రాలు
   2) ఇంగ్లండ్ 3) జర్మనీ
   4) సోవియెట్ యూనియన్
6. కిందివాటిలో సరికాని జతను గుర్తించండి. (జైల్ వార్డెన్ - 2012)
   1) విశాఖపట్నం - నౌకా నిర్మాణం
   2) టిట్లాఘర్ - రైల్వే సామగ్రి
   3) భద్రావతి - ఇనుము, ఉక్కు
   4) పింజోర్ - యంత్ర పరికరాలు

సమాధానాలు

1) 1; 2) 2; 3) 3; 4) 4; 5) 4; 6) 2.

Is Hacker A Hero or Villain?



Hacker
(Computer security)

Hacker is considered as hero of computer programs. In computer security, a hacker is someone who focuses on security mechanisms of computer and network systems. He is someone who lives and breathes computers, who know all about computers, who can get a computer to do anything. Equally important, though, is the hacker's attitude. Computer programming must be a hobby, something done for fun, not out of a sense of duty. Hackers are generally computer geniuses because it is due to the extraordinary computer knowledge and skills that they can conveniently break into other computer systems.

CRACKER

Cracker is considered as villain of computer programs. A cracker is someone who breaks into someone else's computer system, often on a network; bypasses passwords or licenses in computer programs; or in other ways intentionally breaches computer security. A cracker does this for profit, maliciously, for some altruistic purpose.

CLASSIFICATION OF HACKERS BASED ON THEIR ATTITUDE:

WHITE HAT

A "White hat" hacker breaks security for non-malicious reasons, perhaps to test their own security system or while working for a security company which makes security software. The term "white hat" in Internet slang refers to an ethical hacker.

BLACK HAT

A "Black hat" hacker is a hacker who "violates computer security for little reason beyond maliciousness or for personal gain". Black hat hackers break into secure networks to destroy, modify, or steal data; or to make the network unusable for those who are authorized to use the network. Black hat hackers are also referred to as the "crackers" within the security industry and by modern programmers.

GREY HAT

A grey hat hacker lies between a black hat and a white hat hacker. Grey hat hackers sometimes find the defect of a system and publish the facts to the world instead of a group of people. Even though grey hat hackers may not necessarily perform hacking for their personal gain, unauthorized access to a system can be considered illegal and unethical.

ELITE HACKER

A social status among hackers, elite is used to describe the most skilled. Newly discovered exploits circulate among these hackers.

SCRIPT KIDDIE

A script kiddie (also known as a skid or skiddie) is an unskilled hacker who breaks into computer systems by using automated tools written by others.

NEOPHYTE

A neophyte ("newbie", or "noob") is someone who is new to hacking or phreaking and has almost no knowledge or experience of the workings of technology and hacking.

BLUE HAT

A blue hat hacker is someone outside computer security consulting firms who is used to bug-test a system prior to its launch, looking for exploits so they can be closed.

PHREAKS

A phreak is a hacker who specializes in phone systems. These days, however, phreaking is more of a cracker activity. At one time, phreaks were enthusiastic about telephone networks and simply wanted to understand how they worked and explore them. Ethical phreaks didn't steal services or cause damage; they just used their technical skill to play with the system. Phone systems have changed and are less susceptible to technological hacks. As a result, modern phreaks intent on cracking the telecommunications systems often rely on criminal acts such as stealing phone cards and cloning cell phones.

HACKTIVISTS

The hacktivist is a gray hat or cracker who defaces Web pages to bring attention to a political agenda or social cause. Companies, organizations, and governments that engage in controversial practices or that have unpopular policies are likely targets of hacktivists. How ethical this behaviour is depends on whether or not you support the hactivist' s agenda or believe in his cause.

MODEL QESTIONS

1. Retail employees typically use ________ terminals to process sales transactions.
   1) Point of sale
   2)Transaction point
   3) Automatic teller
   4) Sales processing
   5) None of these
2. The simultaneous processing of two or more programs by multiple processors is _____
   1) Multiprogramming
   2) Multiprocessing
   3) Time-sharing
   4) Multitasking
   5) None of these
3. The ___ folder retains copies of messages that you have started but are not yet ready to send.
   1) Drafts 2) Sent Items
   3)Address Book 4) Outbox
   5) None of these
4. Inheritance is the ability of an object to pass on its characteristics to its ________.
   1) Subclasses 2)off-spring
   3) Super classes 4) Parents
   5) None of these
5. Which of the following is used for close a tab on a browser?
   1) Ctrl + T 2) Ctrl + Y
   3) Ctrl + A 4) Ctrl + W
   5) None of these
6. A program that converts high level language to machine Language is __
   1) Linker 2) Assembler
   3) Compiler 4) All of the above
   5) None of these
7. At a time how many operating system can be at work on a computer?
   1) Only one 2) Two
   3) Three 4) Four
   5) None of these
8. A computer that combines the characteristic of analog and digital computers________
   1) Hybrid Computer
   2) Analog Computer
   3) Digital Computer
   4) Super Computer
   5) None of these
9. The technique that extends storage capacities of main memory beyond the actual size of the main memory is called ______
   1) Multitasking 2) Switching
   3) Multiprocessing
   4) Multiprogramming
   5) Virtual storage
10. The maximum Zoom percentage in MS WORD is________
    1) 100% 2) 200%
    3) 400% 4) 500%
    5) None of these
11. The smallest memory size is?
    1) Byte 2) GigaByte
    3) KiloByte 4) MegaByte
    5) None of these
12. Android Operating system is an example of which kind of Source Model?
    1) Open Source
    2) Vertical Market Software
    3) Horizontal Market Software
    4) Shareware 5) None of these
13. Which process checks to ensure the components of the computer and operating are connected properly?
    1) Booting 2) Processing
    3) Editing 4) Saving
    5) None of these
14. Codes consisting of lines of varying widths or lengths that are computer-readable are known as?
    1) An ASCII code
    2) An OCR scanner
    3) A magnetic tape
    4) A bar code 5)None of these
15. What is the ultimate purpose of Defragmentation?
    1) Make the PC faster
    2) Create More Free Space
    3) Delete temporary files
    4) Reduce Power consumption
    5) None of these
16. Which input device cannot be used to work in MS Office?
    1) Scanner 2) Mouse
    3) Keyboard 4) Joy stick
    5) Light pen
17. Storage that retains its data after the power is turned off is referred to as?
    1) Volatile storage
    2) Sequential storage
    3) Non-volatile storage
    4) Direct storage
    5) None of these
18. Accessing data on tapes is much ______ than that accessing data on disks?
    1) Same 2) Faster
    3) Slower 4) All of the above
    5) None of these
19. IP-Address 192.5.48.3 belongs to-
    1) Class A 2) Class B
    (3) Class C 4) Class D
    5) None of these
20. Which type of web document is run at the client site?
    1) Static 2) Dynamic
    3) Active 4) All of the above
    5) None of these
21. UDP (User Diagram Protocol) is-
    1) Connectionless
    2) Network Oriented
    3) Connection oriented
    4) a & b 5) None of these
23. Which Software protects the resources of a private network from users from other networks?
    1) Cache server 2) proxy server
    3) Firewall 4) Router
    5) None of these

KEY

1) 1;	2) 2;	3) 1;	4) 1;
5) 4;	6) 3;	7) 1;	8) 1;
9) 5;	10) 4;	11) 3;	12) 1;
13) 1;	15) 2;	14) 4;	16) 4;
17) 3;	18) 3;	19) 3;	20) 1;
21)1;	22) 1.	23) 3.	